# టిసిపార్డ్
# TSIPARD




సంపుటి : 8 సంచిక : 10

నవంబర్ 2016



ఎడిటర్

**నీతూకుమారి ప్రసాద్,** ఐ.ఏ.ఎస్.

సిఇఓ, టిసిపార్డ్

ఎడిటోరియల్ బోర్డు

**కె.యాదయ్య**

**బి. శేషాద్రి**

**కె. మాధురి**

**డా॥ జి. ఆంజనేయులు**

**పి. వెంకటరామిరెడ్డి**

**బి. నరేంద్రనాథ్ రావు**

**ఎ.నాగేశ్వరరావు**

**డా॥కె.అసయ్య**



కాన్సెప్ట్, ప్లానింగ్,
ఎడిటింగ్, డిజైనింగ్

**సెంటర్ ఫర్ మీడియా పబ్లికేషన్స్,**
**టిసిపార్డ్. మరియు**
**నవతెలంగాణ ప్రింటర్స్ ప్రైవేట్ లిమిటెడ్**
హైదరాబాద్

ప్రచురణ

**టిసిపార్డ్**
రాజేంద్రనగర్
హైదరాబాద్ - 500 030
తెలంగాణ, ఇండియా.
ఫోన్ : 040 - 24018656
ఫ్యాక్స్ : 040 - 24017005
E-mail:editorsthanikapalana@gmail.com
Website: www.tsipard.gov.in



ఈ సంచికలో రచయితలు
వెలిబుచ్చిన అభిప్రాయాలు తప్పనిసరిగా
ప్రభుత్వానికిగాని, టిసిపార్డ్‌కిగాని
చెందినవిగా భావించనక్కరలేదు


# విషయ సూచిక


సంపాదకీయం ........ 4

ప్రభుత్వ సంక్షేమ ఫలాలు ప్రజలకు చేరేందుకు డిఆర్‌డిఓ అధికారి కృషిచేయాలి ........ 5

గ్రామీణ ప్రాంతాల్లో పట్టణ స్థాయి మౌళిక సదుపాయల కల్పన ........ 6

కేరళలో రెండు రోజుల పంచాయతీరాజ్ వ్యవస్థను
అధ్యయనం చేసిన తెలంగాణా బృందం ........ 9

పరివర్తన సాధనాలుగా చిన్న జిల్లాలు ........ 11

దీర్ఘకవితల్లో తెలంగాణ ........ 13

పేదరిక నిర్మూలన పథకాలు అమలు తీరు ........ 15

తెలంగాణ రాష్ట్రంలో కొత్త జిల్లాల వివరాలు ........ 17

జనన మరణాల రిజిస్ట్రేషన్ చట్టం 1969 ........ 20

అడవిలో గిరిజన బ్రతుకులు తీరు ........ 21

సౌరశక్తి ........ 25

హమాలి కూలీ నుండి జడ్పీ చైర్మన్ పదవికీ ఎదిగిన భాస్కర్ ........ 27

చేపల పెంపకంపై అమితాసక్తి ........ 29

స్థిరమైన వ్యవసాయాభివృద్ధి కొరకు మిషన్ వివరాలు ........ 32

కేంద్ర ప్రభుత్వ పథకాలు ........ 34

యానాదుల జీవన శైలీ ........ 36

ఉత్పత్తి రంగంలోనూ మహిళా శక్తి ........ 38

ఎన్ఐఆర్‌డిలో అంతర్జాతీయ శిక్షణా కార్యక్రమం ........ 39

ప్రజా చైతన్యం - అభివృద్ధికి దోహదం ........ 40

చిన్నారుల్లో అయోడిన్ లోపం తగ్గించాలి ........ 43

వనరులను వివేకవంతంగా వినయోగించడంతో సుస్థిరాభివృద్ధి ........ 44

కాలుష్యంతో సతమతమౌతున్న బాల్యం ........ 46

సిరుల శ్రీవరి ........ 47

కేరళలోని కొల్లం జిల్లాలో స్థానిక ప్రణాళిక ........ 48

ఇందిర జలప్రభ ద్వారా లబ్ధిపొందిన గిరిజన తెగల విజయగాథలు ........ 49

మనిషి నాలెడ్జే గొప్పది ........ 51

చెరువుల్లో జలకళతో గ్రామాల్లో వికాసం ........ 53

మనోనియంత్రణతోనే ఒత్తిడికి దూరం ........ 55

డయాబెటిస్‌కి ఇక భయం లేదు ........ 56

సాక్షరభారతం సాకారం దిశగా... ........ 57

బేటీ బచావోలో... మేటి జిల్లా ........ 59

గ్రామీణాభివృద్ధిలో మహిళల పాత్ర ........ 61

ఫ్లోరైడ్ నియంత్రణ కార్యక్రమంలో సర్పంచులు, అధికారుల శిక్షణకై ప్రణాళికలు ... 63

తెలంగాణ సంస్కృతిని సాటిన మహనీయులు ........ 64

సంపాదకీయం

# స్థానిక ప్రభుత్వాలను బలోపేతం చేయాలి

తెలంగాణ రాష్ట్రంలో స్థానిక ప్రభుత్వాలు సమర్థవంతంగా విధులను, అధికారాలను అమలు చేసి ప్రజావసరాలను తీర్చేందుకు ఇతోదోధికంగా కృషిచేస్తున్నాయి. అందుకు కావలసిన విషయాలను 73వ రాజ్యాంగ సవరణనకు అనుగుణంగా, స్థానిక ప్రభుత్వాలకు 29 అధికారాలను మూడంచెల పంచాయతీరాజ్ సంస్థలకు బదలాయించి పనిచేయించాలి. కేరళలలో అక్కడి రాష్ట్ర ప్రభుత్వ పంచాయతీరాజ్ సంస్థలకు పూర్తి అధికారాలను ఇచ్చి గత రెండున్నర దశాబ్దాలుగా సమర్థవంతంగా పనిచేస్తూ స్థానిక ప్రభుత్వాల అభివృద్ధికి పాటుపడుచున్నాయి. అదే విధంగా స్థానిక సంస్థలు పన్నులను వసూలు చేసి వాటిని ప్రజోపయోగంనకు ఖర్చు చేస్తున్నాయి. రాష్ట్ర ప్రభుత్వ గ్రాంటులను పంచాయతీ సంస్థలకు విడుదల చేసి సమర్థవంతంగా పాలనను ప్రజావసరాలకు అనుగుణంగా నడిపిస్తున్నాయి. అందువలననే కేరళలోని స్థానిక పంచాయతీపాలన దేశానికే ఆదర్శంగా నిలిచింది.

కేంద్రం ఇచ్చే నిధులు, రాష్ట్ర ప్రభుత్వ మ్యాచింగ్ గ్రాంటులను సద్వినియోగం చేసుకొంటూ పంచాయతీరాజ్ ప్రభుత్వాలు తూ.చ. తప్పకుండా ప్రభుత్వ పథకాలను అటు కేంద్ర పథకాలు, ఇటు రాష్ట్రం అమలు చేయు సంక్షేమ పథకాలను అమలు చేస్తూ ప్రజారంజకంగా కేరళ పంచాయతీరాజ్ వ్యవస్థ ముందుకు సాగుతుంది. అదే రీతిలో తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి కె.చంద్రశేఖరరావు పంచాయతీరాజ్ వ్యవస్థను బలోపేతం చేయుటకు పలు చర్యలు తీసుకొంటున్నారు. వాటిలో పంచాయతీరాజ్ సంస్థలలో పనిచేసే ప్రతినిధులకు ఇచ్చే గౌరవ భృతిని మూడు రెట్లు పెంచారు. వారికి ప్రాంతీయ స్థాయిలో సౌకర్యాలు ఏర్పరచారు. గ్రామస్థాయిలో కనీస అవసరాలను తీర్చేందుకు సంక్షేమ పథకాలను ఒక రూపాయికే కె.జి.బియ్యం సరఫరా చేయడం, నిత్యవసర వస్తువులను తగిన ధరల్లోనే సరఫరా చేయడం, వృద్దాప్య పెన్షన్‌లను నాలుగు రెట్లు రూ.200 నుండి 1000లకు పెంచి, అర్హులైన వారికి అందించడం, వికలాంగులకు, ఆర్టిస్టులకు, పేదలకు పెన్షన్ సదుపాయాలను పెంచారు. వైద్యసౌకర్యాలను ప్రభుత్వ ఆసుపత్రులలో సౌకర్యాలు పెంచారు. నీరు–ఊరు పేరుతో త్రాగునీటి సమస్యను తీర్చారు. చెరువులను పునరుద్దరించి సాగునీటి సౌకర్యాలను, దానితో భూగర్భ జలమట్టం పెరిగింది. దానితో రెండు పంటలకు సాగునీరు అందించి రైతులకు తోడ్పాటునందించుతున్నారు. విత్తనాలు సకాలంలో అందజేసి అధిక ఉత్పత్తికి చర్యలు తీసుకొన్నారు. ఇట్లా ఎన్నో పథకాలను పంచాయతీ స్థానిక ప్రభుత్వాల ద్వారా అమలు చేసి సంక్షేమ పథకాలు ముందుకు వెళ్తున్నాయి.

ముఖ్యమంత్రి తన పాలనానుభవాలను పంచాయతీపాలనను బలోపేతం చేయుటకు జిల్లాలను విభజించి ప్రజల ముందుకు పాలనను తెచ్చారు. తద్వారా ఏ ప్రాంత ప్రజల సమస్యలను ఆ ప్రాంత అధికారులు తీర్చుటకు సౌలభ్యం ఏర్పడింది. జిల్లా అధికారులు గ్రామపాలనను శ్రద్ధతో నిర్వహించి ఫలితాలను ప్రజలకు చేర్చుతున్నారు. భగీరథ పథకం ద్వారా గ్రామాలలో నీటి కొరతను తీర్చేందుకు ప్రయత్నం జరుగుతుంది. ఆ సదుపాయాలు 2017 మార్చి కల్లా ప్రజలకు అందుబాటులోకి వస్తాయి. స్వపరిపాలన ఫలితాలను తెలంగాణ రాష్ట్ర ప్రజలకు అనుభవంలోకి వస్తున్నాయి.

రాష్ట్ర పంచాయతీరాజ్ మంత్రి జె.కృష్ణారావు ఆదేశాల మేరకు పంచాయతీల పాలన పారదర్శకంగా పని చేయుటకు అన్ని సౌకర్యాలను కల్పించడం జరుగుతుంది. క్షేత్రస్థాయిలో జరిగే పనులను పరిశీలించి తగు సూచనలు, సలహాలను అందించడం జరుగుతుంది. ఈ నేపథ్యంలో పంచాయతీ పాలన ప్రజల అవసరాలను తీర్చి మేలు మరింతగా చేకూర్చాలని ఆశిస్తూ...

Jeetu

(నీతూకుమారి ప్రసాద్)

## ప్రభుత్వ సంక్షేమ పథకాల ఫలాలు ప్రజలకు చేరేందుకు

# డి.ఆర్.డి.ఓ అధికారులు కృషి చేయాలి




ప్రభుత్వ సంక్షేమ పథకాల ఫలాలు ప్రజలకు చేరేందుకు జిల్లాల పునర్ వ్యవస్థీకరణకు తెలంగాణ ముఖ్యమంత్రి శ్రీ చంద్రశేఖర్ రావు శ్రీకారం చుట్టారని పంచాయతీ రాజ్ మరియు గ్రామీణాభివృద్ధి శాఖా మంత్రి శ్రీ జూపల్లి కృష్ణారావు అన్నారు. తెలంగాణ రాష్ట్ర పంచాయతీ రాజ్ మరియు గ్రామీణాభివృద్ధి సంస్థ (టి.ఎస్.ఐ.పి.ఏ.ఆర్.డి) లో జరిగిన జిల్లా రూరల్ డెవలప్‌మెంట్ అధికారుల శిక్షణా తరగతులను ప్రారంభించి ప్రసంగించారు.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రతి గ్రామం స్వయం సమృద్ధి సాధించాలంటే గ్రామ సమస్యలు గ్రామంలోనే పరిష్కారం కావాలనే గాంధీజీ మాటలను గుర్తించి ఆ విధంగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. స్వాతంత్రం వచ్చి ఏడు దశాబ్దాలు గడిచినా గ్రామీణులకు ఇంకా సంక్షేమ ఫలితాలు అందలేదు. ఈ పరిస్థితి నూతన తెలంగాణలో ఉండకూడదని ప్రతి గ్రామం స్వయం సమృద్ధి సాధించాలని అందుకు డి.ఆర్.డి.ఓ అధికారులు కృషి చేయాలన్నారు. ముఖ్యమంత్రి ఆశయం, ప్రభుత్వ లక్ష్యం ప్రజల ఆకాంక్షలు నెరవేర్చడమే డి.ఆర్.డి.వోల బాధ్యత. అందుకు ప్రతి ఒక్కరిని భాగస్వామ్యం చేయాలి. నిర్వీర్యమైన మహిళా సంఘాల్లో నూతన ఉత్తేజం నింపే కార్యక్రమాలను రూపొందిస్తున్నాం. అన్ని ప్రభుత్వ కార్యక్రమాల్లో మహిళా సంఘాలను, ప్రజా సంఘాలను మరియు రైతు సంఘాలను భాగస్వామ్యం చేయాలన్నారు. పారిశుధ్యం, ఇంకుడుగుంతల నిర్మాణం, చెత్తను సేకరించడం, సేకరించిన చెత్తను డంప్ యార్డులకు తరలించడం, రోడ్ల పరిశుభ్రత మొదలగు కార్యక్రమాలు ఉపాధి హామీ పథకం ద్వారా నిర్వహించాలి. ఉపాధి హామీ పథకం ద్వారా పని అడిగిన ప్రతి ఒక్కరికి పని కల్పించవల్సిన బాధ్యత తీసుకోవాలన్నారు. గ్రామ పంచాయతీ సెక్రటరీ, ఉపాధి హామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్ తప్పనిసరిగా గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఒక గంట ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. కరపత్రాలు, పాఠశాలలు, కాలేజీలు, మహిళా సంఘాలు, రైతు సంఘాలు, పత్రికలు ద్వారా ప్రతి ఇంటికీ ప్రభుత్వ పథకాల సమాచారం అందేలా అధికారులు కృషి చేయాలన్నారు. ఉపాధి హామీ పథకంలో కనీసం 60 శాతం కుటుంబాలకు 100 రోజుల పని దినాలు కల్పించేందుకు డి.ఆర్.డి.ఓ.లు చర్యలు తీసుకోవాలన్నారు. అదే విధంగా రోడ్లు, అంగన్‌వాడి భవనాలు, మండల సమైఖ్య భవనాలు, నిర్మాణ వివరాలను కూడా సంబంధిత శాఖల సమన్వయంతో పర్యవేక్షించాలన్నారు. విద్యుత్ సరఫరా, మిషన్ కాకతీయ, మిషన్ భగీరథ, పారిశ్రామిక విధానం మొదలగు కార్యక్రమాలు దేశంలోనే తెలంగాణ ప్రభుత్వంకు ప్రత్యేక గుర్తింపు వచ్చిందన్నారు. అదే తరహాలో డి.ఆర్.డి.ఓ.లు కూడా పంచాయతీ రాజ్ మరియు గ్రామీణాభివృద్ధి శాఖ కు కూడా ప్రత్యేక గుర్తింపు తీసుకురావాలని కోరారు. ఈ విధంగా ప్రజలే కేంద్రంగా కొత్త రాష్ట్రంలో, కొత్త జిల్లాలలో కొత్త ఆలోచనలతో ప్రభుత్వ యంత్రాంగం, ప్రజా ప్రతినిధులు ముందుకెళ్ళినప్పుడే ప్రజల ఆకాంక్ష నెరవేరి బంగారు తెలంగాణ సాధ్యమౌతుందని మంత్రి వివరించారు.

ఈ కార్యక్రమములో పంచాయతీ రాజ్ మరియు గ్రామీణాభివృద్ధి సంచాలకులు శ్రీమతి నీతూ కుమారి ప్రసాద్, ఐ.ఏ.ఎస్., గ్రామీణాభివృద్ధి జాయింట్ కమీషనర్లు శ్రీ. జాన్‌వెస్లీ, శ్రీ. పి.సైదులు మరియు సెర్ప్ డైరెక్టర్ (అడ్మిన్) శ్రీ బాలయ్య పాల్గొన్నారు. ఈ శిక్షణా కార్యక్రమాన్ని టి-సిపార్డ్ లో సి.ఎన్.ఆర్.యం సెంటర్ నిర్వహించింది.

– సి.ఎం.పి.





# గ్రామీణ ప్రాంతాల్లో పట్టణ స్థాయి మౌలిక సదుపాయాల కల్పన

తెలంగాణ ప్రభుత్వం గ్రామాల అర్ధిక పరిపుష్టికి బాటలు వేస్తుంది. రాబోవు మూడు సంవత్సరాల్లో గ్రామాల రూపు రేఖలు మార్చే విధంగా చర్యలు చేపట్టింది. పట్టణాలతో సమానంగా సదుపాయాలు, సౌకర్యాలు, సేవలు గ్రామీణులకు అందుబాటులోకి తేవడం జరుగుతుంది. గ్రామ జ్యోతి కార్యక్రమంలో భాగంగా వివిధ కేంద్ర ప్రభుత్వ పథకాలను మిళితం చేసి కార్యాచరణ అమలు జరుపుతుంది. ముఖ్యంగా గ్రామాల్లో అంతర్గత దారులను ఏర్పాటు చేయడం, మురుగు నీటి కాలువల నిర్మాణాలు చేపట్టడం, వీది దీపాలు ఏర్పాటు చేయడం, త్రాగునీటి సరఫరా వ్యవస్థను బలోపేతం చేయడం, జిల్లాల మధ్య అనుబంధ రోడ్లను ఏర్పాటు చేయడం, అవసరమైన చోట కాజ్వేలు నిర్మించడం, పట్టణాలతో సమానంగా మౌలిక సదుపాయాలు కల్పించడం, నైపుణ్య శిక్షణా కేంద్రాలను ఏర్పాటు చయడం, స్థానికంగా ఆగ్రో ప్రాసెసింగ్ ఏర్పాటు, ఆగ్రో సేవలు మరింతగా అందుబాటులోకి తీసుకురావడం, వ్యవసాయ ఉత్పత్తులను నిల్వ చేసుకొనేందుకు గోదాములను నిర్మించడం, మొబైల్ సేవలను మెరుగు పర్చడం, విద్యా ప్రమాణాలను పెంచడం, ఉన్నత విద్యావకాశాలను చేరువ చేయడం, ప్రజా రవాణాను మెరుగు పర్చడం, ఇంటింటికి వంట గ్యాస్ సదుపాయం కల్పించడం, ప్రతి గ్రామ పంచాయతీ పరిధిలో పౌర సేవా కేంద్రాలను ఏర్పాటు చేయడం, డిజిటల్ అక్షరాస్యతను ప్రోత్సహించడం లాంటి కార్యక్రమాలను వివిధ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పరిధిలోని పథకాల ద్వారా అమలు పర్చడం ద్వారా గ్రామాల సమీక్రుత అభివృద్ధిని సాధించాలని తెలంగాణ ప్రభుత్వం సంకల్పించింది. దీనికి తోడు, గ్రామాలలో ఉపాధి అవకాశాలను మెరుకు పర్చడం జరుగుతుంది. పేదలకు గృహ వసతి కల్పించబోతుంది. నిరుపేద వృద్దులను పింఛన్లను పంపిణీ చేస్తుంది. మెరుగైన వైద్యం గ్రామీణులకు అందుబాటులోకి తీసుకురావడానికి చర్యలు చేపట్టింది. గ్రామాల నుండి వలసలు నివారించడం, గ్రామాలను ఉపాధి కేంద్రాలుగా మార్చడం లాంటి చర్యలను విజయవంతంగా అమలు పర్చడం ద్వారా ఆర్దిక పరిపుష్టికి



బాటలు వేసేందుకు కార్యాచరణ అమలు జరుపుతుంది. తెలంగాణలోని 8,695 గ్రామ పంచాయతీల పరిధిలోని 2,26,83,946 మంది ప్రయోజనం పొందే విధంగా చర్యలు తీసుకుంటుంది. విద్య, వైద్యం, ఉపాధి కోసం గ్రామీణులు ఎంతో దూరం వెళ్లవలసిన అవసరం ఉండని విధంగా సౌకర్యాలు, సదుపాయాలను అందుబాటులోకి తేవడం జరుగుతుంది. వ్యవసాయానికి, గ్రామీణ వృత్తులకు చేయూతనివ్వడం జరుగుతుంది. కేంద్ర ప్రభుత్వ పథకాలతో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ పథకాలను మిళితం చేసి అమలు గ్రామ జ్యోతి కార్యక్రమాలను అమలు పర్చడం ద్వారా పల్లెల రూపురేఖలు మార్చడానికి ప్రభుత్వం చిత్తశుద్ధితో చర్యలు తీసుకుంటుంది. ఇప్పటికే గ్రామాల సమీకృత అభివృద్ధికి తెలంగాణ ప్రభుత్వం కార్యాచరణను ఆచరణలో పెట్టింది. ఆదిలాబాద్ జిల్లా మందమర్రి మండలం సారంగపల్లి, రంగారెడ్డి జిల్లా తాండూరు మండలంలోని ఆలూరు, నిజామాబాద్ జిల్లాలోని జుక్కల్, మెదక్ జిల్లాలోని నారాయణఖేడ్ మండలం ర్యాకల్ గ్రామాలను పథకం అమలుకు ఎంపిక చేశారు. ఒకొక్క క్లష్టర్ కు రూ. 30 లక్షల చొప్పున కేంద్రం నుండి రూ. 1.30 కోట్లు మంజూరు చేయించుకుంది. రూర్బన్ మిషన్ కింద ఈ గ్రామాలను కేంద్రం ఎంపిక చేసింది. దీనికి తోడు ఉపాధి అవకాశాలను కూడా మెరుగు పర్చడం జరుగుతుంది. గ్రామ స్వరాజ్యం లక్ష్యంగా పల్లెలే పచ్చని సిరులతో విరాజిల్లడం కోసం తెలంగాణ గ్రామీణ అభివృద్ధి పథకం రూపొందించింది. దానిని గ్రామ జ్యోతి కార్యక్రమంగా అమలు జరుపుతుంది. అభివృద్ధిలో భాగంగా తెలంగాణలో గ్రామీణాభివృద్ధి శాఖ వాటర్ షెడ్ అభివృద్ధి, స్వయం సహాయక బృందాలు, మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం మొదలైన కార్యక్రమాలను అమలు పర్చడం జరుగుతుంది. ఉపాధి హామీ పథకం కింద సంవత్సరానికి 100 రోజుల పని దినాలు కల్పించడం జరుగుతుంది. ప్రత్యేక పరిస్థితుల్లో 150 రోజులు పని కల్పించడానికి చర్యలు తీసుకుంటున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధితో కూడిన మద్దతు కల్పించడం ద్వారా మన్నిక కలిగిన ఆస్తులను పెంచుకోవడం, నిరుపేద వర్గాలను సామాజికంగా ఉన్నత స్థాయికి తేవడం, పంచాయతీ రాజ్ వ్యవస్థను పటిష్టం చేయడం జరుగుతుంది. తెలంగాణలోని అన్ని గ్రామ పంచాయతీల్లో ఈ పథకం అమలవుతోంది. ఈ పథకం ద్వారా 55 లక్షల జాబ్ కార్డుల పరిధిలో 1.3 కోట్ల మంది ఉపాధి పొందుతున్నారు. దాదాపు 29.7 లక్షల కుటుంబాలలోని 64 లక్షల మందితో 3.6 లక్షల శ్రమశక్తి సంఘాలను కూడా ఏర్పాటు చేశారు. దీనికి తోడు మొక్కల పెంపకం ద్వారా పచ్చదనాన్ని పెంచడానికి ప్రభుత్వం తెలంగాణ హరిత హారం కార్యక్రమం చేపట్టింది. పంట కోత అనంతర కార్యకలాపాల్లో వ్యవసాయ రంగానికి అండగా నిలిచేందుకు మరి కొన్ని కార్యక్రమాలను కూడా అమలు జరుపుతోంది. గ్రామీణ పేదరికాన్ని తొలగించడానికి ప్రపంచ బ్యాంకు సహాయంతో 2000 ప్రాంతాల్లో మహిళా స్వయం సహాయక బృందాలను ఏర్పాటు చేసి గ్రామీణ పేదల ఆర్థిక పరిపుష్టికి తోడ్పాటును అందించడం జరుగుతుంది. భూమి ఆధారిత జీవనోపాధి పథకాలను అమలు జరుపుతోంది. పేదల సమ్మిళిత అభివృద్ధిని సాధించడానికి వీలుగా వ్యవస్థాగత వేదికలను పటిష్టం చేయడం పై తెలంగాణ పల్లె ప్రగతి



ప్రాజెక్టు ప్రధానంగా దృష్టి కేంద్రీకరించింది. జీవనోపాధి అవకాశాలను పెంచుతుంది. నూతన మార్గాల్లోకి విస్తరించడం జరుగుతుంది. మానవాభివృద్ధి చర్యల ద్వారా, తమకు చట్టం ద్వారా, ప్రభుత్వ పథకాల ద్వారా లభిస్తున్న ప్రయోజనాలను అందిపుచ్చుకొనేలా ప్రత్యేకించి పేదల్లోకెల్లా పేదలైన గ్రామీణ కుటుంబాలు అవకాశాలను వినియోగించుకొనేలా చేయడానికి కృషి చేస్తుంది. ఈ ప్రాజెక్టును రూ.642 కోట్లతో అమలు జరపడానికి చర్యలు తీసుకొంటున్నారు. దీనిలో లక్షంగా పెట్టుకున్న లబ్దిదారులు చిన్న సన్నకారు రైతులు, షెడ్యూల్డు కులాలు, తెగల కుటుంబాలు. ఈ పథకాన్ని విలువ శ్రేణి అభివృద్ధి, మానవాభివృద్ధి, పల్లె ప్రగతి సేవా కేంద్రాలు, ఐసీటీ, భాగస్వాములుగా విభజించి అమలు పర్చడం జరుగుతుంది. దీనికి తోడు గ్రామీణులకు ఆర్థిక సదుపాయం, బ్యాంకులతో అనుసంధానం కల్పించడంతో జీవనోపాధికి ఆర్థిక కార్యకలాపాలు నిర్వహించేందుకు కూడా తోడ్పాటును అందించడం జరుగుతుంది. పేద మహిళలకు సముచిత రీతిలో రుణాలను అందించడానికి స్త్రీ నిధి తోడుంటుంది. జీవనోపాధికి ఊతమిస్తుంది. నిరుపేదల ఆదాయం పెంచుతుంది.



వికలాంగులకు తోడ్పాటు, సమాజ నిర్వహణలో ఆరోగ్యం, పోషకాహారం విషయంలో కూడా నిర్దిష్ట ప్రణాళికతో కార్యక్రమాలను అమలు పర్చడం జరుగుతుంది. గ్రామీణ నీటి సరఫరా, పారిశుద్యంపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ కనబర్చడం జరుగుతుంది. గ్రామీణ పారిశుద్ద్యం కోసం వివిధ కేంద్ర ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకునే విధంగా కార్యాచరణ అమలవుతుంది. ఈ కార్యక్రమాలను సరిగా అమలు జరపడానికి తెలంగాణ ప్రభుత్వం గ్రామీణాభివృద్ధి అకాడమీలో ప్రజా ప్రతినిధులకు, క్షేత్ర స్థాయి అధికారులకు ఎప్పటికప్పులు శిక్షణ ఇవ్వడం జరుగుతుంది. వీటన్నిటికీ తోడుగా అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు జరుపుతోంది. దాదాపు రూ. 325 కోట్లతో హరిత హారం కార్యక్రమం చేపట్టింది. మొత్తం 230 కోట్ల మొక్కలు పెంచేందుకు అవసరమైన మేరకు నర్సరీలను ఏర్పాటు చేసింది. మిషన్ కాకతీయ కార్యక్రమం కింది చెరువుల పూడికలు తీయించడం జరుగుతుంది. తెలంగాణలోని సుమారు 45 వేల చెరువుల పూడిక తీయడంతో గ్రామాల రూపే మారిపోనుంది. ఇప్పటికీ పూడిక తీసిన చెరువులు నిండటంతో అదనపు భూములు సాగులోకి వచ్చాయి. అనేక గ్రామీణ వృత్తులకు ఉపాధి మెరుగైంది. ప్రతి ఇంటికి నల్లాల ద్వారా మంచినీరు అందించే భగీరథ పథకం వేగంగా ముందుకు సాగుతుంది. గుడిసెలు లేని గ్రామాల కోసం ప్రభుత్వం డబుల్ బెడ్ రూమ్ పథకం అమలు చేస్తుంది. పూరిగుడిసెల్లో, పెంకుటిండ్లలో కాలం వెళ్లదీసే దుస్థితి నుండి సౌకర్యవంతమైన ఇంటికి పేదలు మారడం ఈ పథకం ఉద్దేశం. నిరుపేదలు గౌరవంగా, భద్రతతో జీవించడానికి ప్రభుత్వం ఆసరా పింఛన్ల పథకాన్ని అమలు చేయడం జరుగుతుంది. పేదలందరికీ ఆహార భద్రత కల్పిండం జరుగుతుంది. రేషన్ కార్డు పైన ఒకొక్కరికి రూపాయికి కిలో బియ్యం చొప్పున ఆరు కిలోలు అందచేయడం జరుగుతుంది. భూమి కొనుగోలు పథకం కూడా అమలవుతుంది. షెడ్యూల్డు కులాలు, తెగల లబ్ధిదారులకు మూడు ఎకరాల భూమి కొనుగోలు చేసి ఇచ్చే కార్యక్రమం అమలు జరుగుతుంది. ఎస్ సీ, ఎస్ టి, బీసీ, మైనారిటీ వర్గాలకు కల్యాణ లక్ష్మి పథకాన్ని అమలు జరుపుతుంది. ఇందులో భాగంగా యువతి వివాహ సమయంలో రూ. 51,000లు ఆర్థిక సహాయం అందచేయడం జరుగుతుంది. హస్టల్ విద్యార్థులకు సన్న బియ్యంతో భోజనం సదుపాయం కలిగించింది. తెలంగాణ ప్రభుత్వం స్వచ్ఛ భారత్ కార్యక్రమాన్ని అమలు జరుపుతుంది. పల్లెలు, పట్టణాలు, నగరాను పరిశుభ్రంగా ఉంచేంధుకు చర్యలు తీసుకుంటుంది. అన్ని వర్గాల ప్రయోజనాలను ఆశించి అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను అమలు జరుపుతుంది. తెలంగాణ ప్రభుత్వం అమలు జరుపుతున్న కార్యక్రమాలకు దేశ వ్యాప్తంగా మంచి స్పందన వస్తుంది. వివిధ సంస్థలు నిర్వహించిన సర్వేల్లో ఉత్తమ ముఖ్యమంత్రిగా కేసీ ఆర్ కు అన్ని వర్గాలు ఆదరణ, అభిమానం కనబరుస్తున్నారు. తెలంగాణను అన్ని రంగాల్లో అగ్రగామిగా ఉంచేందకు ముఖ్యమంత్రి అనేక చర్యలు తీసుకుంటున్నారు. సాగునీరు రంగం పై ప్రధానంగా దృష్టి కేంద్రీకరించారు. పారిశ్రామిక రంగాన్ని ప్రోత్సహించి పెట్టుబడులను ఆకర్శించడం జరుగుతుంది. ప్రభుత్వ, ప్రైవేటు రంగంలో ఉపాధి అవకాశాలను మెరుగు పర్చడం జరుగుతుంది. పరిపాలన వికేంద్రీకరణలో భాగంగా 10 జిల్లాలను 31 జిల్లాలుగా విభజించడం జరిగింది. రోడ్డు మార్గాలను మెరుగుపర్చడం, విస్తరించడం కోసం వేల కోట్లు వ్యయం చేస్తున్నారు. విద్యారంగం పై ప్రత్యేక దృష్టి సారించారు.




– పంతంగి శంకర్, సీనియర్ జర్నలిస్టు

# కేరళలో రెండు రోజుల పంచాయతీరాజ్ వ్యవస్థను అధ్యయనం చేసిన తెలంగాణా బృందం




వందశాతానికి చేరువైన అక్షరాస్యతతో దేశాన్ని ఆకర్శించిన కేరళ రాష్ట్రం... స్థానిక పాలనలో కొంత పుంతలు తొక్కుతూ ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలుస్తోంది. ఇతర దేశాల వారు సైతం స్థానిక సంస్థల పనితీరును అధ్యయనం చేసేందుకు కేరళకు వస్తున్నారంటే అతిశయోక్తి కాదు. కేరళలోని త్రిశూర్ జిల్లాలో ఉన్న కిలా ( కేరళ ఇన్ స్టిట్యూట్ ఆఫ్ లోకల్ అడ్మినిస్ట్రేషన్) దిశానిర్దేశంలో స్థానిక పాలన ముందుకు సాగుతోంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల కన్నామిన్నగా ప్రజలకు సేవలందిస్తూ ప్రజలకు చేరువ అవుతోంది.

ఇలాంటి స్థానిక సంస్థల పనితీరును అద్యయనం చేసేందుకు నవంబర్ 4, 5 వ తేదిల్లో కేరళ రాష్ట్రంలోని గ్రామ,మండల, జిల్లా పంచాయతీలను సందర్శించింది తెలంగాణ పంచాయతీరాజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు గారి నేతృత్వంలోని అధికారుల బృందం రెండు రోజుల పర్యటన నిమిత్తం నవంబర్ 3 వతేది సాయంత్రం కొచ్చి చేరుకుంది మంత్రి జూపల్లి కృష్ణారావు గారి నేతృత్వంలోని బృందం. కేరళ ఎయిర్ పోర్టు పరిధిలోని తమ గ్రామాన్ని సందర్శించాలని పంచాయతీ ప్రెసిడెంట్ ఆల్ఫోన్సా వర్గీస్, వైస్ ప్రెసిడెంట్ కేసీ మార్టిన్, సభ్యులు వీవీ సెబాస్టియన్, మంజులు మంత్రి జూపల్లి కృష్ణారావుకు విజ్ఞప్తి చేశారు. కేరళలో పంచాయతీరాజ్ వ్యవస్థ పనితీరుపై ఎయిర్ పోర్టు లాంజ్‌లో గ్రామ పంచాయతీ ప్రతినిధులతో మంత్రి చర్చించారు. కేరళ ఇనిస్టిట్యూట్ ఆఫ్ లోకల్ అడ్మినిస్ట్రేషన్ ప్రతినిధి రామకృష్ణ తదితరులు ఎయిర్ పోర్టులో మంత్రి జూపల్లి కృష్ణారావు నేతృత్వంలో వచ్చిన తెలంగాణా అధికారుల బృందాన్ని రిసీవ్ చేసుకున్నారు. అక్కడినుంచి కిలా కు తీసుకుని వెళ్లారు.

నవంబర్ 4 వ తేదిన కిలాలో పంచాయతీ సంస్థల పనితీరుపై పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా తెలంగాణ బృందానికి కేరళ పంచాయతీరాజ్ వ్యవస్థలపై వివరించారు కిలా ఫ్యాకల్టీ. కేరళలో 14 జిల్లాలు, 152 బ్లాక్‌లు, 941 గ్రామ పంచాయతీల ద్వారా సాగుతున్న స్థానిక పాలనను కళ్లకు కట్టినట్లు వివరించారు. మరో 87 మున్సిపాలిటీలు, 6 కార్పోరేషన్ ల పాలన తీరుపై పవర్ పాయింట్ ప్రజంటేషన్ ఇచ్చారు. రాష్ట్రంలో అమలవుతున్న వివిధ సంక్షేమ పథకాలను వివరించారు. కేరళలో అక్షరాస్యత 95 శాతాన్ని దాటిందని, ప్రజలు, మీడియా సహకారంతో స్థానిక సంస్థలు చురుగ్గా పనిచేస్తున్నాయని కిలా ఫ్యాకల్టీ తెలిపారు. కేరళలో 1000 మంది పురుషులకు 1087 మంది స్త్రీ జనాభా ఉండడం విశేషం. అలాగే ఎస్సీ, ఎస్టీ, క్రిస్టియన్, ముస్లిం జనాభాయే 50 శాతానికి పైగా ఉ ండటం గమనార్హం.

**వెంకటాగు, శ్రీమూల నగరం గ్రామ పంచాయతీల సందర్శన**

క్షేత్ర స్థాయి పర్యటనలో భాగంగా వెంకటింగు, శ్రీమూల నగర గ్రామ పంచాయతీలను మంత్రి జూపల్లి కృష్ణారావుగారు, కమిషనర్ నీతూ కుమారి ప్రసాద్ గారు, గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులు వెస్లీ, శేషాద్రి ల బృందం సందర్శించింది. ఆయా గ్రామాల్లోని పలు గృహాలను, ఆరోగ్య కేంద్రం, గ్రామపంచాయతీలను పరిశీలించారు. బయోగ్యాస్, ఇంకుడు గుంతల నిర్మాణం, వర్షపు నీటి వినియోగం లాంటి అంశాలపై




స్థానికులతో చర్చించారు. పారిశుద్ధ్య లోపం లేకుండా తీసుకుంటున్న చర్యలు, రోడ్ల నిర్మాణంలో నాణ్యత ప్రమాణాలను మంత్రి జూపల్లి గారు, కమిషనర్ నీతూ ప్రసాద్ గారు అభినందించారు. గ్రామ, వార్డ్ సభలకు పెద్ద పీట వేస్తూ గ్రామాభివృద్ధికి పాలక వర్గాలు చేస్తున్న కృషిని ప్రశంసించారు. కేరళలోని కుదుంబశ్రీ తరహాలోనే తెలంగాణాలోనూ పేదరిక నిర్మూలనకు కేసీఆర్ ప్రభుత్వం చేస్తోన్న కృషిని కేరళ ప్రతినిధులకు వివరించారు మంత్రి జూపల్లి బృందం. తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తోన్న షాదీముబారక్, కళ్యాణలక్ష్మి, డబుల్ బెడ్ రూం ఇండ్ల నిర్మాణ పథకాలపై కేరళ ప్రతినిధులు ఆసక్తి




చూపారు.

**ఎర్నాకులం జిల్లా, పరక్కదావు బ్లాక్ పంచాయతీల పరిశీలన**

నవంబర్ 5 న ఎర్నాకులం జిల్లా పంచాయతి, పరక్కడావు బ్లాక్ పంచాయతిలను జూపల్లి ప్రతినిధుల బృందం పరిశీలించింది. ఈ సందర్భంగా కేరళలో అమలు చేస్తున్న పథకాల అమలు తీరుపై తెలంగాణా బృందం పలు అంశాలను అడిగి తెలుసుకుంది. దేశంలోనే 100 శాతం అక్షరాస్యత సాధించిన తొలి జిల్లాగా గుర్తింపు పొందిన ఎర్నాకులంలో విద్యావ్యవస్థ తీరును ప్రత్యేకంగా పరిశీలించారు. తెలంగాణలోని పంచాయతి వ్యవస్థపై ఎర్నాకులం జిల్లా పంచాయతి సభ్యులు ఆసక్తి చూపారు. తెలంగాణా స్థానిక ప్రజాప్రతినిధులకు కేసీఆర్ ప్రభుత్వం గౌరవ వేతనాలను పెంచడంపై ఎర్నాకులం జిల్లా పంచాయతీ సభ్యులు మంత్రిని ప్రత్యేకంగా అభినందించారు. తెలంగాణాలో పర్యటనకు రావాలని మంత్రి వారిని ఆహ్వానించారు. అనంతరం పరక్కాడావు బ్లాక్ పంచాయతీని మంత్రి సందర్శించారు. పాలకవర్గం, సభ్యులతో ప్రత్యేకంగా సమావేశమై అభివృద్దిలో బ్లాక్ పంచాయతీల పాత్రపై చర్చించారు.

**తెలంగాణ ఏర్పాటు, కేసీఆర్ పాలనపై కేరళ వాసుల ఆసక్తి**

తెలంగాణా ఏర్పాటు, కేసీఆర్ పాలన తీరుపై కేరళ వాసులు ఆసక్తి చూపారు. పంచాయతీ సభ్యులు పలు అంశాలపై అడిగిన ప్రశ్నలకు మంత్రి సమాధానం చెప్పారు. తెలంగాణ ఏర్పాటు తర్వాత రాష్ట్రంలో విద్యుత్ కోతలే లేకుండా చేసుకున్నట్లు వారికి మంత్రి వివరించారు, మిషన్ భగీరథ, మిషన్ కాకతీయ, నూతన పారిశ్రామిక విధానం లాంటి అంశాలను మంత్రి వివరిస్తున్నప్పుడు కేరళ ప్రతినిధులు ఆసక్తి చూపారు.

**పంచాయతీల ఆర్థిక స్వావలంబన**

రాష్ట్ర ఆదాయంలో 30 శాతాన్ని నేరుగా జనాభా ప్రతిపాదికన గ్రామ పంచాయతీలకు కేటాయించడం కేరళ పంచాయతీరాజ్ వ్యవస్థ పరిపుష్టం అయ్యేందుకు దోహదం చేసిన ప్రధాన అంశంగా చెప్పవచ్చు. కేరళలో గ్రామపంచాయతీల సగటు జనాభా 25 వేలు గా ఉండడం గమనార్హం. ప్రాపర్టి, ప్రొఫెషనల్ ట్యాక్స్, సర్వీస్ ట్యాక్స్ లాంటి వాటితో పాటు భవనాల అద్దె, పర్మిట్ ఫీజుల రూపేన పంచాయతీలకు ఆదాయం సమకూరుతుంది. వీటితోపాటు రాష్ట్ర ప్రభుత్వం నుండి డెవలప్ మెంట్, మెయింటనెన్స్ గ్రాంట్ జనరల్ పర్పస్ ఫండ్ ద్వారా నిధులు సమకూరుతాయి.

**ప్రత్యేక కమిటీల ఏర్పాటు**

గ్రామ అభివృద్ధికి నిధులను విడుదల చేయడం కొరకు పంచాయతీల పరిధిలో ప్రత్యేకంగా వివిద రకాల కమిటీలను ఏర్పాటు చేస్తారు. గ్రామ సభల నిర్వహణ ద్వారా ప్రణాళికలు సిద్ధం చేస్తుంటారు. ఇందుకోసం ప్రత్యేకంగా వర్కింగ్ గ్రూపులను ఏర్పాటు చేసుకుంటారు. ఆ తర్వాత డెవలప్ మెంట్ సెమినార్ లు ఏర్పాటు చేసి అభివ ృద్ధి పనులను చేపడుతుంటారు. వీటి పర్యవేక్షణ కోసం ఫైనాన్స్, డెవలప్ మెంట్, సంక్షేమ, ఆరోగ్య, విద్య లాంటి స్టాండింగ్ కమిటీలు పనిచేస్తుంటాయి. గ్రామ స్థాయిలోనే అసిస్టెంట్ ఇంజనీర్, వ్యవసాయ అధికారి, వెటర్నరి, అల్లోపతి, ఆయుర్వేద, హెూమియో డాక్టర్ సహా దాదావు 15 విభాగాల ఉద్యోగులు పంచాయతీ పరిధిలో పనిచేస్తుంటారు. ఈ అన్ని శాఖలకు సంబంధించి , ప్రతి నెల రివ్యూ చేయడంతో పాటు, క్రమశిక్షణ చర్యలు తీసుకొనే అధికారం కూడా పంచాయతీలకే ఉండడం కేరళ స్థానిక పాలనలో హైలేట్ గా చెప్పుకోవచ్చు. అక్షరాస్యత 95 శాతం కన్నా ఎక్కువగా ఉండడం, ప్రజల భాగస్వామ్యం, పారదర్శకత, జవాబుదారీతనం కారణంగా కేరళలోని పంచాయతీరాజ్ వ్యవస్థ దేశానికే ఆదర్శంగా నిలుస్తుంది. రెండు రోజుల పర్యటనతో కేరళ పంచాయతీ రాజ్ వ్యవస్థ స్వరూపాన్ని పూర్తి స్థాయిలో అధ్యయనం చేసింది మంత్రి జూపల్లి కృష్ణారావుగారి నేతృత్వంలోని బృందం.

**– సి. హెచ్. కళ్యాణ్‌చక్రవర్తి,**
**పౌరసంబంధాల అధికారి, పిఆర్ & ఆర్డీ శాఖా మంత్రి**



**విభజించిన జిల్లాల పరంగా చూస్తే ఐటీ రంగానికి రంగారెడ్డి జిల్లా చిరునామా. పారిశ్రామికంగా మేడ్చల్, సంగారెడ్డి, పెద్దపల్లి జిల్లాలకు పెద్దపీట వేయాల్సి ఉంటుంది. విత్తన క్షేత్రంగా కరీంనగర్, సాగునీటి పరంగా ఖమ్మం, నేతన్నల జిల్లాగా సిరిసిల్ల అడవుల జిల్లాగా ఆదిలాబాద్, సాంస్కృతిక వారసత్వ జిల్లాలుగా వరంగల్, యాదాద్రి, భద్రాద్రి, జగిత్యాల జిల్లాలు మచ్చుకు కొన్ని. ఆయా జిల్లాల్లో అందుబాటులో ఉన్న సహజ సంపద, మానవవనరుల్ని ఆధారంగా చేసుకొని జిల్లా అభివృద్ధి నివేదికలు తయారు చేసుకోవాల్సిన తరుణం ఇది.**

స్మాల్ ఈజ్ బ్యూటిఫుల్ అని ఎప్పుడో అన్నాడు సుప్రసిద్ధ ఆంగ్ల కవి ఇ. ఎఫ్.స్కుమాచెర్. తెలంగాణలో దసరా పర్వదినాన ఆ అనుభూతి ఆచరణలోకి వచ్చింది. ఇరవైన్నొక్క కొత్త జిల్లాల ఆవిర్భావంతో వాడవాడలా, పల్లె పల్లెన వెల్లివిరిసిన ఆనందోత్సవాలు చూసి తరించాల్సిందే తప్ప వర్ణించడం సాధ్యం కాదు. ఆదిలాబాద్, మెదక్ వంటి పెద్ద జిల్లా ల్లో (వైశాల్యం దృష్ట్యా) జిల్లా అధికారిగా పనిచేసిన అనుభవంతో ఈ పరిణామాన్ని ఆహ్వానించే వాళ్ళలో నేనొకడిని. సాంఘిక సంక్షేమ హాస్టళ్ళు, రెసిడెన్సియల్ స్కూళ్ళ ఆవరణలో వాళ్ళకు ఆశ్రయం కల్పించే విధంగా చర్యలు తీసుకోవడం జరిగేది. ఇప్పుడు ఆ బాధలు తప్పినట్లే. అయితే దూరాలు దగ్గరయ్యాయి కదా అని అలసత్వంతో జిల్లా అధికార్లు ప్రజానీకానికి అందుబాటులో లేకపోయినా, వారి ఫిర్యాదుల పరిష్కారంలో జాప్యం చేసి నా, హెడ్ క్వార్టర్‌లో మకాం లేకపోయినా, చిన్నజిల్లాలకు, పెద్ద జిల్లాలకు తేడా ఉండదు. సగటు మనిషి ఆశలు అడియాసలు కాకుండా చూసుకోవడం అధికారుల బాధ్యత.

వంశపారంపర్య గ్రామాధికార్ల వ్యవస్థ రద్దై ముప్పై ఏళ్ళు దాటినా, పటిష్టమైన, ప్రత్యామ్నాయ గ్రామపాలనా యంత్రాంగం లేదు. ఉదాహరణకు పటేల్ (గ్రామకరణం), మాలీ పటేల్ గ్రామాధికార్లుగా వుండేవారు. మాలీ పటేళ్ళ అజమాయిషీలో గ్రామీణ సాగు నీటి వనరులు గ్రామస్థుల సమిష్టి కృషితో నిర్వహింపబడేవి. ఆ వ్యవస్థ రద్దు కావటంతో, ఈ వనరులన్నీ పంచాయతీరాజ్, జలవనరుల శాఖల ఆధ్వర్యంలోకి రావటంతో వాటి రోజువారీ నిర్దేశం, నిర్వహణ ప్రశ్నార్థకంగా మారింది. అలాగే రోజ్ నామాంచ రాస్తే పోలీసుపటేళ్ళ ప్రత్యామ్నాయం కరువైంది.

# పరివర్తన సాధనాలుగా చిన్న జిల్లాలు

మారుమూల ప్రాంతాలైన బెజ్జూరు, దహెగాం, తిర్యాణి మండలాల నుంచి జిల్లా కేంద్రమైన ఆదిలాబాద్ చేరుకోవాలన్నా, అలాగే జగదేవ్‌పూర్, దుబ్బాక నుంచి సంగారెడ్డి (మెదక్ జిల్లా కేంద్రం) రావాలన్నా సామాన్య ప్రజానీకం పడే బాధలు అలివి కాని ఇక్కట్లు. అందుకే అనుకుంటాను నా నివాసం (క్యాంపు ఆఫీసు) ముందు పొద్దున్నే దరఖాస్తుదార్లు వేచి ఉండటం చూసి మనసు కరిగిపోయేది.




అంతకు ముందు రోజంతా బస్సులో ప్రయాణించి, దూర భారాలకు ఓర్చి, రాత్రికి కలెక్టరేటు ఆరుబయట ప్రదేశంలో తలదాచుకుని పొద్దున్నే జిల్లా అధికార్ల సందర్శనార్థం ఎదురుచూసే ఆ అభాగ్య జీవుల కష్టాలు ఎప్పుడు గట్టెక్కుతాయా అని ఆక్రోశించే వాడిని. అయినా పని పూర్తవుతుందన్న నమ్మకం లేదు. పదిగంటలు దాటిందంటే దౌరా (టూరు)కు పోవటమో, మీటింగుల్లో మునిగిపోవటమో జరిగేతే, అధికార్లు అందుబాటులో లేకపోతే, మరోరోజు జిల్లా హెడ్ క్వార్టర్‌లో ఉండాల్సి వచ్చేది. అదృష్టవశాత్తు పెద్దగా రద్దీలేని సంగారెడ్డి, ఆదిలాబాద్ లాంటి పట్టణాల్లో ఆఫీసుల ఆవరణలోనే మకాం. వీళ్ల కోసం దేవాలయ ప్రాంగణాల్లో ఉన్నట్లు సత్రాలు ఏర్పా టు చేస్తే బాగుంటుందేమో అన్న ఆలోచన కూడా మెదిలేది. ప్రత్యామ్నాయంగా ఈ ముగ్గురి పాలనా బాధ్యతలు ఒకే అధికారికి (వీఆర్‌వో లేదా వీఆర్‌ఏ) రెవెన్యూ పరంగా అప్పజెప్పటం జరిగింది. అన్ని రెవెన్యూ గ్రామాలకు

సరిపడా సిబ్బంది కరువే. ఇన్‌చార్జీలతో పాలనా వ్యవహారాలు చక్కబెట్టడం ఎక్కువ కాలం మంచిది కాదేమో. ఈ దిశలో గ్రామాధికార్ల పనితనం మెరుగుపరిచి, నైపుణ్యం వాళ్ళలో జొప్పించాల్సిన అవసరం ఈపాటికే ప్రభుత్వం గుర్తించింది.

ఇప్పటికీ ఎంతో పెద్ద రెవెన్యూ గ్రామాల శివార్లు అలాగే ఉండిపోయాయి. భూకమతాల సంఖ్య, విస్తీర్ణం దృష్ట్యా పట్టేదార్ల వారిగా చిన్న చిన్న రెవెన్యూ గ్రామాలుగా విడగొడితే పాలనా సౌలభ్యం, పర్యవేక్షణ పటిష్టం కావటానికి వీలుపడుతుంది. గ్రామస్థాయిలో సర్వే సిబ్బంది నియామకం తెలంగాణ జిల్లాలో తక్షణావసరం. మరీముఖ్యంగా రెవెన్యూ, ఫారెస్టు తగాదాల దృష్ట్యా మజరాల్ని ప్రత్యేక రెవెన్యూ గ్రామాలుగా నోటిఫై చేయాల్సిన అవసరం పరిశీలనా యోగ్యం. సమాంతరంగా గ్రామ పంచాయతీల విభజన కూడా సబబుగా ఉంటుంది. మేజర్, మైనర్, నోటిఫైడ్ అన్న భేదం లేకుండా, పరిపాలనకు తగినంతమంది సిబ్బందిని సమకూరిస్తే సమగ్ర గ్రామీణాభివృద్ధి సాధ్యమవుతుంది. జనాభా సాంద్రత, పంచాయతీ విస్తీర్ణం ప్రామాణికాలుగా చిన్న చిన్న పరిపాలనా సౌలభ్య యూనిట్లు ఈ దిశలో ఎంతో అవసరం.

షెడ్యూలు కులాలు, తెగలు అవాసముంటున్న పల్లెల్ని, తండాల్ని ప్రత్యే క గ్రామ పంచాయతీలుగా ప్రకటిస్తే, పంక్తిలో చివరి వ్యక్తి వరకూ అభివృద్ధి ఫలాలు చేరాలన్న ప్రభుత్వ లక్ష్యం నెరవేరినట్లే. ఇప్పటికే ఈ దిశలో తెలంగాణ ప్రభుత్వం చొరవ తీసుకోవటం ఆహ్వానించదగ్గ పరిణామం.సిబ్బంది కొరత, నిపుణత లోపించటం వంటి మాటలు పాలనా వ్యవస్థలో పరిపాటి. అవసరం ఉన్న శాఖల్లో సిబ్బంది కరువు. అవగాహనలేని సంస్థల్లో పనిలేక యాతన పడేవాళ్ళు ఎందరో. మరీ ముఖ్యంగా జిల్లా, డివిజన్ల స్థాయిలో ఇది ఎక్కువ. పబ్లిక్ సర్వీసు కమిషన్ ద్వారా నియామకమైన సిబ్బంది, అధికార్లు మెరికల్లాంటివారు. అఖిల భారతీయ సర్వీసు అధికార్లకు ఏ మాత్రం తీసిపోరు. కొన్ని సందర్భాల్లో మరీ ముఖ్యంగా గ్రూప్ – 1, 2 సర్వీసు అధికార్లు రిక్రూట్ అయినప్పటి నుంచి అదే శాఖలో మగ్గిపోవాల్సిన దుస్థితి. అలాగాకుండా ఓ పదేళ్ళు ఆయా శాఖ ల్లో పనిచేసి నిపుణతను సంతరించుకున్న తరువాత జనరల్ పూల్ లోకి లాక్కొని వారి సేవలు అన్ని శాఖలకు విస్తరింపజేస్తే మంచిది.

ఆ క్రమంలోనే స్టేట్ అడ్మినిస్ట్రేటివ్ సర్వీస్‌కు చెందిన వారిగా పరిగణించి (గతంలో హైదరాబాద్ సివిల్ సర్వీసు), వాళ్ళ నుంచే ఐఏఎస్, ఐపీఎస్ వంటి అఖిల భారత సర్వీసులోకి ఎంపిక జరిగేలా చూడాలి. దీంతో ఒక సర్వీసు గొప్పది, మరొక సర్వీస్ చిన్నది అన్న భావన పోతుంది. ఈ దిశలో అన్ని జిల్లాల్ని డైరెక్టుగా సెక్రటేరియట్‌తో అనుసంధానించే బదులు ఐదారు జిల్లాలకు కలిపి ఒక సీనియర్ అధికారి పర్యావేక్షణ ఉండేలా చూస్తే, ప్రజల ముంగిట్లో పాలన అన్న నినా దం సఫలమవుతుంది.

చిన్న జిల్లాల ఏర్పాటుతో పాటు పాలనా పరమైన పద్ధతులు, సంప్రదాయాలు, మ్యాన్యువల్స్ మార్చాల్సిన అవసరాన్ని ప్రభుత్వం ఈ పాటికే గుర్తించి ఉంటుంది. ఏ ప్రతిపాదనలు వచ్చినా, ఏ దరఖాస్తు వచ్చినా రొటీన్‌గా తగు చర్య నిమిత్తం పరిశీలనార్థం (ప్లీజ్ ఎగ్జామిన్) అని అంటూ విలువైన సమయాన్ని, శక్తి యుక్తుల్ని వృథా చేయరాదు. అలాగే కిందిస్థాయి నుంచి నివేదికలు కోరటం కూడా తప్పే. ఉదాహరణకు ఏ దరఖాస్తు దారుడైనా కిందిస్థాయిలో పనికావటం లేదని ఫిర్యాదు చేస్తే, నాపైనా, నా పని తీరు పట్ల పై అధికార్లకు కైంప్లెంట్ చేస్తావా అని కక్షకట్టిన సందర్భాలున్నాయి. ఈ అడ్మినిస్ట్రేటివ్ పద్ధతులు అవమానీయం. ఆక్షేపణీయం. ఈ పరిస్థితి నిత్యం ప్రజా సంబంధాలు కలిగి ఉండే శాఖల్లో మరీ దారుణం. ఈ పద్ధతులు మారాలి.

తెలంగాణలో పట్టణాల సంఖ్య తక్కువని మనకు తెలిసిందే. ఇప్పటికే నలభై శాతం జనాభా పట్టణాల్లో, నగరాల్లో నివాసమున్నట్లుగా గణాంకాలు సూచిస్తున్నాయి. రాబోయే పదేళ్లలో జనసాంద్రత యాభై శాతానికి మించిపోయే అంచనాలున్నాయి. ఉదాహరణకు 38 ఏళ్ళ కిందట (1978)లో ఏర్పాటైనది కొత్త జిల్లా రంగారెడ్డి. హైదరాబాద్ మహానగరం చుట్టూ వలయంగా, నాడు 6 లక్షల జనాభాతో, 6 అసెంబ్లీ నియోజన వర్గాలతో ప్రారంభమైంది. నేడు అది 14 అసెంబ్లీ నియోజకవర్గాలతో 52 లక్షల జనాభాతో మరో మహానగరాన్ని తలపిస్తున్నది. అలాగే ఇప్పుడు ఏర్పాటైన కొత్త మండల, డివిజన్, జిల్లా కేంద్రాలు రాబోయే రోజుల్లో పట్టణాకృతుల్ని సంతరించుకునే అవకావశం ఉన్నది. ఈ గ్రోత్ సెంటర్ల క్రమబద్ధీకరణకు ఇప్పటి నుంచే పునాదులు వేయాలి. ప్రణాళికలు తయారు చేసుకోవాలి. ఈ దిశలో టౌన్, కంట్రీ ప్లానింగ్ శాఖను అన్ని గ్రామ, మండల, జిల్లా కేంద్రాల పరిధిలో విస్తరించాల్సిన అవసరం ఉన్నది.

ఈ శాఖ రియల్ ఎస్టేట్, డెవలపర్లకే కాకుండా, సామాన్య ప్రజానీకానికి ఉపయోగ పడేలా రూపాంతరం చెం దాలి. ఈ శాఖ ఆధ్వర్యంలో ప్రణాళికాబద్ధమైన నమూనాలకు లోబడి, గ్రామ, మున్సిపల్, పట్టణాభివృద్ధి సంస్థలు మాస్టర్ ప్లాన్లు సవరించుకోవాలి. గతంలో ఈ నమూనాలు కాగితాలకే పరిమితం కావటం కద్దు. ఈ దిశలో విప్లవాత్మకమైన సం స్థాగత మార్పులు అవసరం. లేదంటే భవిష్యత్తులో అనేక సమస్యలు ఎదుర్కో వాల్సి వస్తుంది. ఇప్పుడు జంటనగరాలు ఎదుర్కొంటున్న రుగ్మతులు అధిగమించాల్సిన అవసరం పట్టణీకరణ దిశలో ఎంతైనా వుంది.

విభజించిన జిల్లాల పరంగా చూస్తే ఐటీ రంగానికి రంగారెడ్డి జిల్లా చిరునామా. పారిశ్రామికంగా మేడ్చల్, సంగారెడ్డి, పెద్దపల్లి జిల్లాలకు పెద్దపీట వేయాల్సి ఉం టుంది. విత్తన క్షేత్రంగా కరీంనగర్, సాగునీటి పరంగా ఖమ్మం, నేతన్నల జిల్లాగా సిరిసిల్ల, అడవుల జిల్లాగా ఆదిలాబాద్, సాంస్కృతిక వారసత్వ జిల్లాలుగా వరంగల్, యాదాద్రి, భద్రాద్రి, జగిత్యాల జిల్లాలు ఉన్నాయి. ఆయా జిల్లాల్లో అందుబాటులో ఉన్న సహజ సంపద, మానవ వనరుల్ని ఆధారంగా చేసుకొని జిల్లా అభివ ృద్ధి నివేదికలు తయారు చేసుకోవాల్సిన తరుణం ఇది. ఒక జిల్లా మంచిగా అభివృద్ధి చెందిందని, మిగతా జిల్లాలు వెనుక బాటుతనాన్ని ఎత్తిచూపే దానికి తావు లేకుండా, అన్ని జిల్లాల సత్వర ప్రగతిని స్వాగతించాలి.

**– డాక్టర్ దాసరి శ్రీనివాసులు**
**విశ్రాంత సీనియర్ ఐఏఎస్ అధికారి**

# దీర్ఘకవితల్లో తెలంగాణం











వచనకవిత్వం అనేరూపం ఒకటి ఏర్పడ్డాక దానికి నిర్దిష్ట పరిమాణం లేదు. ఇన్ని పంక్తులు, ఇన్ని వాక్యాల్లో పూర్తి కావాలన్న నియతి లేదు. కాని అనిర్దిష్టంగా ముప్ఫై పంక్తులు దాటని దాన్ని వచనకవిత్వం అనే రూపంలో పిలుస్తున్నాం. ఈ వచనకవితకు నిడివి పెంచి, తగ్గించి రాస్తే ఆ కవితలను దీర్ఘకవితలు, మినీ కవితలుగా అర్థం చేసుకుంటున్నాం. దీర్ఘకవితలు రాసే కవికి నిర్వహణ ఎక్కువ అవసరం. ఈ నిర్వహణలో రూపం, సారం, నిర్మాణం అనే మూడంశాలు గమనించదగినవి. కేవలం రూపాన్ని అనుసరించి గమనిస్తే ఇదంతా దీర్ఘకవితలోని దీర్ఘత్వాన్ని అనుసరించి చేసిన నిర్వచనమే. సారం వస్తుసంబంధమైనది కనుక ఇది సామాజిక, సారస్వత సంబంధమైంది. ఇక మూడవ అంశం నిర్మాణం. ఈ అంశాన్ని అనుసరించే కొన్ని రచనలను "దీర్ఘకావ్యాలు" అంటున్నారు. తెలంగాణకు జ్ఞానపీఠాన్ని తెచ్చింది డా॥ సి.నారాయణ రెడ్డి "విశ్వంభర" కావ్యం. ఆయన ఇతరరచనలు "భూమిక", "మట్టిమనిషి ఆకాశం" డా.ఎన్.గోపి "జలగీతం" మొదలైనవాటికి కావ్యలక్షణాలుండటంవల్ల ఇవి కావ్యంగా చెప్పబడ్డాయి. ప్రాచీన కావ్య, మహాకావ్య లక్షణాలున్నాయనేది పరిశీలకుల మాట. ఈ మార్గంలో విశ్లేషణలు కూడా వచ్చాయి. పెన్న శివరామకృష్ణ సినారె విశ్వంభరపై, ముదిగొండ వీరభద్రయ్య "మట్టీమనిషి ఆకాశం"పై, ఎం.నారాయణ శర్మ, డా॥ ధనుంజరు నాయక్ డా॥ గోపి జలగీతంపై విశ్లేషణలు రాసారు.

దీర్ఘకవితలు/కావ్యం రాసే కవుల్లో వస్తువు నిర్వహణ, సారం, వైశాల్యం అనేవి గమనించదగ్గవి. ఇవి రాసే కవుల్లో అవగాహన కన్నా ఎక్కువ జ్ఞానం కావాలి. ఈ జ్ఞానాన్ని కొలవడానికి కొన్ని భాగాలు చేయవచ్చు 1.వస్తుగత పార్శ్వాలు, 2.దార్శనిక పార్శ్వాలు, 3.అనుభవపార్శ్వాలు. నిజానికి ఈ మూడు పార్శ్వాలు సాధారణ వచనకవితకు కూడా ఉంటాయి. కాని దీర్ఘకవితలో నిర్వహణ అనే బలమైన లక్షణం వల్ల వీటి ప్రమేయం ఎక్కువ. సాధారణ కవితలో జ్ఞానంతో పాటు అవగాహన ప్రధాన పాత్ర పోషిస్తుంది. సాధారణ కవిత నిడివి తక్కువుండటం వల్ల ఈ మార్గాల ప్రమేయం తక్కువ, దీర్ఘకవితలో ఎక్కువ. తెలంగాణాలో ఉద్యమకాలంలో దానిముందు వెనకల్లో, ప్రధానంగా వచనకవిత అనే రూపం ఏర్పడ్డాక దీర్ఘకవితలు, కావ్యాల సంఖ్య ఎక్కువ. రెండు తెలుగు ప్రాంతాల్లో కూడా దీర్ఘకవిత, కావ్యాల రచన తెలంగాణాలోనే ఎక్కువగా కనిపిస్తుంది. చారిత్రకంగా కొన్ని అంశాలు దీన్ని ప్రస్ఫుటం చేస్తాయి కూడా. దీర్ఘ కావ్యంగా వచ్చిన సినారె "విశ్వంభర" తెలంగాణాకు, తెలుగు సాహిత్యానికి ఒక జ్ఞానపీఠాన్నిచ్చింది. డా.గోపి "జలగీతం" సుమారు పన్నెండు భాషల్లోకి అనువాదమయ్యింది. ఉద్యమం వచ్చినప్పుడు కవిత్వమంత వేగంగా దీర్ఘకవితలు కూడా వచ్చాయి. తెలుగు ప్రాంతాల్లోనే అత్యధికంగా దీర్ఘకవితలను జూలూరి గౌరీశంకర్ రాసారు. సుమారు పంతొమ్మిది దీర్ఘకవితలు జూలూరి వివిధ వస్తువులతో తెచ్చారు. బి.సి.దళిత ఉద్యమాలు, తెలంగాణా, విప్లవ సాయుధపోరాటాలు అనే వస్తువులు జూలూరి దీర్ఘకవితల్లో కనిపిస్తాయి.

ఈ మధ్య కాలంలో వచ్చిన దీర్ఘకవితల్లో అంశాత్మక విభజన కనిపిస్తుంది. మహాకావ్యాలు ఖండకావ్యాలు వచ్చినప్పుడు కాండలు, పర్వాలు, తరంగం అనే పేరుతో ఉన్న విభాగాలు, ఆధునికంగా 'సంఖ్య'గా కనిపిస్తాయి. ఈ నియతిని కూడా అందరు పాటించిన

దాఖలాలు లేవు.

తెలంగాణా మొదటి దీర్ఘకవితను గురించి చెప్పుకోవడం కొంత కష్టమే. దీన్ని చారిత్రకంగా పరిశీలించాల్సి ఉంది. స్థూలంగా దీర్ఘకవితలను 1. మానవీయ స్పృహకలిగినవిగా, 2. తెలంగాణా ఉద్యమానికి సంబంధించినవిగా 3. బీసీ.దళిత చైతన్యాలకు సంబంధించినవిగా అర్థం చేసుకోవచ్చు.

సినారె విశ్వంభర(1980), మట్టీ మనిషీ ఆకాశం-ప్రగతిశీల మానవవాదంగా గుర్తింపబడ్డాయి. "మట్టిని స్థలానికి, ఆకాశాన్ని కాలానికి మనిషిని ఈ రెంటికీ సంధానకర్తగా రూపొందించి ఈ కావ్యరచన చేసారు". ఈ కావ్యంలో వర్ణన ఎక్కువ, అనుభూతి, కళాత్మకత గల వాక్యాలున్నాయి.

మట్టిలో పుట్టిన మానవుడు నాటి నుంచి నేటి వరకు ఎదుర్కొన్న స్థితిగతులను గొప్పగా విశ్లేషించిన ఒక మహత్తర కావ్యం. 1988 లో అత్యున్నతమైన జ్ఞానపీఠ పురస్కారం పొందిన కావ్యం విశ్వంభర. ఈ కావ్యాన్ని కొన్ని విశ్వ విద్యాలయాలు ఎం.ఏ స్థాయిలో పాఠ్యగ్రంథంగా నిర్ణయించాయి.

డా.ఎన్.గోపి "జలగీతం" 2002 లో వచ్చింది. నీరు అనే వస్తువును తీసుకుని ప్రపంచవ్యాప్తంగా నీటికోసం జరుగుతున్న యుద్ధాలను, మానవీయ స్ఫూర్తితో చిత్రించిన కవిత. అనేకమైన వైజ్ఞానిక, శాస్త్రీయ, ఆధ్యాత్మికాంశాలను పెనవేసుకున్న రచన డా.గోపి "జలగీతం".

జూకంటి జగన్నాథం ఐదు దీర్ఘకవితలు రాసారు. చౌరస్తా (1980), శక్తి(1986), ఓ అయిదు ఎపిసోడ్స్ (1993), వాస్కోడిగామా.కాం (2000)లో రాసి, ఇవన్నీ 2000లో "వాస్కోడిగామా.కాం" పేరుతో పుస్తకంగా తెచ్చారు. ఇందులోని నాలుగు దీర్ఘకవితల్లోని వస్తువు వేరు. "అయిదు ఎపిసోడ్స్" మరఠ్వాడా భూకంపంపై, శక్తి స్త్రీ జీవితంపై, చౌరస్తా, వాస్కోడిగామా.కాం లు ప్రపంచీకరణపై రాసారు. ఈ కవిత ప్రపంచీకరణ సందర్భాలలో విచ్ఛిన్నమవుతున్న మానవ జీవనాలగురించి మాట్లాడింది.-"ఒక రోజు పది గాయాలు"(2004) కూడా ప్రపంచీకరణపై నిరసనగా వచ్చిందే.

తెలుగులో సుమారు పంతొమ్మిది దీర్ఘకవితలు రాశారు కవి జూలూరి గౌరిశంకర్. ఇవన్నీ వివిధ సందర్భాల్లో రాసారు. తెలంగాణ ఉద్యమ చైతన్యం, దళిత, బీసీ చైతన్యం నేపథ్యంలో ఈ దీర్ఘకవితలు వెలువరించారు. ప్రాంతీయ చైతన్యంతో పాటు ప్రపంచీకరణ దుష్ప్రభావాలపై వ్యతిరేకత ఇమిడి వుండటం గౌరీశంకర్ దీర్ఘకవితల్లోని విశేషం.

పత్తిపాకమోహన్ చేనేతలపై రాసిన "తెగిన పోగు"(2001)లో వచ్చింది. దీనితో పాటు "విధ్వంసక హుటాషా నృత్యం" పేరుతో మరో దీర్ఘకవితను కలిపి తెచ్చారు. "పవర్లూం పస్తులు తప్పిస్తుందని/ బీ నంబర్ నూలు కడుపు నింపుతుందని/ పాలిస్టర్ ఆదుకుంటుందని/ కన్నకలలన్నీ కళ్ళెదుటే నాశనమయ్యాయి"-(పే.5) అన్న వాస్తవాన్ని చెబుతారు. ఈ కాలంలోనే నారాయణ శర్మ 'సృష్టి' (2000)పేరుతో తాత్విక కవితనొకదాన్ని తెచ్చారు.

అనేక సందర్భాల్లో దేశంలో జరిగే సంఘటనలపట్ల స్పందించి కవిత్వాన్ని రాసారు తెలుగుకవులు. కందుకూరి శ్రీరాములు' 'దహనకావ్యం' కూడా అలాంటిదే. గుజరాత్ మారణ కాండ గురించి రాసిన ఈ కావ్యం 2003 లో వచ్చింది.

దర్భశయనం శ్రీనివాసాచార్య 'ఆట' 2004లో వచ్చింది. ప్రపంచీకరణ పరిణామాలు, డాలర్ విలువ, రియాల్టీ షోల పేరిట జరుగుతున్న వ్యాపారాన్ని ఈ కవిత చిత్రించింది.

తెలంగాణా మలిదశ ఉద్యమమవే దీర్ఘకవితతో ప్రారంభమయ్యిందనటం అతిశయోక్తికాదు. తెలంగాణ ఉద్యమానికి తొలిమైలు రాళ్ళుగా చెప్పుకునే సంకలనాలకన్నా ముందే సుంకిరెడ్డి నారాయణ రెడ్డి 'దాలి' (9.9.2001) వచ్చింది. గత ఉద్యమంలో బలైన 370 మంది వీరులకు, ఆత్మహత్యలు చేసుకున్న రైతులకు ఈ కవితను అంకితం చేసారు సుంకిరెడ్డి. తెలంగాణా సంస్కృతి, ఉద్యమావశ్యకత మొదలైన అంశాలు ఈ కవితలో కనిపిస్తాయి. తెలంగాణా ఇతివృత్తంతో దీర్ఘకవితలు రావడానికి దాలి మార్గాన్ని వేసింది. ఈ కాలంలోనే అల్లం నారాయణ-'యాది-మనాది' వచ్చింది. వెంకట్-'వర్జి', గ్యార యాదయ్య-'ఎర్కోషి', కాసుల ప్రతాపరెడ్డి 'గుక్క' వెలువడినాయి.

కాసుల ప్రతాపరెడ్డి 'గుక్క' తెలంగాణా ప్రాంతంలోని కరువు, హింస, ప్రతిహింస పేరిట నెత్తురు పారడాన్ని సంవేదనాత్మకంగా కవిత్వం చేసింది. ఆర్థికమాంద్యం వంటి అంశాలు తెలంగాణాలో ఎలాంటి దుస్థితిని సృష్టించాయో ఈ కవిత చిత్రించింది.

"రాత్రి అప్పుడప్పుడు ఊరు ఉలిక్కిపడిలేస్తుంది/ఒళ్ళుపిడచ కట్టుకుపోయి కళ్ళుమూసుకుంటుంది/పసిపిల్ల ఒక్కతే గుక్కపెట్టి ఏడుస్తుంది" అని ఆర్తితో చెప్పారు ప్రతాప్‌రెడ్డి.

వనపట్ల సుబ్బయ్య మూడు దీర్ఘకవితలు రాసారు 'హొల్లెడ' (2011) 'మశాల్' -తెలంగాణా మహోద్యమ కావ్యం (2009), 'ఊరచెరువు' 2015లో తీసుకొచ్చారు. మశాల్ ఉద్యమ ప్రస్థానాన్ని, ఆ కాలం ప్రధాన సందర్భాన్ని చిత్రించింది.

తెలంగాణా ఉద్యమం వస్తున్న సందర్భంలోనే అనేక దీర్ఘకవితలు వచ్చాయి. జూలూరి గౌరీశంకర్ చెకుముకి రాయి, నా తెలంగాణా అనే దీర్ఘకవితలు తెచ్చారు. ఈ కవితలు గాక వి.ఆర్.శర్మ "తెలంగాణా" పసునూరి రవీందర్ యుద్ధభూమి- పరమాత్మ 'డిసెంబర్-9', డా.బెల్లి యాదయ్య "విభాజకం", కాంచనపల్లి 'తండ్లాట' ఎం.వి.పట్వర్ధన్- 'జనాంతర్గామి', డప్పోళ్ళ రమేశ్ 'వలపోత', వాసరవేణి పరశురాం- 'ఓ స్వార్థ రాజకీయ నాయకులారా', ఉదయభాను 'గర్భందాల్చిన మేఘం', ఆశారాజు 'గుంగా షాయర్' వడ్డేబోయిన శ్రీనివాస్ 'చెమట చుక్క'మొదలైన దీర్ఘకవితలు వచ్చాయి. ఇవన్నీ ఈ ప్రాంతపు సృజనబలాన్ని చెబుతాయి. ఇంకా అనేక మంది తెలంగాణ ప్రాంత ప్రత్యేకతల్ని, విశిష్టతల్ని తమ దీర్ఘకవితల్లో రూపుగట్టించారు. తెలుగునాట దీర్ఘకవితలు ఎక్కువగా తెలంగాణ ప్రాంతం నుంచి రావడం విశేషం. వీటిలో ప్రాంతీయపరమైన ఆకాంక్షలే గాక ప్రపంచీకరణ దుర్మార్గాలపై నిరసన వ్యక్తం కావడం గమనార్హం. తెలంగాణ ప్రాంత కవులు నిరంతర చైతన్యంతో వ్యవహరిస్తున్నారని చెప్పడానికి ఈ దీర్ఘకవితలే నిదర్శనం.

- ఎం.ఎన్.శర్మ



# పేదరిక నిర్మూలన పథకాలు అమలు తీరు

నేడు ప్రపంచంలో పేదరిక నిర్మూలన ముఖ్యమైన సమస్యగా ఉంది. పేదరిక దేశాలు ముఖ్యంగా ఆసియా, ఆఫ్రికా దేశాలలోనే ఎక్కువ పేదరికం ఉందని లెక్కలు తెలుపుతున్నాయి. ఆ దేశాలలో కెన్యా, ఇతియోపియా, నైజీరియా లాంటి దేశాలను పేర్కొన్నారు. పేదరిక దేశాలలో ఇండియా, పాకిస్తాన్ బంగ్లాదేశ్‌లు అట్టడుగు స్థాయిలో ఉన్నాయి. పేదరికం అనేక అనర్థాలకు దారితీస్తుంది. ప్రపంచంలోని పేదలందరూ ఆసియా దేశాలలో ఉన్నారని ఐక్య రాజ్యసమితి నివేదిక పేర్కొంది. భారత్ అట్టడుగున ఉంది. 187 ఐక్యరాజ్యసమితి దేశాలలో పేదరికం ఉంది. పాకిస్తాన్‌లో కూడా పేదలు అధికంగా ఉన్నారు. వీరందరూ 1.90 డాలర్ల కంటే తక్కువ ఆదాయంతో బతుకులు నెట్టుకొస్తున్నారు. దారిద్ర్యానికి అంతం పలికి సంపదను సమానంగా పంపిణీ చేద్దాం అనే ప్రపంచ బ్యాంకు విడుదల చేసిన నివేదికను గురించి వెల్లడైన వివరాలను చూస్తే 1990లో ప్రపంచవ్యాప్తంగా పేదరికం 37.1 శాతం ఉంది. 2012 నాటికి 12.2 శాతానికి పడిపోయిందని 2030 నాటికి మూడు శాతం కంటే తక్కువకు పేదరికం పడిపోతుందని ఆ నివేదికలో అంచనా వేశారు.ఆ సంఖ్య 2015 నాటికి 70కోట్లకు పడిపోయిందని ఆంతకుముందు ప్రపంచంలో రోజు 1.90 డాలర్ల కంటే తక్కువ ఆదాయంతో బతికే వాళ్లు 90 కోట్ల మంది అని వివరించింది. ఈ గణాంకాలు ఎలా ఉన్నా ప్రపంచ దేశాలలో దుర్భర దారిద్ర్యంతో మానవాళి వేధించబడుతుందనేది వాస్తవం. ఆసియా ఆఫ్రికా దేశాలను సంపన్నులు దోచుకుంటున్నారని పేర్కొంది. అదే విధంగా క్రెడిట్ న్యూస్ నివేదికలో కేవలం ఒక శాతం మంది చేతుల్లో ప్రపంచ సంపద కేంద్రీకృతమై ఉంది. ఈ అసమానత వల్ల వృద్ధి వెనుకబాటుతనం, దారిద్ర్యం నిర్మూలనలో తిరోగమనం స్పష్టమవుతుందని పేర్కొంది. ఆ నివేదికలో తొలిసారి అసమానతల గూర్చి పేర్కొనడం జరిగింది. 2030 నాటికి ప్రపంచ సమాజంలో అట్టడుగున ఉన్న 40 శాతం ప్రజల ఆదాయాలు జాతీయ ఆదాయ వృద్ధి రేట్లతో పోలిస్తే స్థిరంగా, సానుకూలంగా పెరిగేటట్లు చేయడం తొలి లక్ష్యం. వయస్సు, లింగవైకల్యం, జాతి, పుట్టుక, మతం, ఆర్థికస్థితి వంటి వైరుధ్యాలతో నిమిత్తం లేకుండా 2030 నాటికి ప్రపంచంలో ప్రతి ఒక్కరికి సామాజిక ఆర్థిక రాజకీయ ప్రధాన స్రవంతిలో కీలక భాగస్వామ్యం కల్పించడం లక్ష్యంగా పేర్కొంది.

భారతదేశంలో పేదరిక నిర్మూలనకు సంబంధించి రెండు దశలలో చూడాల్సి ఉంది. ఆర్థిక సంస్కరణల ముందు నాటి స్థితి గుణాత్మకంగా ఉంది సంస్కరణల అనంతరం దారిద్ర్యం ఏటా 1.36 శాతం చొప్పున తగ్గుతూ వస్తోంది. సంస్కరణల ముందు ఏటా 0.44శాతం మాత్రమే పేదరికం తగ్గింది. ఆర్థిక సరళీకరణలు ప్రారంభమయ్యాక 1990 దశకం నాటితో పోలిస్తే 2000లలో పేదరికం వేగం తగ్గింది. టెండూల్కర్ కమిటీ అంచనాల ప్రకారం 1993-94నుండి 2004-05 మధ్యకాలంలో మనదేశంలో పేదరికం ఏటా 0.75 శాతం మేర తగ్గింది. కానీ ఆ తర్వాత 2004-05 నుంచి 2011-12 మధ్యకాలంలో దారిద్ర్యం ఏటా 2.2 చొప్పున తగ్గింది.



2000లలో ఎస్సీ, ఎస్టీ వర్గాలలో దారిద్ర్యం గణనీయంగా తగ్గింది. దేశంలో 2009-2010నుంచి 2011-12 మధ్యకాలంలో దేశంలో పేదరికం వేగంగా తగ్గినట్టు రంగరాజన్ కమిటీ నివేదిక సైతం పేర్కొంది. దేశంలో గ్రామీణ, పట్టణ ప్రాంతాలలో భారత ప్రభుత్వం 2011లో సామాజిక ఆర్థిక, కుల గణన ప్రకారం కేవలం పల్లెలకు సంబంధించిన లెక్కలే బయటికి వచ్చాయి. దానిలో కొన్ని పేదల సంఖ్యను నిగ్గుతేల్చడానికి కొన్ని కచ్చితమైన విధానాలు అనుసరించారు. ఆదాయపన్ను చెల్లిస్తున్న నెలకు 10వేల రూపాయలు పైగా సంపాదిస్తున్న కుటుంబాలకు అనాథలు, గూడులేని కుటుంబాలు, ప్రాథమిక గిరిజన సమూహాలు వంటి వాటిని మరో మాటలేకుండా పేదరికం లెక్కల్లో చేర్చడం ఎస్ఇసిసి గణాంకాల ప్రకారం దేశంలోని గ్రామీణ ప్రాంతాలలో 48.53 శాతం ప్రజలు పేదరికంలో కొట్టుమిట్టాడుతున్నట్లు వెల్లడైంది. టెండ్యూలర్, రంగ రాజన్ కమిటీల నివేదికలలో తెలిపిన దానికంటే దేశంలో పేదరికం తాండవిస్తున్నట్లు ఎస్ఇసిసి గణాంకాలు పేర్కొంటున్నాయి. వీటి ప్రాతిపదికగా సమాజంలోని బడుగు బలహీనవర్గాల పురోభివృద్ధి కోసం మెరుగైన విధానాలు రూపొందించి అమలు చేయడం ప్రభుత్వాల బాధ్యత. దేశం నుంచి దారిద్ర్యాన్ని పేదరికాన్ని తగ్గించేందుకు అస్త్రం ఉపాధి వ్యవసాయ రంగాల్లో కన్నా వ్యవసాయాభివృద్ధి వలననే రెండింతలు నిర్మూలించవచ్చునని వివిధ అధ్యయనాలు వెల్లడిస్తున్నాయి. రైతుల ఆదాయం పెంచే క్రమంలో వ్యవసాయాన్ని బహుముఖంగా విస్తరించాలి. మున్ముందు ఉత్పత్తి, సేవారంగాల ఉపాధి అవకాశాలను ఇనుమడింప చేయడం తప్పనిసరి.



భారత్‌లో తయారీ, అంకుర పరిశ్రమలు, ముద్ర వంటి కార్యక్రమాలు ఈ క్రమంలో పడిన సరైన అడుగులే. సేవారంగాన్ని మరింత విస్తరించాలి. నిరుద్యోగం అంతకంతకు పెరగడంతో యువతలో అసంతృప్తి అసహనం ఎల్లలు చాటుతున్నాయి. ప్రతిఒక్కరికీ నాణ్యమైన నైపుణ్యాలు కల్పించాలి. సమర్థులుగా యువతను తీర్చిదిద్దితే వంద కోట్లకుపైగా భారత్‌కు అతిపెద్ద బలంగా మారుతారు. కాని ప్రభుత్వం పేదలకు ఉపయోగపడే ఎం.జి.ఎన్.ఆర్.ఇజి.ఎస్ఎ చట్టం అమలుకు కేటాయించే నిధులలో కోత విధిస్తుంది. ఇది చాలా విధాలుగా ఖండించాలి. పేదరికంను తేలికగా తీసుకొని బడ్జెట్ కోతలు విధించడం సరైనదికాదు. కేంద్రప్రభుత్వం వెనుకబడిన అభివృద్ధి నిధులు ఆర్‌జిఏవై రాజీవ్‌గాంధీ ఉపాధి కల్పన నిధులను తగ్గించారు. దీనితో గ్రామాల ప్రజలకు ఉపాధి కల్పన అంతంతగానే ఉంది. యాంత్రీకరణ పెరగడంతో గ్రామీణులు ఉపాధిని కోల్పోతున్నారు. కనుక " పేదరిక ప్రత్యామ్నాయ పథకాలను" కేంద్రం అమలు చేయక పోతే రాష్ట్రాలకు నిధులు అందకపోవడంతో పేదరిక పథకాలు నీరుగారిపోతున్నాయి. విధాన నిర్ణయవేత్తలు వీటిని గుర్తించి రాష్ట్రాలకు మరిన్ని పేదరిక నిర్మూలనకు నిధులు అందచేయాల్సిన అవసరం ఎంతో ఉంది. కొన్ని పశ్చిమ దేశాలలో పేదరిక నిర్మూలనకు నిధులు ఇస్తున్నాయి. స్విట్జర్లాండ్ సమావేశాలలో 2500 స్విస్‌ఫ్రాంక్‌లు ఇవ్వాలని సూచించింది. ఫిన్‌లాండ్ నెదర్లాండ్ వంటి దేశాల్లో ఈ ప్రయోగం సిద్ధమవుతుంది. భారతదేశంలో వందకోట్లుగా ఉన్న పౌరులకు డబ్బు ఇవ్వడం ఎంతవరకు సాధ్యమవుతుందో పరిశీలించాలి. డబ్బు కన్నా సమాన అవకాశాలు కల్పించాలని నూతనంగా యువత ఆలోచిస్తున్నది. ప్రభుత్వం ప్రజాసంక్షేమ కార్యక్రమాలను పారదర్శకంగా అమలు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

**డాక్టర్ కె.ఆసయ్య, ఐఐఎస్**

# తెలంగాణ రాష్ట్రంలో క్రొత్త జిల్లాల వివరాలు

**1. సిద్ధిపేట జిల్లా:** సిద్ధిపేట జిల్లా కేంద్రం
విస్తీర్ణం: 3,432 చ.కి.మీ.
జనాభా: 10,02,671
మండలాలు: 22
గ్రామాలు: 217
రెవెన్యూ డివిజన్లు: 3
మున్సిపాలిటీలు: 2
ప్రాముఖ్యత: ముఖ్యమంత్రి సొంతజిల్లా.
గ్రామం: చింతమడక.

**2. ఆదిలాబాద్ జిల్లా:** ఆదిలాబాద్
విస్తీర్ణం: 4,153 చ.కి.మీ.
జనాభా: 7,21,433
మండలాలు: 18
గ్రామపంచాయతీలు: 275
రెవెన్యూ డివిజన్లు: 2
ప్రత్తి ఉత్పత్తికి ప్రాముఖ్యం.
అడవి విస్తీర్ణం: 1,09,007 హెక్టార్లు

**3. మంచిర్యాల జిల్లా:** మంచిర్యాల
విస్తీర్ణం: 3,943 చ.కి.మీ.
జనాభా: 7,07,050
మండలాలు: 18
గ్రామపంచాయతీలు: 200
రెవెన్యూ డివిజన్లు: 2
మున్సిపాలిటీలు: 3
ప్రాముఖ్యత: బొగ్గు నిక్షేపాలు (సింగరేణి)

**4. నిర్మల్ జిల్లా:** నిర్మల్ పట్టణం
విస్తీర్ణం: 3845 చ.కి.మీ.
జనాభా: 7,30,286
మండలాలు: 19
గ్రామపంచాయతీలు: 240
రెవెన్యూ డివిజన్లు: 2
మున్సిపాలిటీలు: 2
ప్రాముఖ్యత: బాసర సరస్వతి దేవాలయం

**5. కొమరం భీం అసిఫాబాద్ జిల్లా:** ఆసీఫాభాద్
విస్తీర్ణం: 4878 చ.కి.మీ.
జనాభా: 5,92,831
మండలాలు: 15
గ్రామపంచాయతీలు: 177
రెవెన్యూ డివిజన్లు: 2
మున్సిపాలిటీలు: 1
ప్రాముఖ్యత: గిరిజన సంస్కృతి, గోండుల రాజధాని

**6. ఖమ్మం జిల్లా:** ఖమ్మం
విస్తీర్ణం: 4360 చ.కి.మీ.
జనాభా: 11,02,094
మండలాలు: 21
గ్రామపంచాయతీ: 389
రెవెన్యూ డివిజన్లు: 2
మున్సిపాలిటీలు: 3
ప్రాముఖ్యత: గ్రానైట్, పరిశ్రమలు

**7. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా:** కొత్తగూడెం
విస్తీర్ణం: 8062 చ.కి.మీ.
జనాభా:
మండలాలు: 23
గ్రామపంచాయతీ: 205
రెవెన్యూ డివిజన్లు: 2
మున్సిపాలిటీలు: 4
ప్రాముఖ్యత: బొగ్గు గనులు, పరిశ్రమల కేంద్రం, ఎన్‌టిపిసి, జెన్‌కో, ఎన్ఎమ్‌డిసి, అటోజెనిక్ ఎనర్జీ, ఐటిసి, భద్రాద్రి

**8. మహబూబ్‌నగర్ జిల్లా:** మహబూబ్‌నగర్
విస్తీర్ణం: 4037 చ.కి.మీ.
జనాభా: 12,90,467
మండలాలు: 26
గ్రామపంచాయతీ: 543
రెవెన్యూ డివిజన్లు: 2
మున్సిపాలిటీలు: 3
ప్రాముఖ్యత: పిల్లలమర్రి టూరిస్టు కేంద్రం

**9. వనపర్తి:** వనపర్తి
విస్తీర్ణం: 3055 చ.కి.మీ.
జనాభా: 7,70,334
మండలాలు: 14
గ్రామపంచాయతీ: 215
రెవెన్యూ డివిజన్లు: 1
మున్సిపాలిటీలు: 1
ప్రాముఖ్యత: విద్యాక్షేత్రం

**10. నాగర్‌కర్నూల్:** నాగర్‌కర్నూల్
విస్తీర్ణం: 2966 చ.కి.మీ.
జనాభా: 8,60,613
మండలాలు: 20
గ్రామపంచాయతీ: 329
రెవెన్యూ డివిజన్లు: 3
మున్సిపాలిటీలు: 4
ప్రాముఖ్యత: శ్రీశైలం దేవాలయ ఎత్తిపోతల పథకాలు

**11. జోగులాంబ గద్వాల జిల్లా:** గద్వాల
విస్తీర్ణం: 2928 చ.కి.మీ.
జనాభా: 6,64,971
మండలాలు: 12
గ్రామపంచాయతీ: 190
రెవెన్యూ డివిజన్లు: 1
మున్సిపాలిటీలు: 1
ప్రాముఖ్యత: దేవాలయ టూరిజం

**12. కరీంనగర్** కరీంనగర్
విస్తీర్ణం: 2379 చ.కి.మీ.
జనాభా: 9,86,204
మండలాలు: 16
గ్రామపంచాయతీ: 215
రెవెన్యూ డివిజన్లు: 2
మున్సిపాలిటీలు: 3
ప్రాముఖ్యత: వరిసాగుకు ప్రసిద్ధి.

**13. జగిత్యాల జిల్లా:** జగిత్యాల
విస్తీర్ణం: 3043 చ.కి.మీ.
జనాభా: 9,83,414
మండలాలు: 18
గ్రామపంచాయతీ: 328
రెవెన్యూ డివిజన్లు: 2
మున్సిపాలిటీలు: 3
ప్రాముఖ్యత: చక్కెరపంటకు ప్రసిద్ధి

**14. రాజన్నసిరిసిల్లా జిల్లా:** సిరిసిల్లా
విస్తీర్ణం: 2019 చ.కి.మీ.
జనాభా: 5,43,694
మండలాలు: 13
గ్రామపంచాయతీ: 177
రెవెన్యూ డివిజన్లు: 1
మున్సిపాలిటీలు: 2
ప్రాముఖ్యత: చేనేత పరిశ్రమ

**15. పెద్దపల్లి జిల్లా:** పెద్దపల్లి
విస్తీర్ణం: 2236 చ.కి.మీ.
జనాభా: 7,95,322
మండలాలు: 14
గ్రామపంచాయతీ: 209
రెవెన్యూ డివిజన్లు: 2
మున్సిపాలిటీలు: 2
ప్రాముఖ్యత: ఎన్‌టిపిసి, జెన్‌కో, ఆర్ఎఫ్‌సిఎల్ బొగ్గుగనులు

**16. మేడ్చేల్ జిల్లా:** మల్కాజిగిరి
విస్తీర్ణం: 1039 చ.కి.మీ.
జనాభా: 25,42,203
మండలాలు: 15
గ్రామపంచాయతీ: 84
రెవెన్యూ డివిజన్లు: 2
మున్సిపాలిటీలు: 4
ప్రాముఖ్యత: పారిశ్రామిక కేంద్రం

**17. హైదరాబాద్ జిల్లా:** హైదరాబాద్
విస్తీర్ణం: 217 చ.కి.మీ.
జనాభా: 39,43,323
మండలాలు: 16
గ్రామపంచాయతీ: 84
రెవెన్యూ డివిజన్లు: 2
జిహెచ్ఎం సర్కిలు: 9
ప్రాముఖ్యత: రాష్ట్ర రాజధాని నగరం

**18. వరంగల్ (అర్బన్)జిల్లా:** వరంగల్
విస్తీర్ణం: 1305 చ.కి.మీ.
జనాభా: 11,35,707
మండలాలు: 11
గ్రామపంచాయతీ: 45
రెవెన్యూ డివిజన్లు: 1
మున్సిపాలిటీలు: 1
ప్రాముఖ్యత: విద్యాకేంద్రం

**19. వరంగల్ రూరల్ జిల్లా:** వరంగల్
విస్తీర్ణం: 2175 చ.కి.మీ.
జనాభా: 7,16,457
మండలాలు: 15
గ్రామపంచాయతీ: 280
రెవెన్యూ డివిజన్లు: 2
మున్సిపాలిటీలు: 2
ప్రాముఖ్యత: వ్యవసాయం

**20. జయశంకర్ భూపాలపల్లి జిల్లా:** భూపాలపల్లి
విస్తీర్ణం: 6175 చ.కి.మీ.
జనాభా: 7,05,054
మండలాలు: 20
గ్రామపంచాయతీ: 262
రెవెన్యూ డివిజన్లు: 2
మున్సిపాలిటీలు: 1
ప్రాముఖ్యత: వ్యవసాయం, సమ్మక్కసారలమ్మ జాతర

**21. మహబూబాబాద్ జిల్లా:** మహబూబాబాద్
విస్తీర్ణం: 2877 చ.కి.మీ.
జనాభా: 7,70,170
మండలాలు: 16
గ్రామపంచాయతీ: 287
రెవెన్యూ డివిజన్లు: 2
మున్సిపాలిటీలు: 1
ప్రాముఖ్యత: దేవాలయ ప్రసిద్ధి

**22. జనగామ జిల్లా:** జనగామ
విస్తీర్ణం: 2817 చ.కి.మీ.
జనాభా: 5,82,457
మండలాలు: 13
గ్రామపంచాయతీ: 217
రెవెన్యూ డివిజన్లు: 2
మున్సిపాలిటీలు: 1
ప్రాముఖ్యత: ప్రాజెక్టులు

**23. కామారెడ్డి జిల్లా:** కామారెడ్డి
విస్తీర్ణం: 3663 చ.కి.మీ.
జనాభా: 9,74,227
మండలాలు: 22
గ్రామపంచాయతీ: 323
రెవెన్యూ డివిజన్లు: 3
మున్సిపాలిటీలు: 1
ప్రాముఖ్యత: బెల్లం ఉత్పత్తి కేంద్ర
డైరీ టెక్నాలజీ

**24. నిజామాబాద్ జిల్లా:** నిజామాబాద్
విస్తీర్ణం: 4261 చ.కి.మీ.
జనాభా: 15,77,108
మండలాలు: 27
గ్రామపంచాయతీ: 395
రెవెన్యూ డివిజన్లు: 3
మున్సిపాలిటీలు: 3
ప్రాముఖ్యత: సాగుకు అనువైన జిల్లా

**25. నల్గొండ జిల్లా:** నల్గొండ
విస్తీర్ణం: 6863 చ.కి.మీ.
జనాభా: 16,31,399
మండలాలు: 31
గ్రామపంచాయతీ: 516
రెవెన్యూ డివిజన్లు: 3
మున్సిపాలిటీలు: 3
ప్రాముఖ్యత: తెలంగాణ సాయుధ
పోరాటం

**26. సూర్యపేట జిల్లా:** సూర్యపేట
విస్తీర్ణం: 3374 చ.కి.మీ.
జనాభా: 10,99,560
మండలాలు: 23
గ్రామపంచాయతీ: 322
రెవెన్యూ డివిజన్లు: 3
మున్సిపాలిటీలు: 3
ప్రాముఖ్యత: సిమెంటు పరిశ్రమ

**27. మెదక్ జిల్లా:** మెదక్
విస్తీర్ణం: 2723 చ.కి.మీ.
జనాభా: 7,67,428
మండలాలు: 20
గ్రామపంచాయతీ: 381
రెవెన్యూ డివిజన్లు: 3
మున్సిపాలిటీలు: 1
ప్రాముఖ్యత: పరిశ్రమల కేంద్రం

**28. సంగారెడ్డి జిల్లా:** సంగారెడ్డి
విస్తీర్ణం: 4441 చ.కి.మీ.
జనాభా: 15,23,758
మండలాలు: 26
గ్రామపంచాయతీ: 475
రెవెన్యూ డివిజన్లు: 3
మున్సిపాలిటీలు: 4
ప్రాముఖ్యత: పారిశ్రామిక కేంద్రం

**29. వికారాబాద్ జిల్లా:** వికారాబాద్
విస్తీర్ణం: 3386 చ.కి.మీ.
జనాభా: 8,81,250
మండలాలు: 18
గ్రామపంచాయతీ: 354
రెవెన్యూ డివిజన్లు: 2
మున్సిపాలిటీలు: 2
ప్రాముఖ్యత: నదులకు ప్రసిద్ధి

**30. రంగారెడ్డి జిల్లా:** చేవెళ్ళ
విస్తీర్ణం: 5006 చ.కి.మీ.
జనాభా: 25,51,731
మండలాలు: 27
గ్రామపంచాయతీ: 436
రెవెన్యూ డివిజన్లు: 5
మున్సిపాలిటీలు: 5
ప్రాముఖ్యత: ఎయిర్‌పోర్టు,
పరిశ్రమల నగరం

**31. యాదాద్రి భువనగిరి జిల్లా:** భువనగిరి
విస్తీర్ణం: 3092 చ.కి.మీ.
జనాభా: 7,26,465
మండలాలు: 16
గ్రామపంచాయతీ: 304
ప్రాముఖ్యత: ప్రముఖ ఆధ్యాత్మిక కేంద్రం

**– ఐ & పిఆర్, సిఎంపి**

# జనన మరణాల రిజిష్ట్రేషను చట్టం 1969

జనన మరణాల రిజిస్ట్రేషను చట్టం 1969 లోని సెక్షను 30 ప్రకారము రాష్ట్ర ప్రభుత్వము నియమాలు చేయవచ్చును. ఈ చట్టము ప్రకారము 1977 లో రాష్ట్ర ప్రభుత్వము జారీ చేసిన జనన, మరణాల నమోదు నియమాలను సమూలంగా మార్పు చేస్తు 1999 సంవత్సరము లో (G.O.Ms.655, Health, Medicine and Family Welfare (N1) Department dated 29/12/1999) ద్వార నూతన నియమాలు జారీ చేయబడినవి. సదరు చట్టములోని సెక్షను 7 లోని సబ్ సెక్షను (1) ప్రకారము రాష్ట్ర ప్రభుత్వము, రాష్ట్రములో జనన మరణాల నమోదు చేయుటకు రిజిస్ట్రారులను నియమించ వచ్చును. అంతే గాక అదే చట్టము లోని సబ్ సెక్షను (5) ప్రకారము చీఫ్ రిజిస్ట్రారు గారి ముందస్తు అనుమతితో రిజిస్ట్రారు గారు, రిజిస్ట్రారుగా తన విధులను నిర్వహించుటకు ఉప రిజిస్ట్రారును నియమించి తన విధులను బదిలీ చేయవచ్చును. అలా జనన మరణాల రిజిస్ట్రేషను చట్టం 1969 లోని సెక్షను 30 ప్రకారము సంక్రమించిన అధికారము ప్రకారము రాష్ట్ర ప్రభుత్వము, ఆరోగ్య వైద్య మరియు కుటుంబ సంక్షేమ శాఖ ఉత్తర్వు నెం.26 తేది. 12.01.2000 ద్వార, నూతన నియమాలకు అనుగుణంగా రాష్ట్రములోని వివిధ ప్రాంతాలకు జనన మరణాల నమోదుకు రిజిస్ట్రారులను నియమించింది. దానిలో భాగంగానే మున్సిపాలిటీలకు, ప్రాజెక్టు ప్రాంతాలకు వివిధ హెూదాలు గల అధికారులను, గ్రామపంచాయతీలలో కార్యనిర్వహణాధికారులను జనన మరణ రిజిస్ట్రారులు గా నియమిస్తు ఇతర ప్రాంతాలకు అనగా ఏ పంచాయతీకి కార్యనిర్వహణాధికారి నియమించ బడలేదో వాటికి గ్రామ పరిపాలన అధికారులను జనన మరణ నమోదు అధికారులుగా నియమించడం జరిగింది. కాని జనన మరణ రిజిస్ట్రారులుగా గ్రామరెవెన్యూ అధికారులను నియమించడం, పంచాయతీరాజ్ చట్టములోని సెక్షను 45 లోని సబ్ సెక్షను (1) క్లాజ్ (x) కు వ్యతిరేకము. ఎందుకంటే గ్రామపంచాయతీ నిర్వహించవలసిన కర్తవ్యాలలో జనన మరణ నమోదు కూడా ఒక భాగమే. జనన మరణాల నమోదు కార్యక్రమము గ్రామ పంచాయతీ కర్తవ్యమే అయినా అది స్వతంత్రంగా, స్వయంగా జనన మరణాలను నమోదు చేయలేదు. దాని కొరకు పంచాయతీలో పనిచేసే ఒక అధికారి కావాలి. చట్టానికి వ్యతిరేకముగా నియమాలను చేయ కూడదు. ఒక వేల చేసినా అలాంటి నియమాలు, న్యాయస్థానములలో నిలువ లేవు.

ఆ తరువాత 2002 సంవత్సరములో రాష్ట్రములోని ప్రతి గ్రామపంచాయతీకి పంచాయతీ కార్యదర్శులను ప్రభుత్వము నియమించడం వలన, ఇంతకు ముందు పంచాయతీలలో పనిచుయుచున్న కార్యనిర్వహణాధికారులు జనన మరణ ధృవీకరణ పత్రాలు జారీచేయడం మిగతా పంచాయతీలలో గ్రామ రెవెన్యూ అధికారులు జనన మరణ ధృవీకరణ పత్రాలు జారీచేయడం వలన కొంత వరకు ప్రజలలో సందిగ్ధము ఏర్పడినది. అందువలన అలాంటి సందిగ్ధము దూరం చేయుడానికి, ప్రతి గ్రామపంచాయతీకి పూర్తికాలము పనిచేయుటకు నియమించబడిన కార్యదర్శులు ఉండుట వలన, గ్రామరెవెన్యూ అధికారల నుండి జనన మరణ నమోదు బాధ్యతలను తప్పించి వాటిని పంచాయతీ కార్యదర్శులకు జనన మరణ నమోదు బాధ్యతలను ప్రభుత్వము జి.వో.ఎమ్.ఎస్.నెం. 230 (Health Medical & Family welfare department) తేది. 11.06.2002 ద్వార, పూర్తిగా అప్పగించబడినది.

ఇదివరకు కార్యనిర్వహణాధికారులు లేని గ్రామపంచాయతీలకు మండల రెవెన్యూ అధికారులు జనన మరణ నమోదు అధికారులుగా బాధ్యతలు నిర్వహించేవారు. వారికి సహాయకులుగా గ్రామ స్థాయిలో గ్రామ రెవెన్యూ అధికారులు జనన మరణ అధికారులుగా వ్యవహరించేవారు. అందు కొరకు సంవత్సరము ముగియగానే గ్రామరెవెన్యూ అధికారుల నుండి జనన మరణాల నమోదు రిజిష్టర్లు మండల కార్యాలయలాలో భద్రపరుచుటకు మండల రెవెన్యూ అధికారులు తెప్పించుకొనేవారు. ఆ కారణంగా నెల రోజుల తరువాత ఒక సంవత్సరము లోపు ఆలస్యముగా నివేదించిన వాటిని నమోదును చేయవలసిన జనన మరణాల , గ్రామ పరిపాలన అధికారులు తమ వద్ద ఉన్న రిజిష్టరులో నమోదు చేయుటకు, జనన మరణాల నమోదు అధికారి అయిన మండల రెవెన్యూ అధికారి (ప్రస్థుతం తహసీల్దారు) అనుమతితో నమోదు చేసేవారు. ఎందుకనగా పంచాయతీ పంచాయతీ కార్యదర్శి వ్యవస్థ ప్రాంభానికి ముందు జారీ చేసిన నియమాలలోని నియమము 9 లోని ఉపనియమము (2) ప్రకారము ఆలస్యముగా అంటె జననం లేక మరణం సంభవించిన నెలరోజుల తరువాత నుండి సంవత్సరము లోపు నివేదించు జనన మరణాలను, గ్రామీణ ప్రాంతాలలో మండల రెవెన్యూ అధికారి (ప్రస్థుతం తహసీల్దారు) గారి, మిగతా ప్రాంతాలలో జనన మరణ రిజిస్ట్రారు గారి అనుమతితో నమోదు చేయాలని ఉన్నది. ఇక్కడ మిగతా ప్రాంతాలు అంటె ఎక్కడైతే జనన మరణాల నమోదు అధికారి నియమించబడినారో అక్కడ జనన మరణాల రిజిస్ట్రారు గారు అనుమతి ఇస్తారు అని అర్థం. ఈ నియమాలు జారీ చేసే సమయానికి ప్రతి పంచాయతీకి కార్యదర్శిని ప్రభుత్వం నియమించలేదు అప్పుడు పెద్ద పంచాయతీలకు మాత్రమే కార్యనిర్వహణాదికారి ఉన్నందున వారికి రిజిస్ట్రారు బాధ్యతలు అప్పగించ బడినవి, మిగతా చిన్న పంచాయతీలో గ్రామరెవెన్యూ అధికారులకు రిజిస్ట్రారు బాధ్యలు అప్పగించారు కాబట్టి మండల రెవెన్యూ అధికారి అనుమతి అనే నిబందన పెట్టారు. కాని ప్రస్థుతం ప్రతి పంచాయతీకి కార్యదర్శి నియమించ బడినారు, వారినే గ్రామీణ ప్రాంతాలలో కూడా జనన మరణ రిజిస్ట్రారులు గా ప్రభుత్వం నియమించింది, మరియు ప్రస్థుతం గ్రామీణ ప్రాంతాలలో జననమరణ రిజిస్ట్రారులుగా గ్రామ రెవెన్యూ అధికారులు లేరు, కాబట్టి రిజిస్ట్రారు హెూదాలో సదరు నియమము ప్రకారము రిజిస్ట్రారు గారే అంటె పంచాయతీ కార్యదర్శి గారే స్వయంగా నెల రోజుల తరువాత, సంవత్సరము లోపు నివేదించు జనన మరణాలను, ఆలస్యముగా నివేదించినందులకు తగిన రుసుము తీసుకొని, నమోదు చేయవచ్చును. ఇక్కడ గమనించ వలసినది ఏమనగా, ఆలస్యముగా వచ్చు జనన మరణాల నివేదనను, జనన మరణ రిజిస్ట్రారులు కూడా, మండల రెవెన్యూ అధికారి అనమతి తీసుకొని నమోదు చేయాలని ఆ నియమాలలో ఎక్కడా పేర్కొన బడలేదు. కావున పంచాయతీ కార్యదర్శులు ఆలస్యముగా, సంవత్సరములోపు వచ్చు జనన మరణాలను రిజిష్టరు లో నమోదు చేయుటకు మళ్ళీ మండల రెవెన్యూ అధికారి( తహసీల్దారు) గారి అనుమతి తీసుకోవలసిన అవసరము గాని ఆగత్యము గాని లేదు.

కాని 1999 సంవత్సరము లో (G.O.Ms.655, Health, Medicine and Family Welfare (N1) Department dated 29/12/1999) ద్వార జారీ చేయబడిన నియమాలలో ఉన్న నియమము 9 లోని ఉప నియమము (2) క్రింద చేర్చబడిన ఒక పరిచ్ఛేదం లో **"గ్రామీణ ప్రాంతాలలో మండల రెవెన్యూ అధికారి, ఇతర ప్రాంతాలలో సంబందిత రజిస్ట్రారు గారు అనమతి ఇస్తారు"** అని సూచించ బడినది దానిని మార్చకుండానే తరువాతి జి.వోలు జారీ చేయబడుట వలన పంచాయతీ కార్యదర్శులు సందిగ్ధానికి గురి కావలసిన పరిస్థితి ఏర్పడినది. దానిని మార్చవలసిన అవసరము చాలా ఉన్నది. ప్రభుత్వంలోని వైద్య ఆరోగ్య శాఖ దీనిపై దృష్టి సారించి తొందరగా అవసరమైన మార్పులు చేస్తారని ఆశిస్తాను.

**యస్. శంకరయ్య,**
**సీనియర్ రిసోర్స్ పర్సన్. టిసిపార్డు**



# అడవిలో గిరిజన బ్రతుకుల తీరు

**అడవితల్లి ఒడిలోనే సాగిపోయే జీవితాలు వారివి. అడవే వారి ప్రపంచం. అదే వారి సర్వస్వం. ప్రకృతి ప్రసాదించే కాయలు, పళ్లు, గింజలు తదితరాలే వారికి ఆహారాలు. ఇక ఏదైనా అనారోగ్యం వచ్చినా అడవిలో దొరికే పసర్లు, మూలికలే వారికి మందులు. అడవే వారికి జీవిక. సంప్రదాయంగా వస్తున్న రకరకాల చెట్ల పెంపకం, జొన్న వంటి పంటలు పండిస్తుంటారు. అడవి ఉత్పత్తులైన చింతపండు, తేనె, కుంకుళ్లు, శీకాకాయి, చీపుళ్లు, బుట్టలు, తట్టలు వంటి వస్తువులు వగైరాలు. తమకు సరిపోగా మిగిలిన వాటిని అమ్ముకుని జీవిస్తుంటారు వారు. తమ వస్తూత్పత్తులను అమ్ముకోవటంలో కూడా వారు అమాయకులే. చాలా వరకు దళారీలే వారి నుంచి తక్కువ ధరకు సరుకును కొనుగోలు చేసి లాభాలను తమ జేబులో వేసుకుంటుంటారు. ఇదంతా ఒక ఎత్తయితే వారికి ఆశ్రయమిచ్చి, బతుకునిస్తున్న అటవీ భూములు అంతరించిపోవటం వారికి ప్రమాదంగా పరిణమిస్తోంది. అంతేకాదు, ప్రాజెక్టులు, ఫ్యాక్టరీలు నిర్మిస్తామనే ప్రతిపాదనలు, ప్రయత్నాలు వారికి ఆందోళన కలిగిస్తున్నాయి. అలాంటి సందర్భాల్లో తమ అడవుల జోలికి రావద్దంటూ వారు శాయశక్తులా పోరాడుతున్నారు. ఇటీవల కాలంలో రాయగడలో ఆదివాసీలు ఈ విషయంలో విజయం సాధించారు కూడా.**

గిరిజనులకు ముఖ్యంగా ఆదివాసీలకు సమస్తమూ అరణ్యమే శరణ్యం. అరణ్యాలు అంతరించిపోతే వారి పంచ ప్రాణాలు పంచభూతాల్లో విలీనం అయినట్టే. అందుకనే ప్రాజెక్టులు, ఫ్యాక్టరీలు, నిర్మించి ఉద్యోగాలు కల్పించి కొన్నివేల రూపాయలు వచ్చేదారి చూపిస్తామన్నా, గనులు తవ్వి బంగారం వెలికితీసి వాణిజ్యంలో వాటాలు సమభాగం చేస్తామన్నా దేనికీ ఆశించక మీ పట్టణవాస తిండి మాకొద్దు. మా జొన్నలు మాకివ్వండి. మా తేనెపట్టు మాకివ్వండి. పండ్లనిచ్చే చెట్లను పాడుచేయకండి. పుట్టగొడుగుల నేలను తవ్వకండి. కూర గాయల పాదులను, పూలతోటలను చెల్లాచెదురుచేయకండి" అని, అధికారులను నిత్యం వేడుకొంటుంటారు. అవసరమయితే అందరూ ఒక్కటై రేయింపవళ్లు పహారా కాస్తూ అడవులను కాపాడుకుంటుంటారు. ఇంకా పరిస్థితి మించిపోతే జైలుకెళ్లడానికయినా తయార్!

ఇంత దృఢ సంకల్పంతో సంస్కృతి పరిరక్షణతో ఆదివాసీలు ఉండబట్టే ఆ మాత్రమైనా వారి నివాసాలు, అటవీ పరిసరాలు పచ్చగా కనిపిస్తుంటాయి. అయినా ఎక్కడో దగ్గర ప్రభుత్వాలు అటవీ భూములను సేకరించడం, అభివృద్ధి పేరుతో నిర్మాణాలు జరిపించడం సాగుతూనే ఉంటుంది. అక్కడ ఆదివాసీలు ప్రతిఘటిస్తూనే ఉంటుంటారు.

ఒరిస్సాలోని రాయగడ జిల్లాలోని మునిగుడ, బిసమ్ కటక్ బ్లాక్లోని కొండలు గిరిజనులకు కల్పతరువులుగా పేరుపొందాయి. ఓషధులకు కొదువలేదు. పంటలు పండించుకోడానికి అడ్డులేదు. ప్రకృతి ప్రసాదించే వనరులు, జలనిధులు సమృద్ధిగా ఉన్నాయి. జొన్నల నుంచి కూరగాయల వరకు ఎన్నో అందివచ్చి గిరిజనులను పోషిస్తున్నాయి. జీవవైవిధ్యంతో ప్రకృతి సీమలు మనసును ఆహ్లాదపరుస్తున్నాయి. ఈ నేపథ్యంలో అటవీ భూముల సేకరణను ప్రభుత్వం పెద్ద మొత్తంలో ప్రారంభించింది. టేకు, యూకలిప్టస్ తదితర చెట్లను నాటడానికి సిద్ధమయింది. దీన్ని గిరిజనం అడుకుంది. బోలెడంత డబ్బు వస్తుందని అధికార యంత్రాంగం ఊరించింది. అయినా గిరిజనులు ఒప్పుకోలేదు. అధికారులంతా వచ్చి గిరిజనుల అభ్యంతరాలను తోసిపుచ్చారు. టేకు, యూకలిప్టస్ మొక్కలను నాటి చేతులు దులుపుకున్నారు. టేకు, యూకలిప్టస్ పరిసరాల్లోని సహజమయిన వనసంపదను ఏమాత్రం



ఎదగనివ్వ లేదు. దుంపలు కానీ, కాయలుకానీ, పుట గొడుగులు, పండ్లుకానీ కాయలేదు. పెరగ లేదు. మూడేళ్లలో అక్కడ పరిస్థితి చిన్నాభిన్నం అయింది. నేలంతా నిస్సారమయింది. గిరిజనులకు ప్రకృతిపరంగా లభించే ఎలాంటి ఆహారం అందకుండా పస్తులుండవలసి వచ్చింది. పౌష్టికాహారం కరువై పిల్లలు ఆకలితో మలమల మాడవలసివచ్చింది. ఇక ఆదివాసీ మహిళలంతా ఆదిశక్తిలా ముందుకురికారు. ప్రభుత్వం ఆశపెట్టే డబ్బుకు లొంగలేదు. సహజవనాలకు వినాశనంగా దాపురించే చెట్లనుంచి అడవులను రక్షించుకోదానికి సిద్ధమయ్యారు. భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని తమ జీవన విధానానికి ఆధారమైన సహజసిద్ధమైన చెట్లతో నిండిన అడవులను పెంచుకున్నారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన కొత్త అటవీ విధానం వల్ల తమకే విధమైన ప్రయోజనం ఉండదని, ఏదైతే తాము కోల్పోయామో దాన్ని తిరిగి సంపాదించుకుంటున్నామని ఆదివాసీలు చెప్పారు. మొదట వారు గతంలో ఎక్కడయితే జొన్నలు పండించుకున్నారో ఆ భూములను తిరిగి చేజిక్కించుకున్నారు. అటవీశాఖ అక్కడ నాటిన చెట్లను తొలగించారు. తమ సంప్రదాయ సేద్యాన్ని ప్రారంభించారు. ఈత, మామిడి, పనస, చింత, తదితర మొక్కలను తిరిగి నాటారు. గిరిజనం 'ఎవడువాడు ఎచటివాడు, కొండఫలం, కందబలం కబళించిన దుండగీడు' అన్నట్టు అవసరమయితే తామంతా జైలుకు వెళ్తాం తప్ప వెనక్కు తిరిగేది లేదని గట్టిగా నిలబడ్డారు.

"మీ పట్టణ వాసపు తిండి మేం తినం. మా జొన్నలు మాకివ్వండి" అని నినదించారు. ఇక అటవీశాఖ అధికారులు చేసేదిలేక వెనుదిరిగారు. గతనెల వరకూ వారి జాడ మళ్లీ కనిపించలేదు. మళ్లీ వచ్చారు, మళ్లీ వెళ్లారు. వాళ్లెన్నిసార్లు వచ్చి నచ్చచెప్పడానికి

## అడవులు తరుగుదల

అటవీహక్కుల చట్టం 2006 లోపాలు, అటవీ అధికారుల అక్రమాలు, అవినీతి, అడవులు అంతరించిపోతుండడానికి కారణమవుతున్నాయి. రాజ్యాంగపరమైన హక్కులు, అనుమతులు లేకున్నా అక్రమ ఖనిజ తవ్వకాలు, అక్రమ ప్రాజెక్టులు అడవులు నాశనానికి దోహదపడుతున్నాయి. ఈ ప్రాజెక్టుల వలన కొన్నివేల హెక్టార్ల అటవీప్రాంతం, అందాల పాపికొండల అభయారణ్యం విలువైన వనమూలికలు, దుప్పులు, పక్షులు, కొండచిలువల పెంపక కేంద్రం, మొసళ్ల పెంపక కేంద్రం, ఇతర జంతుజాలం నాశనమయ్యే ప్రమాదం ఉంది. 1927 నుండి 1973 వరకు భద్రాచలం ఏజెన్సీలో 107 హెక్టార్లలో టేకు చెట్లు పెరిగాయి. ఇప్పుడు అవి అంతరించి పోతున్నాయి. ఒక్క అనంతగిరి మండలంలోనే 1500కోట్ల విలువచేసే అడవులు కనుమరుగవుతాయని అధ్యయనాలు వెల్లడించాయి. తెలంగాణ ప్రాంతంలో 750 చదరపు కి.మీ. గోదావరి పరివాహక ప్రాంతంలోని బొగ్గు నిక్షేపాలను ఓపెన్‌కాస్ట్‌ల పేరుతో వెలికితీయడంతో ఉత్తర తెలంగాణ ప్రాంతం ఎడారిగా రూపుదిద్దుకొంటోంది. వ్యక్తిగత ప్రయోజనాల కోసం అడవులను కూడా తాకట్టుపెట్టే పరిస్థితి దాపురించింది. ఆదివాసీ ప్రాంతాల రక్షణకోసం రాజ్యాంగం 5వ షెడ్యూల్ 31,334 చ.కి.మీ. అటవీ ప్రాంతాన్ని ఆదివాసీలు నివసించే ప్రాంతంగా, షెడ్యూల్డ్ ఏరియాగా ప్రకటించారు.

ఆప్రాంతంలో గిరిజనేతరుల పాలన లేదా ఆదివాసీ వ్యతిరేక ప్రభుత్వ పాలనా విధానం కానీ లేకుండా నిషేధం విధించాలి. కానీ ప్రభుత్వమే ఓట్ల రాజకీయాలతో గిరిజనేతరుల వలసలను ప్రోత్సహిస్తోంది. చారిత్రాత్మక పోరాటాలకు ప్రాధాన్యం ఇచ్చి ఆదివాసీ ఆశలకు అనుగుణంగా 2005 డిసెంబర్ 13న పార్లమెంట్ అటవీ హక్కుల చట్టం 2006ను అమలులోకి తెచ్చింది. అయితే అందులోని లోపాల వల్ల అడవులు అంతరించే పరిస్థితి ఏర్పడింది. స్వాతంత్ర్యానికి పూర్వం నుంచి 25 లక్షల ఎకరాల భూములు ఉన్న భూములకు హక్కు పత్రాలు ఇవ్వడం ఈ చట్టం ఉద్దేశం. కానీ గిరిజనేతరులను ఇందులో భాగస్వామ్యం చేయడంతో 2015 డిసెంబర్ 13 తరువాత భూములకు హక్కుపత్రాలు ఇవ్వడంగా మారిపోయింది. ఫలితంగా అవినీతికి అడ్డుచెప్పేవారు లేక గత 8 ఏళ్లలో ఎక్కువశాతం అడవులు నాశనం అయ్యాయి.

# గిరిజన పరిశోధనాసంస్థలు

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌తో పాటు అసోం, బీహార్, గుజరాత్, కేరళ మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, ఒడిషా, రాజస్థాన్, తమిళనాడు, పశ్చిమబెంగాల్, ఉత్తరప్రదేశ్ మణిపూర్, త్రిపుర రాష్ట్రాలలో 14 గిరిజన పరిశోధనా సంస్థలు ఉన్నాయి. రాష్ట్ర ప్రభుత్వాలు, ప్రణాళికలు తయారుచేసేటప్పుడు కావలసిన వివరాలను ఈ పరిశోధన సంస్థలు అందిస్తాయి. న్యాయసహాయం, న్యాయక్రోడీకరణ, దానిపై శిక్షణ, సదస్సులు నిర్వహించడం ఈ పరిశోధనా సంస్థల ప్రధాన బాధ్యతలు. వీటిలో కొన్ని సంస్థలు గిరిజనుల హస్తకళలపై మ్యూజియంను నిర్వహిస్తుంటాయి.

**వృత్తి శిక్షణ కేంద్రాలు**

గిరిజన యువతలోని సృజనాత్మకతను వెలికి తెచ్చేందుకు ఈ వృత్తి శిక్షణ కేంద్రాలు విశాఖ జిల్లాల్లో నెలకొల్పారు. గిరిజన తెగల జనాభా 25శాతం కన్నా ఎక్కువ ఉన్నా వీరిలో గిరిజన మహిళ అక్షరాస్యత రేటు 35శాతం కన్నా తక్కువ ఉంటే ఈ పథకం అమలుచేయవలసి ఉంటుంది. నక్సల్స్ ప్రభావిత ప్రాంతాల్లో ఈ పథకానికి ప్రాధాన్యం ఉంటుంది. గుర్తింపు పొందిన స్వయం ప్రతిపత్తిగల సొసైటీల ద్వారా అమలుచేస్తారు. పాఠశాలలకు తగిన వసతి గృహాలు నిర్వహించడం ఈ పథకం ప్రాథమిక లక్ష్యం. ఎక్కడయితే పాఠశాలల సౌకర్యం అందుబాటులో లేదో అక్కడ సమగ్ర విద్యాభవన సముదాయం నెలకొల్పే నిబంధనలు పథకంలో పొందుపరిచారు.

9,12 తరగతుల్లో ప్రతిభ గల గిరిజన విద్యార్థులు తగిన శిక్షణ నిర్వహించి వారి విద్యాభివృద్ధికి ఆర్థిక సహాయం అందించే పథకం కూడా అమలులో ఉంది. ఈ పథకం కింద పోటీ పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించి వృత్తి విద్యా కోర్సుల్లో ఇంజినీరింగ్, వైద్యవిద్యలో ప్రవేశించడానికి ప్రత్యేక శిక్షణా తరగతులు నిర్వహిస్తారు. పథకంలో 100 శాతం ఆర్థిక సహాయాన్ని కేంద్రం రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు అందజేస్తుంది. ప్రతి గిరిజన విద్యార్థికి ప్రతి సంవత్సరానికి రూ.15వేలు ఆర్థిక సహాయాన్ని కేంద్రం అందిస్తున్నందున రాష్ట్రాలు లేదా కేంద్రపాలిత ప్రాంతాలకు వీటిపై ఆర్థికభారం పడకుండా ఉంటుంది.

**మార్కెటింగ్ అభివృద్ధి సమాఖ్య**

గిరిజనులు తమ అవసరాలకు మించి పండించే పంటలను ప్రయివేట్ వ్యాపారులు, దళారీలు తక్కువ ధరకు కొని మోసగిస్తుంటారు. అలాంటి దగాకోరు దోపిడీ విధానాలను అరికట్టడానికి 1987లో గిరిజన సహకార మార్కెటింగ్ అభివృద్ధి సమాఖ్య (ట్రిఫెడ్)ను ఏర్పాటుచేసింది. 1984లో అమలులోకి వచ్చిన బహుళ రాష్ట్ర సహకార సొసైటీల చట్ట పరిధి కింద ట్రిఫెడ్ పనిచేస్తోంది.

ప్రయత్నించినా వారందరిదీ ఒకేమాట అయింది. చివరకు గిరిజనుల మాట, గిరిజనుల బాట నెగ్గింది. అడవులను రక్షించుకోడానికి వీరెన్ని కష్టనష్టాలు పడ్డారో అంతకు మూడురెట్ల పరిసర గ్రామాలకు వెళ్లి అడవుల రక్షణపై జనాల్లో ఉద్యమస్ఫూర్తి కలిగించారు. సంప్రదాయ వనాల పెంపకాన్ని ప్రోత్సహించారు. తమకు నచ్చిన పంటలను పండించుకోవచ్చని గడపగడపకు తిరిగి ప్రచారం చేశారు.

గత ఏడాది నందువాకి గ్రామం దగ్గర అటవీశాఖ యథాప్రకారం యూకలిప్టస్ మొక్కలను నాటి నర్సరీలను పెంచే ఏర్పాటేట్లు చేసింది. గిరిజనం కదం తొక్కింది. ఆ నర్సరీలు వద్దని విన్నవించుకుంది. వారు పెడచెవిని పెట్టడంతో యూకలిప్టస్ చెట్ల కొమ్మలను విరిచేసింది. అక్కడితో ఆగలేదు. నిప్పుపెట్టి కొట్టేసింది. ఇదంతా జరిగాక పోలీసుల వ్యానులో వచ్చారు. ఆ సమయంలో చాలా మంది గిరిజనం అడవుల్లో ఉన్నారు. కొందరు పొలం పనుల్లో ఉన్నారు. గిరిజన మహిళలు ఇద్దరు పరుగు పరుగున వచ్చి పోలీసులు వచ్చిన సంగతి వారికి తెలియజేశారు. అంతే. గ్రామమంతా కట్టకట్టుకుని పోలీసు స్టేషన్‌కు బయలుదేరింది. పోలీసులు వెనుకంజ వేశారు. అటవీశాఖ మెట్టు దిగింది. గిరిజనం తమకు నచ్చిన మొక్కలను నాటుకోవచ్చని ఒప్పకుంది. అడవుల్లో మళ్లీ జీవవైవిధ్యం విరబూసి పచ్చదనం రెక్కవిప్పింది. గిరిజనుల పోరాటం ఫలించింది. ఇన్నాళ్లు పడిన శ్రమకు గుర్తింపు దక్కింది. నేల తిరిగి సారవంతం కావడం ప్రారంభమయింది. ఇంతటితో ఆదివాసీ మహిళలు తృప్తిపడలేదు. అటవీ రక్షణ సంఘాలుగా ఏర్పాటయ్యారు. అటవీ ఉత్పత్తులను సేకరించడానికి కొన్ని నిబంధనలు రూపొందించుకున్నారు. గత ఏడాది జూన్ నుంచి జూలై వరకు మునిగుడ బ్లాక్‌ని 35 గ్రామాల్లో తిరిగి అటవీ పెంపకాన్ని చేపట్టారు. ఇందులో మునిగూడ నుంచి బిషమ్ కటక్ వరకు దాదాపు 6వేల కుటుంబాలు పాలుపంచుకొంటూన్నయి. ప్రతి ఒక్కరూ 10 నుంచి 15 చెట్లవరకు నాటగలుగుతున్నారు. ఇప్పుడు వర్షాలు తగ్గిన తరువాత తమ పిల్లలకు పోషణ అవసరం. అందువల్ల ఆహారం, పోషక భద్రత గురించి కృషిచేస్తున్న ప్రభుత్వేతర సేవాసంస్థ ప్రతి ఆరునెలలకోసారి ఈ గ్రామాల్లో జీవనం ఎలా ఉందో సమీక్షిస్తోంది. 2014లో పౌష్టికాహార లోపంతో 58 శాతం కుటుంబాలుండగా ఇప్పుడు ఆ సంఖ్య 18 శాతానికి తగ్గింది. వ్యవసాయంతో ప్రకృతి వనరులను అనుసంధానింపచేయడం ప్రథమ లక్ష్యంగా ఈ సేవాసంస్థ కృషి సాగిస్తోంది. ఐసిడిఎస్ వంటి ప్రభుత్వ పథకాల వల్ల ఆహార భద్రత సాధ్యం కాదని గత రెండేళ్ల అనుభవంలో తెలుసుకున్నామని సంస్థ ప్రతినిధులు తెలిపారు. సాధారణంగా మధ్యాహ్న భోజనపథకంలో గుడ్డు ఇస్తుంటారు. కానీ రాయగడ ఏరియాలో గుడ్డుకన్నా పోషక విలువలు సమృద్ధిగా ఉన్న ఆహారాన్ని సహజ సిద్ధంగా తీసుకొంటారు. జొన్నలు, ధాన్యాలు, పండు, కూరగాయలు, ఆకుకూరలు, పుట్టగొడుగులు ఇక్కడ విశేషంగా లభిస్తాయి. ప్రకృతి ప్రసాదించిన వీటి ముందు ఒక గుడ్డు ఏమాత్రం? వీటిని కాపాడుకోవాలే కాని నాశనం చేయకూడదన్నదే



ఆదివాసీల సిద్ధాంతం. ఆదివాసీలు ఎక్కువగా జొన్న జావనే ఆహారంగా వినియోగిస్తుంటారు.

మధ్యాహ్న భోజనంలో జొన్నలే ఉంటాయి. ఇందులో ఉల్లిపాయలు, గొడ్రిసాగు అనే ఆకు కూరలు ఉంటాయి. పుట్టగొడుగులు, చేపలు, మాంసం, కూడా కొన్ని సార్లు తీసుకుంటారు. ఇక ఆదివాసీ మహిళల ఆహార విధానం విచిత్రంగా ఉంటుంది. పండ్లతో పాటు పక్షులు, కీటకాలు, జంతువులు మొదలైనవి అడవిలో ఏవి లభిస్తే వాటినే ఆరగించడం వారికి అలవాటు. మామిడి టెంకలు, చింత పిక్కలు అంబలిగా చేసుకుంటారు. దుంపల వేపుడు చేస్తుంటారు.

**ఓషధులు, మూలికల వైద్యం...**

అడవుల్లో దొరికే ఓషధులు, మూలికలే వారికి మందులు. ఆకులు, వేళ్లలో ఎలాంటి వ్యాధి నివారణ లక్షణాలు ఉన్నాయో ఒక జాబితా వీరి దగ్గర ఉంటుంది. వైద్యం తెలిసిన జేజెమ్మలు గ్రామాల్లో అతి తక్కువ ఉంటారు. వారే గిరిజన కుటుంబాలకు తరతరాలుగా వైద్యం అందించే డాక్టర్లు. ఈ జేజెమ్మలే అడవుల్లోకి కొందరిని పంపి ఔషధ మొక్కలను సేకరించి తీసుకుని రమ్మని చెబుతారు. వీరు అడవుల్లోనే కొన్ని గంటలు ఇదే పనిలో తలమునకలై ఉంటారు.

1997 నుంచి ఎన్ని ప్రభుత్వాలు వచ్చినా బాక్సైట్ అంశం గిరిజన ప్రజలను ఆందోళన పరిస్థితులను కల్పిస్తోంది తప్ప వారికి మేలు జరిగేలా చూడడంలేదు. రాజ్యాంగబద్ధంగా పరిశీలిస్తే అటవీ హక్కుల చట్టంకింద గ్రామసభల్లో చర్చించిన తరువాత గ్రామసభలు ఆమోదించాక, గ్రామసభల్లో గిరిజనులు స్వేచ్ఛగా తమ నిర్ణయాలు ప్రకటించే అవకాశం కల్పించాలి. ఆ తరువాతనే ప్రభుత్వం జి.ఒ.నం.97 విడుదల చేయాలి. కానీ ఇవేవీ జరపకుండా అటవీశాఖ హడావుడిగా జిఒ విడుదల చేయడం, బాక్సయిట్ తవ్వకాలతో ప్రయత్నించడం ఆందోళన తీవ్రం కావడానికి దారితీసింది. గిరిజనుల భావాలకు మద్దతుగా సమితి జడ్జిమెంట్ రావడంతో ప్రభుత్వం వెనకడుగు వేయక తప్పలేదు. జిఒ విడుదల చేసిన పది రోజులకే జిఒ నం.97ను ప్రభుత్వం ఉపసంహరించుకుంది. ఇది గిరిజన ప్రజల విజయంగా అభివర్ణించవచ్చు. మొత్తం 3.48 బిలియన్ టన్నుల బాక్సయిట్ నిల్వల్లో 52శాతం ఒక్క ఒడిషాలోనే ఉన్నాయి. 19శాతం విశాఖ మన్యంలో ఉన్నాయి. ప్రభుత్వం బాక్సయిట్‌కు అంతర్జాతీయ మార్కెట్లో డిమాండ్ బాగా ఉండడంతో బహుళజాతి కంపెనీలు బాక్సయిట్ కోసం ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తున్నాయి. ఈ పరిణామాలు ఆదివాసీల మనుగడకు ముప్పు కలిగిస్తున్నాయి. ఆదివాసీలకు అటవీ సంపదను దూరం చేస్తున్నాయి. అడవుల్లో ఆనకట్టలు నిర్మించినా, గనులు తవ్వినా, ఫ్యాక్టరీలు నిర్మించినా మొదట ఆదివాసుల జీవితాలకే కష్టం వాటిల్లుతుంది.

ఆదివాసి గిరిజన అభివృద్ధి కోసం ప్రభుత్వం గృహ నిర్మాణం, మౌలిక సదుపాయాల అభివృద్ధి, విద్య, ఆరోగ్యం, భూపట్టాల పంపిణీ, భూముల అభివృద్ధి, వ్యవసాయం, పశుగణాభివృద్ధి, సామాజిక భద్రత, బీమా సౌకర్యం తదితర అంశాలను ఈ పథకంలో చేర్చి వీటిని ఆదివాసుల సర్వతోముఖాభివృద్ధి కోసం అమలుచేయాలన్నది ఏకైక లక్ష్యం, మళ్లీ 2007, 2008లో వీరి దీర్ఘకాల ప్రయోజనాల కల్పనకు సమగ్రభద్రత, అభివృద్ధి ప్రణాళికలను రూపొందించారు. రాష్ట్ర ప్రభుత్వాలు, స్వచ్ఛంద సంస్థల అనుసంధానంతో వీటిని అమలు చేయవలసి ఉంటుంది. ఏమైనా ఆదివాసీల గోడును అర్థంచేసుకొని, వారి నెలవులైన అడవులకు ఎటువంటి ముప్పు కలగకుండా చూడటం, వారి సంక్షేమానికి చేయూతనివ్వడం దిశగానే ప్రభుత్వం కృషిచేయాలి.

★




# సౌరశక్తి

ప్రధానమంత్రి నరేంద్రమోదీ నాయకత్వంలోని ఎన్.డి.ఏ. **ప్రభుత్వం సౌరశక్తి అభివృద్ధికి పెద్దపీట వేసింది. సోలార్ పార్కులు, సోలార్ పవర్లూమ్స్, జాతీయ సోలార్ మిషన్, సోలార్ పట్టణాలు, సోలార్ సెల్స్ మొదలగువాటికి ప్రాధాన్యతనిస్తోంది. దాదాపు 121 దేశాలు సభ్యులుగా అంతర్జాతీయ సౌరకూటమికి భారత్ నేతృత్వం వహిస్తోంది. ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకున్న 2017నాటికి దేశంలోని అన్ని గ్రామాలకూ విద్యుత్తు సౌకర్యం సాధించడానికి దీన్‌దయాళ్ ఉపాధ్యాయ గ్రామ జ్యోతి పథకం అమలవుతున్నది.**

పర్యావరణ కాలుష్యాన్ని నివారించేందుకు అందుబాటులోనున్న ప్రత్యామ్నాయ ఇంధనవనరులలో ప్రధానమైనది సౌరశక్తి అని చెప్పక తప్పదు. పెట్రోలు, ముడి చమురు, బొగ్గు వంటి సంప్రదాయ ఇంధన వనరులు కనుమరుగవుతున్న తరుణంలో, ప్రత్యామ్నాయ ఇంధనవనరులపై మానవాళి ఆధారపడాల్సిందే. పవన విద్యుత్తు, సౌరశక్తి, టైడల్ ఎనర్జీ, బయోగ్యాస్ మొదలైన వనరులను కావలసినంత మేర వినియోగించుకోవాలి. భారతదేశంలో సౌరశక్తి పుష్కలంగా లభ్యమవుతుంది. ప్రధానమంత్రి నరేంద్రమోదీ నాయకత్వంలోని ఎన్.డి.ఏ. ప్రభుత్వం సౌరశక్తి అభివృద్ధికి పెద్దపీట వేసింది. సోలార్ పార్కులు, సోలార్ పవర్లూమ్స్ జాతీయ సోలార్ మిషన్, సోలార్ పట్టణాలు, సోలార్ సెల్స్ మొదలగువాటికి ప్రాధాన్యతనిస్తోంది. దాదాపు 121 దేశాలు సభ్యులుగా అంతర్జాతీయ సౌరకూటమికి భారత్ నేతృత్వం వహిస్తోంది. భారత ప్రభుత్వం ప్రత్యామ్నాయ ఇంధన వనరుల మంత్రిత్వశాఖ ద్వారా సౌరశక్తి వినియోగానికి అనేక చర్యలను చేపట్టింది. ప్రపంచ వ్యాప్తంగా ప్రత్యామ్నాయ ఇంధన వనరులపై చర్చ జరుగుతున్న ఈ తరుణంలో, కేంద్ర ప్రభుత్వం వీటికి అధిక ప్రాధాన్యం ఇస్తోంది. మనదేశం ముడిచమురు దిగుమతికి భారీగా చెల్లిస్తోంది.

**జవహర్ లాల్ నెహ్రూ జాతీయ సోలార్ మిషన్:**

ఈ మిషన్‌ను జనవరి 11, 2010 న ప్రారంభించారు. 2022 నాటికల్లా గ్రిడ్ కనెక్టెడ్ సౌరశక్తిని 20 వేల మెగావాట్లకు పెంచాలన్న లక్ష్యాన్ని నిర్దేశించారు. దీర్ఘకాలిక విధానం, అత్యధిక లక్ష్యాల సాధన, పరిశోధన-అభివృద్ధి, దేశీయ ఉత్పత్తులతో ముడిసరుకులను తయారుచేసుకుంటే, మనం లక్ష్యాలను సాధించగలము. వికేంద్రీకరణతో పంపిణీ విధానం, సోలార్ లైటింగ్, సోలార్ పంపులు, సౌరశక్తి ఆధారిత గ్రామీణాభివృద్ధిని చేపడితే, భారతదేశ గ్రామీణ వ్యవస్థే సమూలంగా మారిపోతుంది. ప్రపంచంలోనే మనదేశం సోలార్ రంగంలో అంతర్జాతీయ అధినేతగా ఎదగాలన్నది లక్ష్యంగా నిర్ణయించారు. దీన్ని సాధించడం కోసం మూడంచెల విధానాన్ని అవలంబించారు. అనుకూలతలను ప్రోత్సహించే విధానంగా క్లీన్ ఎనర్జీ ఫండ్ నుండి 750 మెగావాట్ల గ్రిడ్ కనెక్టెడ్ సౌర విద్యుత్తు ఉత్పత్తికి నిధులనందచేస్తున్నారు.

**సోలార్ పార్కులు:**

2014-15 నుండి అల్ట్రా మెగా సోలార్ పవర్ ప్రాజక్టులు, సోలార్ పార్కుల అభివృద్ధి పథకాన్ని కేంద్ర ప్రభుత్వం ప్రారంభించింది. సోలార్ ఎనర్జీ కార్పొరేషన్ ఆఫ్ ఇండియాను స్థాపించి, సోలార్ పార్కుల నిర్మాణాన్ని చేపట్టే సంస్థలను ఏర్పాటుచేశారు.

**సి.పి.ఎస్.యు. స్కీమ్:**

కేంద్ర ప్రభుత్వరంగసంస్థల పథకం క్రింద వెయ్యి మెగావాట్ల గ్రిడ్ కనెక్టెడ్ సోలార్ పి.వి. పవర్ ప్రాజక్టులను కేంద్ర, రాష్ట్ర పథకాల క్రింద కేంద్ర ప్రభుత్వం, కేంద్ర ప్రభుత్వరంగ సంస్థలు చేపట్టాయి.

**రక్షణ శాఖలో:**

డిఫెన్స్ స్కీమ్ ద్వారా 300 మెగావాట్ల గ్రిడ్ కనెక్టెడ్ అఫ్ గ్రిడ్ సోలార్ పివి ప్రాజక్టులను రక్షణ విభాగంతో పాటు, పారా మిలటరీ దళాలు కూడ చేపట్టాయి.

**విండ్ సోలార్ హైబ్రిడ్ పథకం:**

పవన విద్యుత్తుతో కూడిన సౌర విద్యుదుత్పత్తికి ఒక ముసాయిదాను కేంద్రం రూపొందించడం హర్షణీయం. దీనిని ప్రజల సహకారం/ప్రాతినిధ్యం కోసం మంత్రిత్వశాఖ వెబ్ సైటులో ఉంచారు. 2022 నాటికి ఈ విధానంలో పది గిగావాట్ల సౌరశక్తిని సాధించాలనేది దీని లక్ష్యం.

**సౌర పైకప్పులు:**

ప్రజల వ్యక్తిగత ఇళ్ళ పైకప్పులపై సౌరపలకలను ఏర్పాటుచేసే



రూఫ్‌టాప్ సౌర పథకాన్ని కేంద్ర ప్రభుత్వం ఆమోదించింది. వీటి ఏర్పాటుకు 30 శాతం వరకూ మూలధన రాయితీ నివ్వడానికి ఐదువేలకోట్ల రూపాయలతో కేంద్రం ఒక నిధిని ఏర్పాటుచేసింది. దీనిద్వారా, 2022 నాటికి ఆరు గిగావాట్ల సౌరశక్తిని ఉత్పత్తి చేయాలనేది లక్ష్యం.

**సోలార్ పట్టణాలు:**

దేశవ్యాప్తంగా ఎనిమిది ఆదర్శ సోలార్ నగరాలను అభివృద్ధి చేయాలనే ప్రతిపాదనను కేంద్రం ఆమోదించింది. దీని ప్రకారం, నాగపూర్, చండీగడ్, గాంధీనగర్, మైసూర్ నగరాలను సంపూర్ణ సౌర నగరాలుగా అభివృద్ధి చేస్తారు. ఇందుకోసం 950 కోట్లను కేంద్రం కేటాయించింది. పునర్వినియోగ ఇంధనవనరుల ప్రాజెక్టులను స్థాపించేందుకు ప్రభుత్వ-ప్రైవేటు భాగస్వామ్య విధానంలో రాష్ట్ర ప్రభుత్వాలు/స్థానిక ప్రభుత్వాలు సమానంగా మరో 950 కోట్లరూపాయలను సమకూరుస్తాయి. మొత్తం 15 పట్టణాలను ముందుగా ప్రయోగాత్మక విధానంలో అభివృద్ధి చేస్తారు.

**గ్రీన్ కాంపస్‌లు:**

దేశంలోని 14 ఎంపికచేసిన విశ్వవిద్యాలయాల్లో హరిత ప్రాంగణాలను ఏర్పాటు చేస్తున్నారు.

**ఫోటో వోల్టాయిక్ టెక్నాలజీ:**

ప్రస్తుతం మనకు అందుబాటులోనున్న సౌర బ్యాటరీని మొదటగా కనుగొన్నది బెల్ టెలిఫోన్ కంపెనీవారు 1954లో, ఈ సాంకేతికతను ఫొటో వోల్టాయిక్ (పి.వి.) పరిజ్ఞానమంటారు. సౌరశక్తి అనేది మళ్ళీ మళ్ళీ ఉపయోగించగల అంటే పునర్వినియోగ పరిజ్ఞానం. ఈ శక్తి, భూగోళంపై ఎక్కడైనా, సూర్యుడు ఉంటే చాలు లభ్యమవుతుంది. కనుకనే, ఈ బ్యాటరీలను తిరిగి ఛార్జి ఎక్కడైనా చేయించవచ్చు. ఉపయోగించవచ్చు. దీని నిర్వహణకు ఎటువంటి ఖర్చుకాదు. ఈ సాంకేతికతను ప్రధానంగా మూడు వర్గాలుగా విభజించవచ్చు. మొదటి తరం నీటి ఆధారిత క్రిస్టలైజ్డ్ సిలికాన్ టెక్నాలజీ అంటారు. రెండవతరం ఫొటోవోల్టాయిక్స్లు, మూడవతరం పలుచని ఫిలిమ్ ఆధార ఫొటోవోల్టాయిక్‌లు.

అమెరికాలోని జార్జియా విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తలు మూడు డైమనన్ల త్రి-డి సౌర బ్యాటరీలను అభివృద్ధి చేశారు. వీటిని స్పేస్ ఎక్స్ ఫాల్కన్ రాకెట్ ద్వారా అంతరిక్షంలోకి ప్రవేశపెట్టారు. రోదసీలో జరిగే మార్పులకు ఈ త్రి-డి బ్యాటరీలు ఎలా పనిచేస్తాయనే అంశాన్ని వీరు పరిశీలిస్తారు.

**తెలుగు రాష్ట్రాలలో సౌరశక్తి అభివృద్ధి వినియోగం:**

ఆంధ్రప్రదేశ్‌లోని రాయలసీమ ప్రాంతం సౌరశక్తి ఉత్పత్తి, ప్రయోగం, వినియోగాలకు మిక్కిలి అనుకూలంగా ఉన్న ప్రాంతం. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఇటీవలే, సౌర విధానాన్ని ప్రకటించింది. రాష్ట్రవ్యాప్తంగా రూఫ్ టావ్ సౌర విధానాన్ని ఎక్కువ వినియోగంలోకి తేవాలనేది వారి లక్ష్యం. కొన్ని ఎంపికచేసిన ప్రాంతాలలో 250 మెగావాట్ల సోలార్ పార్కులను ఏర్పాటుచేసి, ప్రభుత్వ భవనాలు, ఆసుపత్రులు మొదలైనవాటిలో సౌరశక్తిని అధికంగా వినియోగించే ఏర్పాట్లు చేస్తున్నారు. వచ్చే ఐదేళ్ళ కాలంలో, కనీసం పదివేల సౌరశక్తితో నడిచే పంపుసెట్లను ఏర్పాటు చేయాలనేది ప్రణాళిక. ముఖ్యంగా, విద్యుత్ సౌకర్యం లేని మారుమూల ప్రాంతాలకు ఈ సౌరశక్తి వరప్రదాయిని లాంటిది. అనంతపురంలో ప్రపంచంలోని అతిపెద్ద సౌరశక్తి పైకప్పు త్వరలో ఏర్పాటు కానున్నది. తెలంగాణా ప్రాంతంలో కూడ ఈ సౌరశక్తి అభివృద్ధికి అపార అవకాశాలు వున్నాయి. ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకున్న 2017 నాటికి దేశంలోని అన్ని గ్రామాలకూ విద్యుత్తు సౌకర్యం సాధించడానికి, దీన్‌దయాళ్ ఉపాధ్యాయ గ్రామ జ్యోతి పథకం క్రింద ముఖ్యంగా ఈశాన్య ప్రాంతాలలో సంపూర్ణ విద్యుదీకరణకు కార్యాచరణ మొదలైంది. అయితే, మిగులు సౌరవిద్యుత్తును గ్రిడ్‌కు తరలించే సదుపాయం ఉండాలి. గ్రామీణ ప్రాంతాలలో కూడ సౌర పంపుసెట్లు, వీధి దీపాలు, కుక్కర్లు మొదలైనవి విరివిగా వినియోగంలోకి వచ్చే రోజు ఎంతోదూరంలో లేదు. సంప్రదాయ వనరులు అడుగంటు తున్న నేటి తరుణంలో, పునరుత్పాదక ఇంధనవనరులే మానవాళికి శరణ్యం. కనుక సౌరశక్తి మన జీవితాలలో తప్పక వెలుగులు పూయిస్తుందని ఆశిద్దాం.

# హమాలి కూలీ నుండి జడ్పీ చైర్మన్ పదవికి ఎదిగిన భాస్కర్



మహబూబ్‌నగర్ జిల్లాలోని గద్వాల మండలంలో కాకులారం అను ఒక మారుమూల కుగ్రామం కలదు. ఈ గ్రామంలో దళితుల్లో అతి నిరుపేదలైన బండారి దేవమ్మ నారాయణలకు మొదటి కుమారుడిగా తేది : 18-10-1968వ సం॥లో జన్మించినారు బండారి భాస్కర్ గారు. రెక్కాడితే కాని డొక్కాడని అతి నిరుపేద కుటుంబంలో పుట్టిన భాస్కర్ కొరతల కొలిమిలో, ఆకలి, అంటరానితనం, పేదరికంతో అవమానాలు భరిస్తూ నలుగురు చెల్లెళ్లు, ముగ్గురు తమ్ముళ్లు వారి తల్లిదండ్రులతో కలిపి మొత్తం పది మందితో కలిసి పెద్ద కుటుంబం వీరిది.

ఈ కుటుంబం గడవడం కష్టంగా ఉన్న రోజుల్లో ఎలాంటి ఉపాధి అవకాశాలు లేక, ఆస్తులు అంతస్తులు లేక భాస్కర్ బతుకుదెరువుకొరకు కర్నూల్ రైల్వేస్టేషన్‌లో హమాలీ కూలీగా చేరాడు. కుటుంబ బాధ్యతల్ని మోస్తూ వచ్చిన కూలీ డబ్బులతో కుటుంబాన్ని పోషిస్తూ ఉండేవాడు.

**విద్యాభ్యాసం:**

ప్రాథమిక విద్యాభ్యాసం 1972 సం॥ నుండి 1984 వరకు ప్రభుత్వ పాఠశాలలో హై స్కూల్ విద్యను పూర్తిచేశాడు.

**వివాహం:**

వీరి వివాహం గద్వాల మండలం మేలచెరువు గ్రామ నివాసి అయిన లక్ష్మిదేవితో 1992 సం॥ మే నెలలో జరిగింది. వీరికి ఒక కుమారుడు భరత్, ఒక కూతురు భారతి, వీరిరువురు ప్రస్తుతం ప్రాథమిక విద్యనభ్యసిస్తున్నారు.

**తండ్రి గ్రామసర్పంచ్‌గా ఎన్నిక:**

డా॥ బాబాసాహెబ్ అంబేద్కర్ గారి కృషివల్ల వారు సాధించి పెట్టిన రిజర్వేషన్ వలన కాకులారం గ్రామ పంచాయతీ 1979 సం॥లో ఎస్సీలకు రిజర్వు కావడం వలన తన తండ్రిగారైన నారాయణకు ప్రథమ పౌరుని (సర్పంచ్)గా అవకాశం దక్కింది.

1979 నుండి 1988 వరకు తండ్రి గ్రామ సర్పంచ్‌గా బాధ్యతలు నిర్వర్తించారు. భాస్కర్ తండ్రి సర్పంచ్‌గా ఉన్న రోజుల్లో తండ్రిగారికి గ్రామాభివృద్ధిలో సహకరిస్తూ, గ్రామ ప్రజలకు సేవ చేస్తూ తండ్రికి చేదోడు వాదోడుగా ఉండేవారు. ఇలా ప్రజా సమస్యలు పరిష్కరిస్తూ, ప్రజా నాయకునిగా ఎదుగుతూ, 2001 సం॥ నుండి 2006 వరకు సర్పంచ్‌గా కాకులారం గ్రామానికి భాస్కర్ ఎన్నికై పూర్తి కాలం పదవీ బాధ్యతలు నిర్వర్తించి గ్రామంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు అమలు చేసి గ్రామాన్ని ప్రగతిపథంలో పయనింపజేశారు.

**మహబూబ్‌నగర్ జిల్లా పరిషత్ చైర్మన్‌గా :**

నూతన తెలంగాణ రాష్ట్రంలో మహబూబ్‌నగర్ జిల్లా గద్వాల మండలం నుండి జిల్లా ప్రాదేశిక సభ్యునిగా డా॥ బాబాసాహెబ్ అంబేద్కర్ కృషి ఫలితంగా ఎస్సీ రిజర్వేషన్ కోటాలో ఎన్నికై తొలి దళిత చైర్‌పర్సన్‌గా చరిత్ర సృష్టించారు. స్థానిక ప్రభుత్వమైనా జిల్లా పరిషత్‌కు తేది: 5-6-2014న ఏకగ్రీవంగా ఎన్నిక కావడం. ఉన్న స్థాయి నుండి ఉన్నత స్థాయికి ఎదగడం పేద వర్గాలు హర్షించదగిన, అభినందించదగిన పరిణామం.

**పారదర్శక పరిపాలన :**

జిల్లా పరిషత్ చైర్మన్‌గా ఎలాంటి ఆటంకాలు, ఒడిదుడుకులు లేకుండా జిల్లా మంత్రులు, పార్లమెంట్ సభ్యులు, శాసనమండలి సభ్యులు, శాసనసభ్యుల ప్రోత్సాహంతో జడ్.పి.టి.సి. సభ్యుల, మండల పరిషత్ అధ్యక్షుల సమన్వయంతో, పంచాయతీ శాఖ అధికారుల సహకారంతో ఎలాంటి వివాదస్పద వ్యాఖ్యలకు తావివ్వకుండా తనదైన శైలితో జిల్లా పరిషత్ పరిపాలనను పారదర్శకంగా మేటిగా, ధీటుగా నడిపిస్తున్న దీక్షాదక్షులు.

**అభివృద్ధి ఆశాకిరణం :**

సమర్థనాయకునిగా, సకల రంగాల్లో జిల్లాను అభివృద్ధి చేయాలనే తపోదీక్షలో నిరంతరం అన్ని శాఖల అధికారులతో మాట్లాడుతూ సమీక్షలు నిర్వహిస్తూ అన్ని శాఖల ప్రభుత్వ పథకాలను సక్రమంగా అమలు చేయాలని సూచనలు ఇస్తూ, సుపరిపాలనే ధ్యేయంగా, ప్రజాసంక్షేమమే లక్ష్యంగా జిల్లా ప్రజల సంక్షేమానికి, జిల్లా అభివృద్ధికి ఎనలేని కృషిచేస్తున్న అభివృద్ధి ఆశాకిరణం బండారి భాస్కర్.

**కపటంలేని మనస్తత్వం :**

ధృడవిశ్వాసం, సడలని పట్టుదల, మొక్కవోని ధైర్యం, కటువైన,



బలమైన వ్యక్తీకరణ ఆయన సొంతం. మొహమాటం అసలే లేదు. ఉన్నది ఉన్నట్లుగా మొహమాటం లేకుండా, కుండబద్దలు కొట్టినట్లు వాస్తవాలు మాట్లాడే వాస్తవవాది, మానవతావాది. శాఖా సిబ్బంది ఎవరైన తప్పులు చేసినట్లు తనవద్దకు వస్తే మొహమాటం లేకుండా హెచ్చరికలు జారీ చేస్తారు. ఆ విషయాలను మనసులో పెట్టుకోకుండా వెంటనే మళ్లీ మర్చిపోతారు. తరువాత మళ్లీ ఎపుడైనా కొత్త విషయాలు ప్రస్తావించక కపటము లేకుండా మాట్లాడతాడు.

**నీతి, నిజాయితీ గల నాయకత్వం :**

ప్రభుత్వ ఉద్యోగులు అవినీతికి తావులేకుండా ఎవరి విధులు వారే నిర్వహించాలని, అప్పుడే జిల్లా సమగ్ర అభివృద్ధి చెందుతుందని అంటారు. అంతేకాదు తాను నీతితో, నిజాయితీతో అంకితభావంతో, పారదర్శకంగా, జవాబుదారీతనంతో జడ్.పి. చైర్మన్‌గా పనిచేస్తూ అవినీతికి తావు లేకుండా తాను ఎక్కడా కూడా అవినీతి అక్రమాలకు పాల్పడకుండా ఆత్మగౌరవంతో ఉంటూ పరిపాలన సాగిస్తున్న బండారి భాస్కర్ చైర్మన్ గారు నీతి, నిజాయితీకి నిలువెత్తు నిదర్శనం.

**సంక్షేమ హాస్టళ్లలో సన్న బియ్యంతో ఆహారం అమలు ఆలోచన కర్త:**

భారతదేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా ఒక వినూత్న ఆలోచన మహబూబ్‌నగర్ జడ్.పి. చైర్మన్ గారికి తట్టింది. అదేమనగా అన్ని సంక్షేమ హాస్టళ్లలో ప్రభుత్వ పాఠశాలల మధ్యాహ్న భోజనంలో ముక్కిన బియ్యంతో, నూకల బియ్యంతో వండే అన్నం విద్యార్థులు తినడం గమనించారు. ఒక రోజు ఉపాధ్యాయ దినోత్సవం నాడు ఒక హాస్టల్‌కు వెళ్లి విద్యార్థులు తింటున్న భోజనంలో పురుగులను చూసి చలించి పోయాడు. ఎందుకిలాంటి భోజనం తినాలి పేదవర్గాల పిల్లలు. ఉన్నత వర్గాల పిల్లలు తినే సన్నబియ్యం వీరికెందుకు సరఫరా చేయరాదు అని ఆలోచించి రాష్ట్ర పౌరసరఫరాల శాఖామంత్రి శ్రీ ఈటెల రాజేందర్ గారితో చెప్పడంతో వారు గౌరవ ముఖ్యమంత్రితో మాట్లాడి వెంటనే రాష్ట్రంలో సంక్షేమహాస్టళ్లలో మరియు ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం మొత్తం సన్నబియ్యంతో ఆహారం అందించాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం, దీన్ని అమలుచేయడం గొప్ప మార్పు ఇంతటి మహోన్నతమైన ఆహార పథకాన్ని అమలు చేసిన ఘనత దక్కిన ఘనుడు ఆలోచన కర్త, పేద విద్యార్థుల స్ఫూర్తిదాత జడ్.పి. చైర్మన్ బండారి భాస్కర్.

**ప్రజా ప్రతినిధుల జీతం మంజూరులో వీరి కృషి అమోఘం :**

స్థానిక ప్రభుత్వాల ప్రతినిధులైన సర్పంచ్‌లు, మండల పరిషత్ అధ్యక్షులు, జిల్లా పరిషత్ సభ్యులు, జడ్.పి. చైర్మన్‌లు నిరంతరం ప్రజల మధ్యన ఉంటూ వారి సమస్యల పరిష్కారం కోసం అనేక ప్రాంతాలు, వివిధ కార్యాలయాలు సందర్శిస్తుంటారు. ప్రజల నుండి డబ్బులు ఆశించకుండా, ఇతరులకు తలవంచకుండా కనీస ఖర్చులు భరించుటకొరకైనా ఆత్మగౌరవంతో బతకడానికి, అందరికి గౌరవ వేతనాలు గతంలో ఇస్తున్న వాటికంటే పెంపుదల చేయాలని కరీంనగర్ జడ్.పి. చైర్మన్ శ్రీమతి తుల ఉమా గారితో కలిసి ముఖ్యమంత్రి గారికి విన్నవించగా వీరి యొక్క విన్నపం ప్రకారమే రాష్ట్రంలోని అందరు స్థానిక ప్రభుత్వాల ప్రతినిధులకు గౌరవ వేతనం ముఖ్యమంత్రిగారు మంజూరు చేయడం జరిగింది. ప్రస్తుతం జడ్.పి. చైర్మన్ గారికి నెలకు రూ॥ 1,00,000/-, జడ్.పి.టి.సి. సభ్యులకు రూ॥ 10,000/-, మండల పరిషత్ అధ్యక్షులకు నెలకు రూ॥ 10,000/- గ్రామ సర్పంచ్‌లకు రూ.15,000/- గౌరవవేతనం పొందుతున్నారు. ఇది ఏరాష్ట్రంలో ఇంత మొత్తం అమలుచేయడం లేదు. ఇది మనకు గర్వకారణం దీని వెనుక విశేషమైన కృషి జడ్.పి. చైర్మన్ బండారి భాస్కర్ గారిదే.

**జిల్లా ప్రజల గుండెల్లో నిలిచే నేతగా ఎదగాలి :**

జిల్లా పరిషత్ చైర్మన్‌గా పదవీకాలం ముగిసిన తరువాత వెనక్కి చూసుకుంటే ప్రేమానురాగాలు మిగిలి మీ పరిపాలన ప్రజల మదిలో చెరిగిపోని ముద్రగా ఉండాలి. అది వందేళ్లయినా. పదిలంగా ఉండాలి. అలా నిలవాలంటే ఇంకా మంచి పనులు చేయాలి. ప్రజల కష్టాల్ని మీ కష్టంగా భావించి ప్రతి సమస్యను పరిష్కరిస్తూ ప్రజానాయకునిగా, ఒక సమర్థ నాయకునిగా ఎదుగుతూ భవిష్యత్‌లో మరెన్నో అత్యున్నతమైన పదవులు అధిరోహించాలని మనసారా కోరుకుంటూ.

**బి. వెంకటయ్య**
**డి.టి.యం మహబూబ్‌నగర్,**



# చేపల పెంపకంపై అమితాసక్తి

**• వ్యవసాయం కంటే లాభసాటి • ప్రోత్సహిస్తున్న తెలంగాణ ప్రభుత్వం**

వర్షాలు సమృద్ధిగా కురువడంతో చెరువులు, కుంటలు, జలాశయాలు కళకళలాడుతున్నాయి. ఈ నేపథ్యంలో చేపల పెంపకంపై సహజంగానే ఆసక్తి పెరుగుతున్నది. చేపల సాగుకు అనేక అనుకూలతలు కనిపిస్తున్నాయి. వ్యవసాయం కంటే లాభసాటిగా ఉన్న చేపల పెంపకం కోసం రాష్ట్ర ప్రభుత్వం కూడా తగిన ప్రోత్సాహం అందిస్తున్నది. అయితే చేపల పెంపకం ఏ విధంగా చేపట్టాలి, ఎటువంటి చేపలు పెంచుకుంటే లాభం వస్తుంది, ఎటువంటి చెరువులు దీనికి అనుకూలం.. మొదలైన అంశాలపై అవగాహన అవసరం.

చేపల పెంపకం చాలా పురాతనమైనది. ప్రాచీన యుగం నుంచి ఆదిమ మానవుడు చేపలను వేటాడి జీవనం సాగించేవాడు. కాలాను గుణంగా శాస్త్ర, సాంకేతిక పురోగతితో చేపల పెంపకం అభివృద్ధి చెందుతున్నది. వ్యవసాయంతో పోల్చితే చేపల పెంపకం లాభదాయక మైంది. చేపల పెంపకంలో చీడపీడల బెడద ఉండదు. కూలీల అవస రం చాలా తక్కువ. ఇతర వ్యవసాయ ఆధార ఉపాధులతో పోలిస్తే నిర్వ హణ చాలా సులభం. చేపల పెంపకంలో లాభాలు అధికం. తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలు పొందవచ్చు. పెట్టుబడికి దాదాపు రెట్టింపు ఆదాయం పొందే అవకాశం ఉన్నది. చేపల అమ్మకానికి అనువైన మార్కెటింగ్ వ్యవస్థ విస్తృతంగా ఉన్నది. చేపల పెంపకం గ్రామీణ ప్రాంత రైతులకు, నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించడంలో ఎంత గానో దోహదపడుతుంది. చేపల పెంపకానికి విస్తారమైన అవకాశాలు న్నాయి. సహజంగా పెంచుకునేందుకు ప్రతి గ్రామంలో చెరువులు, కుంటలు అందుబాటులో ఉన్నాయి. వీటిలో కాకుండా చెరువులు తవ్వకొని, చేపలు పెంచితే మరింత ఆదాయం పెరుగుతుంది.

**పెంపకానికి అనువైన రకాలు..**

చేపల పెంపకానికి అనువైన రకాలను ఎంపిక చేసుకుని తగిన యాజమాన్య పద్ధతులు పాటిస్తే లాభాల పంట పండినట్లే. మన రాష్ట్రంలో ప్రతి జిల్లాలో (విభజనకు ముందు) చేప పిల్లల ఉత్పత్తి కేంద్రాలు అందుబాటులో ఉన్నాయి. కొందరు ఔత్సాహికులు ప్రైవేట్ హాచరీలు ఏర్పాటు చేసుకుని చేప పిల్లల ఉత్పత్తి చేస్తున్నారు. రాష్ట్రంలో పెంపకం కోసం రోహు, బొచ్చ (కట్ల), బంగారు తీగ (సీసీ), మ్రిగాల, గడ్డిచేప (గ్రాస్ కార్ప్), వెండి చేప (సిల్వర్ కార్ప్) విత్తనాలను ఉత్పత్తి చేస్తున్నారు. ఇవి పూర్తిగా శాకాహార చేపలు. వీటిని సాగు చేయడం వల్ల ఉత్పత్తి అధికంగా వచ్చే అవకాశాలు ఉంటాయి. రాహు, బొచ్చ, మ్రిగాల వంటి దేశీయ చేపలు, బంగారు తీగ, గడ్డిచేప, వెండి చేప వంటి దేశీయ రకాలు చేపల పెంపకానికి చాలా అనువైనవి. ఇవి త్వరగా పెరిగి తక్కువ కాలంలో లాభాలు ఆర్జించి పెడతాయి. మిశ్రమ జాతి చేపల పెంపకం చేపడితే మరింత లాభాలు పొందవచ్చు. 30:50:20 నిష్పత్తిలో పెంపకం చేపడితే ఆ లాభాలే వేరుగా ఉంటాయి. నీటి పై భాగంలో ఆహారం తీసుకునే రోహు రకాలు 30 శాతం, నీటి పైనా, మధ్య, కింది భాగంలో ఆహారం తీసుకునే బొచ్చ రకం 50 శాతం, కేవలం నీటి అడుగు భాగంలో ఆహారం తీసుకుని పెరిగే గడ్డి చేపలను 20 శాతం మిశ్రమ పద్ధతిలో పెంచుకోవాలని మత్స్య శాఖ అధికారులు సూచిస్తున్నారు.

**మరిన్ని పద్ధతుల్లో పెంపకం..**

చేపల పెంపకాన్ని పలు రకాలుగా పెంచుకోవచ్చు. సంప్రదాయ పద్ధ తి ప్రాచీనమైంది. సహజంగా నీటి వనరుల్లో చేరిన చేపలను పెరిగిన తర్వాత చెరువులో నీరు తగ్గినపుడు పట్టుకోవడం సంప్రదాయ పద్ధతి. చేపల పెంపకంలో పాక్షిక సాంద్రత అనే మరో పద్ధతి ఉన్నది. చేప పిల్లలను సహజ నీటి వనరుల్లో వదిలి తక్కువ మోతాదులో ఎరువులు, కృత్రిమ ఆహారం ఇచ్చి చేపల దిగుబడిని పెంచుకోవచ్చు. ఈ పద్ధతిలో హెక్టారుకు ఐదు వేల చేప పిల్లలను వదలవచ్చు. ఉత్పత్తి రెండు నుంచి మూడు రేట్లు పెరిగే అవకాశం ఉన్నది. అంటే ఒక హెక్టార్‌కు 3 నుంచి 6 టన్నుల చేపలు ఉత్పత్తి చేసుకోవచ్చు. దాదాపు అన్ని చెరువులు, కుంటలు, జలాశయాల్లో ఈ

## లాభసాటిగా కేజీ కల్చర్..

కేజీ కల్చర్ పద్ధతిలో చేపల పెంపకం ప్రస్తు త రోజుల్లో లాభసాటిగా ఉన్నది. తక్కువ ఖర్చుతో ఎక్కువ ఉత్పత్తి చేసుకోవచ్చునని మత్స్య శాఖాధికారులు చెబుతున్నారు. ప్రధాన జలాశయాలు, లోతు ఎక్కువగా ఉన్న చెరువుల్లో ఈ పద్ధతిన చేపలు పెంచుకోవచ్చు. 4 మీటర్ల లోతు, 6 మీటర్ల పొడ వు, 4 మీటర్ల వెడల్పుతో ప్రత్యేకంగా రూపొందించిన ప్లాస్టిక్ బాక్స్‌లను అవసరమైనన్ని ఒకదానికొకటి అమర్చి ఒక సెల్‌ను ఏర్పాటు చేసుకోవాలి. దీనిలో ఒక బాక్స్‌లో 6 వేల చేప పిల్లలను పెంచుకోవచ్చు. నీటిపై తేలియాడే గుళికలను దాణాగా ఇవ్వాలి. 6 నెలల తర్వాత 3,500 కిలోల చేపలను ఉత్పత్తి చేసుకోవచ్చు. పంగేసియస్ అనే రకం చేపలు ఈ పద్ధతిలో పెంచడానికి అనుకూలమైనవి.



పద్ధతిన చేపల పెంపకం చేపట్టవచ్చు. ప్రత్యేకంగా తవ్విన చెరువుల్లో అధిక సాంద్రత పద్ధతిలో చేపట్టే పెం పకంలో ఎక్కువ సంఖ్యలో చేప పిల్లలను వదిలి అధికంగా ఎరువులు, ఆహారం వినియోగించవచ్చు. హెక్టార్‌కు దాదాపు 7 వేల నుంచి 15 వేల చేప పిల్లలను వదలవచ్చు. చేప పిల్లల పెంపకం, యాజమాన్య పద్ధతులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటే 15–20 టన్నుల దిగుబడి సాధిం చవచ్చు. ఒకే రకమైన మాంసాహార చేపలను మోనోకల్చర్ పద్ధతిన పెంచుకోవచ్చు. తిలాపియా జాతికి చెందిన ఆడ, మగ చేపలను విడిగా పెంచుకుంటే ఈ విధానం లాభసాటిగా ఉంటుంది. పాలికల్చర్ విధా నంలో చేపలతో పాటు మంచి రకం రొయ్యలను కలిపి పెంచుకోవచ్చు. దీనివల్ల అదనపు ఆదాయం పొందే అవకాశం ఉంటుంది. ఆహారంలో సాధారణంగా ఇచ్చే తవుడు, వేరుశనగ చెక్కలతోపాటు రొయ్యలకు అదనంగా నత్తగుల్లల మాంసం ఫిష్‌మీల్ ఆహారంగా ఇవ్వాలి.

**వ్యాధుల పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలు..**

చేపలు వ్యాధుల బారిన పడకుండా చర్యలు తీసుకోవాలి. వ్యాధిని కలిగించే కారకాలు నీటిలో ఉండటం వల్ల, అధిక సాంద్రతలో చేపలను పెంచటం వల్ల, నీటి గుణాలలో మార్పులు వచ్చినపుడు ఆక్సిజన్ తగ్గి కాలుష్యం పెరుగుతుంది. దీనివల్ల చేపలు ఒత్తిడికి గురై వ్యాధుల బారి న పడినపుడు వాటి లక్షణాలను గుర్తించవచ్చు. వ్యాధికి గురైన చేపలు నీటిపై మందకొడిగా ఈదుతూ అకస్మాత్తుగా ఎగిరిపడుతాయి. నీటిలో ఈదే శక్తి క్రమంగా సన్నగిల్లుతుంది. సమన్వయం, స్థిరత్వం కోల్పోయి ప్రతిస్పందన లోపిస్తుంది. అతి కష్టంమీద శ్వాస తీసుకుంటూ నోటిని తెరిచి నీటిపై తేలుతాయి. చెరువు గట్టుకు, అంచులకు ఉన్న చెట్లకు రుద్దుకొంటూ కనిపిస్తాయి. చర్మం మొప్పలపై జిగురు అధికంగా స్రవిస్తుంది. శరీరపు సహజత్వం తగ్గి రంగు మారతాయి. తల పెద్దది గాను తోక సన్నగా మారుతుంది. కండరాలు క్షీణించి శరీరం వంకర తిరుగు తుంది. రెక్కలు, తోక కుళ్లిపోతుంటుంది. శరీరంపై పుండ్లు, కణుతులు ఏర్పడి రక్తస్రావం జరుగుతుంది. కళ్లు ఉబ్బి బయటకు పొడుచుకు వస్తాయి. ఆహారం తక్కువ తీసుకోవడం లేదా పూర్తిగా మానివేయడం జరుగుతుంది. ఇలాంటి లక్షణాలు కనిపించినపుడు ప్రోటోజోవా, ఇక్తి యో జోడోసిస్ వంటి వ్యాధులు సోకినట్లు గుర్తించాలి. ఇలాంటి పరి స్థితులు

## విత్తన చేపల సేకరణలో జాగ్రత్తలు..

సహజ నీటి వనరుల్లో లభించే అన్నిరకాల చేపలు పెంపకానికి అనువు కావు. తక్కువ సమయంలో పెద్దగా పెరిగే భారతీయ మేజర్ కార్ప్ చేపలు, విదేశీ కార్ప్ చేపలను ఎంపిక చేసుకోవా లి. చెరువులో లభించే సహజ ఆహారాన్నే కాకుండా అనుబంధంగా ఇచ్చే ఆహారాన్ని ఇష్టంగా తీసుకునేవిగా ఉండాలి. భిన్నమైన ఆహారపు అలవాట్లు, ప్రవర్తనతో ఉండే జాతులను ఎంపిక చేసుకోవడం వల్ల వివిధ జాతుల మధ్య గల పోటీని నివారించవచ్చు. చేప పిల్లలు తాత్కాలిక ప్రతికూల పరిస్థితులను తట్టుకునేవిగా ఉండాలి. నీటి పై భాగంలో తిరుగుతూ సహజ ఆహారాన్ని తీసుకునే బొచ్చ చేపపిల్లలు ఏడాదిలో కిలో బరువు పెరుగుతాయి. తవ్విన చేపల చెరువులో అయితే ఏడాదిలో రెండు కిలోలు పెరుగుతాయి. మంచి రకం చేపల్లో ఒకటైన రోహు నీటి మధ్య భాగంలో ఈదుతూ సహజ ఆహారాన్ని తీసుకుంటాయి. ఇవి తొలి ఏడాది 750 గ్రాములు, రెండో ఏడాది 2 కిలోల వరకు పెరుగుతాయి. అదే తవ్విన చెరువులో అయితే తొలి ఏడాదే 2 కిలోలు పెరుగుతుంది. మ్రిగాల రకం చేపలు సేద్యపు చెరువుల్లో మూడేళ్లలో 3 కిలోలు పెరుగుతా యి. తవ్విన చెరువుల్లో రెండేళ్లలోనే 3 కిలోలు వస్తాయి. బంగారు తీగ చేపలు 6 నుంచి 8 నెలల వరకు నీరు నిలువ ఉంటే చెరువులు, కుంటల్లో పెంచుకునేందుకు అనువైనవి. చేపల విత్తనాల ఎంపికలో సరైన పరిమాణం చూసుకోవాలి. మిశ్రమ చేపల పెంపకం సమయంలో అన్నిరకాల చేపపిల్లలు ఒకే పరిమాణంలో ఉండేలా చూసుకోవాలి.

ఎదురైనప్పుడు నివారణ చర్యలుగా ఎకరానికి 50 గ్రాముల మాలకైట్ గ్రీన్, ఒకటి లేదా ఒకటిన్నర లీటర్ల పార్మిలిన్‌ను నీటిలో కలిపి చెరువులో చల్లుకోవాలి. అధిక సేంద్రియ పదార్థాలను వాడటం వల్ల ట్రోకోడోనాసిన్ అనే వ్యాధి సోకే ప్రమాదం ఉన్నది. ఈ వ్యాధి సోకి న ట్లు గుర్తిస్తే ఎకరాకు ఫార్మాలిన్‌ను కిలో నుంచి కిలోన్నర నీటిలో కలిపి చల్లుకోవాలి. మిక్సోబోలస్, మిక్సిజోనూ, ప్లాటీ హెల్మంత్, క్రస్టేషియ న్, లెర్నియా, బ్రాంబియో మైసిస్, హెమోరేజిక్ సెప్టిసీమియా, తాటా కు తెగులు, కురుపు వ్యాధి వంటివి కూడా చేపలకు సోకే ప్రమాదం ఉన్నది. వీటి నివారణకు మత్స్యశాఖ అధికారులను సంప్రదించాలి.

**నీరు, నేల యాజమాన్య పద్ధతులు..**

చేపలను సహజ వనరులతో పాటు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన చెరువుల్లోనూ పెంచుకోవచ్చు. రెండో పద్ధతిలోనే మంచి లాభాలుం టాయని మత్స్య శాఖాధికారులు చెబుతున్నారు. ఇలాంటపుడు పెంప కందారులు కొన్ని మెళకువలను పాటించాలి. చెరువు నిర్మాణానికి అనువైన స్థలాన్ని ఎంపిక చేసుకోవాలి. ఎంపిక చేసుకున్న ప్రదేశంలో ఏడాది పొడవున ఉష్ణోగ్రత వ్యత్యాసాలు 30-40 డిగ్రీలు దాటితే చేపల పెంపకం కష్టంగా మారుతుంది. ఏడాది పొడవునా నీరు లభించే ప్రదేశాలను ఎంపిక చేసుకోవాలి. నల్లరేగడి, ఎర్ర నేలల కంటే బంక మట్టి నేలలు చేపల పెంపకానికి అనువైనవి. కొంత శాతం ఇసుక పాలు కలిగిన నేలలు కూడా సత్ఫలితాలు ఇస్తాయి. నేలలో కర్బన లభ్యత, ఉదజని, నత్రజని శాతం పరీక్షించుకొని మత్స్యశాఖ అధికారుల ద్వారా అనువుగా మార్చుకొని చెరువులు తవ్వుకోవడం మంచిది. ఇక చేపల పెంపకానికి నీటి లక్షణాలూ ముఖ్యం. చేపల ఎదుగుదలపై నీరు అధిక ప్రభావం చూపుతుంది. సాధారణంగా చేపల చెరువులకు నదులు, కాలువలు, జలాశయాలు, చెరువులు, వాగుల నుంచి నీటి లభ్యత ఉంటుంది. ఈ సదుపాయం లేనిచోట భూగర్భ జలాలను ఉపయోగించవ చ్చు. నీరు ఉదజని సూచిక PH 7 నుంచి 9 మధ్య ఉంటే పెంపకానికి అనుకూలం. నదులు, కాలువ నీరైనా భూగర్భ జలాలైన కాలుష్య పదార్థాల వల్ల కలుషితం కానివై ఉండాలి. భూగర్భ జలాలను వాడే ముందు నిపుణులచే పరీక్షించుకోవాలి.

– దొంత వెంకటస్వామి

## చేపల పెంపకంతో మంచి ఆదాయం..

వ్యవసాయం కంటే చేపల పెంపకం మంచి లాభదాయకం. గతంలో కంటే పెంపకంలో ఇప్పుడు అనేక మార్పులు వచ్చాయి. ప్రభుత్వం కూడా చేపల పెంపకాన్ని ప్రోత్సహిస్తున్నది. ఒక హెక్టార్‌లో చేపల చెరువు తవ్వుకుంటే 2.50 లక్షల వరకు ఖర్చు వస్తుంది. ఇందులో ప్రభుత్వం60 వేల రూపాయల వరకు ఆర్థిక సహాయం చేస్తుంది. చేప పిల్లలు ఇప్పుడు రాష్ట్రవ్యాప్తంగా అందుబాటులో ఉన్నాయి. ప్రభుత్వ చేప విత్తనోత్పత్తి కేం ద్రాలే కాకుండా ప్రైవేట్‌గా హాచరీస్ ఏర్పాటు చేసుకుంటున్నారు. ప్రస్తు తం మత్స్య సంపదను పెంచేందుకు ప్రభుత్వం ఉచితంగా చేప విత్తనాలు పంపిణీ చేస్తున్నది. మత్స్య పారిశ్రామిక సహకార సంఘాలకు అనేక సం క్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్నది. మత్స్యకారులకు వ్యక్తిగతంగా కూడా రుణాలు ఇస్తున్నది.



# స్థిరమైన వ్యవసాయాభివృద్ధి కొరకు జాతీయ మిషన్ (NMSA) వివరాలు





**ము**న్ముందు వాతావరణ మార్పు అనేది ఒక్క పర్యావరణానికి సంబంధించిన సమస్య మాత్రమే కాదు ఇది మొత్తం భూగోళ అభివృద్ధిపై ఒక పెద్ద సవాలుగా అవతరించవచ్చు.

**వాతావరణ మార్పు - ప్రభావము:**

1. ప్రతి 10 సంవత్సరాలకు 0.2 డిగ్రీల చొప్పున భూగోళవేడి పెరుగుతూ వుంటుంది.
2. ఎండాకాలంలో సగటు వర్షపాతం పెరగటం.
3. తరుచుగా దీర్ఘకాల వర్షాభావ పరిస్థితులు
4. తక్కువ కాలంలో ఎక్కువ వర్షాల నమోదు
5. వడగాల్పులు సర్వసాధారణం కావడం
6. మంచుప్రదేశాలు తరిగిపోవడం
7. సముద్రమట్టాలు పెరిగిపోవడం.
8. భూమి, నీరు జీవవైవిధ్యం ఇతర ప్రకృతి వనరులు తరిగిపోవడం ఫలితంగా ఎటువంటి నివారణ చర్యలు చేపట్టకపోతే దీర్ఘకాలంలో 2100 స॥ నాటికి వ్యవసాయ ఉత్పత్తులు 40 శాతం వరకు తగ్గిపోవచ్చు. కొన్ని పంటలు అసలు పండకపోవచ్చు.

**వాతావరణ అనుకూలత :**

వ్యవసాయ రంగంలో అననుకూల వాతావరణ పరిస్థితులైన కరువు, వరదలు, వడగాల్పులు, అతిశీతలము, అసమతుల్యవర్షపాతము, సుదీర్ఘవర్షాభావము, క్రీమికీటకాల ఉధృతిని తట్టుకొని నిలిచే ఉపశమన కార్యక్రమాల ద్వారా స్థిరమైన రాబడిని సాధించడం కొరకు ప్రవేశపెట్టినదే ఈ యొక్క జాతీయ మిషన్ (NMSA).

వాతావరణ మార్పుపై జాతీయ కార్యచరణ ప్రణాళికలోని 8 మిషన్‌లలో ఎన్.ఎమ్.ఎస్.ఎ (NMSA) కార్యక్రమం అత్యంత ప్రాధాన్యతతో కూడుకున్న ఒక అంశము.

**స్థిరమైన వ్యవసాయవృద్ధి సాధన కోసం ఈమిషన్ ద్వారా ఈక్రింది తెలిపిన కార్యక్రమాలు చేపట్టబడుతూ ఉన్నాయి.**

1. అధికదిగుబడి వంగడాలు తయారి మరియు సరఫరా
2. పశుపోషణ మరియు చేపల పెంపకం
3. సమర్ధవంతమైన నీటి వినయోగం
4. చీడపీడల మరియు పోషకాహార యాజమాన్యం
5. అభివృద్ధిపరచిన వివిధ నూతన వ్యవసాయ కార్యక్రమాలు
6. వ్యవసాయ పంటల భీమా పథకాలు
7. ఋణ సదుపాయం



8. వ్యవసాయ ఉత్పత్తుల విక్రయం
9. సమాచారం అందుబాటు
10. జీవనోపాదుల వికేంద్రీకరణ

పైవిధంగా స్థిరమైన వ్యవసాయభివృద్ధి కొరకు జాతీయ మిషన్ (NMSA) కార్యక్రమం ద్వారా సమర్ధవంతమైన నీటి వినియోగము, చీడపీడల మరియు పోషకాహార యాజమాన్యం మరియు జీవనోపాదుల వికేంద్రీకరణ కొరకు అధిక ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతూవుంది.

**మిషన్‌లోని ఇతర అంశాలు :**

1. వ్యవసాయశాఖలోని అన్ని పథకాలను క్రోడీకరించి, సమన్వయపరిచి ప్రత్యేకించి, నీరు భూమి యాజమాన్యం, భూమి ఆరోగ్యం మరియు వర్షాధార ప్రాంతాల అభివృద్ధిపై ప్రత్యేకదృష్టి పెట్టడం.
2. వ్యవసాయ వనరులను సమాజంతో కలిసి సమర్థవంతంగా వినియోగించుకోవడం
3. వ్యవసాయ సంబంధ విషయాలలో ఆయా ప్రాంత సమస్యలపై ప్రత్యేక దృష్టిపెట్టడం పంటల మార్పిడి సమీకృత వ్యవసాయాన్ని ప్రోత్సహించడం.

**మిషన్ ఉద్దేశ్యాలు:**

1. వ్యవసాయ పరిశ్రమను అధిక దిగుబడి ఇచ్చేదిగాను, స్థిరమైన ఆదాయాన్న ఇచ్చేదిగాను, మరియు వివిధ వాతావరణ పరిస్థితులకు తట్టుకునేదిగా తయారుచేయడం.
2. సహజవనరులైన నీరు, నేలలను కాపాడటం.
3. భూపరీక్షల ద్వారా మరియు భూమి మ్యాపింగ్ ద్వారా అవసరమైనమేర పెట్టుబడులు పెట్టడం తద్వారా భూమి ఆరోగ్యాన్ని కాపాడుకోవడం.
4. అవసరమైన మేరకు నీటి వినియోగం తద్వారా ప్రతిచుక్కకు అధిక పంటదిగుబడిని సాధించడం.
5. రైతుల యొక్క సామర్థ్యాన్ని పెంపొందించడం.
6. వర్షాదార పంటల యొక్క ప్రదర్శనా క్షేత్రాలు ఏర్పాటు చేయడం, అందులోని మెళకువలను గూర్చి రైతులను చైతన్యపరచడం.
7. వ్యవసాయ మరియు సంభంధితశాఖల మధ్య సమన్వయం సాధించడం.

**జాతీయ మిషన్ వ్యూహము :**

1. వర్షాధార ప్రాంతాల అభివృద్ధి – ఇందులో భాగంగా ప్రాంతాల ప్రాతిపదికన సహజవనరుల యాజమాన్యంతోపాటు ముఖ్యంగా ప్రభుత్వ కార్యక్రమాలైన సమగ్రనీటి పరీవాహిక ప్రాంత యాజమాన్యం (IWMP), మహాత్మగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (MGNREGs), రాష్ట్రీయ వికాస్ యాజన (RKVY), జాతీయ ఆహార భద్రత మిషన్ (NFSM), సమగ్ర ఉద్యానపంటల అభివృద్ధి మిషన్ (MIDH) వ్యవసాయ విస్తరణ మరియు సాంకేతిక మిషన్ వంటి వివిధ వ్యవసాయ కార్యక్రమాల సమర్థ నిర్వహణ.
2. వివిధ వ్యవసాయ, వ్యవసాయ అనుబంధ పరిశ్రమలైన ఉద్యానపంటలు, పశుపోషణ, చేపల పెంపకం, కలప, వ్యవసాయ ఉత్పత్తుల విలువలను పెంచడం, ప్రాంతాలవారీగా పంటల ఎంపిక భూపరీక్ష మొదలైనవి.
3. సమర్థ నీటి వినియోగం కొరకు వివిధ పనిముట్లు సరఫరా.
4. భూమి గుణములను పెంచే కార్యక్రమాలు.
5. వాతవరణ మార్పులకు అనుగుణంగా పంటల ఎంపికలో తోడ్పాటు.

**జి.జయపాలరెడ్డి,**
**సి.ఇ.ఓ జడ్‌పి (విశ్రాంత),**
**సలహాదారుడు,సి.ఎన్.ఆర్.ఎమ్. టి.సిపార్డ్**

# కేంద్ర ప్రభుత్వ పథకాలు




**1. శ్యామ్‌ప్రసాద్ రూర్బన్ మిషన్:**

ప్రధానమంత్రి నరేంద్ర మోది 2016 ఫిబ్రవరి 21వ తేదీన శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ నేషనల్ రూర్బన్ మిషన్‌ను చత్తీస్‌ఘడ్ రాష్ట్రంలోని నంద్‌గావ్ జిల్లా కురుబిత్ గ్రామంలో ప్రధాని ఈ పథకాన్ని ప్రారంభించారు. ఈ పథకం యొక్క ముఖ్య ఉద్దేశం పట్టణాలకు స్మార్ట్ సిటీలుగా అభివృద్ధి చేస్తున్నట్లు పల్లెలను స్మార్ట్ విలేజ్‌లుగా అభివృద్ధి చేయడం తద్వారా పల్లెలు నుంచి వలసలను నిరోధించటం. రూర్బన్ మిషన్ వల్ల దేశంలో ఆకర్షణీయమైన గ్రామాలు ఏర్పడతాయి. ఈ పథకం క్రింద చేపట్టే కస్టర్లు కార్యకలాపాలకు కేంద్రాలవుతాయి. ఈ పథకం గ్రామీణుల జీవన శైలిని మెరుగుపరుస్తుంది. ఈ పథకం క్రింద వచ్చే మూడేళ్ళలో దేశంలో 300 గ్రామాలను అభివృద్ధి కేంద్రాలుగా మార్చాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ఈ పథకం వల్ల గ్రామంలో మెరుగైన సదుపాయాలు లభిస్తాయి. ఉపాధి దొరుకుతుంది.

**2. నయిరోషిణి:**

ముస్లిం మైనారిటీ మహిళలకు సాధికారత కల్పించడం లక్ష్యంగా నయిరోషిణి పథకం కేంద్ర ప్రభుత్వం చేపట్టడం జరిగింది. భారతదేశంలో మైనారిటీల్లో ముస్లింలదే మెజారిటీ దేశంలో దాదాపు 13.88 కోట్ల మంది ముస్లింలు ఉన్నారు. ఈపథకం ద్వారా ముస్లిం మహిళలకు ఆరోగ్యం, ప్రభుత్వ కార్యకలాపాలు, బ్యాంకులు వంటి ఆర్థిక కార్యకలాపాలు పట్ల అవగాహన కల్పించడం, రాజకీయ రంగంలో మెళకువలు నేర్పించి వారిలో నాయకత్వ లక్షణాలను పెంపొందించడం తద్వారా వారికి సాధికారతను కల్పించడం ఈ పథకం క్రింద చేపడతారు. ఇందుకోసం కొంతమందిని బృందాలుగా ఏర్పాటు చేసి వారికి ఈ అంశాలల్లో శిక్షణ ఇస్తారు.

కేంద్ర మైనారిటీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ వీరికి ఈ శిక్షణ ఇస్తుంది. ఇందుకోసం మంత్రిత్వశాఖ కొన్ని సంస్థలను ఎంపిక చేస్తుంది. ఈ సంస్థల ప్రకారం నమోదయిన సొసైటీలు లాభాపేక్షలేని కంపెనీల చట్టం క్రింద నమోదయిన ప్రైవేటు కంపెనీలుగా గుర్తింపు పొందిన విశ్వవిద్యాలయాలు ఉన్నత విద్యాసంస్థలు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు చెందిన శిక్షణా సంస్థలు, మహిళ స్వయం సహాయక బృందాలు మొదలైన వాటిని ఎంపిక చేస్తారు. ఎంపిక చేసిన సంస్థలు ఆయా బృందాలన్ని ఆ చోటుకు వెళ్లి అక్కడే శిక్షణ ఇవ్వాల్సి ఉంటుంది. ఇందుకు అవసరమైన ఆర్థిక సహాయం కేంద్ర మంత్రిత్వ శాఖ చేస్తుంది. శిక్షణలో భాగంగా ఈ పథకం క్రింద కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మైనారిటీ మహిళల కోసం అమలు చేస్తున్న పథకాలు గురించి వివరిస్తాయి. ఆరోగ్యం, చౌకదుకాణాలు, గృహనిర్మాణం, స్వయం ఉపాధి, న్యాయపరమైన హక్కులు వంటి విషయాలపై వారికి అవగాహన కల్పిస్తారు.

**3. మిషన్ ఇంద్రధనుష్:**



మిషన్ ఇంద్రధనుష్ కార్యక్రమం ద్వారా రెండేళ్ళలోపు చిన్నారులకు గర్భిణీ స్త్రీలకు 7 రకాల వ్యాధులు నుండి రక్షణ కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వం చుక్కల మందు పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టింది. కోరింతదగ్గు, ధనుర్వాతం, పోలియో, క్షయ, తట్టు, హైపటైటిస్ బి లాంటి ప్రాణాంతక వ్యాధులపై టీకాలు సమరానికి ఇంద్రధనుష్‌లో ఏడు రంగులుతో పోల్చి కేంద్ర ప్రభుత్వం మిషన్ ఇంద్రధనుష్ పేరుతో నామకరణం చేసింది. ఈ పథకం ద్వారా 2014 నుంచి 2019 నాటికి టీకాలు పొందుతున్న బాలల శాతాన్ని 65 శాతం నుంచి 90 శాతానికి పెంచటంతో పాటు శిశు మరణాలను మూడింతంలో రెండింటికి తగ్గించాలన్న లక్ష్యంగా ఈ కార్యక్రమం ద్వారా చేయాలని ప్రభుత్వ లక్ష్యంగా పట్టుకుంది.

**4. ప్రధాన మంత్రి కృషి సించాయి యోజన:**

ఆర్థిక వ్యవహారాల కెబినెట్ కమిటీ 2015 జూలై 1వ తేదీన వ్యవసాయ క్షేత్రాలకు జలవనరుల నిర్వహణ కోసం ప్రధానమంత్రి కృషిసించాయి యోజన వంటి కొత్త పథకానికి అంకురముద్ర వేసింది. కేంద్ర ప్రభుత్వం ఈ పథకం ద్వారా జలవనరులు ఏర్పాటు, వినియోగం, సైక్లింగ్‌లో సంబంధం ఉన్న అన్ని మంత్రిత్వ శాఖల డిపార్ట్‌మెంట్‌లు



పరిశోధన/ ఆర్థిక సంస్థలన్నింటినీ ఒక ఉమ్మడి వేదికపైకి తీసుకురావడం ఈ పథకం లక్ష్యం. ఇలా చేయడం వల్ల మొత్తం వాటర్‌సైకిల్ వ్యవస్థపై ఒక సంపూర్ణ అవగాహన ఏర్పాటు చేసుకుని తద్వారా గృహవినియోగం, వ్యవసాయం, పారిశ్రామిక అవసరమైన బడ్జెట్ కేటాయింపులు చేయడం సాధ్యమౌతుంది. ఈ కార్యక్రమం ద్వారా ఆధారనియమైన నీటిపారుదల వసతుల గల పంట భూములు విస్తీర్ణాన్ని పెంచడం జరుగుతుంది. జలవనరులు వృధాను అరికట్టేందుకు వ్యవసాయ క్షేత్రాల్లో నీటి వినియోగాన్ని పెంచేందుకు చర్యలు తీసుకోవడం జరుగుతుంది. నీటి వనరులు రీచార్జింగ్ సామర్థ్యాన్ని పెంచడం మున్సిపాలిటీల్లో రీసైక్లింగ్ చేసిన నీటిని ఆ చుట్టు ప్రక్కల ప్రాంతాల్లో వ్యవసాయ కార్యకలాపాలకు వినియోగించేందుకు గల అవకాశాలు అన్వేషించడం, నీటి వనరుల వృధాను అరికట్టేందుకు వ్యవసాయ క్షేత్రాల్లో నీటి వినియోగాన్ని పెంచేందుకు చర్యలు తీసుకోవడం, ఈ పథకానికి రాష్ట్రస్థాయి ప్రణాళిక అమలు విధానం ఆచరణలో ఉంటుంది. జలవనరులు పంపిణీ నెట్‌వర్క్, నీటి వినియోగం మూడింటినీ పరిగణలోకి తీసుకుని దీర్ఘకాలిక, మధ్యకాలిక అభివృద్ధి లక్ష్యాలను అనుగుణంగా డిఐపి రూపొందిస్తారు. బ్లాక్, జిల్లా స్థాయిలో రెండిటిలోనూ వీటిని అమలు పరుస్తారు.

**4. ఫార్మాజన్ సముధాన్ పథకం:**

ఔషధరంగంలో మందులు కొనుగోలు ధరల విషయంలో వినియోగదారులు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలను పరిష్కరించడం కోసం కేంద్ర ప్రభుత్వం ఈ ఫార్మాజన్ సమాధాన్ పథకాన్ని కేంద్ర రసాయనాలు ఎరువులు శాఖ 2015 మార్చి 12న ప్రారంభించించి... మందుల ధరలు వాటి లభ్యతలకు సంబంధించిన వినియోగదారుల ఆన్‌లైన్ ద్వారా ఫిర్యాదు చేయడం ఈ పథకం యొక్క విధానం. కేంద్ర ప్రభుత్వానికి చెందిన నేషనల్ ఫార్మాసుటికల్ ప్రెసింగ్ అథారిటీ (జాతీయ ఔషధ ధరల సంస్థ – ఎన్‌పిపిఏ) ఈ పథకాన్ని రూపొందించింది. ఔషధ ధరల నియంత్రణ ఉత్తర్వు – 2013 క్రింద ఈ పథకాన్ని అమలు చేస్తున్న వినియోగదారుల ప్రయోజనాలు పరిరక్షణ ఈ పథకం యొక్క ఉద్దేశ్యం. మందులను అధిక ధరకు అమ్మడం, కొన్ని మందులు దొరకకపోవడం కొన్నింటికి కొరత ఏర్పడును. ఎన్‌పిపిఏ అనుమతి లేకుండా కొత్తమందులను, అడిగిన మందులు ఇవ్వటానికి దుకాణదారులు సరైన కారణం చెప్పకుండా నిరాకరించడం వంటి సమస్యలు వచ్చినప్పుడు వినియోగదారులు ఈ పథకం ఆన్‌లైన్‌లో ఎన్‌పిపిఏకు ఫిర్యాదు చేయవచ్చు. ఫిర్యాదు అందిన 48 గంటలలోపు, ఎన్‌పిపిఏ ఫిర్యాదుపై తగిన చర్య తీసుకుంటుంది. ఈ పథకం ముఖ్యంగా కృత్రిమ ఔషధాల మందులు అధిక ధరలకు అమ్మడం వంటి విధానాల నివారణకు సహాయపడుతుంది.

**ఈ–నామ్:**

రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ భీమ్‌రామ్ అంబేద్కర్ 125వ జయంతి సందర్భంగా 2016 ఏప్రిల్ 14న ప్రధాని నరేంద్రమోదీ రైతుల కోసం ఈ–నామ్ పేరిట జాతీయ వ్యవసాయ మార్కెట్‌ను ఈ–ట్రేడింగ్ ప్లాట్‌ఫారం మీదకు తీసుకువచ్చారు. ఈ కార్యక్రమంలో జాతీయ వ్యవసాయ మార్కెట్ 8 రాష్ట్రాల్లో ప్రాథమికంగా 21 మండలాలను ఏర్పాటు చేసి ఈ మండలాల్లో గోధుమలు, గింజధాన్యాలు, నూనెగింజలు, బంగాళదుంపలు, ఉల్లిపాయలు, మసాల దినుసులతో పాటు 25 పంటలకు సంబంధించిన క్రయవిక్రయాలు జరుగుతాయి. ఇందుకోసం హర్యానా, గుజరాత్, మధ్యప్రదేశ్, తెలంగాణ, జార్ఖండ్, రాజస్థాన్, ఉత్తరప్రదేశ్, హిమచల్‌ప్రదేశ్ మొదలగు రాష్ట్రాలు ఎంపిక చేసింది. ప్రస్తుతం ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రణాళిక ప్రకారం మరో కొన్ని మండలాలను ప్రారంభించాలని యోచిస్తుంది. ప్రభుత్వం ఈ పథకం ముఖ్యంగా రైతులు తమ ఉత్పత్తులను విక్రయించుకునేందుకు ఈ ప్లాట్‌ఫారంలు ఎంతో పారదర్శకంగా ఉండటంతో పాటు తగిన భద్రత కలిగిస్తుంది. అలాగే రైతులు తమ ఉత్పత్తులను గరిష్ట ధరలకు విక్రయించుకునేందుకు అవకాశం ఉంది. ఈ పథకాన్ని ఆన్‌లైన్ పోర్టల్ మాధ్యమంలో త్వరలో నిర్వహించనున్నారు. ప్రతిదానికి వివిధ రాష్ట్రాల్లో మండలాలను అనుసంధానం చేయనున్నారు. ఈ సాఫ్ట్‌వేర్‌ను ఉచితంగా అన్ని రాష్ట్రాలకు అందజేయనున్నారు. ఈ పోర్టల్‌కు సంబంధించిన వివరాలకు రైతులు వారంలోని ఏడు రోజుల్లో 24 గంటలూ పనిచేసే హెల్ప్‌లైన్ ద్వారా తెలుసుకోవచ్చు.

**భూసార కార్డులు పథకం:**

భూసార కార్డులు పథకాన్ని ప్రధాని నరేంద్రమోదీ 2015 ఫిబ్రవరి 17న రాజస్థాన్‌లోని శ్రీ గంగానగర్ జిల్లాలోని సూరత్‌గడ్‌లో ప్రారంభించారు. ఈ పథకం ద్వారా ఎరువులను సమతుల్యంగా వినియోగించేటట్లు ప్రోత్సహించే ఉద్దేశ్యంతో 14 కోట్లమంది రైతులకు నాయిల్ హెల్త్‌కార్డులు అందజేస్తారు. ఈ పథకం ద్వారా వివిధ వ్యవసాయ భూముల్లో మట్టిని శాస్త్రీయంగా పరీక్షించి ఆ భూమి ఏ పంటకు అనువుగా ఉంటుంది, ఏ పంటకు ఎంతమేరకు ఎరువులు వినియోగించాలి, నేల నాణ్యతను పెంచటానికి ఏ ఖనిజ లవణాలు ఉపయోగించటం వంటి వివిధ వివరాలతో భూసారకార్డులు అందజేస్తారు.

**– ఎం.ప్రదీప్‌కుమార్, రీసెర్చ్ అసోసియేట్, టిసిపార్డ్**

# యానాదుల జీవనశైలి

కేవలం ఒక్క తెలుగు రాష్ట్రాలలో కాకుండా యానాదులు దక్షిణాది, ఉత్తరాది రాష్ట్రాలలో నివశిస్తున్న దాఖలాలు అగుపిస్తున్నాయి. వీరిది ఆదిమ జాతి కాబట్టి యానాదులను అనాదివారని, యానాది వారని వ్యవహరించడం సహజమయ్యింది. వీరు ఎక్కడ నుంచి వచ్చారు అనేందుకు పరిశోధన గావించిన 'వెన్నెలకంటి రాఘవయ్య' ఈ విధంగా చెబుతున్నారు 'ఖైరు' (ఖైబరు) కనుమలగుండాను, కాశ్మీరుత్రోవను, మధ్యధరాసముద్రపు ప్రాంతాపు జాతులైన ద్రావిడులు, వారి తర్వాత తరలివచ్చిన ఆర్యులు, వలసవచ్చి మొదట్లో సింధు నదీ ప్రాంతంలో కొద్దికాలం నివసించారు. అటు పిమ్మట వచ్చిన వారి యొక్క తాకిడికి తట్టుకోలేక గంగానది ప్రాంతములను ఆక్రమించి ఆ పైన అక్కడ నుంచి కూడా తరుమబడినారు. వింధ్య పర్వతశ్రేణులను అధిగమించి వీరు దక్షిణాపథములో ప్రవేశించి కన్యాకుమారి వరకు వ్యాప్తి చెందినారు. ఇది 'యానాది గ్రంథం'లో అగుపిస్తున్న ఆధారం మూలంగా చెప్పబడుచున్నది.

ఈ విధంగా వచ్చిన యానాది జాతివారు 'ప్రోటో అస్ట్రలాయిడ్' జాతికి చెందిన మానవజాతికి చెందినవారనే స్పృహ నాగరికుల్లో, అగ్రబలహీన, నిమ్న-దళిత వర్గాలలో లేకపోవడం గమనార్హం. అసలు విషయం యానాదులంటే నాగరికులకు వారిలో నాలుగైదు వర్గాలున్నారనే విషయం తెలియకపోవచ్చు. వీరిలో కూడా వారి వృత్తిని ఆధారంగా చేసుకొని విభజించినట్లు బోధపడుచున్నది. 1. మంచియానాది (లేదా) రెడ్డియానాది. 2. అడవియానాది 3. పాకీయానాది 4. చల్లాయానాది (అంటే చెత్తకుండీలలో, ఇతరుల) ఆహార పదార్థాలు సేకరించే జాతి అని నాలుగు వర్గాలుగా చేశారు.

ముఖ్యంగా ఈ యానాదుల్లో నాగరిక జీవనం కలిగిన 'రెడ్డియానాది' వారిని 'స్వచ్ఛమైన జాతి'గా పిలుస్తుంటారు. అయితే వీరు వ్యవసాయ కూలీలుగా, పాలేర్లుగా, చేపల చెరువులు మరియు రొయ్యల కయ్యల దగ్గర (చెరువులు) కాపలాదారుల్లా పనిచేస్తుంటారు. ఎక్కువగా వ్యవసాయంపై ఆధారపడి బ్రతుకుతుంటారు. వీరు కుందేళ్లను, పక్షుల్ని, ఎలుకలను వేటాడతారు. చేపలను పడుతుంటారు. అడవియానాదులైతే కొండల మీద జీవిస్తూ, అడవులలో సంచరిస్తూ అక్కడ లభ్యమయ్యే కుంకుడుకాయలు, బంక (జిగురు), తేనె వంటి అటవీ సంపదను సేకరించి అమ్ముకొని సొమ్ముచేసుకుని వాటితో దినవెచ్చాలు కొనుక్కుంటుంటారు. ఎక్కువగా వీరు పశువుల పెంపకంపై ఆధారపడి జీవించడం అలవాటు. మిగిలిన యానాది వారు పారిశుద్ధ్యం పనిచేసో, చెత్తకుండీలలో దొరికే ఆహార పదార్థాలను ఏరుకుని బ్రతుకీడ్చడం వలన వారిని యానాదుల్లో మిక్కిలి వెనుకబడిన వారుగా, దీనావస్థలో గర్భదరిద్రంలో మగ్గుతున్న వాళ్లుగా గుర్తించబడినారు.

ఈ జాతి వారు మాంసాహారులని పైన పేర్కొనడం జరిగింది. అందుచేత వాటితో బాటు వీరింకా ఉడతలు, ఉడుములు, కోడి, మేక, గొర్రె, నెమళ్ళు, నేల మీద తిరిగే తోడేళ్లను, కొంగలను, నీటి కాకులను ఆహారంగా స్వీకరిస్తారు. అయితే యానాదులు గోమాంసాన్ని గాన్ని కోతిమాంసాన్ని గాని ముట్టరు. యానాదులకు వీటిపై ఒక పవిత్ర భావం ఉండటవే అందుకు కారణం కావచ్చును. కేవలం మాంసాహారమే కాకుండా వీరు శాఖాహారంగా అడవిలో లభించే పండ్లను, ఆకుకూరలను, కాయ, దుంపలను తింటూ ఉంటారు. ఏ జాతి వారినైనా వారు తీసుకునే ఆహారాన్ని బట్టి వారి వారి జీవనశైలి తెలిసిపోతుంది. బహుశా ఈ కారణాల వల్లే కొన్ని వర్గాల వారు మొదట్లో మాంసాహారులై, బౌద్ధమతం జనంలోకి వచ్చిన తరువాత శాఖాహారులుగా మారిపోవడం గమనించాల్సిన అంశం.

వీరు ఎటువంటి వారినైనా మర్యాదపూర్వకంగా 'అయ్యా' అని సంబోదిస్తుంటారు. తెలంగాణా ప్రాంత యానాదులు మాట్లాడే మాండలికం ఒక రకమైన యాసతో వుంటే, ఆంధ్ర ప్రాంతపు యానాదులు మాట్లాడే మాండలికం మరో విధమైన యాస కనిపిస్తూ ఉంటుంది. స్పష్టమైన భాషను కొండల్లో, అడవులలో తిరిగే వారు మాట్లాడటం కుదరదు కాబట్టి కొన్ని పదాలను ఈ విధంగా ఉచ్చరించడం మనం గమనించవచ్చు. ఉదా॥ 'చదువుకు-సదవు, స్నానంకు-తానం, దయకు-ధయ, చాపకు-సాప, చాకలికి-సాకలి" అనడం సహజంగా కనిపిస్తుంది. ఇదే విధంగా నాగరికత గల గ్రామీణుల్లో ××× కూడా మాట్లాడుతుండటం మనం గమనించవచ్చు. అన్ని కులాల వారికి ప్రత్యేక దేవతలు, దేవుళ్లు ఉన్నట్టుగానే యానాదులకూ ఉన్నారు. వారి కులదేవత చెంచుదేవత. ఈ దేవతతో బాటు వీరింకా కలియుగదైవం వెంకటేశ్వరస్వామిని, శ్రీరాముడిని కూడా పూజిస్తారు.

ఈ జాతికి చెందిన ఆడవారు 'సోది' చెబుతుంటారు. ఈ సోదినే 'రంగం' అని అంటారు. ప్రస్తుతం వీరి జీవన విధానంలో గణనీయమైన మార్పులు తీసుకొస్తున్నా ఇంకా అన్నిరంగాల్లో ఈ జాతి జనుల వెనుకబాటుతనం మాత్రం ఎక్కువగానే ఉంది. నిన్నటి వరకూ ఒక మలినభావం నుండి ఇంకొక అమలిన భావంలోకి మారడమే భావపరిణామం. ఇటువంటి భావపరిణామం లేనటువంటి జాతులు, వర్గాలు విధ్వంసం వైపుకు ప్రయాణం చేస్తుంటాయి. నేడు యానాదులను గాని, మరే ఇతర గిరిజనవర్గాల వారైనా మార్పు చెందడానికి నాగరిక సమాజం 'చదువు'ను 'ఉపాధి'ని కల్పింపజేసి సహకరించాల్సిన బాధ్యత, ఆవశ్యకత ఎంతైనా ఉన్నది. ఇంక వీరి యొక్క కుటుంబ వ్యవస్థ హైందవ సమాజానికి కాస్త భిన్నంగా అగుపిస్తుంటుంది. ఆర్థికవెసులుబాటు గల కొన్ని యానాది కుటుంబాలలో పురుషులు ఇద్దరు లేక ముగ్గుర్ని పెళ్లాడుతుండటం అనాదిగా వస్తున్నది. అలాగని ఏకపత్నీవ్రతం లేకపోలేదు. ఎక్కువగా ఏకపత్నీవ్రతమే అమలులో ఉంది. ఎక్కడికి

వెళ్లినా ఈ యానాదులు భార్యాబిడ్డలు యాజమాని (తండ్రిని) విడిచిపెట్టి ఉండరు. ఎందుకంటే వారి ఆస్తిపాస్తులు వారే గనుక.

మారుమూల ప్రాంతాలలో జీవించే యానాదులు కూడా పాటను తమ జీవన విధానంలో ఒక భాగంగా భావిస్తారు. అందుచేతనే వారి పాటల్లో పెళ్లికాగానే తల్లినీ, పినతల్లినీ మరిచిపోవద్దని, ఆయా యానాది జంట వెన్నెల్లో పాడుకునే పాటలు బాగా కనిపిస్తాయి. వారికిష్టమైన ఆహారం, అత్త గురించి, మేనల్లుడిని అల్లుడు చేసుకుంటే వాడు అకారణంగా అలిగితే అత్తపాడే మనోవేదన పాటలు, స్త్రీలు చందమామను ఉద్దేశించి పాడే విరహగీతాలు, అత్తకోడల్ని తప్పుపడుతూ పాడే గడుసుదనం పాటలు చాలానే అగుపిస్తుంటాయి. ఇప్పసారా గురించి కూడా వారి పాటల్లో వేడుక ద్రవంగా దర్శనమిస్తుంది.

శతాబ్దాల పాటు ఈ యానాది వారికి ఎదుగుదల, విద్య, ఆర్థిక వెసులుబాటులు లేకపోవడం దయనీయమైన విషయం. నేటికీ వీరు ఒక జాతిగా సరియైన గుర్తింపు పొందకపోవడం శోచనీయం. ఐటిడిఏ వంటి సంస్థలు వీరి యొక్క అభివృద్ధికి కృషి చేస్తున్న యానాదులకది ఉపయోగపడటం లేదనే చెప్పాలి. వీరి జీవన విధానం, సంస్కృతి సంప్రదాయాలు మారడానికి స్వతంత్ర్య సంస్థలు ఎంతో కృషి చేయ్యాల్సి ఉంది. అయితే కొన్ని మతసంస్థలు వీరిని మతమార్పిడికి ప్రోత్సహిస్తూ, ప్రలోభాలకు గురి చేస్తూ వారిని అయోమయంలో పడేల చేస్తున్నాయి. ఈ పరిస్థితి సమర్థనీయం కాదు. ఈ జాతిజనులు సంస్కరించబడాలంటే ముందుగా వారిలో ఆ విద్యను పారద్రోలాలి. ఆరోగ్య భద్రత, ఆహారభద్రత, వారి వారి ఆర్థిక స్థితిగతులలో గణనీయమైన మార్పులు తీసుకురావలసిన బాధ్యత, ఆవశ్యకత ప్రతి రాష్ట్ర ప్రభుత్వానికీ ఉంది. ఆ కృషి తప్పక మన రెండు తెలుగు రాష్ట్రాలూ చేయగలవని ఆశిద్దాం!

**– డా॥ మంతెన సూర్యనారాయణరాజు**
**విశ్రాంత ఉపన్యాసకులు, హైదరాబాద్**

# టిసిపార్డు నందు 'రాగాస్ సాఫ్ట్‌వేర్ & జియో ఎంజియన్ఆర్ఇజిఎ"పై శిక్షణా కార్యక్రమం



తెలంగాణ రాష్ట్ర పంచాయతీరాజ్ & గ్రామీణాభివృద్ధి శిక్షణా సంస్థ (టిసిపార్డు) నందు ఎంజిఎన్ఆర్ఇజిఎస్ జిల్లా ప్రతినిధులకు (డిఆర్‌పి) మరియు అడిషనల్ జిల్లా ప్రతినిధులకు, డిసిలకు 'రాగాస్ సాఫ్ట్‌వేర్ మరియు జియో ఎంజిఎన్ఆర్ఇజిఎ' అప్లికేషన్ మీద శిక్షణ జరిగింది. ఈ కార్యక్రమంను ఐటి మరియు సిఎన్ఆర్ఎం సెంటర్‌హెడ్ శ్రీ బి.నరేంద్రనాథ్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంను సిఇఓ సిపార్డు శ్రీమతి నీతూకుమారి ప్రసాద్, డైరెక్టర్, గ్రామీణాభివృద్ధి శాఖ వారి ఆదేశాల మేరకు నిర్వహించడం జరిగింది.

ఈ సందర్భంగా సిఎన్ఆర్ఎమ్ సెంటర్‌హెడ్ శ్రీ బి.నరేంద్రనాథ్ మాట్లాడుతూ జియో అప్లికేషన్స్‌ను ఎన్ఐఆర్‌డి, ఎన్ఆర్ఎస్ఏ, ఎస్ఐఆర్‌డిల ద్వారా సమాచార చేరవేత చేయడం జరుగుతుందని, భువన్ సాంకేతిక సాఫ్ట్‌వేర్ ద్వారా కార్యక్రమ వివరాలను చూపడం జరుగుతుందని నరేంద్రనాథ్ వివరించారు. మొబైల్ ద్వారా జియో సమాచారంను జిల్లాప్రతినిధులు ఉపయోగించుకొని అమలు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమం జియో ఎంజిఎన్ఆర్ఇజిఎ క్రింద కేంద్ర ప్రభుత్వం అసెట్స్‌ను జియోటాగింగ్ చేయడం ద్వారా సఫలీకృతం చేసేందుకు చేయడం జరుగుతుందని తెలిపారు.

ఈ కార్యక్రమంలో సిఆర్‌డి నుండి ప్రోగ్రామ్ మేనేజర్ శ్రీ ఎం.ఆంజనేయులు, సిఎన్ఆర్ఎం సెంటర్ ప్రతినిధి శ్రీ గాంధీలు నిర్వహించుతున్నారు. తెలంగాణ రాష్ట్రంలోని అన్ని జిల్లాల నరేగా ప్రతినిధులు అందరూ పాల్గొంటున్నారు. ఈ శిక్షణా కార్యక్రమంను సి.ఎన్.ఆర్.ఎం సెంటర్ వారి ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది.



# ఉత్పత్తి రంగంలోనూ మహిళా శక్తి

ప్రస్తుతం మహిళా సంఘాలలో విద్యావంతులైన డిగ్రీ, పీజీలు చేసిన యువతుల సంఖ్య గణనీయంగా పెరుగుతున్నది. ప్రధానమంత్రి ప్రారంభించిన స్కిల్ ఇండియా ద్వారా ఈ సంఘ సభ్యులకు శిక్షణ ఇచ్చి ప్రోత్సహించాల్సి ఉన్నది. మహిళా సంఘాల ఉత్పత్తులు విదేశాలకు ఎగుమతి చేసే స్థాయికి ఎదగాలి.

సూక్ష్మ పరపతి వ్యవస్థ దేశంలో ప్రప్రథముగా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 1998లో ప్రారంభమైంది. తెలంగాణ రాష్ట్రమేర్పడిన తర్వాత దాదాపు 74లక్షలకు పైగా మహిళలు ఈ సంఘాలలో సభ్యులుగా కొనసాగుతున్నారు. వీరు రుణాలను సద్వినియోగం చేయడమే గాక 98 శాతం మహిళలు వాయిదాలు తప్పకుండా చెల్లింపులు చేస్తున్నారు.

ఈ మైక్రో క్రెడిట్ వ్యవస్థ ప్రారంభించి దాదాపు 18 ఏళ్లు గడిచింది. కానీ ఉత్పత్తి రంగంలోకి చొచ్చుకొని సామర్థ్యం ఈ సంఘాల సభ్యులకు పెరుగడం లేదు. గుత్త కంపెనీలు, బహుళజాతి కంపెనీల తాకిడికి మార్కెట్‌లో మహిళా సంఘాల ఉత్పత్తులు నిలువలేకపోతున్నాయి. వినియోగదారుల అభిరుచుల ప్రకారం నూతన ఒరవడిలో సమిష్టిగా ఈ మహిళా సంఘాలు నాణ్యమైన వస్తువులు తయారు చేయగల నైపుణ్యాలను, శిక్షణలను అలవర్చుకోవాలి. ప్రస్తుతం మహిళా సంఘాలలో విద్యావంతులైన డిగ్రీ, పీజీలు చేసిన యువతుల సంఖ్య గణనీయంగా పెరుగుతున్నది. ప్రధానమంత్రి ప్రారంభించిన స్కిల్ ఇండియా ద్వారా ఈ సంఘ సభ్యులకు శిక్షణ ఇచ్చి ప్రోత్సహించాల్సి ఉన్నది. మహిళా సంఘాల ఉత్పత్తులు విదేశాలకు ఎగుమతి చేసే స్థాయికి ఎదగాలి.

ఇంగ్లాండ్‌లోని మహిళలు మూడు బిలియన్ల విలువగల వస్త్రాలను ఎగుమతి చేయగలుగుతున్నా రు. ఆ దేశంలోని వస్త్ర పరిశ్రమలో 98 శాతం శ్రామికులు మహిళలే కావడం ఒక ప్రత్యేకత. దక్షిణ కొరియా, చైనా, జపాన్, సింగపూర్ లాంటి దేశాల్లోపారిశ్రామిక రంగంలో మహిళల పాత్ర అద్వితీయం.

తెలంగాణ రాష్ట్రంలో మహిళా సంఘాల కార్యక్రమాలు ఆధునిక ఉత్పత్తి రంగంలోకి శరవేగంగా ప్రవేశించాల్సి ఉన్నది. మహిళలు అందుకు సిద్ధంగా ఉన్నారు. ప్రభుత్వ ప్రోత్సాహం అవసరం. సెర్ప్ సంస్థ ఈ సంఘాలకు తగిన శిక్షణ, నైపుణ్యాలను అందిస్తుంది. జాతీయస్థాయిలో ఎన్ఆర్ఎల్ ఎం సంస్థను కూడా విరివిగా ఉపయోగించాలి. ఇప్పుడిప్పుడే మహిళా సంఘాలు ఎదుగుతున్న రాష్ట్రాల్లో మన రాష్ట్ర మహిళా సంఘాల సభ్యులు వారికి శిక్షణ ఇస్తున్నారు. వందలాదిమంది ఉత్సాహవంతులైన సుశిక్షుతులైన సభ్యురాళ్లు (సీఆర్‌పీలు) మన రాష్ట్రం నుంచి ఉత్తరాది రాష్ట్రాలలో మహిళా సంఘాలకు పొదుపు, బ్యాంకు లింకేజీ, చిరు వ్యాపారాలు, ఆడిటింగ్, నాయకత్వ లక్షణాల గురించి శిక్ష ణ ఇస్తున్నారు. ఈ సీఆర్‌పీలు ఒక్కొక్కరు ప్రతి సంవత్సరానికి రూ. 80,000 నుంచి 1,00,000 వరకు సంపాదించుకుంటున్నారు.

**–ప్రొఫెసర్ కూరపాటి వెంకటనారాయణ**
**మైక్రో ఫైనాన్స్ విశ్లేషకులు**



# గ్రామీణాభివృద్ధి ప్రణాళికలు రూపకల్పన అమలుపై ఎన్ఐఆర్డిలో అంతర్జాతీయ శిక్షణా కార్యక్రమాన్ని ప్రారంభించిన పిఆర్ & ఆర్డీ మంత్రి జూపల్లి కృష్ణారావు




ప్లానింగ్ అండ్ మేనేజిమెంట్ ఆఫ్ రూరల్ డెవలప్ మెంట్ ప్రొగ్రామ్స్ పై రాజేంద్రనగర్ ఎన్ఐఆర్డి (నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ రూరల్ డెవలప్ మెంట్) లో అంతర్జాతీయ శిక్షణ శిబిరాన్ని ప్రారంభించిన పంచాయతీరాజ్ మరియు గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు.

హైదరాబాద్: గ్రామాల అభివృద్ధి ద్వారానే దేశ అభివృద్ధి సాధ్యమని, గ్రామీణాభివృద్ధికి తెలంగాణ ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని పంచాయతీరాజ్ మరియు గ్రామీణాభివృద్ధిశాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. రాజేంద్రనగర్ లోని ఎన్ఐఆర్ డి(నేషనల్ ఇన్ స్టిట్యూట్ ఆఫ్ రూరల్ డెవలప్ మెంట్) లో ప్లానింగ్ అండ్ మేనేజ్ మెంట్ ఆఫ్ రూరల్ డెవలప్ మెంట్ ప్రొగ్రామ్స్ పై అంతర్జాతీయ శిక్షణ శిబిరాన్ని మంత్రి జూపల్లి కృష్ణారావు ప్రారంభించారు. ఈ శిక్షణ శిబిరంలో టాంజనియా, నైజిరియా, శ్రీలంక, సూడాన్, జింబాబ్వే, ఫిజి, ఈజిప్ట్, ఖజికిస్తాన్, మలేషియా, మాల్దీవులు తదితర 20 దేశాలకు చెందిన ప్రభుత్వ ఉద్యోగులు పాల్గొంటున్నారు. ఎన్ఐఆర్ డీ డైరెక్టర్ జనరల్, ఐఏఎస్ అధికారి డబ్ల్యూ.ఆర్. రెడ్డి, ఎన్ఐఆర్ డీ ప్రతినిధులు శంకర్ ఛటర్జీ, చిన్నాదురై, ఆరుణ జయమణి ల ఆధ్వర్యంలో శిక్షణ తరగతులు జరగనున్నాయి.

ఈ కార్యక్రమాన్ని ప్రారంభించిన అనంతరం మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ... అభివృద్ధి చెందుతున్న దేశాలలో అధిక జనాభా గ్రామాల్లోనే నివసిస్తుందని, గ్రామీణాభివృద్ధి ద్వారానే ఏ దేశమైనా అభివృద్ధి చెందుతుందని అన్నారు. గ్రామీణాభివృద్ధి కోసం ప్రభుత్వాలు ఎన్నో కార్యక్రమాలు చేపడుతున్నప్పటికి, ఇప్పటికి గ్రామాల్లో పేదరికం అలాగే ఉందన్నారు. గ్రామాల్లో పేదరిక నిర్మూలన లక్ష్యంగా భారతదేశంలో ఉపాధిహామి, పీఎంజీఎస్ వై, రూరల్ హెల్త్ మిషన్, స్వచ్ఛ్ భారత్ లాంటి పలు కార్యక్రమాలను కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు. గ్రామీణాభివృద్ధి ద్వారానే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని గుర్తించిన సీఎం కేసీఆర్... ఆ దిశగా తెలంగాణలో అనేక సంక్షేమ కార్యక్రమాలకు శ్రీకారం చుట్టిన విషయాన్ని మంత్రి జూపల్లి గుర్తుచేశారు. గ్రామీణాభివృద్ధికి భవిష్యత్ లో తెలంగాణను రోల్ మోడల్ గా చూపేలా కేసీఆర్ సర్కార్ కార్యక్రమాలు అమలు చేస్తోందని అన్నారు. ఆసరా పెన్షన్ లు, విద్యార్థులకు హాస్టలల్లో సన్న బియ్యం భోజనం, కళ్యాణ లక్ష్మీ, స్త్రీ నిధి, దీపం పథకం, స్కిల్ డెవలప్మెంట్ లాంటి కార్యక్రమాల ద్వారా తెలంగాణలో పేదరిక నిర్మూలనకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ఇరిగేషన్ ప్రాజెక్ట్ ల నిర్మాణం ద్వారా తెలంగాణలోని ప్రతి ఎకరానికి సాగు నీరు ఇచ్చి.. గ్రామాల్లో పేదరికాన్ని పారద్రోలేందుకు తమ ప్రభుత్వం ప్రయత్నిస్తుందని అన్నారు. గ్రామస్థాయిలో పని చేస్తున్న వివిధ శాఖలను సమన్వయం చేస్తూ ప్రజలకు మెరుగైన సేవలు అందించే లక్ష్యంతో గ్రామజ్యోతి కార్యక్రమాన్ని తెలంగాణలో ఆరంభించామన్నారు. అభివృద్ధిలో ప్రజలను భాగస్వామ్యులను చేసేందుకు గ్రామస్థాయిలో వివిధ కమిటీలను ఏర్పాటు చేసినట్లు మంత్రి తెలిపారు. ఈ శిక్షణ కార్యక్రమంతో నేర్చుకున్న విషయాలు గ్రామీణా పేదరిక నిర్మూలనకు దోహదపడుతాయనే ఆశా భావాన్ని మంత్రి వ్యక్తం చేశారు.

# “ప్రజా చైతన్యం - అభివృద్ధికి దోహదం”

**ఒ**కనాడు అచ్చంపేట తాలూక మహబూబ్‌నగర్ జిల్లాలోని మారుమూల గ్రామం ఉమాపురం డిండీ ప్రాజెక్టు నిర్మాణంలో మునిగిపోయిన గ్రామం. ఆ గ్రామాన్ని ప్రాజెక్టు వాటర్ నుండి 1 1/2 కిలోమీటర్ల దూరంలో పునర్‌నిర్మాణంలో ఎన్నో కష్టాలను ఎదుర్కొని నిలబడి ప్రస్తుతం వంగూరు మండలంలోని మిగతా గ్రామాలకు ధీటుగా అభివృద్ధి చెందుతుంది అని చెప్పడానికి గర్వపడుతున్నాం. గ్రామాభివృద్ధికి తోడుగా నిలిచిన ప్రజాప్రతినిధులు, అధికారులు, సాంకేతిక నిపుణులు, గ్రామ ప్రజలు అందరి సహకారంతో గ్రామం యొక్క రూపురేఖలు మారిపోయాయి. ఈ ప్రగతికి తోడ్పడిన ప్రతి ఒక్కరూ అభినందనీయులే.

సిసి రోడ్: 2015 సంవత్సరంలో ప్రధానమంత్రి గ్రామసడక్ యోజనలో మంజూరైన రోడ్డుకు రూ. 6.5 కోట్ల రూపాయలు ఖర్చు చేసి రోడ్డు నిర్మాణాన్ని పూర్తి చేసింది ప్రభుత్వం. 13 కిలోమీటర్ల పొడవు గల ఈ రోడ్డు గ్రామాలను కల్పుతూ అంటే అవి – తిప్పారెడ్డిపల్లి నుండి, గాజ్ర, నింజాబాద, ఉమాపూర్, ఉప్పలపహాడ్, మాచినోన్‌పల్లి, వెంకటాపూర్ మరియు వంగూరు. దీని వల్ల మండల హెడ్‌క్వర్టర్‌కు బ్రహ్మాండమైన రోడ్డు, రవాణా సౌకర్యం చేకూరింది. విద్యార్థులకు, రైతులకు, మార్కెట్ వెళ్లే వారికి, ఉద్యోగస్తులకు అందరికీ మేలు జరిగింది.

అందుకే అనుకుంటున్నాం గతుకుల రోడ్డు నుండీ గట్టెక్యాం అని. దీనితో మా ప్రాంతపు ప్రజల చిరకాల వాంఛ నెరవేరింది. ఇప్పుడు నాగరికత పైపు నడుస్తున్నాం. ప్రగతి వైపు పయనిస్తున్నాం, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను మనసారా అభినందిస్తున్నాం.

మిషన్ కాకతీయలో భాగంగా ఉమాపూర్‌లోని మూడు చెరువులు, కుంటల్లో పూడిక తీసాం. కట్టనుసరి చేసాం. ఇప్పుడు తాళ్ళచెరువు, వావిళ్లకుంట, మల్లయ్యకుంట జలకళను సంతరించుకున్నాయి. దాదాపు 55 లక్షల రూపాయల వ్యయంతో చేపట్టిన ఈ పనులు పలువురి దృష్టిని ఆకర్షిస్తూ వూరికే ఓ కొత్తదనాన్ని తెచ్చిపెట్టాయి. అందుకే మన ప్రభుత్వం చేపట్టిన మిషన్ కాకతీయ కార్యక్రమం అన్ని రాష్ట్రాలకు ఆదర్శంగా నిల్చి, అందరిమన్ననలను, ప్రశంసలను అందుకుంటోంది.

గ్రామంలోని ప్రాథమిక పాఠశాలను సర్వశిక్షాఅభియాన్ (ఎస్ఎస్ఏ) నిధులతో అభివృద్ధి చేసి విద్యార్థులకు చదువుకోవడానికి ఓ చక్కటి వాతావరణాన్ని నెలకొల్పడమే కాకుండా, ఆటపాటలకు, అనువైన అనుకూలతలను కల్పించడమైనది.

హరితహారంలో నాటిన మొక్కలు అందర్ని ఆకట్టుకుంటూ పాఠశాలకు వచ్చే వార్ని ఆహ్వానిస్తున్నట్లుగా కనిపిస్తున్నది. చక్కటి కంపౌండ్ వాల్ నిర్మించడం వల్ల, రక్షణ కల్పించడంతో పాటు, మంచి వాతావరణాన్ని కల్పించినందుకు అందరూ సంతోషంగా వున్నారు.

పరిపాలనా సౌలభ్యం కోసం అందరం కల్సి ఒక్క దగ్గర చేరి గ్రామ సమస్యలు చర్చించి పరిష్కరించుకోవడానికి ఒక వేదిక కావాలన్న మా ప్రజల కోరికను మన్నించిన ప్రభుత్వం ఓ చక్కటి గ్రామపంచాయతీ కార్యాలయాన్ని నిర్మించుకోవడానికి నిధులు మంజూరు చేసింది. దాదాపు రూ. 13 లక్షల ఖర్చుతో నిర్మించిన కార్యాలయ భవనాన్ని మా శాసనసభ్యులు శ్రీ గువల బాల్‌రాజు గారు 07.01.2016 తేదీన ప్రారంభించారు. ఎంపిపి శ్రీమతి భాగ్యలక్ష్మి గారు, సర్పంచ్ ఎమ్.సుధాకర్‌రావుతో కల్సి. దీని వల్ల ప్రజలకు, మహిళా సంఘాలకు, సమావేశాలు ఏర్పాటు చేసుకోవడానికి ఎంతో మేలుజరిగింది. హరితహారంలో భాగంగా గ్రామపంచాయతీ ఆవరణలో ఇంకా చుట్టుప్రక్కల నాటిన మొక్కలు పలువురిని ఆకట్టుకుంటూ పచ్చదనాన్ని పంచుతున్నాయి. ఇటీవలే నిర్మించిన కంపౌండ్ వాల్‌తో గ్రామపంచాయతీకి ఓ కొత్తదనం వచ్చింది. నాటిన మొక్కలకు సంపూర్ణ రక్షణ కల్పించినట్లైంది. వచ్చే ఆఫీసర్లకు పనిచేసుకోవడానికి అనుకూలమైంది.

ప్రజలకు త్రాగడానికి శుద్ధిపరిచిన నీటిని సరఫరా చేయాలని




ప్రాథమిక పాఠశాల భవనాలు, క్రొత్త కంపౌండ్‌వాల్, వాటర్ ట్యాంక్




ఉమాపూర్ గ్రామపంచాయతీ భవన ప్రారంభోత్సవం





ఊహించిన సర్పంచ్ ఎమ్.సుధాకర్‌రావు కృషి ఫలించింది. Halcyon Solutions Inc Dublin Ohio- USA వారి సౌజన్యంతో (CPW) Community Pure Water సంస్థ హైదరాబాద్ వారు ఉమాపురంలో దాదాపు 5 లక్షల రూపాయల ఖర్చుతో ప్రారంభించిన ఈ వాటర్‌ప్లాంట్ నుండి ప్రజలకు నామమాత్రపు రేటులో ప్యూరిఫైడ్ వాటర్‌ని అందించడం అందర్ని ఆనందపర్చింది. ఈ ఆర్.ఓ.వాటర్ ప్యూరిఫికేషన్ ప్లాంట్‌ను అచ్చంపేట శాసనసభ్యులు శ్రీ గువ్వల బాలరాజు గారు మరియు సిపిడబ్ల్యు సంస్థ జనరల్ మేనేజర్ శ్రీ మనోహర్ గారు ప్రారంభించారు. ప్రారంభసభ దిగ్విజయంగా జరిగినది అందరి సహకారంతో.

పాఠశాల విద్యార్థులకు ఉచిత నీటి సరఫరా చేయడం జరుగుతున్నది. గ్రామానికి వాటర్‌ప్లాంట్‌ను అందించిన Halcyon కంపెనీ USA సిఇఓ శ్రీ మోహన్ విద్దం గార్ని, సిపిడబ్ల్యు జనరల్ మేనేజర్ గారు శ్రీ మనోహర్ గార్ని శాసనసభ్యులు అభినందించారు, సత్కరించారు. ఇప్పుడు గ్రామస్తుల స్పందన వింటుంటే 'కాళ్ళనొప్పులు పోయినవి, మంచిగ ఆకలేస్తున్నది, తిన్న బుక్కెడు బువ్వ మంచిగ అరుగుతున్నది, మేమైతే ఆరోగ్యంగా వున్నము' అంటున్నరు. ఈ మాటలు వారి నోట వచ్చినవే వింటే ఎంతో మంచిగనిపించింది. దేవుడు వాళ్ళను మంచిగ చూడాలని అంటున్నది సహృదయజనం.

గ్రామంలోని ఎస్సీ కాలనీలో మహాత్మాగాంధీ నేషనల్ రూరల్ ఎంప్లాయిమెంట్ గ్యారంటీ స్కీమ్ (ఎమ్‌జిఎన్ఆర్‌ఇజిఎస్)లో జిల్లా కలెక్టర్ గారు మంజూరు చేసిన రూ॥ ఐదు లక్షల ఖర్చుతో సిసి రోడ్ వేయడం వల్ల ఆ ప్రాంతం ప్రజలు ఆనందంగా ఉన్నారు. ప్రభుత్వం తీసుకున్న చొరవకు అందరు అభినందనలు తెలియజేస్తున్నారు. ఇజిఎస్ అధికారులను, పంచాయత్‌రాజ్ అధికారులను, ఇంజనీర్లను అందరు ప్రశంశిస్తున్నారు.

ఈ సంవత్సరం నీటిఎద్దడి ఎక్కువ వుండడం వల్ల గ్రామీణ ప్రజలు త్రాగునీటి కోసం అల్లాడిపోయినారు. బోర్లు పడకపోయే, వానరాకపోయే అన్న చింత తప్ప మరి ఇంకేంలేదు. వున్నటువంటి బోర్లను కడిగించి మరిన్ని క్రొత్త పైపులేని లోతుకు మోటరు దింపితే నీళ్లు మంచిగా వచ్చినవి. ప్రభుత్వం మంజూరు చేసిన ఓ బోరులో మంచిగనీళ్లు రావడంతో ధైర్యం వచ్చింది. మోటర్లు పెట్టి వాటిని కంటికిరెప్పలా చూసుకుంటూ ఈ ఎండాకాలంలో త్రాగునీటి కష్టం నుండి బయటపడ్డం. మా అదృష్టం ఈ సారి కరెంటు ఫుల్‌గా వున్నందుకు, మోటరేస్తే నీళ్లు రావడం, ఇలా నీళ్ల కష్టాల నుంచి గట్టెకించిండు దేవుడు.

యువతకు స్వయం ఉపాధిని కల్పించడం కోసం ఎస్సీ/బీసీ కుటుంబాల వారికి పాడిపశువులను కొనడానికి ఇండియన్ ఓవర్‌సిస్ బ్యాంక్ వంగూర్ బ్రాంచ్ మేనేజర్ శ్రీ ఉమేష్ గారు రుణాలను మంజూరు చేశారు. దీనికి సంబంధించి ఎస్సీ/బీసీ కార్పొరేషన్ మహబూబ్‌నగర్ అధికారులు సబ్సిడీని విడుదల చేశారు ఈ సంవత్సరం బడ్జెట్‌లో.

గ్రామీణ ప్రజలు తమ పంటలను, ఉత్పత్తులను మార్కెట్‌కు తరలించడానికి కావలసిన రోడ్డును (ఎమ్‌జిఎన్ఆర్ఇజిఎస్) ఇజిఎస్ కార్యక్రమంలో పనులు ప్రారంభించి ముళ్ళకంచెలను తొలగించి, రైతుల రాకపోకలను, పశువులను, బండ్లను, వారి వాహనాలకు అనువైన మార్గాన్ని నిర్మించారు. ఈ నిర్మాణపు పనులతో గ్రామీణ యువతకు, మహిళలకు కరువు పనుల క్రింద పనులు దొరకడం వల్ల అందరు ఆనందంగా వున్నారు.

రాబోయే రోజుల్లో ఈ రోడ్డుకు మరిన్ని నిధులు కేటాయించి దీనిపై మోరంపోసి (3) కల్వర్టులు కట్టి ఉమాపురం నుండి పాతూరుకు చక్కటి రహదారిని నిర్మించాలని ప్రజలు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

ఉమాపురం గ్రామాన్ని వంగూరు పోలీసు అధికారులు దత్తత తీసుకున్నారు. గ్రామాన్ని సందర్శించి మొక్కలు నాటి హరితహారం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ప్రజలతో విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు.

హరితహారం కార్యక్రమానికి, ప్రజల నుండి, మహిళల నుండి కూడ విశేషస్పందన రావడం అందరిని ఆశ్చర్యపరిచింది. నేడు నాటిన మొక్కలే రేపటి వనాలు. మొక్కలు నాటండి – పర్యావరణాన్ని కాపాడండి అంటూ వారు ఇచ్చిన సూచనలు, సలహాలు, అందరిని ఆకట్టుకున్నాయి.

వంట చేయడానికి కట్టెలు లేక, వున్నా వాటి పొగతో సతమతమౌతున్న మా ఊరి మహిళలకు 'దీపం' పథకం క్రింద 90% మందికి గ్యాస్ పొయ్యి, సిలిండర్లు మంజూరు చేయించి వారికి అందించడం జరిగింది.

ఉమాపురం గ్రామాన్ని ఎస్సీ సబ్‌ప్లాన్‌లో ఎంపిక చేయడం





వల్ల రాబోయే రోజుల్లో మరిన్ని సంక్షేమ పథకాలు అంటే డబుల్‌బెడ్‌రూం ఇళ్లు, సిసి రోడ్లు, మెరుగైన నీటి సరఫరా, రవాణా సౌకర్యం, విద్యుత్‌చ్ఛక్తితో వెలిగే వీధిదీపాలు (ఎల్‌ఇడి లైట్), మురుగు కాలువల నిర్మాణం, వాటర్‌ట్యాంక్‌ల నిర్మాణం ఇవన్నీ కావాలని మా గ్రామంలో ఏర్పాటు చేసిన గ్రామసభలో ప్రజాభిప్రాయాన్ని సేకరించి, అధికారుల సూచనలు పాటించి 'గ్రామజ్యోతి' కార్యక్రమంలో ప్రజల అవసరాలకు అనుగుణంగా ప్రణాళికలను తయారు చేసి ప్రభుత్వానికి పంపడం జరిగింది. ఈ ప్రణాళిక మంజూరై అమలు జరిగితే మా గ్రామం 'ఆదర్శగ్రామం' అవుతుందనే నమ్మకంతో మేమంతా ముందుకు సాగుతున్నాం. పుట్టెడంత ఆశతో (గ్రామసభ ఛాయాచిత్రాన్నిపైన పొందుపరచనైనది). 'డిండీ ప్రాజెక్టు" నిర్మాణం వల్ల ముంపుకు గురైన మా గ్రామం అంచెలంచెలుగా ఎదుగుతూ బంగారు తెలంగాణ బాటలో నడుస్తున్నది. దీనిని ఆదుకోమని మేమంతా చేతులు జోడించి, సవినయంగా ప్రార్థిస్తున్నాం ప్రభుత్వాన్ని.

స్వచ్ఛభారత్ కార్యక్రమంలో భాగంగా ప్రజాచైతన్యం వెల్లివిరిసేలా ప్రజల్లో దీని పట్ల అవగాహన పెరిగేలా అనేక కార్యక్రమాలు చేపట్టబడ్డాయి. వీధులు శుభ్రపరిచాం. ముళ్ళపొదలు తొలగించాం. కలుపు మొక్కలను ఏరివేశాం, మేము సైతం అంటూ ప్రతి ఒక్కరూ ఉత్సాహంగా పాల్గొన్నారు ఈ కార్యక్రమంలో. వంగూరు మండల పరిషత్ అధ్యక్షులు శ్రీమతి ఎమ్.భాగ్యలక్ష్మి గారు గ్రామస్తులతో కల్సి వీధులను శుభ్రపరిచారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని అందర్నీ కోరారు.



'స్వచ్ఛపాఠశాల' నినాదంతో ఉమాపూర్ ప్రాథమిక పాఠశాలలోని విద్యార్థినీ విద్యార్థులు పలకాబలపం ప్రక్కనబెట్టి, చీపురుకట్ట చేతులో బట్టి మేము సైతం ఎవరికీ తీసిపోమంటూ స్వచ్ఛత కార్యక్రమాన్ని నిర్వహిస్తుంటే ఎంతో సంతోషమనిపించింది. పిల్లల శ్రద్ధ చూస్తుంటే తల్లిదండ్రులే ఆశ్చర్యపడిపోతున్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీ వెంకటయ్య గారి సూచనలను పాటిస్తూ పాఠశాల ప్రాంగణాన్ని పరిశుభ్రతను కాపాడుతున్నారు బాలబాలికలు.

తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన హరితహారం పుడమితల్లికి పచ్చలహారం. ప్రతిఒక్కరూ మొక్కలు నాటాలన్న మన ముఖ్యమంత్రి శ్రీ కె.చంద్రశేఖర్‌రావు గారి పిలుపుమేరకు మా గ్రామంలో ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేశాం. నేడు నాటిన మొక్కలే రేపటి మానవ మనుగడకు ఆధారమౌతుందన్న అంశాన్ని తెల్సుకున్న ప్రజలు బాగా స్పందించారు. మాచినోన్‌పల్లి, ఉప్పలపహాడ్ నర్సరీల నుండి, మామిడి, వేప, టేకు, కానుగు, దానిమ్మ, చింత మొదలగు అనేక మొక్కలను తెచ్చి గ్రామంలోని అనేక ప్రాంతాలలో పొలం గట్లపైన, రోడ్డుకు ఇరువైపుల నాటడం జరిగింది.

ఇన్ని సంక్షేమ కార్యక్రమాల్ని ప్రజల్లోకి తీసుకెళ్లి వాటిని విజయవంతం చేయడానికి మాతో నిలిచిన మా నాగర్‌కర్నూలు పార్లమెంట్ సభ్యులు శ్రీ నంది ఎల్లయ్య గారు, అచ్చంపేట శాసనసభ్యులు శ్రీ గువ్వల బాల్‌రాజ్ గారు, ఎంపిపి శ్రీమతి ఎమ్.భాగ్యలక్ష్మి గారు, ఎంపిడిఓ శ్రీమతి బి.జయస్నేహ గారు, వివిధ శాఖల అధికార్లు, అందరు ఆదరణీయులే అభినందనీయులే.

ఎన్ని ప్రణాళికలున్నా, ఎన్ని సంక్షేమ కార్యక్రమాలున్నా ఎవరి కోసం వీటిని రూపొందించామో తెల్సుకొని వాటి ఫలాలను, వాటి ఫలితాలను అందుకునే ప్రజా చైతన్యం, ప్రజల భాగస్వామ్యం లేనిదే అవి విజయవంతం కావు. అందువల్ల ప్రచార మాధ్యమాలు, ప్రసారమాధ్యమాలు అంటే పత్రికలు, టివిలు, రేడియోలు (ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా) ఈ అంశాలపై ఇంకా విస్తృత ప్రచారం కల్పించాలి. అప్పుడే మన ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలు ప్రజలకు చేరువై లబ్ధిపొందుతారు, చైతన్యవంతులౌతారు. అందుకేనేనంటాను "ప్రజాచైతన్యం-ప్రగతికి సోపానం" అని.

**- ఎమ్.సుధాకర్‌రావు, సర్పంచ్, ఉమాపూర్**



### చిన్నారులలో

# అయోడిన్ లోపం తగ్గించాలి

తెలంగాణలో చిన్నారుల్లో అయోడిన్ లోపం శాపంగా మారుతోంది. దీర్ఘకాలంగా అయోడిన్ లేని ఉప్పును తీసుకుంటుండడంతో 6–11 ఏళ్ల మధ్య వయసు పిల్లల్లో 3–8 శాతం మంది చిన్నారులు థైరాయిడ్ సమస్యలతో బాధపడుతున్నారు. ముఖ్యంగా మహబూబ్‌నగర్, ఆదిలాబాద్, వరంగల్, ఖమ్మం జిల్లా ఏజెన్సీ ప్రాంతాల్లోని పిల్లల్లో గాయిటర్ (థైరాయిడ్ కారణంగా గొంతు దగ్గర వచ్చే ఉబ్బు) వ్యాధిగ్రస్తులు గణనీయస్థాయిలో ఉండటం ఆందోళన కలిగించే అంశం. తెలంగాణలో 29.71 శాతం ఉప్పు నమూనాల్లో అయోడిన్ లేదని పరీక్షల్లో తేలింది. అయోడిన్ లోపాన్ని నివారించేందుకు కేంద్ర ప్రభుత్వం కొన్నేళ్ల కిందటే ఉప్పు ద్వారా దాన్ని అందించాలని నిర్ణయించి, 'అయోడైజ్‌డ్' ఉప్పును అందుబాటులోకి తీసుకొచ్చింది. అయినా ఇప్పటికీ గ్రామీణంలో... ముఖ్యంగా మారుమూల అటవీ ప్రాంతాల్లో కొన్నిచోట్ల విడిగా బస్తాల్లో లభించే ఉప్పునే ఉపయోగిస్తున్నారు. ఫలితంగా చిన్నారుల్లో అయోడిన్ లోపం వేధిస్తోంది. బాల్యం నుంచే అయోడిన్ ఉప్పు వాడకంపై అవగాహన కల్పించడంతో పాటు.. కుటుంబాల్లో తప్పనిసరిగా వాడే విధంగా చర్యలు తీసుకునేందుకు కేంద్ర ప్రభుత్వం అయోడిన్ లోప రుగ్మతల నివారణ కార్యక్రమాన్ని జాతీయ స్థాయిలో అమలుచేస్తోంది. ఇందులో భాగంగా ఇటీవల తెలంగాణలోని అన్ని జిల్లాల్లో అయోడిన్ లోపాలపై సర్వే నిర్వహించారు.

**మహబూబ్‌నగర్‌లో తీవ్రం**

ఇతర జిల్లాలకంటే ఎక్కువగా... మహబూబ్‌నగర్ జిల్లాలో గాయిటర్ సమస్యతో బాధపడుతున్న చిన్నారులు 8.04 శాతం ఉన్నట్టు తేలింది. ఇందులో గ్రేడ్ 1(చేతితో పరీక్షిస్తే గుర్తించదగినది) గాయిటర్‌తో బాధపడుతున్న చిన్నారులు 4.96 శాతం ఉండగా, గ్రేడ్ 2(దూరం నుంచి కూడా కంటికి కనిపించేది) గాయిటర్‌తో బాధపడుతున్న పిల్లలు 3.07 శాతం ఉండడం గమనార్హం. అటవీ ప్రాంత జిల్లాలైన ఖమ్మం, ఆదిలాబాద్, వరంగల్ జిల్లాల్లో గాయిటర్‌తో బాధపడుతున్న చిన్నారులు 7 శాతానికి పైనే ఉన్నారు. మెదక్‌లో 3.74శాతం, కరీంనగర్‌లో 3.11శాతం, నల్గొండలో 3.01శాతం ఉండగా.. నిజామాబాద్, హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల్లో ఇంకా సర్వే నిర్వహించలేదు. సర్వేలో భాగంగా అయోడైజ్‌డ్ ఉప్పును వాడుతున్నారా? లేదా? అన్నది తెలుసుకునేందుకు ఆయా జిల్లాల్లో నమూనా పరీక్షను నిర్వహించారు. తెలంగాణలోని పూర్వ పది జిల్లాల్లో కలుపుకొని మొత్తం 2050 ఉప్పు నమూనాలను పరీక్షించగా... ఇందులో 609 (29.71శాతం) నమూనాల్లో అయోడిన్ అస్సల్లేదని వెల్లడైంది. 395 (19.27 శాతం) నమూనాల్లో ఉప్పులో ఉండాల్సిన మోతాదు కంటే తక్కువగా అయోడిన్ ఉన్నట్లుగా తేలింది. పాఠశాలల్లో విద్యార్థులను కలుసుకొని.. వారి ఇళ్లలో ఉపయోగిస్తున్న ఉప్పును తీసుకురమ్మని చెప్పి, ఆ ఉప్పు నమూనాలను పరీక్షించగా వెల్లడైన ఫలితాలివి. ఆరోగ్య, ఆహార, పౌరసరఫరా శాఖల అధికారులు గ్రామీణ ప్రాంతాల్లో అయోడైజ్‌డ్ ఉప్పు వాడకంపై అవగాహన కల్పించకపోతే ఆరోగ్య సమస్యలు మరింత తీవ్రమయ్యే ప్రమాదముంది. గర్భిణులకు తగినంత అయోడైజ్‌డ్ ఉప్పును అందిస్తే... దేశంలో ఏటా 10 లక్షల మంది పిల్లల్లో అయోడిన్ లోపంతో మెదడు దెబ్బతినకుండా నివారించగలమని కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ ఇటీవల వెల్లడించింది.

– పిటిఐ

**రోజుకు ఎంత మొత్తంలో అయోడిన్ అవసరం?**

| | |
|---|---|
| 0-5 ఏళ్లలో | 90 మైక్రోగ్రాములు |
| 6-12 ఏళ్లలో | 120 మైక్రోగ్రాములు |
| 13 ఏళ్ల తర్వాత | 150 మైక్రోగ్రాములు |
| గర్భిణీ/పాలిచ్చే తల్లులు | 250 మైక్రోగ్రాములు |

**అయోడిన్ తగ్గితే ఏ సమస్యలొస్తాయి?**

- గాయిటర్
- హైపోథైరాయిడిజం
- మరుగుజ్జుతనం
- మానసిక, శారీరక అభివృద్ధి మాంద్యం

**గర్భిణీల్లో అయితే...**

- గర్భస్రావం
- మృతశిశువు జననం
- గర్భస్థ శిశువు ఎదుగుదల మందగించడం

**ఏప్రిల్-ఆగస్టు 2016లో సేకరించిన ఉప్పు నమూనాల పరీక్ష ఫలితాలు (పూర్వ జిల్లాల గణాంకాలు)**

| జిల్లా | నమూనాలు | అయోడిన్ శూన్య నమూనాలు (శాతం) |
|---|---|---|
| ఆదిలాబాద్ | 200 | 69(34.50) |
| హైదరాబాద్ | 200 | 11(5.50) |
| కరీంనగర్ | 200 | 62(31) |
| ఖమ్మం | 250 | 64(25.60) |
| మహబూబ్‌నగర్ | 200 | 81(40.50) |
| మెదక్ | 150 | 53(35.33) |
| నల్గొండ | 200 | 52(26) |
| నిజామాబాద్ | 200 | 59(29.50) |
| రంగారెడ్డి | 200 | 85(42.50) |
| వరంగల్ | 250 | 73(29.20) |
| **మొత్తం** | **2050** | **609(29.71)** |




**మా**నవ జనాభా పెరిగే కొలది పెరుగుచున్న జనాభా అవసరాల కొరకు అభివృద్ధి పేరుతో సహజ వనరులను పరిమితికి మించి ఉపయోగించడం వలన భూజల వనరుల వాతావరణం కలుషితమయి అనేక పర్యావరణ సమస్యలకు దారితీస్తుంది. దీని కారణంగా భూమి మీద పేదరికం, త్రాగునీటి సమస్య, అంటువ్యాధులు ప్రబలడం లాంటి సామాజిక ఆర్థిక సమస్యలకు దారితీయడమే కాకుండా వనరుల కొరత తీవ్రతరమయి భవిష్యత్ తరాల మనుగడ ప్రశ్నార్థకంగా మారింది. ఈ తరుణంలో భావితరాలను దృష్టిలో పెట్టుకుని అభివృద్ధి ఉండాలని సుస్థిరాభివృద్ధి సూచిస్తుంది. మానవ సంక్షేమాన్ని పెంపొందించుకోవడానికి ఆర్థికాబివృద్ధి ఒక్కటి సరిపోదు. వనరులు వినియోగం పున:కల్పన (×××÷)ల మధ్య సమతుల్యతను ఏర్పర్చి అభివృద్ధి ప్రక్రియను కొనసాగిస్తే సుస్థిర అభివృద్ధి సాధ్యపడుతుంది. కాబట్టి ప్రస్తుత కాలంలో అభివృద్ధి వ్యూహాలు, సమాజం, ఆర్థిక వ్యవస్థ పర్యావరణాలు సామూహిక అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తున్నాయి. అందుకే ప్రస్తుత ప్రజలు కనీస అవసరాలను తీరిస్తూ భవిష్యత్ తరాల వారికి వనరులను మిగిల్చే విధంగా వాటిని వివేకవంతంగా వినియోగించుకోవడం ద్వారా సుస్థిరాభివృద్ధి సాధించవచ్చు.

**సుస్థిరాభివృద్ధిలోని ప్రధాన అంశాలు:**

- వనరులను వాటి పునరుత్పాదక శక్తికి మించి వినియోగించరాదు.
- పునరుత్పత్తి చెందని ఇంధన వనరుల స్థానంలో పునరుత్పత్తి చెందేటువంటి కాలుష్యరహితమైన ఇంధన వనరులను వినియోగించాలి.
- పర్యావరణం విలీనం చేసుకోగలిగిన సామర్థ్యం కంటే ఎక్కువ పరిమాణంలో కాలుష్య పదార్థలను పర్యావరణంలోకి విసర్జించరాదు.
- అభివృద్ధి అనేది ప్రపంచంలోని అన్ని దేశాల్లో అన్ని వర్గాల ప్రజలకు కనీస అవసరాలను తీర్చే విధంగా ఉండాలి.

**సుస్థిరాభివృద్ధి లక్ష్యాలు:**

- అన్ని వర్గాల ప్రజల జీవన ప్రమాణాలను పెంచడం, విద్య, ఆగర్యో ప్రజాజీవనంలో భాగస్వామ్యం, నాణ్యమైన పర్యావరణం సమన్యాయాన్ని పెంపొందించడం, వనరులు అందుబాటులో ఉండే విధంగా ప్రస్తుత అభివృద్ధి విధానాలను తీర్చడం మొదలైన అంశాలు సుస్థిరాభివృద్ధిలో సమ్మిళితం చేయబడతాయి.
- సహజ వనరులను ప్రస్తుత అవసరాలకు ఏ రేటులో వినియోగిస్తామో, అదే రేటులో వాటిని పునరుత్పత్తి చెందడానికి చర్యలు తీసుకోవడం.
- అభివృద్ధి అనేది పర్యావరణానికి హాని కలుగజేయని రీతిలో



ఉండాలి. అనగా ఆర్థికాభివృద్ధి అనేది భావితరాల జీవన ప్రమాణాలను దెబ్బతీయకూడదు.

- కాలుష్యరహితమైన పునరుత్పాదిత చౌకగా లభ్యమైన శక్తి వనరులను వినియోగాన్ని పెంపొందించి అందరికి అందుబాటులో తీసుకురావాలి.
- గ్రామాల్లో, పట్టణాల్లో, నగరాల్లో సుస్థిరమైన పారిశుద్ధ చర్యలు చేపట్టడం.
- సుస్థిరాభివృద్ధికి దోహదపడేలా సముద్ర ఉత్పత్తులు సముద్ర వనరుల పరిరక్షణ చేపట్టాలి.
- అడవులు పరిరక్షణ, ఏడారీకరణ, భూసారం తగ్గుదలను అరికట్టాలి.
- సుస్థిరాభివృద్ధి దిశలో ప్రపంచ భాగస్వాములను ప్రోత్సహించడంతో పాటు సుస్థిరాభివృద్ధి లక్ష్యాలను సమర్థవంతంగా అమలు చేయడం.

**సుస్థిరాభివృద్ధిలోని ప్రాధాన్యత:**

ప్రపంచస్థాయిలో సుస్థిరాభివృద్ధి ప్రాధాన్యతను దృష్టిలో పెట్టుకుని పర్యావరణం పట్ల ప్రజల దృక్పథాల్లో మార్పులు తీసుకురావాలి. అనగా పర్యావరణాన్ని దుర్వినియోగపరచడానికి బదులు పరిరక్షణలో భాగస్వామ్యం అయ్యే విధంగా, అత్యాశకు కాకుండా అవసరాలకు మాత్రమే వనరులను వినియోగించుకునే విధంగా వారి ఆలోచన విధానాల్లో మార్పులు రావాలి. సుస్థిరాభివృద్ధి ఆర్థికాభివృద్ధికి పర్యావరణానికి అనుకూలంగా ఉండే పద్ధతులను నవకల్పనలను ప్రోత్సహిస్తుంది. పర్యావరణానికి గల శోషక సామర్థ్యాన్ని దృష్టిలో ఉంచుకుని ఆర్థిక కార్యకలాపాలను పరిమితులను విధిస్తుంది. సుస్థిరాభివృద్ధి పరిపాలనాపరమైన ప్రభుత్వ పాత్రను విస్తరింపజేస్తుంది. వనరుల సంరక్షణను ప్రోత్సహిస్తుంది. జీవవైవిధ్య పరిరక్షణను చేపడుతుంది.

**సుస్థిరాభివృద్ధి – పర్యావరణ అనుకూల అభివృద్ధి విధానాలు:**

నూతన పర్యావరణ అనుకూల అభివృద్ధి విధానాలను ఆయా రంగాల్లో అనుసరించడం ద్వారా సుస్థిరాభివృద్ధిని సులభంగా సాధించవచ్చు.

**1. సేంద్రియ వ్యవసాయం:**

వ్యవసాయ పంటకు మరియు పశుసంపదకు సంబంధించి ఉత్పత్తి ఉత్పాదకతలను పెంపొందించడానికి ఉపయోగించే రసాయనిక పురుగు మందులు, ఎరువులు జన్యుమార్పిడి జీవులవృద్ధి హార్మోన్ల స్థానంలో, పర్యావరణ అనుకూలమైన జీవ ఎరువులను వినియోగిస్తు చేపట్టే వ్యవసాయ విధానమే సేంద్రియ వ్యవసాయం.

**2. జీవ ఎరువులు:**

భూసారాన్ని ప్రకృతిపరంగా అభివృద్ధి చేసే సూక్ష్మజీవులను లేదా వాటి మిశ్రమాన్ని జీవ ఎరువులు అంటారు. కొన్ని రకాలైన సూక్ష్మజీవులు మొక్కల్లో సహజీవనం చేస్తూ పంటలకు కావలసిన వివిధ పోషకాలను అందజేస్తాయి. ఫలితంగా పర్యావరణ పరిరక్షణలో కీలకపాత్ర వహిస్తాయి.



**3. జీవక్రియ సంహారకాలు:**

పంట మొక్కలను నష్టపరిచే తెగుళ్ళను, క్రిమికీటకాలను, మరియు క్రిమికారక డింభకాలను అరికట్టేందుకు వినియోగించే మొక్కలు, జంతువులు, సూక్ష్మజీవులు మొదలైన ప్రకృతి పరమైన జీవరాశులను లేదా వాటి నుండి తీసే ఉత్పనాలని జీవక్రిమిసంహారకాలు. వీటి ద్వారా పంటలకు పట్టే వివిధ రకాల చీడ నివారణలకు ఉపయోగపడుతూ సస్యపరిరక్షణను పెంపొందిస్తాయి.

**4. వాటర్‌షెడ్ నిర్వహణ:**

ఒక భౌగోళిక ప్రాంతంలో అందుబాటులో ఉన్నటువంటి ప్రతి ఒక్క నీటి బొట్టును కూడా వృధా కాకుండా వినియోగంలోకి తీసుకురావచ్చు ఈ పద్ధతి ద్వారా.

**5. పునరుత్పత్తి చెందే ఇంధన వనరుల వాడకం:**

జనాభా పెరిగే కొలది అభివృద్ధి కార్యక్రమాలు వేగవంతం కావడం వల్ల ఇంధన డిమాండులు రోజురోజుకు పెరిగిపోతున్నాయి. ఈ పరిస్థితిని అధిగమించడానికి పరిమితంగా ఉన్న కాలుష్యసహితమైన సాంప్రదాయ ఇంధన వనరుల స్థానంలో పునరుత్పత్తి చెందే (బొగ్గు, పెట్రోలియం మొదలగునవి). పునరుత్పత్తి చెందే కాలుష్యరహితమైన ఇంధన వనరుల ఉత్పత్తి వినియోగాన్ని పెంపొందించడం ద్వారా సుస్థిరాభివృద్ధిని సాధించవచ్చు.

**6. జీవ ఇంధనాలు వాడకం:**

భారతదేశం ప్రధానంగా వ్యవసాయ దేశం కావడం వల్ల ప్రపంచంలో అత్యధికంగా పశుసంపదను కలిగి ఉండడం వల్ల జీవ ఇంధనాలు అయినటువంటి బయోగ్యాస్, బయోఇథనాల్, బయో హైడ్రోజన్ గ్యాస్, బయోబ్యూటినాల్, బయోడిజిల్ మొదలగు జీవ ఇంధనాలకు ముడిపదార్థాలు సమృద్ధిగా లభ్యమౌతున్నాయి. అయితే ఈ జీవ ఇంధనాలు ద్వారా కొన్ని నష్టాలు కూడా లేకపోలేదు.

**7. హరితనగరాలు:**

పునరుద్ధరించదగిన కార్బన రహితమైన శక్తి వనరులను వినియోగించడం ద్వారా పర్యావరణహితమైన పట్టణాభివృద్ధి ప్రణాళికల ద్వారా అభివృద్ధి పరిచిన నగరాలే హరిత నగరాలు.

**8. సాంప్రదాయంతో ఇంధన వనరులు:**

ఇటీవల కాలంలో మానవులచే అభివృద్ధి పరిచబడినవి పునరుత్పత్తి సామర్థ్యాన్ని కలిగి ఉండేవి. కాలుష్యరహితమైనవి అవి జలవిద్యుత్, సౌరవిద్యుత్, పవనవిద్యుత్, తరంగ శక్తి, ఓషన్ థర్మల్ ఎనర్జీ కాన్వెర్షన్, భూతాప విద్యుత్, బయోగ్యాస్, బయోమన్, మైక్రోజలవిద్యుత్, హైడ్రోజన్ ఎనర్జీ మొదలగునవి.

ఈ విధంగా ప్రస్తుత ప్రజలు అవసరాలను తీర్చుకుంటూ భవిష్యత్ తరాల వారికి వనరుల్ని మిగిల్చే విధంగా వివేకవంతంగా వినియోగించుకోవడం ద్వారా సుస్థిరాభివృద్ధి సాధించవచ్చు.

**– సి. హెచ్. రేణుక**





# కాలుష్యంతో సతమతమౌతున్న బాల్యం

**30 కోట్ల మందికి అత్యంత విషపూరిత వాయువే శరణ్యం**
**భారత్ సహా దక్షిణాసియాలో 62 కోట్ల మందిపై ఎఫెక్ట్**
**ఏటా ఐదేండ్లలోపు బాలలు ఆరు లక్షల మంది మృతి**
**వాయు కాలుష్యంతో అధ్వాన్నంగా ఢిల్లీ**
**భావి పౌరుల రక్షణకు తక్షణం కాలుష్యాన్ని నియంత్రించాలి**
**ప్రపంచ దేశాలకు యూనిసెఫ్ పిలుపు**

ప్రపంచవ్యాప్తంగా 30 కోట్ల మంది బాలలు అత్యంత విషపూరితమైన వాయువులు పీలుస్తున్నారు. అంతర్జాతీయ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌వో) మార్గదర్శకాల కంటే ఆరు రెట్లు ఎక్కువగా విషపూరితమైన గాలిని పీలుస్తున్నారని యునిసెఫ్ పేర్కొంది. భారత్ సహా దక్షిణాసియా దేశాల్లోనే 22 కోట్ల మంది బాలలు ఉన్నారు. భారత్‌లోని ఉత్తరాది రాష్ట్రాల బాలలే ఎక్కువగా విషపూరిత వాయువులు పీలుస్తున్నారు. దీనివల్ల ప్రతియేటా ఐదేండ్లలోపు బాలలు ఆరు లక్షల మంది మృతి చెందుతున్నారని యూనిసెఫ్ ఆందోళన వ్యక్తం చేసింది. బాలల కోసం స్వచ్ఛమైన గాలి అనే పేరుతో అధ్యయనం జరిపిన యునిసెఫ్ నవంబర్ ఏడో తేదీ నుంచి 18 వరకు మొరోకోలోని మరాకేశ్ నగరంలో వాతావరణ మార్పులపై అంతర్జాతీయ సదస్సు జరుగనున్న నేపథ్యంలో ఈ నివేదికను వెల్లడించింది. బాలల క్షేమంతోపాటు వారి హక్కుల పరిరక్షణకు ప్రోత్సాహం కల్పించాలని, ప్రపంచదేశాల అధినేతలు వాయు కాలుష్య కారకాల నియంత్రణకు తక్షణం చర్యలు తీసుకోవాలని పేర్కొంది. వాయు కాలుష్యం ప్రతిరోజూ లక్షల మంది బాలల జీవితాలకు ముప్పుగా పరిణమించిందని యునిసెఫ్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఆంథోనీ లేక్ వ్యాఖ్యానించారు.

**నివేదిక ముఖ్యాంశాలు:**

- ఔట్ డోర్, ఇన్‌డోర్ కాలుష్య ప్రభావంతో పిల్లల్లో అభివృద్ధి చెందుతున్న మెదడుతోపాటు అవయవాలు భౌతికంగా దెబ్బ తింటున్నాయి. ఈ పరిణామం శిశు పరిణామాలకు దారి తీస్తున్నది. వాహనాలు వదులుతున్న ఉద్గారాలు, శిలాజ ఇంధనం, దూళి, వ్యర్థాల దగ్ధం తదితర ఎయిర్‌బోర్న్ కాలుష్య కారకాల వల్లే వాయువులు విషపూరితం. ప్రపంచవ్యాప్తంగా ఏడుగురు బాలల్లో ఒకరు పీలుస్తున్న గాలి అంతర్జాతీయ మార్గదర్శకాలకంటే ఆరు రెట్లు మలిన పూరితం. దక్షిణాసియాలో 62 కోట్ల మంది, ఆఫ్రికా ఖండ దేశాల్లో 52 కోట్లు, తూర్పు ఆసియా, పసిఫిక్ ప్రాంతాల పరిధిలో 45 కోట్ల మంది బాలలు కాలుష్య కారక వాతావరణంలో జీవిస్తున్నారు.
- ఇన్‌డోర్, ఔట్‌డోర్ వాయు కాలుష్యంతో ఆఫ్రికా, ఆసియా ఖండ దేశాల్లోనే బాలలు ఎక్కువగా మరణిస్తున్నారు. ఐదేండ్లలోపు వయస్సు బాలల్లో పది మందికొకరు మృతి చెందుతున్నారు. న్యుమోనియా తదితర శ్వాసకోశ వ్యాధులతో బాధపడుతున్నారు. దీనివల్ల పెద్దలకంటే అప్పుడప్పుడే ఎదుగుతున్న బాలల ఊపిరితిత్తులు, మెదడు, రోగ నిరోధక వ్యవస్థలపైనే ప్రభావం చూపుతున్నది. దారిద్ర్యంలో మగ్గుతున్న బాలల పరిస్థితి అత్యంత దుర్భరం. వైద్య సేవలు అందక అత్యధికంగా అనారోగ్యానికి గురయ్యేది వారే. అత్యల్ప ఆదాయ, మధ్యతరగతి ఆదాయ కుటుంబాలు గల దేశాల్లో బాలలపై వాయు కాలుష్యం ప్రభావం అధికం.

**కాలుష్య కారక సిటీల్లో ఢిల్లీ టాప్**

- ప్రపంచ వ్యాప్తంగా వాయు కాలుష్యంతో అత్యధికంగా దెబ్బ తిన్న నగరాల్లో దేశ రాజధాని న్యూఢిల్లీ మొదటి స్థానంలో ఉంటుంది. దీపావళి పండుగకు ముందు కూడా ఢిల్లీలోని పలు ప్రాంతాల్లో కాలుష్యం ప్రభావంతో సన్నని పొర ఏర్పడింది. ఈ పొర పరిమాణం క్యూబిక్ మీటర్‌కు 300 మిల్లీ గ్రాముల పైనే. ఇది ప్రమాదకరమైన పీఎం 2.5 కంటే ఎక్కువే. ఈ నేపథ్యంలోనే సోమవారం ఢిల్లీ వాసులు ఇండ్ల నుంచి బయటకు రావద్దని హెచ్చరికలు జారీ అయ్యాయి. 60 శాతానికి పైగా భారతీయులు.. సహారా ఏడారి ప్రాంతంలోని 19 దేశాలకు 18 దేశాల్లో 95 శాతం మంది జనాభా వంటింటి అవసరాలకు ఘన వ్యర్థాలే (బొగ్గు, కలప) వినియోగిస్తున్నారు. ఇన్‌డోర్ కాలుష్యంతో భారత్‌లో 2012లో లక్ష మందికిపైగా బాలలు మృతి చెందారు.

– పిటిఐ



### శ్రీ వరి విధానాన్నే పాటిస్తున్నా...

మూడు, నాలుగేండ్లుగా శ్రీ వరి విధానాన్నే పాటిస్తున్నా. నాకు ఉన్న భూమిలో రెండు ఎకరాల్లో ఐఆర్-64, 1010 రకం విత్తనాలతో పంట సాగు చేస్తున్నా. మామూలు పంట కన్నా, 20 క్వింటాళ్ళ దిగుబడి వస్తున్నది. ఈ విధా నం తెలిసినప్పటి నుంచి శ్రీ వరి విధానాన్నే పాటిస్తున్నా. వ్యవసాయాధికారులు కూడా ఎప్పటికప్పుడు సూచనలు ఇస్తూ, కొత్తగా అమలు చేసేందుకు ఇతర ప్రాంతాల రైతుల ను కూడా నా పొలం వద్ద సూచనలిస్తున్నారు.

**- కట్కూరి రామచంద్రం-దుబ్బాక రైతు**

### ఆరుతడి పంటగానే భావించొచ్చు

వరి పంటపై ఆసక్తి చూపే రైతులు శ్రీ వరి సాగు చేసుకోవడం ద్వారా దీన్ని ఆరుతడి పంటగానే భావించవచ్చు. నీరు లేక ఇబ్బంది పడుతున్నామన్న బాధ తప్పుతుంది. ప్రభుత్వ ప్రోత్సాహం కూడా ఆరుతడి పంటల విధానానికి అనుకూలంగా ఉంటుం ది. ఎక్కడ రైతులకు అవగాహనా సమావేశాలు నిర్వహించినా, శ్రీ వరి సాగు విధానంపై సూచనలు ఇస్తున్నాం.

**- బి. మల్లేశం, వ్యవసాయాధికారి-దుబ్బాక**

# సిరుల 'శ్రీవరి'

కొంచెం మెళకువలు పాటించి, సాగు విధానంపై శ్రద్ధ చూపిస్తే శ్రీవరి ద్వారా అధిక లాభాలను పొంద వచ్చు. కొన్నేళ్ల నుంచే ఈవిధానాన్ని విదేశాల్లో పాటిస్తుండగా క్రమంగా రాష్ట్రం లోనూ ఈ విధానాన్ని పాటిస్తున్నారు. మొదట్లో ప్రయోగాత్మక పద్ధతిన సాగులోకి వచ్చిన వరి పంటలో నవీన పద్ధతిని శ్రీవరి విధానంగా పేర్కొంటారు. రెండుమూడేళ్లుగా దుబ్బాక ప్రాంతంలో శ్రీవరి సాగు చేస్తూ అధిక దిగుబడిని సాధిస్తున్నారు. తక్కువ పెట్టుబడి, తక్కువ నీరుతో సాగు చేసుకోగలిగే ఈ విధానాన్ని పాటిస్తే రైతన్న ఇంట సిరులు కురుస్తాయంటున్నారు వ్యవసాయశాఖాధికారులు.

మామూలు పద్ధతిలో వరి పంట సాగు చేసే విధానంలో ఎక్కువగా శ్రమపడాల్సి ఉంటుంది. సాధారణ పద్ధతిలో వరి పంట సాగు చేసేందుకు ప్రతి మడిలో ఎప్పటికీ నీరు నిల్వ ఉండాలి. నారు కోసం ఒక ఎకరాకు 25 కిలోల వరకు వరి విత్తనాలు అవసరం. దిగుబడి కూడా ఎకరాకు 30 క్వింటాళ్ళ వరకు దిగుబడి వస్తుంది. కానీ శ్రీవరి విధానంలో ఎకరాకు కేవలం 2 కిలోల విత్తనాలే అవసరం అవుతాయి. ప్రత్యేక రకమైన విత్తనాలేవీ లేకుండా, మామూలుగా నేలల రకాలను బట్టి, సాధారణంగా వాడుకలో ఉన్న విత్తనాలే వాడుకోవచ్చు. 8-12 రోజుల వ్యవధి ఉన్న వరి నారును మొక్కకు మొక్కకు మధ్య అడుగు దూరం ఉండేలా చూసుకోవాలి. కేవలం రెండు ఆకుల నారునే నాటడం వల్ల నారు ఏపుగా పెరిగి, ఎక్కువ సంఖ్యలో పిలకలు వస్తాయి. నారు మడి నుంచి మొక్కలను వేరు, బురదతో సహా తీసి, మడిలో పైపైనే నాటాలి. సాధారణ వరిని నాటినట్లు లోతుగా నాటకూడదు. దీంతో మొక్క బాగా ఏపు గా పెరిగి, అధిక సంఖ్యలో పిలకలు వేసే అవకాశం ఉంటుంది.

మొక్కలు నాటిన పది రోజులకు కలుపు మొక్కలు తీసేందుకు వీడర్‌ను ఉపయోగిస్తే కలుపు మొక్కలు మురిగిపోయి, ఎరువుగా మారుతాయి. ఈ పద్ధతి వల్ల హెక్టారుకు ఒక టన్ను వరకు పచ్చి రొట్ట సహజంగానే భూమికి చేరుతుంది. వీడర్ వాడకం వల్ల వరి మొలకలకు ఆక్సిజన్ బాగా అంది, సూక్ష్మజీవులు వృద్ధి చెంది, నత్రజనిని నిలకడగా ఉంచుతుంది. ఒక పంట కాలంలో రెండు కన్నా ఎక్కువ సార్లు వీడర్‌ను ఉపయోగించడం వల్ల పంట దిగుబడి బాగా పెరుగుతుంది. నీరు వినియోగం విషయంలోనూ జాగ్రత్తలు పాటించాలి. పొలం తడిగా ఉండాలి గానీ, పొలంలో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలి. నీరు ఎక్కువైతే ఒక్కో మడిలో ప్రతి రెండు మీటర్ల దూరంలో ఒక కాలువను తీసుకోవాలి. దీంతో ఎక్కువైన నీరు బయటకు వెళ్ళిపోయే అవకాశం ఉంటుంది. మధ్యలో తడి ఆరినప్పుడు నీరు పెట్టాలి. ఎరువుల వాడకం విషయంలోనూ కొద్దిపాటి జాగ్రత్తలు పాటించాలి. ప్రస్తుతానికి రసాయన ఎరువులు వాడినా భవిష్యత్తులో సేంద్రియ ఎరువులు వాడే విధానాన్ని అమలు చేసుకోవాలి. ప్రస్తుతం ఈ ప్రాంతంలో శ్రీవరి సాగు చేస్తున్న రైతులు 1010 రకం, ఐఆర్-64 రకం విత్తనాలు వాడుతున్నారు. ఈ రకం విత్తనాలు సాధారణ పద్ధతిలో వరి పంట సాగు చేసే రైతులు వినియోగిస్తున్నారు. తక్కువ శ్రమ, తక్కువ పెట్టుబడితో పాటు, చీడ పీడల బెడద లేకుండా అధిక దిగుబడి సాధించే వీలున్న శ్రీవరి సాగు ద్వారా ఎక్కువ ఆదాయాన్ని పొందాలని వ్యవసాయ శాఖాధికారులు సూచిస్తున్నారు.

**- శివకుమార్, దుబ్బాక**

# కేరళలోని 'కొల్లం' జిల్లాలో స్థానిక ప్రణాళిక

కేరళ రాష్ట్ర ప్రణాళికా సంఘం ఆధ్వర్యంలో ఒక ప్రాజెక్టులో భాగంగా స్థానిక అంశాలకు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తూ స్థానిక అభివృద్ధి ప్రణాళికను, సమగ్ర జిల్లా అభివృద్ధి ప్రణాళిక తయారీని ప్రారంభించింది. ప్రణాళికా వికేంద్రీకరణ పక్రియలో 'స్థానిక ప్రణాళిక అంశాన్ని' ప్రవేశపెట్టడం ద్వారా పంచాయతీల నుండి పురపాలక సంఘాల వరకు అభివృద్ధి ప్రణాళికలను రూపొందించడంలో ఇప్పటికే అమలులో వున్న సువ్యవస్థిత ప్రక్రియను మరింత మెరుగు పరచడమే ఈ ప్రాజెక్టు లక్ష్యం. పరిస్థితి అంచనాకు సమాచార (దత్తాంశాల) గణాంకాల సేకరణ, దార్శనిక వృత్తం తయారీ కసరత్తు, పంచాయతీలు, జిల్లా ప్రణాళికా కమిటీలో విధాన నిర్ణయాలు తీసుకునే వారికి సమాచారం అందించడం, అంతిమంగా ప్రణాళికను తయారుచేయడంలో తోడ్పాటునందించడం. ఇలా ప్రణాళికా ప్రక్రియ ప్రతి అంశంలోనూ 'స్థానిక అంశాన్ని' చేర్చి సత్ఫలితాలు సాధించడం ఈ ప్రాజెక్టు ప్రధానోద్దేశ్యం. ఆయా స్థానిక ప్రాంతాల వారీగా సమాచారాన్ని సేకరించి, సమర్పించడం వల్ల తగిన భూమి వినియోగ ప్రణాళిక దిశగా ప్రజలలో ఆలోచనలను ప్రోత్సహించడానికి వారిని పురికొల్పడానికి ఈ కసరత్తు తోడ్పడుతుంది. అదే ప్రాజెక్టు లక్ష్యం. ఈ ప్రాజెక్టు భౌగోళిక సమాచార వ్యవస్థ (GIS) సాంకేతిక నైపుణ్యాన్ని వినియోగించుకుని ఉపగ్రహాల ద్వారా తీసిన భౌగోళిక ఛాయా చిత్రాలను, భూమి లెక్కల సమాచారాన్ని, పట్టిక రూపంలోని ఆర్థిక, సామాజిక సర్వే సమాచారాన్ని(Data) తీసుకుని స్థానిక ప్రణాళికల తయారీకి, వాటి సమర్పణకు ఉపయోగించుకుంటుంది.

ప్రాథమిక రంగం నుండి ఆరోగ్యం, విద్య వంటి మౌలిక సేవలు, నీటిసరఫరా, దారిద్ర్యనిర్మూలన, గ్రామీణాభివృద్ధి, మౌలిక సదుపాయాలు (రోడ్లు, వంతెనలు, ఇళ్ళు), అడవులు, పర్యావరణం, గనులు, భూగర్భవనరులు, సాంఘిక సంక్షేమం, మహిళా, శిశు అభివృద్ధి, విద్యుత్ టెలీకమ్యూనికేషను, వినోదపర్యటన, సంస్కృతి, క్రీడలు, యువజన వ్యవహారాల వంటి 18 అభివృద్ధి రంగాల గురించి రంగాల వారీగా క్షుణ్ణమైన విశ్లేషణ జరిగింది. వీటిలో ప్రతి రంగంలో సమస్యలను, పరిష్కార చర్యలు రెండింటినీ నిర్దిష్ట వివరాలతో గుర్తించారు. అదేవిధంగా పూర్తి చేసిన ప్రాజెక్టులు / కార్యక్రమాలను గురించి ఆయా స్థానిక ప్రాంతాలకు నిర్దిష్టరీతిలో విశ్లేషణ జరిపి సూచనలు తీసుకున్నారు. మానవ వనరుల అభివృద్ధి, ఆర్థిక వనరుల లభ్యతను కూడా ఈ కసరత్తులో చేర్చి వాటిని స్థానిక ప్రాంతాల వారీగా సమర్పించారు. ఆ విధంగా ప్రణాళికా వికేంద్రీకరణ, ప్రక్రియ, ప్రజాభాగస్వామ్య ప్రణాళిక ప్రతిదశలోనూ మొత్తం అభివృద్ధిపై సూచనలు, సలహాలు ఇవ్వవలసిందిగాను తగిన చోట్ల నిర్ణయాలు కూడా తీసుకోవలసిందిగా ప్రజలను ప్రోత్సహించి అందుకు పురికొల్పడం జరిగింది. అందువల్ల జిల్లా ప్రణాళికా కమిటీ సూచనలు-పరిష్కారాలతో ప్రజా భాగస్వామ్య ప్రక్రియలో స్థానిక నిర్ణయాలకు కూడా చోటు లభించింది.

దరమిలా 'కొల్లం' సమగ్ర అభివృద్ధి ప్రణాళిక ప్రస్తుతం దీర్ఘకాలిక సమస్యలతో వ్యవహరించే 15-20 ఏళ్ళ దార్శనిక ప్రణాళికగా వుంది. నివాసాల ఏర్పాటు రీతులు, పల్లెలు -పట్టణాలనే తేడాలు లేకుండా సమగ్రాభివృద్ధికి జిల్లాస్థాయి విధానాలు అందులో చేరివున్నాయి. లభించే వనరులను గరిష్టంగా ఉపయోగించుకోవడానికై అమలు చేయవలసిన ఉత్తమ స్థానిక వ్యూహం, నీటి యాజమాన్యం, ఇంధనం, రవాణావ్యవస్థ, వినోదపర్యటన వంటి రంగాలకు వర్తించే ప్రాంతీయ మౌలిక సదుపాయాలను వినియోగించుకోవడానికి దీర్ఘకాలిక దృక్పథం వంటివి ఈ సమగ్ర ప్రణాళికలో అంతర్భాగం. ఈ దార్శనిక ప్రణాళిక నుండి వాస్తవంగా అమలు చేయవలసిన ప్రణాళికను తీసుకుని అమలు చేశారు. పర్యవేక్షించారు. స్థానిక ప్రభుత్వాలు, జిల్లా ప్రణాళికా కమిటీలోని విధాన నిర్దేతలు, ఇతర భాగస్వాములు ఇప్పుడిప్పుడే ఊపందుకుంటున్న స్థానిక ప్రణాళికా సదవకాశాన్ని పరిశీలించి నిర్ణయాలు తీసుకోవడానికి ఈ ప్రాజెక్టు అవకాశం కల్పించింది. కొల్లం అనుభవం, ముఖ్యంగా ఆ జిల్లా ప్రణాళిక రూపొందించిన పద్ధతులను సులువుగా ఇతర జిల్లాలలో మరింత మెరుగ్గా అమలుచేయవచ్చు.

## ఎంజిఎన్‌ఆర్‌ఇజిఎస్ పథకం క్రింద ఇందిర జలప్రభ ద్వారా లబ్ధిపొందిన

# గిరిజన తెగల విజయగాధలు

మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం క్రింద ఇందిర జలప్రభ ద్వారా పేద గిరిజన కుటుంబాలు తమ ఆర్థికస్థితిని మెరుగుపరచుకొన్నారు. వీరి యొక్క ముందు పరిస్థితి దయనీయంగా ఉండేది. తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న నరెగా పథకాలను ఉపయోగించుకొని తమ ఆర్థికస్థితిని మెరుగుపరచుకొని వారి కుటుంబం అప్పులబారి నుండి బయటపడ్డారు. వారి పిల్లలను ఆదాయం పెరుగుట వలన పాఠశాలలకు పంపుట ద్వారా విద్యాబుద్ధులతో పాటు, భవిష్యత్తుకు మంచిబాటను ఏర్పరచుకొనుట జరిగింది.

వారి విజయగాధలను ఇంకొందరికి మాదిరిగా ఉపయోగపడే విధంగా ఉన్నాయి. అదే రీతిలో మిగతా కుటుంబాలు వారు లాగే ప్రభుత్వ పథకాలను ఉపయోగించుకొని జీవనోపాదులను మెరుగుపరచుకొనవచ్చును. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఉద్దేశ్యాల మేరకు బంగారు తెలంగాణ బాటలో నడువాలని ఆశిద్దాం. వారి విజయగాధలు...

సిర్పూర్-యు మండలంలోని మామిడిపల్లి గ్రామపంచాయతీ పిక్లతాండ గ్రామానికి చెందిన బొడ టాక్రు, బోడ తిరుపతి మరియు బానోత్ ఉత్తం అనే ముగ్గురు గిరిజన రైతులకు 2014-15 సంవత్సరంలో ఇందిర జలప్రభ పథకం క్రింద బోరుబావి మంజూరైంది.



చింతకొరి బ్లాక్ క్రింద 12.70 ఎకరాలలో మంజూరైన బోరుబావికి విద్యుత్, మరియు మోటారు సౌకర్యం కల్పించడమైనది. ఈ రైతులకు చెందిన భూములు పూర్తిగా వర్షదారంపై ఆధారపడి వ్యవసాయం చేసుకొనే వారు. కొన్నిసార్లు వర్షభావ పరిస్థితుల కారణంగా పంటలు పండక అప్పులపాలయ్యేవారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఇందిర జలప్రభ పథకంను వ్యవసాయంలో సద్వినియోగం చేసుకుంటున్నారు. ఇందిర జలప్రభలో వేసిన బోరుల్లో పుష్కలంగా నీరు ఉండటంతో రైతులు సంవత్సరానికి రెండు పంటలు పండిస్తున్నారు.

మాకు మంజూరయిన మోటారును సరైన సమయంలో ఇవ్వడం ద్వారా మా యొక్క పంట అధిక దిగుబడిని తీయడం జరిగిందని రైతులు సంతోషం వెలుబుచ్చినారు.

ఉట్నూర్ మండలంలోని లక్కారం గ్రామపంచాయతీ పెద్దసుద్దగూడ గ్రామానికి చెందిన తొడ్సం బీర్శావ్, ఆత్రం తెలంగ్‌రావు మరియు పెద్మ విశ్వనాథ్ అనే ముగ్గురు గిరిజన రైతులకు 2012-13 సంవత్సరంలో ఇందిర జలప్రభ పథకం క్రింద బోరుబావి మంజూరైనది.



జంగుబాయి బ్లాక్ క్రింద 10.24 ఎకరాలలో మంజూరైన బోరుబావికి విద్యుత్, మరియు మోటారు సౌకర్యం కల్పించడమైనది. ఈ రైతులకు చెందిన భూములు పూర్తిగా వర్షధారంపై ఆధారపడి వ్యవసాయం చేసుకొనే వారు కొన్ని సార్లు వర్షభావ పరిస్థితుల కారణంగా పంటలు పండక అప్పులపాలయ్యేవారు. ఉపాధి కోసం వలసబాట పట్టేవారు ఇదంత గతం. ప్రస్తుతం వారి జీవన విధానం వ్యవసాయం చేయడంలో అనుహ్య మార్పు వచ్చింది. వారి భూములను సస్యశామలం చెయ్యాలని సదాశయంలో ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఇందిర జలప్రభ పథకంను వ్యవసాయంలో సద్వినియోగం చేసుకుంటున్నారు. ఇందిర జలప్రభలో వేసిన బోరుల్లో పుష్కలంగా నీరు ఉండటంతో రైతులు సంవత్సరానికి గాను మూడు పంటలు పండిస్తున్నారు. మరియు లాభాలతో పయనిస్తున్నారు. పత్తితో పాటు వాణిజ్య పంటలు మరియు ఆహార పంటలు జొన్న, మొక్కజొన్న మరియు పలు రకాల కూరగాయలు పండిస్తున్నారు. పంటలతో వచ్చిన ఆదాయంతో అప్పులు తీసుకోకుండానే స్వయంగా పెట్టుబడులు పెట్టి కూతురి యొక్క వివాహం చేయడం జరిగిందని ఆనందంతో రైతులు తెలియపర్చడం జరిగింది.

### జలప్రభతో ఉల్లిసాగు

ఆదిలాబాద్ జిల్లాలోని సిర్పూర్ (టి) మండల కేంద్రం నుండి 22 కి.మీ. దూరంలో దబ్బా గ్రామపంచాయతీ ఆడపల్లి బ్లాక్‌కు చెందిన లబ్ధిదారులు ఆలం లస్మక్క 3 ఎకరాలు, కుమురం హంస 2 ఎకరాలు, ఆలం మల్లేష్ 3 ఎకరాలు, నాయిని మరాలు 2.50 ఎకరాలు. ఈ బ్లాకు దబ్బా నుండి ఆదేపల్లి వెళ్లే రహదారికి మధ్య రొడ్డుకు ఇరువైపుల గల ఈ భూములు ఎస్టీ తెగకు చెందినవారే.



















వీరికి పంటలు పండించడానికి ఆర్థికంగా వెనుకబడుట వలన ఇతరులకు కౌలుకు ఇచ్చి వేరే ప్రాంతాలకు వలసవెళ్లి జీవనం సాగిస్తుండేవారు. ఇందిర జలప్రభ ద్వారా బోరు వేయడం జరిగింది.

ఇప్పుడు ఇట్టి బోరు నీటిని ఉపయోగించుకుని కౌలుకి ఇవ్వడం మరియు కూలీకి వెళ్లడం మానేసి, ప్రస్తుతం మేమే మా స్వంత భూమి యందు కష్టపడి ఇంకా 2, 3 కుటుంబాలకు ఉపాధిని కల్పించే స్తోమత మాకున్నదని మాకు తోడుగా మార్చిన పథకము కళలో కూడా రాని ఈ బ్రతుకు నిజజీవితంలో అనుభవిస్తున్నందుకు చాలా సంతోషంను వెల్లిబుచ్చుతున్న లబ్ధిదారులు, పొట్ట చేత బట్టి పొరుగు ప్రాంతాలకు వెళ్లి తమ పొట్టలు నింపుకునే మాకు "ఇందిర జలప్రభ" ద్వారా మేము సహితం మా స్వంత కష్టంగా మా బ్రతుకు బ్రతుకుతూ ఇతరులకు బ్రతికే అవకాశాన్ని కల్పిస్తామన్న విశ్వాసము కల్గియున్నామని వారి జీవన ప్రయాణం గురించి చెబుతూ... బోరు లేనప్పటి మా స్థితిని చూసి, ఇప్పటి స్థితిని చూసి, మేము వేసిన పంటలను... మేమే కళయా, నిజామా.... అని ఆశ్చర్యచికిత్సలము అవుతున్నాం. బోరువేసిన రెండవ సంవత్సరం నుండి మా యొక్క జీవన విధానంలో చాలా మార్పులు వచ్చాయి. రెండవ పంటగా కూరగాయలు మిర్చి, టమాట, మొదటి పంటగా కందులు, పత్తి లాంటివి వేసి ఆర్థికంగా బలోపేతం కావడం జరిగింది. ఈ సంవత్సరము ఆకాశాన్ని అంటిన ఉల్లిధరను చూసి నిత్యవసర సరుకుగా వున్న ఉల్లిపాయలను 2 ఎకరాలు వేయడం జరిగింది. అదే విధంగా కోతిమీర 0.50 ఎకరా, టమాట 0.5 ఎకరా వేసి మొత్తానికి గ్రామంలో కావలసిన నిత్యవసర సరుకులను మేమే కొంత వరకైన అందించి గ్రామాదాయమును పొరుగు ప్రాంతాలకు వెళ్లకుండా దినదినాభివృద్ధి చెందుతామని మా ఆశా, కోరిక.

గుగ్లావత్ శేఖర్ ఒక సాధారణ కుటుంబానికి చెందిన వాడు. వృత్తిరీత్యా కూలీ పని సాగించేవారు. తనకున్నటువంటి రెండు ఎకరాల





20 గుంటల భూమి ఎా ద ల తో , ఎత్తుపల్లాలతో కూడి ఉండేది. ఆ భూమిని సాగుచేయలేని పరిస్థితి ఆ కుటుంబానిది. మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నేనున్నాను నీకు అండగా అని ఆ కుటుంబానికి ఉపాధి కల్పించింది. ఉపాధి హామీ పథకంలో భార్యభర్తలు ఇరువులు చేరి జై అంబే శ్రమ శక్తి సంఘం ఏర్పరచుకొన్నారు. ఈ సంఘం నందు శేఖర్ మేట్‌గా వ్యవహరిస్తున్నారు.

2011-12 సం॥లో తనకున్నటువంటి పొదలతో కూడిన బీడు భూమి అభివృద్ధికి కావలసినటువంటి పనుల అంచనాలను మండల కంప్యూటర్ కేంద్రం నందు చేయించుకొని పథక సంచాలకులు, జిల్లా నీటి యాజమాన్య సంస్థ, ఆదిలాబాద్ గారి పరిపాలన ఆమోదము పొందినాడు. పని సంఖ్య 61313 భూమి చదును పనిని జై అంబే సంఘము వారు 175 పని దినాలలో రూపాయలు రూ.21000/- వేతనముగా పొంది దానిని సారవంతముగా తీర్చిదిద్దినారు. శేఖర్ తమ కుటుంబానికి కూలీగా వచ్చిన మొత్తంతో పాత బావిలో మోటారు బాగు చేయించుకొని బావి అమర్చుకొన్నాడు.

ఈ సంవత్సరం శేఖర్ బావి ద్వారా 2.20 గుంటలలో ఒక ఎకరం పది గుంటలు వరి పొలం వేశాడు. మిగితా భూమిలో వేరుశనగ, మొక్కజొన్న పంట పండించాడు. వరి పంటకు 32000/- వేరుశనగ మరియు మొక్కజొన్న 23000/- చొప్పున మొత్తం 55000/- రూపాయలలో పంటలకు పెట్టుబడులు పోను శేఖర్ 34000/- రూపాయలు లాభంగా పొందినాడు.

మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి పథకం కూలీ స్థాయి నుండి రైతు స్థాయికి శేఖర్‌ను చేర్చింది. దానితో సుస్థిర ఆస్తి లభించినది. సంవత్సరానికి కొద్దిపాటి ఆదాయం లభించినది తద్వారా తన కుటుంబం మెరుగైన జీవనం గడుపుతున్నారు అని ఉపాధి హామీ పథకానికి కృతజ్ఞతలు తెలుపుకుంటున్నాడు.

**- టి.యం.కె.గాంధీ,**
**జె.ఆర్.పి., సి.యన్.ఆర్.యం.**
**టిసిపార్డ్**



# మనిషి నాలెడ్జే గొప్పది

## టీచర్‌కు కంప్యూటర్ ప్రత్యామ్నాయమా!

**విద్యా టెక్నాలజీ ఉపాధ్యాయుడి బోధనకు అదనపు పరికరమవుతుంది గాని, అది ఉపాధ్యాయుడి స్థానాన్ని పూరించలేదు. స్మార్ట్ క్లాస్‌రూంల కంటే స్మార్ట్ టీచర్లే ప్రధానం. టీచర్ల తయారీని గాలికి వదిలేసి స్మార్ట్ క్లాస్‌రూంలను ఆశ్రయిస్తే ప్రయోజనం ఉండదు. గూగుల్ ఎప్పటికీ గురువుకంటే గొప్పది కాదు. సజీవంగా, క్రియాత్మకంగా ఉండే బోధన అభ్యసన ప్రక్రియలో యంత్రంతో చేయించాల్సిన పనులను యంత్రంతోనే చేయిస్తూ, మనిషి చేయాల్సిన పనులు మనిషి చేసినంత కాలం సమస్య లేదు. కాని అవి తారుమారు అయినప్పుడే సంక్షోభం తలెత్తుతుంది.**

కేంద్ర ప్రభుత్వం నూతన విద్యా విధాన రూపకల్పనకు కసరత్తును గత సంవత్సరమే ప్రారంభించిందింది. మాజీ ఐఏఎస్ అధికారి సుబ్రమణ్యం నేతృత్వంలో రూపొందించబడిన ముసాయిదాపై దేశవ్యాప్తంగా చర్చ జరుగుతున్నది. గతంలో రూపొందించబడిన విద్యా విధానాలకు భిన్నంగా క్షేత్రస్థాయిలో దేశవ్యాప్తంగా సుమారు మూడు లక్షల సంప్రదింపులు జరిగాయి. కానీ ఆ సంప్రదింపుల్లో పారదర్శకత లోపించిందనీ, ముసాయిదా దేశ విద్యారంగాన్ని ఇంకా బలహీనపరిచేదిగా ఉందని విమర్శలు వస్తున్నాయి. తమిళనాడులో ఈ ముసాయిదాను నిరసిస్తూ ప్రజా వ్యతిరేక విద్యా విధాన వ్యతిరేక ఐక్య కార్యాచరణ కమిటీ ఏర్పడింది. ఈ కమిటీ అధ్వర్యంలో నవంబర్ 17న జంతర్ మంతర్ వద్ద నిరసన ప్రదర్శన జరిగింది. ఈ నేపథ్యంలో ముసాయిదా, విద్యలో సమాచార, ప్రసార, సాంకేతికశాస్త్ర (ఐసీటీ) వినియోగం గురించి వెలువరించిన అభిప్రాయాలను విశ్లేషించడం ఈ వ్యాసం ఉద్దేశం.

సమాచార, ప్రసార, సాంకేతిక శాస్త్రాలను ప్రస్తావించకుండా 21వ శతాబ్దపు విద్య గురించి మాట్లాడలేం. అన్నిరంగాలను ప్రభావితం చేసినట్లే విద్యా రంగాన్ని కూడా సమాచార, ప్రసార, సాంకేతిక శాస్త్రం ప్రభావితం చేస్తున్నది. అయితే విద్యలో సమాచార, ప్రసార, సాంకేతిక శాస్త్ర వినియోగం గురించి కమిటీ ప్రతిపాదనలు నిష్ణాతుల సిఫార్సుల మాదిరిగా గాక సాధారణ స్థాయి అవగాహనతోనే దర్శనమిస్తాయి. అన్నిస్థాయిల విద్యలో సమాచార, ప్రసార, సాంకేతిక శాస్త్ర వినియోగాన్ని పెంపొందించాలని, సెకండరీ, ఉన్నతస్థాయి విద్యలో ఆన్‌లైన్ కోర్సులను ప్రవేశపెట్టాలని, దీనిద్వారా తక్కువ ఖర్చుతో నాణ్యమైన విద్య లభిస్తుందనే అపోహను ఈ ముసాయిదా కలిగిస్తున్నది. దీని వినియోగానికి ఉన్న పరిమితులను అర్థం చేసుకోకపోతే కలిగే పరిణామాల గురించి హెచ్చరికలు లేకపోగా దీనిపేరు మీద జరిగే విద్యా వ్యాపారాన్ని బలపరిచే విధంగా సిఫార్సులున్నాయి.

ప్రీ ప్రైమరీ స్థాయి నుంచే ముందే నిర్దేశించబడిన లక్ష్యాలకు అనుగుణంగా విద్యార్థుల చదువులకు మార్గదర్శకాన్ని ఇచ్చే విశ్లేషణ పద్ధతి ఇది. దీనిలో విద్యార్థికి ఆన్‌లైన్ విద్యా వ్యవస్థ సమకూర్చబడుతుంది. దీనిద్వారా పిల్లలు నేర్చుకునే క్రమంలో పిల్లలకు కావలసిన వ్యక్తిగత విషయాన్ని సమకూరుస్తూ, వారిని అంచనా వేస్తుంటాయి. ఈ క్రమంలో పిల్లల అనుభవాలకు సంబంధించిన మొత్తం సమాచారానికి సంబంధించిన డాటా బేస్ తయారవుతుంది. దీన్ని ఉపయోగించి పిల్లల భవిష్యత్ సాధనకు సంబంధించిన అంచనాలు ఇవ్వబడుతాయి, దానికనుగుణంగా పిల్లలు నేర్చుకుంటారు. ఈ విధానంలో సహజమైన టీచర్ స్టూడెంట్ సంబంధాలు బలహీనపరుచబడుతాయి. పిల్లలు అమానవీకరించబడుతారు.

దీనివల్ల లాభం కంటే నష్టమే ఎక్కువ. డిజిటల్ వ్యాపారుల లాగానే సుబ్రమణ్యం కమిటీ కూడా ఈ బిగ్ డాటా విశ్లేషణ విధానాలను కీర్తిస్తున్నారు. సమాచార, ప్రసార, సాంకేతిక శాస్త్ర వినియోగంలో బహుళ జ్ఞానేంద్రియాల వినియోగం ఉంటుంది కాబట్టి విషయాలను బాగా గుర్తుంచుకోగలుగుతారు. అయితే నేర్చుకోవడం అంటే కేవలం విషయాన్ని గుర్తుంచుకోవడం, అర్థం చేసుకోవడమే కాదు, దాన్ని సరిగ్గా

అన్వయించడం, సరైన వివేచనను తద్వారా సరైన విలువలను పొందడం జరుగాలి. మొదటిరకం పనులకు సమాచార, ప్రసార, సాంకేతిక శాస్త్ర వినియోగం బాగానే తోడ్పడుతుంది.

కాని రెండో రకం పనులకు వివేచన, విలువలు టీచర్ చాలా ప్రధానం. కాని మన విద్యావ్యవస్థ మొదటి పనుల కేంద్రం గానే నడుస్తున్నది కాబట్టి ఐసీటీ వినియోగానికి ప్రాముఖ్యం పెరిగింది. సమాచార, ప్రసార, సాంకేతిక శాస్త్ర వినియోగంతో బోధన జరుగుతున్నదని చెప్పుకోవడం నేడొక ప్రత్యేక ఆకర్షణ. అందుకనే డీజీ స్కూళ్లు, ఈ టెక్నోస్కూళ్లు అని స్కూళ్ల పేర్ల ముందు ప్రిఫిక్సులు చేరాయి. టీచర్ల కంటే స్మార్ట్‌బోర్డులకు ప్రాధాన్యం పెరిగింది. ప్రపంచ వ్యాప్తంగా ఈ విద్యా వ్యాపారం మూడు పువ్వులు ఆరు కాయలుగా ఉన్నది. తెలంగాణ ప్రభుత్వం కూడా ఈ విద్యా సంవత్సరం నుంచి కొన్ని ప్రభుత్వ స్కూళ్లలో పైలట్ ప్రాజెక్టుగా స్మార్ట్ తరగతులను ప్రారంభించింది.

అయితే ఈ సమాచార, ప్రసార, సాంకేతిక శాస్త్ర వినియోగం ఏస్థాయిలో, ఏమేరకు ఉండాలి? దీని ని బోధన అభ్యసనలో ఏ మేరకు సమైక్య పరచాలి? ఇది టీచర్‌కు అదనపు సహాయకారి అవుతుందా? ప్రత్యామ్నాయం అవుతుందా? టీచర్ల తయారీని పట్టించుకోకుండా డిజిటల్ క్లాస్‌రూముల తయారీ యే ప్రాధాన్యమైనదా? అనే విషయాల చర్చ ముఖ్యమైనది. మన దేశానికే చెందిన ఇంగ్లాండ్‌లోని న్యూ కాజిల్ యూనివర్సిటీ ప్రొఫెసర్, సుగత మిత్ర చేసిన ప్రయోగాలు కూడా ఈ సందర్భంగా తెలుసుకోదగినవి. సుగత మిత్ర 1999 నుంచి కంప్యూటర్ల వినియోగం, ఇంటర్నెట్ ద్వారా పిల్లలు ఎలా నేర్చుకుంటారన్న విషయాలపై పరిశోధనలు చేశారు. ఈయన ఇన్‌స్ట్రక్టర్ లేకుండానే స్వయం అభ్యసన ద్వారానే పిల్లలు ఇంటర్నెట్‌ను వాడటం నేర్చుకున్నారని, వారి పదజాలం కూడా పెరిగిన విషయం పరిశీలించాడు. దీన్నే స్వీయ వ్యవస్థీకృత అభ్యసన పరిసరం అన్నాడు.

స్వయం అధ్యయన కేంద్రాలను సుగత మిత్ర మనదేశంతో పాటు ప్రపంచవ్యాప్తంగా చాలా దేశాల్లో ఏర్పాటు చేశాడు. ఇది స్వయం నిర్దేశిత అధ్యయనం, సహకార భావనతో జ్ఞానాన్ని నిర్మించుకునే విధానానికి ఆధారం. అయితే ఈ విధానానికి కూడా పరిమితులున్నాయని విమర్శకులు చెబుతున్నారు. అన్ని విషయాలను ఈ విధానంలో నేర్చుకోలేక పోవడం, విస్తృత పరిమాణంలోని సమాచారం నుంచి కావాల్సిన సమాచారాన్ని ఎంపిక చేసుకోవడానికి మార్గదర్శకత్వం లోపించడం, నేర్చుకోవడం ఎలాగో నేర్చుకోవడం టీచర్ సమక్షంలోనే జరుగుతుందనే ముఖ్యమైన అంశం ఈ విధానంలో లోపిస్తుంది. విద్యార్థులపై సరైన నియంత్రణ లేకపోవడం, అవసరమైన సమాచారాన్ని మాత్రమే పొందే ప్రావీణ్యాన్ని పొందలేకపోవడం, పొందిన సమాచా రం విశ్వసనీయతను అంచనావేసే నైపుణ్యాలను ఇవ్వదు. సమాచారం అందుబాటులో ఉన్నంత మాత్రాన సరిపోదు, దానిని సరైన రీతిలో వ్యవస్థీకృతం చేయడంలో టీచర్ పాత్ర ప్రధానమైనది. అందుకనే ఆన్‌లైన్ కోర్సుల ద్వారా అభ్యసించే వారి లో వైఫల్యాలు ఎక్కువ ఉంటాయని నిపుణులు అంటున్నారు.

కాబట్టి ఐసీటీ విధానం, స్మార్ట్ తరగతి గదులు టీచర్‌కు ప్రత్యామ్నాయం ఎప్పటికీ కాదు. ఇవి విద్యార్థికి కావలసిన సమాచారాన్ని మాత్రమే ఇస్తా యి. ఆ సమాచారాన్ని సమన్వయపరిచి సరైన జ్ఞానాన్ని అందించడంలో టీచర్ల పాత్ర చాలా ఎక్కువ. పిల్లలకు జ్ఞానాన్ని ఇవ్వడంతో పాటు వారి మెంటరింగ్, కౌన్సెలింగ్ కూడా స్కూల్ స్థాయిలో చాలా ముఖ్యమైనవి, ఈ విధులను సాంకేతిక పరికరాలు, స్మార్ట్ తరగతి గదులు ఇవ్వలేవు. ఇవి టీచర్‌కు అదనంగా ఉపయోగపడే పరికరాలు మాత్రమే. సాధారణ టీచర్ల బోధనా సామర్థ్యాన్ని కొంతవరకు పెంచడానికి ఉపయోగపడవచ్చు కాని, సామర్థ్యం ఉన్న టీచర్లకైతే ఇవి అడ్డంకిగానే తోస్తాయి. టీచర్ సామ ర్థ్యం పెరిగినా కొద్దీ టెక్నాలజీ వాడకం తగ్గుతుంది.

బోధనలో టెక్నాలజీ విద్యార్థులను, వారు బాగా నేర్చుకున్నారనే భ్రమలకు గురిచేస్తుంది. ఊహాశక్తి, భావనలకు ఆకృతినిచ్చే సామర్థ్యాలు తగ్గిపోతాయి. పిల్లల వైయుక్తిక బేధాలను అనుసరించి బోధనా జరుపడానికి దీనిలో తక్కువ అవకాశాలుంటాయి. సమాచార, ప్రసార, సాంకేతిక శాస్త్ర వినియోగం వల్ల పిల్లల్లో నేర్చుకోవడం పట్ల మొదట్లో కొత్తదనంతో కొంత ఉత్తేజాన్ని కలిగించవచ్చు, కాని కాలక్రమేణా అది యాంత్రికంగా మారుతుంది. అన్ని విషయాల ను ఈ విధానంలో బోధించలేం. ముఖ్యంగా ఎలిమెంటరీ స్థాయిలో ఈ విధానాలను పరిమితంగా వాడవలసి ఉంటుంది. సృజనాత్మకత, విమర్శనాత్మ క ఆలోచన, భిన్న సంస్కృతుల ప్రజలు ఒకరితో నొకరు వ్యవహరించే తీరు, ప్రపంచాన్ని అర్థం చేసుకునే తీర్లను అవగాహన సామర్థ్యాలను శతాబ్దపు నైపుణ్యాలుగా ఈ సమాచార, ప్రసార, సాంకేతిక శాస్త్ర వినియోగాన్ని కీర్తించేవారు చెబుతుంటారు. అయితే ఈ నైపుణ్యాలు సమాచార, ప్రసార, సాంకేతికశాస్త్ర వినియోగం లేకపోయినా అభివృద్ధి చెందుతాయి. అలాగే సమాచార, ప్రసార, సాంకేతిక శాస్త్ర వినియోగంతో ఈ నైపుణ్యాలు తప్పక కలుగుతాయనే నమ్మకం ఏమీ ఉండదనీ ఈ రంగంలోని నిపుణులు చెబుతున్నారు.

విద్యా టెక్నాలజీ ఉపాధ్యాయుడి బోధనకు అదనపు పరికరమవుతుంది గాని, అది ఉపాధ్యాయుడి స్థానాన్ని పూరించలేదు. స్మార్ట్ క్లాస్‌రూంల కంటే స్మార్ట్ టీచర్లే ప్రధానం. టీచర్ల తయారీని గాలికి వదిలేసి స్మార్ట్ క్లాస్‌రూంలను ఆశ్రయిస్తే ప్రయోజనం ఉండదు. గూగుల్ ఎప్పటికీ గురువు కంటే గొప్పది కాదు. సజీవంగా, క్రియాత్మకంగా ఉండే బోధన అభ్యసన ప్రక్రియలో యంత్రంతో చేయించాల్సిన పనులను యంత్రంతోనే చేయిస్తూ, మనిషి చేయాల్సిన పనులు మనిషి చేసినంత కాలం సమస్య లేదు. కాని అవి తారుమారు అయినప్పుడే సంక్షోభం తలెత్తుతుంది. ఈ మౌలిక విషయాలను చర్చించకుండా నే జాతీయ విద్యా విధాన ముసాయిదా- 2016 సమాచార, ప్రసార, సాంకేతిక శాస్త్ర వినియోగాన్ని కీర్తిస్తున్నది. క్లిష్టంగా ఉన్న విద్యారంగ పరిస్థితులను రాబోయేకాలంలో అతి సంక్లిష్టం చేయబోనున్న ప్రతిపాదనలివి.





# చెరువుల్లో జలకళతో గ్రామాల్లో వికాసం

తెలంగాణ రాష్ట్రంలో చెరువులకు పూర్వవైభవం సంతరించుకుంటున్నది. మిషన్ కాకతీయ పేరుతో చెరువుల పునరుద్దరణకు శ్రీకారం చుట్టిన ప్రభుత్వం ఐదు సంవత్సరాల కాలంలో రాష్ట్రంలోని అన్నిచెరువులను పునరుద్దరించాలని కృతనిశ్చయంతో ఉన్నది. చెరువులకు జలకళ సంతరించుకుని గ్రామాల్లో రైతులకు భవిష్యత్తుపై భరోసాను కల్పిస్తున్నది. తెలంగాణ ప్రాంతంలో కాకతీయుల కాలంనాటి చెరువులు తరువాతి కాలంలో నిర్లక్ష్యం చేయబడి అవసాన దశకు చేరుకున్నాయి. చారిత్రక ఆధారాల ప్రకారం కాకతీయుల పరిపాలనా దక్షతకు మారుపేరుగా నిలువబడిన చెరువులు తెలంగాణ వ్యవసాయరంగ అభివృద్ధికి ఇతోధికంగా తోడ్పడ్డాయి. కాకతీయులే కాకుండా అసఫ్‌జాహీలు, కుతుబ్‌షాహీలు, ప్రభువులు కూడా వారి అనంతరం చెరువుల అభివృద్ధికి అహర్నిశలు కృషిచేసి కాకతీయుల వారసత్వాన్ని ఇనుమడింపజేశారు. ఇంతటి వైభవోపేతమైన చెరువులను తెలంగాణలోని వ్యవసాయరంగ అభివృద్ధికి, సాగునీటి, త్రాగునీటి అవసరాల కోసమే కాకుండా బహుళప్రయోజనాలు కలిగిన చెరువుల పునరుద్దరణకు సమగ్రఅధ్యయనం చేసిన ప్రభుత్వం గ్రామాలకు ఆదెరువు అయిన చెరువులకు మహర్దశ కల్పించడానికి శ్రీకారం చుట్టి అప్రతిహతంగా ముందుకుసాగుతున్నది. 1956 లో ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రం ఏర్పడిన నాటికి తెలంగాణలో రెవెన్యూ రికార్డుల ప్రకారం 33,000 లకు పైగా చెరువులున్నట్లు నమోదుకాగా, 12 లక్షలఎకరాలకు పైగా భూమి సాగులో ఉన్నట్లు తెలుస్తున్నది. తెలంగాణలో వ్యవసాయరంగం, రైతుల ప్రయోజనాలే లక్ష్యంగా కాంక్షించిన ప్రభుత్వం సర్వే జరిపించి రాష్ట్రంలో 46,351 చెరువులు, 24.50 లక్షల ఎకరాల ఆయకట్టు ఉన్నట్లు లెక్కలు తేల్చింది. ఇందులో 100 ఎకరాలకు పైబడి ఆయకట్టు ఉన్న చెరువులు38,411 కాగా, వాటి కింద 20.46 లక్షల ఎకరాల ఆయకట్టు ఉన్నట్లు తేలింది. రాష్ట్రంలో అత్యధికంగా మెదక్, మహబూబ్‌నగర్ జిల్లాల్లో చెరువులు ఉన్నట్లు గణాంకాలు తెలుపుతున్నాయి. ఇలా చెరువుల పునరుద్దరణకు నడుంబిగించిన ప్రభుత్వం నాటి కాకతీయులకు సమున్నత ప్రాధాన్యం కల్పించే దిశగా మిషన్ కాకతీయ పేరుతో చెరువుల పునరుద్దరణకు పూనుకొని, యుద్ధ ప్రాతిపదికన పనులు చేపడుతున్నది.

తెలంగాణలో విధ్వంసం కాబడిన చెరువులను పునరుజ్జీవింపచేయడానికి మిషన్ కాకతీయ పేరిట చెరువుల పునరుద్దరణ కార్యక్రమాన్ని 2015 మార్చి12 ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్ రావు నిజామాబాద్ జిల్లా సదాశివనగర్ పాతచెరువులో ప్రారంభించి అప్రతిహతంగా రెండోదశ పనుల కార్యక్రమముతో విజయవంతంగా ముందుకు సాగుతున్నది. మొదటిదశలో పూర్తి చేసిన చెరువుల పునరుద్దరణ కార్యక్రమము పనుల పురోగతిని అంచనా వేసిన ప్రభుత్వం రైతులు, ప్రజల సహకారంతో వడివడిగా అడుగులు వేస్తున్నది. మిషన్ కాకతీయ కార్యక్రమములో భాగంగా పూడికలు తీసి చెరువుల, కుంటల నీటినిల్వ సామర్థ్యాన్ని పెంచడం, తొలగించిన పూడికను రైతుల పంటభూముల్లో పరచడం, చెరువుకట్టలను బలోపేతం చేయడం, చెరువు అలుగు, తూములను మరమ్మత్తులు చేయడం, క్రాస్ డ్రైనేజ్ స్ట్రక్చర్‌లను మరమ్మత్తు చెయ్యడం, చెరువులకు నీటిని తరలించే ఫీడర్ చానళ్ళను రీ సెక్షన్ చేయడం, పూడిక తీయడం, చెరువుల్లో పెరిగిన తుమ్మ చెట్లను నరికి వెయ్యడం, గుర్రపు డెక్క, లొట్ట పీసు మొక్కల తొలగింపు, కట్ట బలోపేతానికిసరిపడే మొరం పూడిక మట్టిని వాడుకోవడం, చెరువుల శిఖం భూములను కబ్జాల బారి నుండి రక్షించడం మరియు హరిత హారం కార్యక్రమములో భాగంగా చెరువు శిఖంలో చెట్లు, చెరువు కట్టలపై ఈత చెట్లను నాటడం లాంటిపనులు చేపడుతూ చెరువుల రాజకీయ, ఆర్థిక, సాంస్కృతిక వికాసానికి కేంద్రాలుగావిలసిల్లేలా కార్యక్రమము విజయవంతంగా కొనసాగుతున్నది.

మిషన్ కాకతీయ కార్యక్రమము మొదటి దశలో 8105 చెరువులకు ప్రభుత్వం రూ.2591 కోట్లకు పరిపాలనా అనుమతులు మంజూరు చేసింది. సుమారు 8039 చెరువుల యందు రూ.1633 కోట్లతో పనులు ప్రారంభించి సుమారు 7503 చెరువులను పూర్తి చేయడం జరిగినది. చెరువుల పునరుద్దరణలో అత్యంత ముఖ్యమైన పూడికతీత కార్యక్రమము రైతుల భాగస్వామ్యంతో అప్రతిహతంగా, స్ఫూర్తిదాయకంగా,



ఉపయుక్తంగా జరిగింది. 2 కోట్ల 52 లక్షల 14 వేల ట్రాక్టర్ ట్రిప్పుల పూడిక మట్టిని రైతులు స్వచ్ఛందంగా తమ పొలాల్లోకి తరలించుకుపోవడం జరిగింది. ఇది 6 కోట్ల 53 లక్షల 37 వేల క్యూబిక్‌మీటర్ల మట్టితో సమానం. రాష్ట్ర వ్యాప్తంగా సుమారుగా 300 కోట్ల రూపాయలను మట్టిని తమ పంట పొలాల్లోకి తరలించుకోవడానికి పెట్టుబడి పెట్టినట్లు తెలియుచున్నది. ఇవే కాకుండా రైతులు స్వచ్ఛందగా మిషన్‌కాకతీయ పనులలో భాగస్వాములు కావడం తమ వ్యవసాయ అవసరాలకు అనుగుణంగా చెరువుల పునరుద్ధరణలో పాలుపంచుకోవడంతో మొదటిదశ పనులు విజయవంతంగా ముగింపు దశకు చేరుకున్నాయి. ఇవే కాకుండా రెండో దశ మిషన్ కాకతీయ పనులకు సైతం 9043 చెరువులకు 3080కోట్లకు పరిపాలనా అనుమతులు మంజూరీ చేయడం జరిగినది. వీటిలో 8826 చెరువుల పనులు ప్రారంభించడం జరిగినది. ఇప్పటి వరకు 947 పనులు పూర్తికాగా మిగతా చెరువులు పునరుద్ధరణ క్రతువులో వివిధ దశల్లో ముందుకుసాగుతున్నాయి. ఇలా మొదటిదశ,రెండో దశలోని లోటుపాట్లను సవరిస్తూ మూడోదశ పనులకు శ్రీకారం చుట్టడానికి ప్రభుత్వం సమాయత్తమవుతున్నది. చెరువుల పునురుద్ధరణ కార్యక్రమము గ్రామాల్లో రైతులకు,ప్రజలకు భావి జీవితానికి బాటలు వేస్తూ,భద్రతకు భరోసాను పెంచుతూ గ్రామసీమల వికాసాన్ని పెంపొందించేలా దోహదపడుతున్నది.

రాష్ట్రంలో ఈ ఏడు సమృద్ధిగా వర్షాలు కురిసి చెరువులు జలకళతో ఉట్టిపడుతున్నాయి. చెరువే గ్రామాల అభివృద్ధికి,గ్రామీణ సంస్కృతికి అద్దం పట్టేలా విలసిల్లుతూ చెరువుతోనే గ్రామాల్లో ప్రజల జీవితాలు ఆధారపడుతూ చెరువుల చుట్టూ సామాజిక,సాంస్కృతిక వికాసానికి మరోమారు సజీవంగా సాక్ష్యంగా నిలుస్తూ తెలంగాణలో చెరువులు పునర్‌వైభవాన్ని సంతరించుకుంటున్నాయి. తెలంగాణలో చెరువులే గ్రామ ప్రజలకు సబ్బండ వర్ణాల జాతులకు ఆలవాలంగా బ్రతుకునిచ్చే బతుకమ్మలకు,కట్ట మైసమ్మ బోనాలకు, గంగజాతరలకు, సామూహిక వనబోజనాలకు అన్నింటికి మూలకేంద్రంగా చెరువులు విలసిల్లుతూ మరోమారు తెలంగాణలో ఏళ్ళుగా కనుమరుగయిన సంస్కృతికి చెరువులు జీవం పోసుకున్నాయి. నాడు గ్రామంలో చాకలివారికి చాకిరేవుగా, ముదిరాజ్‌లకు చేపల పెంపకము వృత్తిగా, రైతులకు పచ్చనిపంటపొలాలకు నీరందించే తల్లిగా, గ్రామములోని పశువులు, బర్రెలు, మేకలు, గొర్రెలకు త్రాగునీటికి పెద్దదిక్కుగా గ్రామాల పచ్చగా కళకళలాడేలాగా బ్రతుకుపై భరోసా పెంచే విధంగా ఉండే చెరువులు క్రమేణా మూలకపడి నేడు మరలా మిషన్ కాకతీయతో సబ్బండవర్ణాల బ్రతుకులకు బంగారుబాటలు వేసే విధంగా జలకళతో కళకళలాడుతున్నాయి. ఇప్పటికే రాష్ట్రంలో ఈ ఏడాది కురిసిన వర్షాలకు గ్రామాల్లో పచ్చనిపంటలతో హరితగ్రామాలుగా వికసిస్తున్నాయి. దీనికి తోడు చెరువు పూడిక మట్టితో రసాయనిక ఎరువుల వాడకం తగ్గింది. పూడిక మట్టి వాడకం వల్ల 50శాతం రసాయనిక ఎరువుల వినియోగాన్ని తగ్గిస్తుందని, పంట దిగుబడి 15 శాతం నుండి 20 శాతం పెరుగుతుందని ఇక్రిశాట్ పరిశోధనలు తెలియజేస్తున్నాయి. ఖరీఫ్ పంటలతో పల్లెలు కళకళలాడగా,రైతులు మోములో ఆనందాలు వెల్లివిరుస్తున్నాయి. ఇదే అదనుగా భావించిన రైతులు యాసంగి పంటలపై ప్రణాళికలు ప్రారంభిస్తున్నారు. గ్రామాల్లో చెరువులజలశోభను అంచనా వేసిన ప్రభుత్వం చెరువులను గ్రామాల సర్వతోముఖాభివృద్ధికి ఆలవాలంగా చేయాలని చెరువు కట్టలపై హరితహారము పథకములో భాగంగా ఈత,ఖర్జూర చెట్లు నాటించింది. తద్వారా చెరువు కట్టకు బలాన్నివ్వడమే కాకుండా చెరువులు సహజసిద్ధమైన ఈత కల్లుకు నిలయాలుగా మారి ప్రజలను గుడుంబా మహమ్మారి నుండి విముక్తి కలిగించేలా దూరదృష్టితో,శాశ్వత ప్రయోజనాలే లక్ష్యంగా ఒక్క దెబ్బకు రెండు పిట్టలు అన్నట్లుగా దీర్ఘ కాలిక ప్రణాళికతో పయనిస్తున్నది. అంతే కాకుండా గ్రామాల్లో గుడుంబా నిర్మూలకు నడుంబిగించిన ప్రభుత్వము గుడుంబా తయారీ నిలిపివేసిన కుటుంబాలకు ప్రత్యామ్నాయ మార్గాలు ఎంచుకునేలా ఆర్థికసహాయం అందిస్తున్నది. అదేవిధంగా ఇప్పటికే వరంగల్ జిల్లాలో గుడుంబా తయారీ నిలిపివేసిన కుటుంబాలకు ఆర్థికసహాయం అందజేయడం జరిగినది. ఇదే సమయంలో ప్రజలు సహజసిద్ధమైన ఈత పానీయాలవైపు మరలేలా ఈత వనాల అభివృద్ధికి హరితహారములో ఈత చెట్లు నాటడం జరిగినది. ఇలా చెరువులే గ్రామాల సర్వతోముఖాభివృద్ధికి,అసమానతలను రూపుమాపే విధంగా గ్రామీణ జీవనముఖ చిత్రాన్ని మార్చే విధంగా పలు ప్రణాళికలతో భావితెలంగాణకు బాటలు వేస్తున్నది.

జలకళతో శోభిల్లుతున్న చెరువుల్లో చేప పిల్లలను వదిలి నీలి విప్లవం సృష్టించాలని చేపపిల్లల పంపిణీ కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. రాష్ట్రంలో మత్స్యకారుల అభివృద్దే లక్ష్యంగా రూ. 48 కోట్లతో 4697 చెరువుల్లో, రిజర్వాయర్‌లల్లో 80-100 ఎమ్ఎమ్ సైజు,కట్ల,రోహు,మ్రిగాల రకాల చేపపిల్లల ఉచితంగా విడుదలచేస్తున్నది. గ్రామ పంచాయతీ పరిధిలోని 19 వేల చెరువులల్లో చేపపిల్లలను విడుదల చేయడం జరిగినది. తద్వారా 3700 పై చిలుకు మత్స్య సహకార సంఘాలకు లబ్ది చేకూరడమే కాకుండా 20 లక్షల మత్స్యకారులు ప్రత్యక్షంగా,పరోక్షంగా లబ్దిపొందే అవకాశం ఉన్నది. ఇవే కాకుండా గ్రామాల్లోని సమృద్ధిగా ఉన్న చెరువులే వేదికలుగా పలు లాభాలు పొందేలా మత్స్యకారులు అభివృద్ధికై కాంక్షించే ప్రభుత్వం రూ. 29 కోట్లతో మత్స్య విత్తన కేంద్రాల అభివృద్ధికి బాటలు వేస్తున్నది. ఇలా చెరువుల పునరుద్ధరణతో మత్స్యకారులు,రైతులు,సబ్బండ కులాల వారు,గ్రామంలోని పశుసంపద అభివృద్ధికి బంగారు బాటలు వేస్తూ చెరువుల అభివృద్ధి ద్వారా ఆర్థిక, రాజకీయ, సామాజిక, సాంస్కృతిక వికాసం కలుగుతుంది. ఇంతే కాకుండా చెరువుల జలకళ ద్వారా భూగర్భ జలాల వృద్ధిలో గణనీయమైన మార్పులు చోటు చేసుకున్నట్లుభూగర్భజలశాఖ వారి అధ్యయనంలో తేటతెల్లమయినది,రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో భూగర్భజలాలు పెరిగినట్లు నివేదికలు తెలియజేయుచున్నవి. తద్వారా యాసంగి పంటకాలానికి సాగునీరుఅందడమే కాకుండా భూగర్భజల మట్టం పెరగడంతో త్రాగునీరు ఎలాంటి ఢోకా లేకుండా సస్యశ్యామల తెలంగాణగా విలసిల్లే అద్భుత ఘడియలు ఆవిష్కృతం కానున్నాయి. అంతే కాకుండా చెరువులే మూల కేంద్రాలుగా పల్లెపట్టుకొమ్మల అభివృద్ధికి మూలవిరాట్టుగా అవతరించనున్నాయి. మిషన్ కాకతీయ పేరుతో బడుగు,బలహీన వర్గాలే కాకుండా అన్నిరకాల వర్గాల అభివృద్ధిని ఆకాంక్షించే వికాసకేంద్రాలుగా చెరువులు విలసిల్లనున్నాయి.

**ఎ. శ్యామ్ కుమార్, హన్మకొండ, వరంగల్.**

# మనోనియంత్రణతోనే.. ఒత్తిడి దూరం



పరీక్షల సమయంలో ఒత్తిడి ఉండటం సహజం. ఇది స్వల్పస్థాయిలో ఉండటం మంచిదే. ఎక్కువ మార్కులు తెచ్చుకునేలా ప్రేరేపిస్తుంది. కానీ ఆ ఒత్తిడే మితిమీరిందంటే మొదటికే మోసం. వ్యతిరేక ఫలితాలను ఇస్తుంది. పరీక్షల సీజన్లో విద్యార్థిపై అనేక రకాల ఒత్తిళ్లు ఉంటాయి. సబ్జెక్టుల క్లిష్టత, జ్ఞాపకశక్తి తగ్గడం వంటి సమస్యలు కూడా ఒత్తిడి పెంచుతాయి. సరిగా పరీక్ష రాయలేదేమోననే సందేహం, నిస్సహాయతతో ఆందోళన చెందుతూ ఉంటారు.

పోటీ పరీక్షలకు ప్రిపేర్ అవుతున్న రమేశ్ ఈ మధ్య తరచూ తలనొప్పి అంటున్నాడు. పరీక్షలు గుర్తొస్తే అరచేతులు చెమటలు పడుతున్నాయి. పుస్తకం చదవడం మొదలుపెడుతాడు కానీ కొద్దిసేపటికే వేరే ఆలోచనలు మనసును చుట్టు ముడుతున్నాయి. పరీక్షలు దగ్గరవడుతుంటే చాలామంది విద్యార్థులు రమేశ్లాగే సతమతమవుతుంటారు. ఈ వ్యాకులత ఇలాగే కొనసాగితే కష్టపడి చదివింది కూడా పరీక్షలో సరిగా రాయలేకపోయే ప్రమాదం ఉంది.

**ఎన్ని రకాలో....**

పరీక్షల సీజన్లో విద్యార్థిపై ఉండే ఒత్తిళ్లు రకరకాలు. కుటుంబం, సమాజం, స్నేహితుల నుంచే కాదు, విద్యార్థి స్వయంగా సృష్టించుకునే ఒత్తిడి ఉంటుంది. సబ్జెక్టుల క్లిష్టత, జ్ఞాపకశక్తి క్షీణించడం లాంటి సమస్యలు కూడా ఒత్తిడి పెంచుతాయి.

పరీక్షల ఫలితాల గురించి, దానితో ముడిపడి ఉన్న తల్లిదండ్రుల పరువు ప్రతిష్టల గురించి ఆలోచిస్తూ అవన్నీ తమ చేతిలోనే ఉన్నాయన్న భావన కొందరు విద్యార్థుల్లో ఉంటుంది. సరిగా పరీక్షలు రాయలేమేమోననే సందేహంతో, నిస్సహాయతతో ఆందోళన చెందుతుంటారు.

**ఇక్కడ ఉంటే అక్కడి ధ్యాస**

హాస్టల్లో రకరకాల విద్యార్థులతో కలిసి ఉండాల్సి వస్తుంది. హేళన చేసేవారూ, ఏడిపించేవారూ వారిలో ఉండొచ్చు. ఈ వాతావరణం పడక చదువుపై ఏకాగ్రత కుదరనివారికి ఇంట్లో ఉంటే ఎంత బాగా చదివే వాణ్ణో? కదా అనిపిస్తుంది.

ఇంట్లో ఉన్నవారు ఏమనుకుంటారంటే.. ఇక్కడ ఏదైనా సందేహం వస్తే తీర్చేవారు లేరు. ఇదే హాస్టల్లో ఉండుంటే బావుండేది. అనవసరంగా ఇంట్లో ఉన్నాను అనే ఆలోచనలు చేస్తుంటారు. దీంతో ఈ రెండు రకాలవారూ ఏదో కోల్పోయినట్టు కనబడుతారు. ఆందోళన, విపరీతమైన ఒత్తిడి, ఒకే రకమైన పనివల్ల బాగా నిద్ర వస్తుంది. హాస్టల్లో ఉండేవారికైతే ఇది మరీ ఎక్కువ.

**చదవని సిలబస్ భారం**

ఇంతకాలం పుస్తకాలను సరిగా పట్టించుకోనివారికి తీరా ఇప్పుడు సిలబస్ భారంగా తోస్తుంది. చదవలేకపోవడం, వేగంగా చదవలేకపోవడం సమస్యలవుతాయి. ముందే చదువు మొదలుపెడితే బాగుండేది అనే ఆలోచన ఇబ్బంది పెడుతుంది.

**ఏకాగ్రత కుదరదు**

సమయం వృథా చేయకుండా చదువుకుందామని గట్టిగా నిశ్చయించుకుంటారు. ఏదో ఒక విషయం కోసం మిత్రులకు ఫోన్ చేస్తారు. మాటల్లో పడి చదివే మూడ్ పోతుంది. యవ్వన దశ కాబట్టి లైంగికపరమైన ఆలోచనలు వస్తుంటాయి. ఇలా వచ్చిన ఆలోచనల వల్ల తాను తప్పు చేస్తున్నాననే భావంతో సరిగా చదవలేక బాధపడుతుంటారు. ఇవన్నీ సహజం. దాని గురించి దిగులపడటం, ఆలోచించడం చేయకుండా.. వచ్చిన భావనను అనుభవంలోకి తెచ్చుకోవాలనే ఆలోచనను ఇగ్నోర్ (Ignore) చేయడం వల్ల అది మనల్ని ఎక్కువ బాధపెట్టకూడదు. ఒత్తిడిలో ఉన్న విద్యార్థిపై ఇంతకుముందున్న భయాలు, అనుమానాలన్నీ ఒకేసారి దాడిచేస్తాయి. ఆత్మన్యూనతను పెంపొందించి నేను చదవలేను అనే భావనకు గురిచేస్తాయి.

జనరల్ స్టడీస్, కరెంట్ అఫైర్స్ ఇంకా చదవాల్సింది ఎంతో ఉంది. చదివింది నాకు సరిగా వస్తుందో లేదో అనే భయం, అనుమానాలు పెరిగి, ఆత్మన్యూనత పెంపొంది ఇక చదవలేను అనే ఒత్తిడికి గురిచేస్తాయి. సాధించాల్సిన లక్ష్యాన్ని గుర్తుచేసుకుని దృశ్య రూపంలో ఊహించుకుంటే ఏకాగ్రత వస్తుంది. ఇలా రకరకాల కారణాలు విద్యార్థులను వేధిస్తుంటాయి. అయితే కారణాలేవైనా వాటన్నిటినీ పక్కనబెట్టి రాబోయే పరీక్షల కోసం చదవాలి.

ఇన్నాళ్లు చదవకుండా పోయానన్న భావనతో ఇప్పుడున్న సమయాన్ని వృథా చేయకూడదు. వెంటనే చదవడం మొదలు పెట్టాలి. సాధించాల్సిన లక్ష్యాన్ని గుర్తుకు తెచ్చుకోవడం, దాన్ని దృశ్యరూపంలో ఊహించుకోవడం వల్ల ఏకాగ్రత వస్తుంది.

**- డా။సి.వీరేందర్,**
**పర్సనాలటీ డెవలప్‌మెంట్ ట్రైనర్**

# డయాబెటిస్.. ఇక భయం లేదు!




మన శరీరంలో ఉపయోగపడకుండా మిగిలిపోయిన చక్కెర పదార్థాల మోతాదు సాధారణ స్థితి కంటే ఎక్కువగా రక్తంలో ఉండటాన్ని డయాబెటిస్ అంటారు. ఇది ఒక మెటబాలిక్ డిజార్డర్.

**డయాబెటిస్ – రకాలు**

టైప్ 1 ఇన్సులిన్ డిపెండెంట్ డయాబెటిస్ : దీనినే జువెనైల్ డయాబెటిస్ అని కూడా అంటారు. ఇది ముఖ్యంగా పిల్లల్లో ఎక్కువగా ఉంటుంది.

టైప్ 2 నాన్ ఇన్సులిన్ డిపెండెంట్ డయాబెటిస్

జెస్టేషనల్ డయాబెటిస్ – ఇది గర్భిణి స్త్రీలలో కనిపిస్తుంది.

మొదటి రకం డయాబెటిస్ చిన్న వయసులో వచ్చేది. దీనిలో ఎక్కువ శాతం మంది 20 సంవత్సరాలలోపు పిల్లలు ఈ వ్యాధి బారిన పడే అవకాశం ఎక్కువగా ఉంటుంది. దీన్నే జువెనైల్ డయాబెటిస్ అంటారు. ఇది శరీరంలోని క్లోమగ్రంథిలో బీటా కణాల నుంచి వచ్చే ఇన్సులిన్ ఉత్పత్తి పూర్తిగా ఆగిపోవడం వల్ల వస్తుంది.

రెండవ రకం డయాబెటిస్ ఎక్కువగా 30 ఏళ్లు దాటినవారిలో వస్తుంది. దీనికి రెండు కారణాలు.

1. అవసరమైన మోతాదులో ఇన్సులిన్ ఉత్పత్తి కాకపోవడం.

2. శరీరంలోని కణజాలం ఇన్సులిన్‌ను ఉపయోగించుకోలేకపోవడం. ఇది శారీరక శ్రమ తక్కువగా ఉండి, మానసిక ఒత్తిడి అధికం గలవారిలో, ఎక్కువగా రాత్రివేళలో ఉద్యోగాలు చేసేవారైన సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లు, కాల్‌సెంటర్‌లో, మార్కెటింగ్‌లో పనిచేసేవారిలో త్వరగా వచ్చే అవకాశం ఉంటుంది.

తల్లిదండ్రుల్లో ఎవరికైనా ఈ వ్యాధి ఉంటే వారి సంతానానికి, స్థూలకాయం ఉన్నవారు కూడా ఈ వ్యాధి బారిన పడే అవకాశం ఎక్కువగా ఉంటుంది.

**కారణాలు :** శారీరక శ్రమ తక్కువగా ఉండి, మానసిక ఒత్తిడి అధికంగా ఉండడం, శరీరంలో తక్కువ మోతాదులో ఇన్సులిన్ ఉత్పత్తి కావడం. ఉత్పత్తి అయ్యే ఇన్సులిన్‌ను శరీరంలోని కణజాలాలు సంపూర్ణంగా ఉపయోగించుకోకపోవడం (ఇన్సులిన్ రెసిస్టెన్స్) వంశపారంపర్య కారణాలు. తల్లిదండ్రుల్లో ఉంటే సంతానానికి ఈ జబ్బు వచ్చే అవకాశం ఎక్కువగా ఉంటుంది.

స్థూలకాయం. బిఎంఐ 30 కంటే ఎక్కువగా ఉన్నవారిలో డయాబెటిస్ అవకాశాలు ఎక్కువ.

ఆటో ఇమ్యూన్ డిసీజ్ వలన టైప్ 1 డయాబెటిస్ వస్తుంది.

క్లోమగ్రంథి సిస్టిక్ ఫైబ్రోసిస్ వల్ల వస్తుంది.

క్రానిక్ పాంక్రియాటైటిస్, పార్షియల్ పాంక్రియాడక్టమీ

కొన్నిసార్లు ఎలాంటి కారణాలు లేకుండా కూడా రావచ్చు.

**లక్షణాలు :** దాహం, ఆకలి, మూత్రం ఎక్కువగా ఉండడం. బరువు తగ్గడం, త్వరగా నీరసపడడం, పిక్కల్లో నొప్పి, ఒంటినొప్పులు, గాయాలు నయం కాకపోవడం, ఫంగల్ ఇన్‌ఫెక్షన్లు, చర్మవ్యాధులు, కాళ్లూచేతులు తిమ్మిర్లు, లైంగిక వాంఛలు తగ్గిపోవడం.

**కాంప్లికేషన్స్:** షుగర్ ఉన్నవారు సరైన చికిత్స, జీవనవిధానం లోపిస్తే ఇతర సమస్యలకు లోనవుతారు. వాటిలో కొన్ని..

డయాబెటిక్ ఫూట్, డయాబెటిక్ నెఫ్రోపతి, డయాబెటిక్ రెటినోపతి, డయాబెటిక్ న్యూరోపతి, బీపీ, కొలెస్ట్రాల్ లెవల్స్ పెరగడం, ఛాతినొప్పి, గుండెపోటు, పక్షవాతం, కాటరాక్ట్, గ్యాస్ట్రిక్ సమస్యలు

**రోగనిర్ధారణ:** ఫాస్టింగ్ బ్లడ్ షుగర్ (ఎఫ్‌బీఎస్), పోస్ట్ ప్రాండియల్ బ్లడ్ షుగర్ (పీపీబీఎస్), హెచ్‌బీఏవన్‌సీ, గ్లూకోజ్ టాలరెంట్ టెస్ట్ (జీటీటీ), యూరిన్ షుగర్ లెవల్, రాండమ్ షుగర్ లెవల్స్ (ఆర్‌బీఎస్)

వీటితో పాటు బ్లడ్ యూరియా, సీరమ్ క్రియాటినిన్, కొలెస్ట్రాల్ టెస్టులు చేయిస్తే కచ్చితమైన చికిత్స అందించవచ్చు.

**హోమియోచికిత్స:** జెనెటిక్ కాన్‌స్టిట్యూషన్ విధానం ద్వారా వ్యక్తిలోని డయాబెటిస్ జబ్బుని కాదు, జబ్బుతో ఉన్న వ్యక్తికి ట్రీట్‌మెంట్ చేయడం ద్వారా కాంప్లికేషన్స్ రాకుండా చూడవచ్చు. డయాబెటిస్ గుర్తించిన వెంటనే హోమియోపతి వైద్యంతో సంపూర్ణంగా నయం చేసే అవకాశం ఉంటుంది. అంతేకాకుండా చిన్న వయసులో అధిక ఒత్తిడి వల్ల వచ్చే స్ట్రెస్ డయాబెటిస్‌ను సంపూర్ణంగా నయం చేయవచ్చు.

**– డా॥ ఎమ్.శ్రీకాంత్**



# సాక్షరభారతం సాకారం దిశగా........

సాక్షరభారతం సాకారం చేయడం కోసం ప్రభుత్వాలు పలు పథకాలు ప్రవేశపెట్టి, అమలవుతున్నా సంపూర్ణ అక్యరాస్యత భారతావని దిశగా వడివడిగా అడుగులు పడడం లేదు. స్వాతంత్ర్యానంతరం దేశంలో వ్యవసాయరంగ అభివృద్ధితో పాటు,పరిశ్రమల అభివృద్ధికి పలు విధివిధానాలను రూపొందించిఅభివృద్ధిచెందుతున్న ఆర్థికవ్యవస్థగా భారత్‌ను నిలబెట్టడంలో ప్రభుత్వాల అవిరళ కృషి దాగిఉన్నది.దీనికి తోడు వ్యవసాయరంగ అభివృద్ధిని కాంక్షించిన ప్రభుత్వాలు నీటిపారుదల ప్రాజెక్టుల నిర్మాణానికి పూనుకొని నాగార్జున సాగర్ లాంటి బహుళార్ధక సాధక ప్రాజెక్టుల నిర్మాణంగావించి వ్యవసాయరంగ అభివృద్ధికి అహర్నిశలు కృషి చేసింది.ఇదిలా ఉంటే దేశంలో నిరక్ష్యరాస్యులు అధికంగాఉండడమే కాకుండా పేదరికరేఖకు దిగువన ఉన్న జనాభా సైతం అధికంగా ఉండడంతో నవనిర్మాణ భారత్ నిర్మాణాన్ని ఆవిష్కరించడానికి ఆశించినంతగా అత్యవసర అభ్యున్నతి కానరాక ఒకడుగు ముందుకు,రెండడుగులు వెనక్కి అన్నట్లుగా దేశంలో అభివృద్ధి తయారయ్యింది. అభివృద్ధికి ఆటంకంగా మారిన నిరక్ష్యరాస్యతను రూపుమాపడానికి ప్రభుత్వాలు విద్యారంగ అభివృద్ధికి పూనుకున్నాయి. దేశం లో నేటికీ నిరక్ష్యరాస్యుల సంఖ్య అధికంగా ఉన్నది.అట్టి నిరక్ష్యరాస్య జనాభాకు సైతం విద్యను అందిస్తేనే చదువు స్రవంతిలోకి ప్రవేశించి సంపూర్ణ అక్షరాస్యత సాకారమవుతుంది.లేకపోతే దేశంలోని జనాభాతోపాటు దేశాభివృద్ధి సైతంతిమిరంలో సమరం చేస్తూనే ఉంటుంది.దేశంలో అట్టడుగున ఉన్న గ్రామీణ జనాభా అధికంగా కలదు.దేశమంతా గ్రామాల సమాహారం గా నిర్మాణాత్మకమై ఉన్నది. పల్లె జనాభా గల భారతావని పల్లెసీమలసమగ్ర అభివృద్ధితోనే నయా భారత నిర్మాణం రూపుదిద్దుకొంటుంది. ఇలా మూరుమూల గ్రామాల్లోనూ సైతం ప్రభుత్వ పథకాలు ప్రవేశించి, ఆశించిన లక్ష్యాల దిశగా ముందుకు సాగితేనే అభివృద్ధి చెందిన ఆర్థిక భారతం దిశగా అడుగులు పడుతుంది.

దేశంలో దిగువబాగాన ఉన్న గ్రామాల్లో ప్రభుత్వానికి,ప్రజలకు మధ్య వారధిగా స్థానిక సంస్థలు పనిచేస్తున్నాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రణాళికలను అమలుపరచడం, ఆయా ప్రభుత్వాల పథకాల రూపకల్పన భాగస్వాములవుతూ,పథకాల అమలులోనూ స్థానిక ప్రభుత్వాలు క్రియాశీలకమైన పాత్రను పోషిస్తూ పల్లెల ప్రగతికి,స్థానిక అవసరాలకు అనుగుణంగా,స్థానిక అభివృద్ధికి పాటుపడతాయి.ఇలా అట్టడుగున ఉన్న స్థానిక ప్రభుత్వాలయిన పంచాయతీ రాజ్ సంస్థల భాగస్వామ్యంతోనే గ్రామాల్లో నిరక్షరాస్యతను రూపుమాపి,అక్షరాస్యులుగా తీర్చిదిద్దవని భావించిన ప్రభుత్వం పంచాయతీ రాజ్ సంస్థలను భాగస్వాములను చేస్తూ జాతీయ సాక్షరతా మిషన్ సాక్షరభారత్ కార్యక్రమానికి రూపకల్పన చేసి,అంతర్జాతీయ అక్షరాస్యత దినోత్సవాన్ని పురస్కరించుకుని 8 సెప్టెంబరు,2009న ప్రారంబించడం జరిగినది.సాక్షరభారత్ కార్యక్రమములో 15 సంవత్సరాల పైబడిన 7 కోట్ల ప్రజానీకాన్ని 31.3.2012 నాటికి అక్షరాస్యులుగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా ప్రవేశపెట్టడం జరిగినది. ప్రాథమిక అక్షరాస్యత, ప్రాథమిక విద్యనైపుణ్యాభివృద్ధి మరియు నిరంతర విద్యల సమ్మిళిత కార్యక్రమంగా సాక్షరభారత్ ను అమలుచేయడం జరుగుతున్నది.మన రాష్ట్రంలో 50 శాతం కంటే తక్కువ మహిళా అక్షరాస్యత గల 18 జిల్లాల్లో మొదటి దశలో కార్యక్రమంను అమలు చేసి,క్రమేపి అన్ని జిల్లాల యందు అమలుపరుచుతూ రాష్ట్రవ్యాప్తంగా అమలుపరచడం జరుగుతున్నది.కానీ సాక్షరభారత్ కేంద్రముల పనితీరు కొంత ఆశాజనకముగా ఉండడములేదన్న విమర్శలు వినవస్తున్నాయి.

“ మీరు ఒక సంవత్సరం కాలానికి ప్రణాళిక చేస్తున్నారా! అయితే వరి నాటండి,జీవిత కాలానికి ప్రణాళిక చేస్తున్నారా!అయితే ప్రజలను విద్యావంతుల్ని చేయండి”అని చైనా సామెత కలదు.అంటే దీర్ఘకాలిక అభివృద్ధికి,దేశ సమగ్ర అభివృద్ధికి ప్రజలను విద్యావంతులుగా తీర్చిదిద్దడమే ఏకైక సాధనం అని సామెత తెలుపుచున్నది.సమాజ సమగ్ర వికాసానికి విద్య ఎనలేని పాత్రను పోషిస్తుంది. విద్య ద్వారానే రాజకీయ,ఆర్థిక,సామాజిక,సాంస్కృతిక వికాసం ఏర్పడుతుంది.విద్య ద్వారా మాత్రమే సమసమాజస్థాపన సాకారానికి అంకురార్పణ గావించబడుతుంది.దేశ అభ్యున్నతికి ఆలవాలమైన విద్యారంగ అభివృద్ధితో పాటు,విద్యావకాశాలను అందుకోని నిరక్షరాస్యులుగా మిగిలిన వారిని అక్షరాస్యులుగా మార్చే బృహత్తరపథకాన్ని సాక్షరభారత్ పేరుతో కొనసాగుతున్నది.అభివృద్ధి విస్తృతమైనది.భౌతిక వసతుల కల్పనతో అభివృద్ధిలో ఆర్థికాభివృద్ధితో పాటు సామాజిక,మానవ వనరుల అభివృద్ధి చెందితేనే అభివృద్ధి పరిపూర్ణమవుతుంది.సామాజిక ఆర్థికాభివృద్ధికి అక్షరాస్యత కీలకం.అక్షరాస్యత ఒక అంతిమ ఫలితం కాదు.పలు అంతిమ ఫలితాలు సాధించేందుకు అక్షరాస్యత ఒక సాధనం.పదాలు చదవడం,వాక్యాలు రాయడం,లెక్కలుచేయడానికే అక్షరాస్యతను పరిమితం చేయరాదు.విద్యకు,విమర్శనాత్మక అవగాహనకు అక్షరాస్యత పునాది.వ్యక్తిగత,సామాజిక పురోగతి అక్షరాస్యత శక్తివంతమైన సాధనం.అక్షరాస్యత అధికంగా ఉన్న దేశాలలో అభివృద్ధిలో ముందంజలో ఉండడమే కాకుండా శిశుమరణాలు,మానవ సమగ్రవికాసాభివృద్ధి అధికంగా కలదు.అభివృద్ధి లక్ష్యం జీవన నాణ్యత పెంచడం.జీవన

నాణ్యతను పెంచడానికి అక్షరాస్యత కీలకం. అక్షరాస్యతలో ముందున్న రాష్ట్రాలు,దేశాలల్లో జీవననాణ్యత సూచనలు ఉన్నతంగా ఉన్నాయి. విద్య ద్వారా సాంస్కృతిక,సామాజిక ప్రయోజనాలు నెరవేరి సమసమాజ అభివృద్ధి దిశగా ముందుకు వెళుతూ అభివృద్ధిలో ముందంజలో ఉంటాయి.

జాతీయ సాక్షరతా మిషన్ నిర్వచనం ప్రకారం ఒక వ్యక్తిని అక్షరాస్యుడైనట్లుగా ప్రకటించాలంటేకనీస కార్యనిర్వాహక అక్షరాస్యత సాధించాలి. కార్యనిర్వాహక అక్షరాస్యత అంటే అక్షరజ్ఞానంలోనూ, సంఖ్యా పరిజ్ఞానంలోనూ స్వశక్తిని పొందడం, సమాజంలో తాము అణచివేయబడడానికి గల కారణాలు గ్రహించి అణిచివేతకు దారితీస్తున్న పరిస్థితులను అధిగమించడానికి సంసిద్ధులుగా తయారుచేయడం,తమ జీవనస్థాయి,ఆర్థిక పరిస్థితులు మెరుగు పరుచుకోవడానికి అవసరమయ్యే నైపుణ్యాల్ని అలవరచుకోవడం,జాతి సమైక్యం,పరిసరాల పరిరక్షణ,స్త్రీ సమానత్వం,చిన్న కుటుంబ సూత్రాలు అనే నాలుగు జాతీయ విలువలను పెంపొందించుకోవడం లాంటి కార్యనిర్వాహక అక్షరాస్యతను సాధిస్తే ఆయా వ్యక్తిని అక్షరాస్యుడు అయినట్లుగా ప్రకటించవచ్చని సాక్షరతా మిషన్ తెలిపింది. సాక్షర భారత్ ప్రధాన లక్ష్యాలు నాలుగు కలవు. అవి. 1.ప్రాథమిక అక్షరాస్యత అంటే అక్షరాస్యత,సంఖ్యా పరిజ్ఞానం లేని వయోజనులకు ప్రయోజన అక్షరాస్యత,సంఖ్యా పరిజ్ఞానం అందించడం. 2.ప్రాథమిక విద్య: ప్రాథమిక అక్షరాస్యతను మించి తమ చదువు కొనసాగించేందుకు,నియత విద్యకు సమతుల్యమైన విద్యను పొందేందుకు వయోజన నూతన అక్షరాస్యులకు అవకాశాలు కల్పించడం. 3. నైపుణ్యాభివృద్ధి : నూతన అక్షరాస్యులు,ఇతరులు వారి సంపాదన,జీవన పరిస్థితులను మెరుగుపరచుకోవడానికి తగు నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు అందించడం. 4.నిరంతర విద్య:వయోజన నూతన అక్షరాస్యులకు,ఇతరులకు నిరంతర విద్యకు అవకాశాలు కల్పించడం. అక్షరాస్యత,అక్షరాస్యనంతర,నిరంతర విద్యాకార్యక్రమాలను ఒకదాని తర్వాత మరొకటి వరుస క్రమంలో నడపడం కాకుండా పరస్పర కొనసాగింపుగా కలగలిపి నడపడం సాక్షరభారత్ ప్రత్యేకత. ఇలా పైన తెలిపిన నాలుగు లక్ష్యాలతో అభ్యాసన సమాజాన్ని,జ్ఞాన సమాజాన్ని ఆవిష్కరించడమే ధ్యేయం. అంతే కాకుండా 15 సంవత్సరాల వయస్సు పైబడిన 7 కోట్ల వయోజన నిరక్షరాస్యులకు ప్రాథమిక అక్షరాస్యతను అందించడం, 15 లక్షల వయోజనులకు ప్రాథమిక విద్యను సమతుల్య కార్యక్రమాల ద్వారా అందించడం,వృత్తి నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడమే నిర్దిష్ట లక్ష్యాలుగా సాక్షరభారత్ పథకము రూపకల్పన చేయడం జరిగింది. సాక్షరభారత్ అమలుకు గాను గ్రామాల్లో లోక్ శిక్షా కేంద్రము కార్యక్రమాల నిర్వహణ,అనుసంధాన కేంద్రముగా పనిచేస్తుంది. లోక్ శిక్షా సమితులు గ్రామ కోఆర్డినేటర్ ల ఆధ్వర్యంలో గ్రామంలో నడుపబడుతూ మండలలోక్ శిక్షాసమితి,జిల్లా లోక్‌శిక్షాసమితి సూచనలమేరకు పథకము అమలు,కార్యక్రమాల రూపకల్పన చేయడం జరుగుతున్నది. గ్రామస్థాయిలో ఉండే కో ఆర్డినేటర్‌ల పనితీరుపైననే పథకము అమలు ఆధారపడి ఉన్నది. కానీ ఆశించినంతగా అమలు కావడం లేదన్న విమర్శలు ఉన్నాయి. ప్రతి పంచాయతీలో లోక్ శిక్షాసమితి ప్రజా విద్యాకేంద్రం నిర్వహించడం,నిర్వహించిన కార్యక్రమ వివరాలు డాక్యుమెంటు చేయడం, పంచాయతీ ప్రజా విద్యాసమితి, అక్షరాస్యతా కేంద్రాల నిర్వహణకు ప్రాజెక్టు నివేదికను తయారుచేయడం,అక్షరాస్యత అనుకూల వాతావరణ కల్పన,గ్రామపంచాయతీ లో నిరక్షరాస్య పురుషుల,స్త్రీలను గుర్తించడం,వాలంటీర్లను,ప్రేరక్‌లను ఎంపికచేయడం లాంటి ప్రధానమైన విధులతో సాక్షరభారత్ కేంద్రాలు పనిచేయవలసి ఉంటుంది. కానీ గ్రామాల్లో కో ఆర్డినేటర్‌ల పనితీరు నానాటికీ తీసికట్టుగా తయారయ్యిందన్న విమర్శలు లేకపోలేదు. దానికి తోడు కో ఆర్డినేటర్‌లకు చెల్లించే వేతనములు,భత్యములు,ప్రోత్సాహకాలు కూడా సకాలములో అందక వారి పనితీరు మెరుగుపడడము లేదన్న విమర్శలు ఉన్నాయి. గ్రామ స్థాయిలో కోఆర్డినేటర్‌ల పనితీరు మెరుగుపడాలంటే,పథకము అమలులో విజయవంతముగా పనిచేయాలంటే వారికి అందించాల్సిన ఆర్థిక అవసరాలను సకాలములో అందిస్తేనే వారు సాక్షర భారత్ కేంద్రములను సమర్థవంతముగా నడపడానికి ఆస్కారము ఉంటుంది. సభలు, సమావేశములు ఏర్పాటు చేయవలెనన్న వారికి కూడా ఆర్థికఅవసరాలు సకాలములో అందజేయాలి. కొన్ని గ్రామాల్లో కేంద్రముల ఏర్పాటుకు వసతి సౌకర్యము లేదు. గ్రామపంచాయతీఆవరణలోనే చాలా కేంద్రములు నెలకొల్పడం జరిగింది. కానీ కేంద్రముల ఏర్పాటుకు వసతికొరకు అదనముగా భత్యము చెల్లించి కిరాయికి లేదా పాఠశాలల యందు లేదా అంగన్‌వాడీ కేంద్రముల యందు నిర్వహించుకునే విధముగా ఏర్పాట్లు చేస్తే విద్యావిషయక కేంద్రముల అన్నియూ ఒకే సమూహముగా ఉండి అభ్యాసకులకు సైతం అందుబాటులో ఉండడం ద్వారా వీలయినంత త్వరగా కేంద్రములకు చేరుకుని అక్షరాస్యతను అందిపుచ్చుకునే అవకాశము ఉంటుంది. సాక్షరభారత్ సమావేశములను నెలకోసారిసమీక్షించుకుని నిరక్షరాస్యులను గుర్తించడం,వారిని అక్షరాస్యులను తీర్చిదిద్దడం లాంటి ఎజెండా అంశాలతో నిర్దిష్ట లక్ష్యాలతో ముందుకు వెళితేనే సాక్షరభారతం దిశగా అడుగులు పడతాయి. సాక్షరభారత్ కేంద్రమల పనితీరు మెరుగుపరచడానికి సమూల మార్పులు అవసరమున్నది. సాక్షరభారత్ కేంద్రముల పనితీరును తీర్చిదిద్దడానికి గ్రామస్థాయిలో ఉన్న అన్ని శాఖల ఉద్యోగులను,ప్రజాప్రతినిధులను సమన్వయపరిచి నెలకోసారి సమీక్షా సమావేశములు నిర్వహించాలి. గ్రామములో ప్రభుత్వ అనుబంధ లేదా ఇతర రంగాల్లో పనిచేయుచున్న ఉద్యోగులు,గౌరవ వేతనము అందుకొనువారు అందరినీ మొదటగా అక్షరాస్యులుగా తీర్చిదిద్దేలా కార్యాచరణ రూపొందించుకోవాలి. అదే విదముగా ప్రభుత్వం నుండి మరే ఇతర లబ్ధిపొందుతున్న లబ్ధిదారులు ఎవరైనా అక్షరాస్యులుగా తీర్చిదిద్దేలా ప్రణాళిక రూపొందించుకుని వారి ద్వారా మరికొంతమందిని అక్షరాస్యులను తయారుచేసేలా రూపకల్పన చేసుకోవాలి. ఇలా సమూల మార్పులతో సాక్షరభారత్ కేంద్రముల పనితీరు తీర్చిదిద్దుతేనే పథకము విజయవంతముగా ముందుకు వెళుతూసాక్షరభారతంగా దిశ పయనించి, నిరక్ష్యరాస్యతను ప్రారద్రోలిన సమాజము విజ్ఞానవంతముగా, వికాసవంతముగా అభివృద్ధిలో పురోగమించడానికి దోహదపడుతుంది. నిరక్ష్యరాస్యులు లేని సమాజముతోనే మానవవనరుల వినియోగం,జీవన నాణ్యత మెరుగుపడి ఆరోగ్యవంతమైన భారత్ గా ఆవిష్కృతమైతేనే ఆధునిక భారత్‌గా రూపుదిద్దుకొంటుంది.

**చింతల దేవేందర్, భూపాలపల్లి జిల్లా.**




- జిల్లాలో గణనీయంగా పెరిగిన బాలికల నిష్పత్తి
- 1000 మంది బాలలకు 953 మంది బాలికలు
- ఫలిస్తున్న జిల్లా యంత్రాంగం కృషి

# బేటీ బచావోలో.. మేటి జిల్లా




ఆడపిల్ల పుడితే అరిష్టం.. అన్నది ఇదివరకటి మాట. కానీ ఇప్పుడు ఆడపిల్ల పుడితే లక్ష్మీదేవి పుట్టిందనుకునే తల్లిదండ్రుల సంఖ్య పెరుగుతోంది. మా ఇంట్లో పుట్టే బిడ్డ ఓ సానియా మీర్జా.. పీవీ సింధు.. సైనా నెహ్వాల్ ఎందుకు కాకూడదని తల్లిదండ్రులు భావిస్తున్నారు. హైదరాబాద్ జిల్లాలో బాల బాలికల నిష్పత్తి గణనీయంగా పెరగడమే దీనికి సాక్ష్యం. జిల్లాలో బాలికల నిష్పత్తి 30 శాతంమేర పెరగడం గమనార్హం. జిల్లా యంత్రాంగం సహా, మహిళా స్త్రీ శిశు సంక్షేమం, వైద్యారోగ్యశాఖ, విద్యాశాఖలు సమష్టి కృషి ఫలితాలనిస్తోంది.

మూడేళ్లుగా పటిష్ట ప్రణాళికతో ముందుకెళ్లిన జిల్లా యంత్రాంగం లక్ష్యాన్ని సాధించడంలో సక్సెస్ అయ్యింది. 2011 జనాభా లెక్కల ప్రకారం జిల్లా బాలబాలికల నిష్పత్తి1000/918 మాత్రమే. రాష్ట్రవ్యాప్తంగా ప్రతీ వెయ్యిమంది బాలురకు 932 బాలికలు ఉంటే, హైదరాబాద్‌లో కేవలం 918 మాత్రమే ఉండటం విస్మయం కలిగించిన అంశం. పైగా బాలికల నిష్పత్తి అత్యంత తక్కువగా ఉన్న 100 జిల్లాల్లో హైదరాబాద్ ఒకటిగా ఉంది. కాని కాలక్రమేణా పరిస్థితుల్లో మార్పు వస్తోంది. ఏడాదికేడాది బాలికల నిష్పత్తి పెరుగుతోంది. దీనికి తోడు స్త్రీశిశు సంక్షేమశాఖ సైతం బాలికల సంఖ్యను పెంచేందుకు ప్రత్యేక చొరవ తీసుకుంటోంది. 2014 నుంచి బేటీ బచావో – బేటీ పడావో కార్యక్రమాన్ని జిల్లాలో పటిష్టంగా అమలుచేస్తూ వస్తున్నారు. ఏడాదికి బాలికల నిష్పత్తిని 10 పాయింట్లు

| నెల నెల వివరాలు... | | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|---|
| | 2014 | | | 2015 | | | 2016 | | |
| మాసం | బాలురు | బాలికలు | మొత్తం | బాలురు | బాలికలు | మొత్తం | బాలురు | బాలికలు | మొత్తం |
| జనవరి | 3310 | 3129 | 6439 | 3302 | 3171 | 6473 | ---- | ---- | ---- |
| ఫిబ్రవరి | 3311 | 3147 | 6458 | 3282 | 3476 | 6758 | ---- | ---- | ---- |
| మార్చి | 3237 | 3078 | 6313 | 3289 | 3187 | 6476 | ---- | ---- | ---- |
| ఏప్రిల్ | 2851 | 2953 | 5804 | 3143 | 2997 | 6140 | 3292 | 3101 | 6393 |
| మే | 3356 | 3158 | 6514 | 3290 | 3129 | 6419 | 3295 | 3114 | 3409 |
| జూన్ | 3174 | 3064 | 6238 | 3294 | 3111 | 6405 | 3086 | 2989 | 6075 |
| జూలై | 3474 | 3307 | 6781 | 3261 | 3095 | 6356 | 3189 | 3023 | 6212 |
| ఆగస్టు | 3326 | 3156 | 6482 | 3375 | 3151 | 6528 | 3009 | 2897 | 5906 |
| సెప్టెంబర్ | 3389 | 3294 | 6686 | 3147 | 2944 | 6091 | ---- | ---- | ---- |
| అక్టోబర్ | 4182 | 3249 | 7431 | 3279 | 3203 | 6482 | ---- | ---- | ---- |
| నవంబర్ | 3308 | 3252 | 6560 | 3543 | 3327 | 6870 | ---- | ---- | ---- |
| డిసెంబర్ | 3343 | 3170 | 6513 | 3287 | 3066 | 6353 | ---- | ---- | ---- |

2015 ఫిబ్రవరి మాసంలో బాల బాలికల నిష్పత్తిలో గణనీయమైన మార్పు కనిపించింది. మూడేళ్ల కాలంలో ఎన్నడూ లేని విధంగా ఈ మాసంలో బాలుర కంటే బాలికలే అత్యధికంగా జన్మించడం గమనార్హం. ఈ నెలలో బాలురు 3282 మంది పుడితే బాలికలు, 3476 మంది పుట్టారు. బాలుర కంటే 194 బాలికలు ఎక్కువగా జన్మించడం గమనార్హం.

| బాలబాలికల నిష్పత్తి వివరాలు... | | | |
|---|---|---|---|
| | 2014 | 2015 | 2016 (ఆగస్టు వరకు) |
| పుట్టిన బాలురు | 40,261 | 39,492 | 15,871 |
| పుట్టిన బాలికలు | 37,955 | 37,857 | 15,124 |
| మొత్తం | 78,216 | 77,349 | 30,995 |
| నిష్పత్తి | 1000:942 | 1000:958 | 1000:953 |

పెంచాలని లక్ష్యంగా పెట్టుకుంటే కేవలం రెండేళ్లకాలంలోనే 918 నుంచి 958కి తీసుకురాగలిగారు.

**కాలం మారుతోంది..**

ఇది వరకు సమాజంలో ఆడ, మగ తేడాలు బలంగా నాటుకున్నాయి. మగ పిల్లలతో పోల్చుకుంటే.. ఆడపిల్లలపై వివక్ష.. చిన్నచూపు స్పష్టంగా కనబడేది. కానీ, రానుకాను కాలం మారుతోంది. ఇటీవలి కాలంలో మహిళలు అన్నీ రంగాల్లో దూసుకుపోతుండటం, ఉద్యోగావకాశాలు పెరగడం ఆడపిల్లల సంఖ్య పెరగానికి కారణమవుతోంది. పాఠశాల విద్య నుంచి ఉన్నత విద్యవరకు అన్నింటా బాలికలే ముందంజలో ఉంటున్నారు. విద్య- ఉపాధి అంశాల్లో రిజర్వేషన్లు, సమాన వాటా లభించడం సైతం ఆడపిల్లలపై సమాజవైఖరిలో మార్పుకు కారణమైంది.

**ఫలితాలనిచ్చిన చర్యలు..**

వాస్తవికంగా తల్లులకు కొడుకులు, తండ్రులకు బిడ్డలంటే ఇష్టం.. ఈ విషయం సైకాలజీ పరంగా సైతం నిర్ధారణ అయ్యింది. అయితే ఇటీవలికాలంలో ఆడపిల్లలను కావాలనుకునేవారి సంఖ్య ఎక్కువవుతోంది. తక్కువ ఖర్చుకే పిండ నిర్ధారణ పరీక్షలు లభించడంతో గతంలో పుట్టేవారు ఆడ, మగ తెలుసుకునే వీలుండేది. ఆడపిల్లలను పిండదశలోనే గుర్తించే గర్భస్థ పూర్వ, గర్భస్థ పిండ నిర్ధారణ నిషేధ చట్టాన్ని పీఎన్‌డీటీ, పోస్కో చట్టాలను పటిష్టంగా అమలు చేస్తున్నారు. జిల్లాలోని ప్రైవేట్ హాస్పిటళ్లపై ప్రత్యేక నిఘాపెట్టారు. దీంతో అనుకూల ఫలితాలు వస్తున్నాయని, బాలికల నిష్పత్తి ఇది కూడా కారణమని భావిస్తున్నారు.

**- ఐ & పిఆర్**



## జాతీయ గ్రామీణాభివృద్ధి సంస్థ ,పంచాయితీ రాజ్‌ల మధ్య ఎంవోయు నిలకడైన

# గ్రామీణాభివృద్ధిలో మహిళల పాత్ర



నిలకడైన గ్రామీణాభివృద్ధిలో మహిళల పాత్ర పెంచాలని కేంద్ర ప్రభుత్వం భావిస్తోంది. ఆ మేరకు మహిళా చైతన్య కార్యక్రమాలను రూపొందిస్తుంది. దేశంలోని ఔత్సాహిక మహిళలను గ్రామీణాభివృద్ధిలో భాగస్వామ్య చేయడానికి వేగవంతమైన చర్యలు తీసుకుంటుంది. దేశ వ్యాప్తంగా రాష్ట్రాల వారిగా మహిళా ప్రతినిధులకు ప్రత్యేక శిక్షణ ఇవ్వడానికి చర్యలు చేపట్టింది. ఈ మేరకు వివిధ సంస్థలతో అవగాహణ ఒప్పందాలను చేసుకుంటుంది. మహిళలు స్వతంత్రంగా నిర్ణయాలు తీసుకొనే విధంగా వివిధ అంశాలపై అవగాహణ కలిగించడం కోసం వివిధ స్థాయిల్లో శిక్షణ ఇవ్వడం జరుగుతుంది. పురుషులతో పోలిస్తే మహిళా ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు అత్యంత ఉత్పాదక ఫలితాలను సాధిస్తున్నారు. ఈ విషయాన్ని జాతీయ మహిళా సంఘం (ఎన్ సి డబ్ల్యు) చైర్ పర్సన్ లలితా కుమార మంగళం వెల్లడించారు. హైదరాబాద్ లోని రాజేంద్ర నగర్ లో నెల రోజుల పాటు జరుగనున్న జాతీయ గ్రామీణాభివ ృద్ధి సంస్థ, పంచాయతీ రాజ్ (ఎన్ ఐ ఆర్ డి అండ్ పి ఆర్) స్థాపక దిన కార్యకలాపాలు నవంబర్ 9న ఆరంభమైన సందర్భరేగా ఆమె మరిన్ని వాస్తవాలను తెలిపారు. గ్రామీణ మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకొనేందుకు అట్టడుగు స్థాయికి వెళ్లవలసిన అవసరం ఎంతయినా ఉందని ఆమె పేర్కొన్నారు. మహిళల కోసం ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ప్రవేశపెట్టాలని, వారు కూడా వారి నెట్ వర్కింగ్ ప్రావీణ్యాలను మెరుగుపరచుకోవాలని లలితా కుమార మంగళం సూచించారు. 'గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చిన మహిళలతో మేము కలిసి పనిచేసేటప్పుడు నిర్ణయాలు తీసుకోనే ప్రక్రియలో వారికి ప్రమేయం ఉండటం లేదని గ్రహించాం. సభలను నిర్వహించడం, ఖాతాలను రూపొందించడం, రిపోర్టింగ్, వివిధ ప్రభుత్వ కార్యాలయాలతో సంబంధాలు, చట్టాలపై అవగాహన కలిగి ఉండడం వంటి అంశాలను ఎక్కువ మంది పంచాయితీ నేతలు అర్థం చేసుకోవడం లేదని కనుగొన్నాం. అందుకే వారు నిర్ణయాలు తీసుకొనే ప్రక్రియలో పాలు పంచుకోవడం వారికి ఎంతో కష్టంగా ఉంటోంద'ని ఎన్ సి డబ్ల్యు సారథి తెలిపారు. నిజానికి మహిళలు వారు విజయవంతమైన సర్పంచ్ లు గాని, లేదా పంచాయతీ సభ్యులు గాని అయితే వారికి ఉండే నిర్ణయాలు చేసే శక్తి వల్ల చాలా ఎక్కువ గౌరవం దక్కుతుందనుకున్నారు అని లలితా కుమారమంగళం వివరించారు. మహిళలు వారి నిర్ణయాలను వారే తీసుకొనేందుకు వీలుగా వారికి సాధికారతను సమకూర్చే ప్రయత్నంలో శిక్షణ ఒక భాగం అని, ఈ శిక్షణ వారి సముదాయాలకు తోడ్పాటును అందించే



విధంగా వారిని తయారు చేయగలదని తెలిపారు. ట్రైనింగ్ ఆఫ్ ట్రైనర్స్ (టి ఒ టి) త్వరలోనే ఆరంభం అవుతుందని ఆమె చెప్పారు. ఎన్ సి డబ్ల్యు ఒక యాప్ ను రూపొందిస్తోందని కూడా ఆమె వెల్లడించారు. ఎన్నికైన మహిళా ప్రతినిధులకు ఐటిని ఎలా వినియోగించుకోవాలి, మరుగుదొడ్లు, రహదారులు ఎలా నిర్మించాలి వంటి అంశాలను బోధించడం జరుగుతుందని ఆమె వెల్లడించారు. ఈ ఆర్థిక సంవత్సరం నుంచి మొదలుపెట్టి సుమారు 2 లక్షల కోట్ల రూపాయలను పంచాయతీలకు నేరుగా



బదలాయించడం జరగనుందని తెలిపారు. ప్రస్తుతం దేశంలోని పంచాయతీ ప్రధాన్ లలో 53 శాతం మంది మహిళలు ఉన్నారని



కుమార మంగళం తెలిపారు.

ఈ సందర్భంగా పంచాయతీలకు ఎన్నికైన మహిళా ప్రతినిధులకు పరిపాలనలో సామర్థ్యం పెరిగే విధంగా వారికి శిక్షణను ఇవ్వడం కోసం జాతీయ మహిళా సంఘం (ఎన్ సి డబ్ల్యు), జాతీయ గ్రామీణాభివృద్ధి సంస్థ, పంచాయతీ రాజ్ (ఎన్ ఐ ఆర్ డి అండ్ పి ఆర్) లు ఒక అవగాహన పూర్వక ఒప్పంద (ఎమ్ ఒ యు) పత్రంపై సంతకాలు చేశాయి. మహిళల సాధికారిత కోసం, మరీ ముఖ్యంగా పంచాయతీలకు మహిళా ప్రతినిధులుగా ఎన్నికైన వారికి శిక్షణను అందించడం కోసం వివిధ కార్యకలాపాలను చేపట్టడంలో భాగస్వామ్యాన్ని ఏర్పరచుకోవడంపై ఈ ఎమ్ ఒ యు దృష్టి సారిస్తుంది. శిక్షణ ఒకటవ దశలో భాగంగా రాజస్థాన్ లోని ఆరు జిల్లాలలో 9 వేల మందికి పైగా ఎన్నికైన మహిళా ప్రతినిధులకు శిక్షణను ఆరంభిస్తారు. ఆ తరువాత జార్ఖండ్, అస్సాం లలో ఈ శిక్షణను కొనసాగనుంది. సభా నిర్వహణ, నగదు నిర్వహణ, సమాచార సాంకేతిక విజ్ఞాన (ఐటీ) సంబంధ శిక్షణ, పరిపాలన తదితర విషయాలలో శిక్షణ ఉంటుందని ఎన్ సి డబ్ల్యు చైర్ పర్సన్ లలిత కుమార మంగళం తెలిపారు. మహిళలు స్వయంగా నిర్ణయాలు తీసుకొనే దిశగా ప్రస్తుతం తాము చేపట్టిన శిక్షణ ఒక ముందడుగు అని ఆమె అన్నారు.

"నిలకడైన గ్రామీణాభివృద్ధి కోసం మహిళలను చైతన్య పరచడం" అనే అంశంపై ఓర్వకల్ మహిళా పొదుపు లక్ష్మి ఐక్య సంఘం సలహాదారు విజయభారతి కీలకోపన్యాసం ఇచ్చారు. అణగారిన వర్గాల మహిళలు ఎదుర్కొంటున్న అనేక సమస్యలకు స్వయం సహాయక బృందాలు (ఎస్ హెచ్ జి లు) ఒక పరిష్కారాన్ని చూపాయని ఆమె చెప్పారు. ఎస్ హెచ్ జి లు కేవలం బ్యాంకింగ్ లావాదేవీలకే పరిమితం కాలేదని, అవి మహిళలలో చైతన్యాన్ని ప్రోది చేస్తున్నాయని ఆమె అన్నారు. ఈ బృందాల పనితీరు మహిళల క్రెడిట్ వర్తీనెస్ ను చాటిచెప్పిందని ఆమె అన్నారు. ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ నాయకత్వంలో ది రూరల్ లైవ్ లీ హుడ్ మిషన్, దీన్ దయాళ్ ఉపాధ్యాయ గ్రామ్ జ్యోతి యోజన లు చక్కగా పనిచేస్తున్నాయని ఆమె అన్నారు.

ఎన్ ఐ ఆర్ డి అండ్ పి ఆర్ డైరెక్టర్ జనరల్ శ్రీ డబ్ల్యు. ఆర్. రెడ్డి మాట్లాడుతూ గ్రామీణాభివృద్ధికి శిక్షణను అందించడంలోను, గ్రామీణాభివృద్ధి సంబంధిత పరిశోధనలు నిర్వహించడంలోను ఎన్ ఐ ఆర్ డి పెట్టింది పేరు అని పేర్కొన్నారు. గ్రామీణాభివృద్ధి కార్యకలాపాలలో ప్రపంచంలోని ఇతర దేశాలు అనుసరించదగిన ఆదర్శప్రాయ నమూనాగా భారతదేశం ఆవిర్భవించే అవకాశం ఉందని చెప్పారు. ఎన్ సి డబ్ల్యు ట్రైనింగ్ మాడ్యూల్స్ ను రూపొందించిందని తెలిపారు. "మేము ఈ ట్రైనింగ్ మాడ్యూల్స్ ను ఉపయోగించుకొని మాస్టర్ ట్రైనర్స్ కు శిక్షణ అందిస్తాం, వారు వేరు వేరు క్లస్టర్ లలో ఎన్నికైన ప్రతినిధులకు శిక్షణ ఇస్తారు అని శ్రీ డబ్ల్యు. ఆర్. రెడ్డి అన్నారు. "ఇది ప్రాథమికంగా ఒక సంవత్సరం పాటు జరిగే కార్యక్రమం. దీనిని రాజస్థాన్ ప్రభుత్వ సహకారంతో నిర్వహిస్తామని పేర్కొన్నారు.

**– శంకర్ పంతంగి**



# నల్లగొండ జిల్లాలో ఫ్లోరైడ్ నియంత్రణా కార్యక్రమంలో భాగంగా సర్పంచులు, అధికారులకు టిసిపార్డ్‌లో శిక్షణకై ప్రణాళికలు

త్రాగునీటిలో పరిమితస్థాయి కంటే ఫ్లోరైడ్ శాతం ఎక్కువగా ఉండటం వల్ల వచ్చే ఫ్లోరోసిస్ వ్యాధి తద్వారా వచ్చే ఇతర దుష్పరిణామాలతో బాధపడుతోన్న జనసంఖ్య ఎక్కువగా ఉండే జిల్లాలలో నల్గొండ జిల్లా ఒకటి. అందులోనూ ముఖ్యంగా 17 మండలాల్లో (1108 జనావాసాలు) ఈ సమస్య మరీ ఎక్కువగా ఉంది. ఈ సమస్యను అధిగమించే దిశలో జిల్లా కలెక్టర్ అధ్యక్షతన ఏర్పడిన జిల్లా ఫ్లోరైడ్ నియంత్రణ కేంద్రం (డిఎఫ్ఎంసి) యునిసెఫ్ సహకారంతో వివిధ రకాల చర్యలకు ఉపక్రమించింది.

ఈ చర్యలపై చర్చించటానికి నవంబర్ 5, 2016 తేదీన నల్లగొండ ఆర్‌డబ్ల్యుఎస్ఎస్ సమావేశ మందిరంలో ఒక వర్క్‌షాప్ నిర్వహించడమైనది. ఈ చర్యలలో భాగంగా టిసిపార్డ్‌లో సర్పంచులకు, అధికారులకు శిక్షణా కార్యక్రమాలు నిర్వహించాలని నిశ్చయించడమైనది.

నల్లగొండ జిల్లా కలెక్టర్ శ్రీ గౌరవ్ ఉప్పల్ అధ్యక్షతన జరిపించిన ఈ వర్క్‌షాప్‌లో యునిసెఫ్ ప్రతినిధులు ఎఫ్.క్యాన్ ప్రజాప్రతినిధులు సామాజిక కార్యకర్తలు, ఆర్‌డబ్ల్యుఎస్ఎస్ ఇంజనీర్లు టిసిపార్డ్ ప్రతినిధులు పాల్గొన్నారు. టిసిపార్డ్ తరపున జాయింట్ డైరెక్టర్ శ్రీ కె.యాదయ్యగౌడ్‌తో సెంటర్ హెడ్ సిడబ్ల్యుఎస్ శ్రీ ఎ.నాగేశ్వర్‌రావు, శ్రీమతి విద్యుల్లత పాల్గొన్నారు.



# తెలంగాణ సంస్కృతిని చాటిన మహనీయులు

మన దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత కూడా హైదరాబాద్ సంస్థానం ఒక స్వతంత్ర్య సంస్థానంగా ఉండేది. నిజాం పాలన నుంచి 1948 సెప్టెంబర్ 17న విముక్తి పొంది హైదరాబాద్ రాష్ట్రంగా ఏర్పడి 1956లో భాషా ప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటులో భాగంగా ఆధ్ర రాష్ట్రంగా ఏర్పడింది. అయితే మన తెలంగాణ భౌగోళికంగా చూస్తే అనేక భిన్న సంస్కృతులకు నెలవైవుంది. అందుకు కారణం ఈ ప్రాంతంలో అనేక ప్రాంతాల నుంచి వచ్చి ఇక్కడ స్థిర నివాసం ఏర్పరుచుకుని జీవించేవారే ఎక్కువ. ఇక్కడ సంస్కృతిని ఆకలింపు చేసుకొని ప్రజల జీవన విధానలతో మమేకమైనవారు అనేక మంది ఉన్నారు. మన పొరుగు రాష్ట్రాలైన కన్నడ, మళయాళ, తమిళ, మరాఠీ ప్రజలు మన జీవన విధానాలకు అలవాటుపడి భిన్నత్వంలో ఏకత్వంగా మసలుకుంటున్నారు.

ఈ నేపద్యంలో మన సంస్కృతి, సాంప్రదాయాలకు ఆలవాలమైన అనేక పండుగలు, మన రాష్ట్రానికే చెందుతాయి. వాటిల్లో ప్రస్తుతం విశ్వవ్యాప్తంగా జరుపుకుంటున్న బతుకమ్మ, బోనాలు మొదలైనవి ముఖ్యమైనవి. ఈలాంటి సాంస్కృతిని చాటి చెప్పిన మహనీయులు మన రాష్ట్రంలోనే జన్మించటం మనం చేస్తుకున్న మహా పుణ్యం. కావున వారి గురించి, వారి యొక్క విశిష్టత మరియు మన తెలంగాణ సాంస్కృతి సాంప్రదాయలకు ఎనిలేని కృషి చేసిన వారిని మనం స్మరించుకోవటం మన విధి. వారిలో తెలుగులో తొలి రామాణకర్త అయిన గోన బుద్ధారెడ్డి, సహజ కవి బమ్మెర పోతన, ఆదిరాజు వీర భద్రరావు, ధాశరధి కృష్ణమాచార్యులు, డా॥ సి. నారాయణ రెడ్డి, సురవం ప్రతాపరెడ్డి మొదలైన వారు మన తెలంగాణ సంస్కృతిని చాటిచెప్పిన వారిలో ప్రముఖులు.

**(1) బమ్మెర పోతన:-**



ఈయన నేటి వరంగల్ జిల్లాలోని బమ్మెర గ్రామంలో జన్మించారు. మహాకవి, ప్రజాకవి పండిత పామరులను అందరినీ మెప్పించే విధంగా పద్యాలను రాసిన మహాకవి ఈయన సంస్కృతంలో ఉన్న శ్రీమద్భాగవతమును ఆంధ్రీకరించి తన జన్మనీ, తెలుగు భాషను, తెలుగు వారిని ధన్యులు చేసిన గొప్ప వ్యక్తి. ఈయన ఆంధ్రీకరించిన శ్రీమద్భాగవతములోని పద్యాలను వినని తెలుగువాడు లేడంటే అతిశయోక్తి కాదు. ఇంకా పోతన శ్రీరాముని ఆజ్ఞపై శ్రీకృష్ణుని కథ, విష్ణుభక్తుల కథలు ఉన్న భాగవతమును తెలుగులో వ్రాశారు. ఆంధ్ర భాగవతమును రచించిన మహాకవి. ఈ భాగవతంలో మొత్తం తెలుగుతనం ఉట్టి పడుతుంది.

**(2) ఆదిరాజు వీరభద్రరావు (నవంబర్ 16, 1890 నుండి సెప్టెంబర్ 28, 1973):-**



మన తెలంగాణ ప్రాంతపు చరిత్ర, సంస్కృతిపై విశేష పరిశోధన చేసిన గొప్ప భాషా శాస్త్రవేత్త అయిన ఆదిరాజు వీరభద్రరావు ఖమ్మం జిల్లా దెందుకూరు గ్రామంలో నవంబర్ 16న 1890లో జన్మించారు. చిన్న వయస్సులో ఉన్నప్పుడే తండ్రి లింగయ్య మరణించడంతో దూరపుబంధువైన రావిచెట్టు రంగారావు ప్రొత్సాహం, సహాయంతో విద్యనుభ్యసించినారు అదే విధంగా రావిచెట్టు రంగారావు ఇంట్లో నెలకొల్పిన శ్రీకృష్ణదేవరాయాంధ్ర భాషా నిలయం గ్రంధాలయానికి తొలి గ్రంధపాలకుడిగా నియమితులైనారు.

1908వ సం॥లో కొమర్రాజు లక్ష్మణరావు నెలకొల్పిన "విజ్ఞాన చంద్రికామండలి" హైదరాబాదు నుంచి మద్రాసుకు తరలించిన సమయంలో లక్ష్మణరావు విజ్ఞప్తి మేరకు వీరభద్రరావు కూడా మండలిలో పనిచేయడానికి మద్రాసుకు వెళ్లారు. మండలిలో పనిచేస్తున్న సమయంలో అనేక ప్రసిద్ధ రచయితలు, కవులు, పండితులు మరియు పరిశోధకులతో పరిచయం ఏర్పడింది. 1914లో హైదరాబాద్ తిరిగివచ్చి మహబూబ్ కళాశాలలో తెలుగు ఆచార్యునిగా చేరారు. ఆ తరువాత చాధర్‌ఘాట్ ఉన్నత పాఠశాలలోను, నారాయణగూడాలోని బాలికోన్నత పాఠశాలలోను తెలుగు పండితునిగా పనిచేసారు.

1921లో తెలంగాణ సాహితీ సాంస్కృతిక వికాసానికై ఆంధ్ర పరిశోధిక మండలి స్థాపించినప్పుడు దానికి కార్యదర్శిగా పనిచేసారు. ఆ సంస్థ 1935లో తెలంగాణలోని పలుచారిత్రాత్మక ప్రదేశాలు, శిలశాసనాలు, తాళపత్ర గ్రంథాలు సేకరించి "తెలంగాణ శాసనాలు" పేరిట పెద్ద గ్రంధాన్ని ప్రచురించటంలో ఆదిరాజు కృషి ఎనలేనది. కాకతీయ రాజ్య పతనానంతరం ఓరుగల్లును ఏలిన సీతాపతి (షితాబు ఖాన్) చరిత్రను వెలువరించాడు. తెలంగాణలో నాటి 9 జిల్లాల చరిత్రను, భాగ్యనగరం గ్రంథాలను కూడా రచించారు.

**3) కాళోజి నారాయణ రావు: (సెప్టెంబర్ 9, 1914 నుండి నవంబర్ 13,2002):-**

మన తెలంగాణ ప్రజల గుండె చప్పుడు, ఉద్యమ ప్రతి ధ్వని, రాజకీయ సాంఘిక చైతన్యాల సమాహారం, హక్కులపై పోరాడిన ప్రజల మనిషి, ప్రజల జీవన గమనాలపై కవిత్వాలు వ్రాసిన ప్రజాకవి, తెలంగాణ ప్రజల జీవిత చలనశీలి మన కాళోజి. ఈయన గురించి మనం ఎంత చెప్పుకున్నా అది చాలా తక్కువనే చెప్పాలి. ఎందుకంటే



పుట్టుక, చావులు కాకుండా బతుకంతా తెలంగాణకు అర్పితమొనర్చిన మహనీయుడు, నిజాం దమననీతికి, నిరంకుశత్వానికి అరాచక పాలనకు వ్యతిరేకంగా కలంతో సాటి చెప్పిన గొప్పవ్యక్తి, పోరాటయోధుడు.

ఈయన 1914 సెప్టెంబర్ 14న కర్ణాటక రాష్ట్రంలో బీజాపూర్ జిల్లాలోని రట్టి హళ్ళి గ్రామంలో జన్మించాడు. తెలుగు, ఉర్దూ, హిందీ, మరాఠీ, కన్నడ, ఇంగ్లీషు భాషల్లో అనేక రచనలు చేసాడు. ఉద్యమ సమయంలో రాజకీయ వ్యంగ్య కవిత్వం వ్రాయటంలో దిట్ట, తెలంగాణకు తొలిపొద్దు మన కాళోజీ.

"అన్యాయాన్నెదిరిస్తే నా గొడవకు సంతృప్తి-అన్యాయం అంతరిస్తే నా గొడవకు ముక్తి ప్రాప్తి. అన్యాయాన్నెదిరించిన వాడే నా కారాధ్యుడు" అని సగర్వంగా ప్రకటించి ఉద్యమమే ఊపిరిగా జీవించిన ప్రజాకవి. "నా గొడవ పేరిట సమకాలీన సామాజిక సమస్యలపై నిర్మొహమాటంగా, నిక్కచ్చిగా, కటువుగా స్పందిస్తూ పాలకులపై అక్షరాయుధాలను సంధించిన ప్రజాకవి. తెలంగాణ ప్రజల ఆర్తి, ఆవేదన, ఆగ్రహం ఆయన గేయాల్లో రూపుదిద్దుకుంటాయి. బీజాపూర్ నుంచి వరంగల్‌కు వచ్చి మడికొండలో స్థిరపడిపోయారు. ప్రాథమిక విద్య అనంతరం హైదరాబాద్‌లో ఉన్నత విద్యాభ్యాసంగావించాడు. అనంతరం 1939లో హైదరాబాద్‌లో హైకోర్టుకు అనుభంధంగా వున్న కళాశాల నుంచి న్యాయశాస్త్రంలో పట్టా పొందాడు. 1930 నుంచే కాళోజీ గ్రంథాలయ ఉద్యమంలో ఎంతగానో చురుగ్గా పాల్గొన్నాడు. తెలంగాణలో ప్రతి గ్రామంలో ఒక గ్రంథాలయం ఉండాలన్నది ఆయన చిరకాల ఆకాంక్ష, సత్యాగ్రాహ ఉద్యమంలో పాల్గొని 25 సం॥రాల వయస్సులోనే జైలుశిక్ష అనుభవించాడు. నిజామాంధ్ర మహాసభ, హైదరాబాద్ స్టేట్ కాంగ్రెస్‌తో కాళోజీకి అనుభంధం విడదీయానిది.

**4) డా॥. సి. నారాయణ రెడ్డి (1931 జూలై 29):-**



కరీంనగర్ జిల్లాలోని మారుమూల గ్రామం హనుమాజీపేటలో మల్లారెడ్డి, బుచ్చమ్మ పుణ్య దంపతులకు 1931 జూలై 29న జన్మించారు. ప్రాథమిక విద్య గ్రామంలోనే వీధిబడిలోనే జరిగింది. చిన్నతనం నుంచే హరికథలు, జానపదాలు, జంగం కథలవైపు ఆకర్షితుడయ్యాడు. మాధ్యమిక విద్య ఉర్దూ మాధ్యమంలో, ఉన్నత విద్య కరీంనగర్‌లో జరిగాయి. తదనంతరం హైదరాబాద్‌లోని చాదర్‌ఘాట్ కళాశాలలో ఇంటర్, ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి బి.ఎ. కూడా ఉర్దూ మీడియంలోనే చదివాడు. కాని తర్వాత ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి తెలుగు సాహిత్యం పి.జీ మరియు డాక్టరేట్ డిగ్రీ పొందారు. విద్యార్థి దశనుంచే అనేక గ్రంథాలు రచించారు.

ఉపాధ్యాయునిగా జీవితానంరంభించిన సి.నా.రె., ఉస్మానియా విశ్వవిద్యాలయంలో ఆచార్యునిగా పనిచేస్తూ అనేక ఉన్నత పదవులు, పురస్కారాలు అందుకున్నాడు. విశ్వనాథ సత్యనారాయణ తరువాత జ్ఞానపీఠ పురుస్కారం పొందిన తెలుగు సాహితీకారుడు ఆయనే. అనేక పద్య కావ్యాలు, గేయ కావ్యాలు వచన కవితలు, గద్య కృతులు, చలన చిత్ర గీతాలు, యాత్రా కథనాలు, సంగీత నృత్య రూపకాలు, ముక్తక కావ్యాలు, బుర్రకథలు, గజళ్లు, వ్యాసాలు, విమర్శన గ్రంథాలు, అనువాదాలు మొదలైనవి రచించారు. విద్యార్థి దశలోనే ప్రహ్లాద చరిత్ర, సీతపహరణం వంటి పద్యనాటికలు, భలే శిష్యులు తదితర సాంఘిక నాటకాలు రచించాడు. రామప్ప సంగీత నృత్యారూపకం అన్ని భారతీయ భాషల్లోకి అనువాదమైంది.

తెలుగు సాహిత్యానికి ఆయన చేసిన ఎనలేని సేవాలకు గాను 1988లో విశ్వంభర కావ్యానికి గాను ప్రతిష్టాత్మకమైన జ్ఞానపీఠ పురుస్కారం లభించింది. అదేకాకుండా రాజ్యసభ సభ్యునిగా కూడా నియమితులైనారు. తెలుగు చలన చిత్ర రంగంలో ఆయన రాసిన పాటలు ఎంతో ప్రసిద్ధి చెందాయి.

**5) దాశరధి కృష్ణమాచార్యులు జూలై 22, 1925 నుంచి నవంబర్ 5, 1987):-**



తెలంగాణ ప్రజల కన్నీళ్లను "అగ్నిధార" గా మలిచి నిజాం పాలన మీదకు ఎక్కుపెట్టిన మహాకవి. ఈయన వరంగల్ జిల్లా గూడూరు గ్రామంలో 1925 జూలై 22న జన్మించారు. ప్రస్తుతం ఈ గ్రామం ఖమ్మం జిల్లాలో వుంది. బాల్యం మొత్తం ఖమ్మం జిల్లా మధిరలో గడిపాడు. ఉన్నత విద్య ఉర్దూ మాధ్యమంలో చదివాడు . అనంతరం భోపాల్ విశ్వవిద్యాలయం నుంచి ఇంటర్, ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి ఇంగ్లీష్ సాహిత్యంలో బి.ఎ. చదివారు. సంస్కృతం, ఆంగ్లం, ఉర్దూ భాషల్లో మంచి పండితుడు. హైదరాబాద్ సంస్థానంలో నిజాం నిరంకుశానికి వ్యతిరేక ఉద్యమంలో పాలుపంచుకున్నాడు.

సాహిత్యంలో దాశరధి అనేక ప్రక్రియల్లో కృషి చేసాడు. కథలు నాటికలు కవితలు రాశారు. నిజాం నవాబుకు వ్యతిరేకంగా ఆంధ్రమహాసభలో చైతన్య వంతమైన పాత్రను నిర్వహించి జైలుకు కూడా వెళ్లాడు. తెలంగాణ రచయితల సంఘాన్ని 1953లో స్థాపించి అధ్యక్షునిగా అనేక జిల్లాల్లో సాహితీ చైతన్యాన్ని నింపిన వ్యక్తి. తల్లిమీద, తల్లి తెలంగాణ మీద అనేక పాటలు, పద్యాలు రచించాడు. ఇప్పటికి

కూడా అవి ప్రజలకు ఎంతో ఉత్తేజాన్ని కలుగచేస్తాయి.

**6). సురవరం ప్రతాపరెడ్డి (1896 మే 28, నుంచి ఆగష్టు 25, 1953):-**

ఈయన 1896 మే 28న మహాబూబ్‌నగర్ జిల్లాలోని ఇటిక్యాలపాడులో జన్మించాడు. అప్పటి మద్రాసు ప్రెసిడెన్సీ కళాశాలలో బి.ఎ., తిరువాన్కూర్‌లో బి.యల్ డిగ్రీ పూర్తి చేసాడు. కొంత కాలం పాటు న్యాయవాద వృత్తి నిర్వహించాడు.



తెలంగాణ ప్రాంతంలో రాజకీయ, సాంఘీక చైతన్యం కోసం అహర్నిశలు పాటుబడిన మహావ్యక్తి. బహుముఖ ప్రజ్ఞాశాలి. 1926లో ఈయన నెలకొల్పిన 'గోలకొండ' పత్రిక తెలంగాణ సాంస్కృతిక గమనంలో ఒక మైలురాలు. ఈయన పత్రిక సంపాదకునిగా, పరిశోధకుడిగా, రచయితగా, క్రియాశీలక ఉద్యమకారునిగా సాగిన ఈ ప్రస్థానం, ప్రతిభ అనన్యమైనది.

తెలంగాణలో కవులే లేరనే నిందారోపణలకు ధీటుగా 354 కవులలో కూడిన "గొల్కొండ కవుల" సంచిక గ్రంథాన్ని ప్రచురించి అనేక మంది కవుల జీవిత విశేషాలలో ఒక గ్రంథాన్నే ప్రచురించిన వైతాళి కుడు కూడా నిజాం నవాబు నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా అనేక సంపాదకీయాలు తన పత్రిక అయిన 'గొల్కొండ' ద్వారా నిజాం పాలనపై వ్యతిరేకతను వెలుబిచ్చాడు. తెలంగాణలో గ్రంథాలయ ఉద్యమంలో ప్రముఖ పాత్ర పోషించాడు. 1951లో ప్రజావాణి అనే పత్రికను స్థాపించాడు. 1952లో జరిగిన మొదటి ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ తరుపు న వనపర్తి నియోజకవర్గం నుంచి శాసనసభకు ఎన్నికైనాడు.

**7). గద్దర్:-**

ఈయన అసలుపేరు గుమ్మడి విఠల్ రావు ప్రముఖ విప్లవ కవి 'గద్దర్' అనే పేరును స్వాతంత్ర్యం రాకపూర్వం "గద్దర్ పార్టీ" గుర్తుగా తన పేరును మార్చుకున్నాడు. మెదక్ జిల్లాలోని తుఫ్రాన్ గ్రామంలో లచ్చమ్మ, శేషయ్యలకు 1949లో ఒక దళిత కుటుంబంలో జన్మించాడు. విద్యాభ్యాసం నిజామాద్ జిల్లాలో, ఇంజనీరింగ్ విద్య హైదరాబాద్‌లో జరిగింది. 1969లో తెలంగాణ ఉద్యమంలో చురుగ్గా పాల్గొన్నారు. ప్రజలను ఉద్యమం వైపు నడిపించేందుకు, ప్రజలకు చేరువ అయ్యేందుకు బుర్రకథలను ఎంచుకుని గ్రామ గ్రామన తిరుగుతూ ప్రచారం చేసాడు. దళితులపై జరుగుతున్న ఆకృత్యాలపై, పాటల రూపంలో జనాన్ని చైతన్యవంతం చేసేందుకుగాను ఒగ్గుకథ, ఎల్లమ్మకథ, బుర్రకథల రూపంలో 'జన నాట్యమండలి' ద్వారా ప్రజలను చైతన్యవంతం చేసేందుకు తనవంతు కృషి చేస్తున్నాడు. 1985లో కారంచేదులో దళితులపై జరిగిన దాడులను వ్యతిరేకిస్తూ ఉద్యమాన్ని నడిపాడు.



తెలంగాణ ఉద్యమాన్ని పునరుద్దించటంతో, వెనుకబడిన తరగతులు, నిమ్నకులాల ఉద్ధరణకు అహర్నిశలు పాటుపడుతున్న వ్యక్తి. ఈయన వ్రాసిన పాటల్లో "అమ్మ తెలంగాణమా", "పొడుస్తున్న పొద్దు" అనే పాటలు బహుళ ప్రజాధరణ పొందినవి.

**8). గోరేటి వేంకన్న:-**

ఈయన ప్రముఖ ప్రజాకవి, గాయకుడు ప్రకృత్తి, పల్లె ప్రజల పాడుకునే పాటలకు మూలాధారాలు. 1963లో మహబూబ్‌నగర్ జిల్లా గౌరవంలో జన్మాంచాడు. చిన్నతనం నుంచే భక్తి పాటలు పాడేవాడు 1984లో రైతుల సమస్యలపై ఆయన వ్రాసిన "నీ పాట ఏమాయెరో నీ మాట ఏమాయరో "అనే పాట మంచి పేరు సంపాదించి పెట్టింది. ఈయన సామాన్య ప్రజలకు అర్ధమయ్యే విధంగా, వారి నాలుకలపై నిలిచే విధంగా అనేక పాటలను వ్రాసారు. వాటిల్లో "రేలపూతలు" అనే పాటల సంకలనంలో కులవృత్తులు ధ్వంసమై, పల్లెలను మింగి పట్టణాలు బలుస్తున్నప్పుడు, మానవత్వపు విలువలు మృగ్యమవుతున్నప్పుడు కవి హృదయం ఎంతగా వేదనకు గురువుతుందో చాలా చక్కగా విశిదీకరించాడు. ఈయనకు ప్రకృతిని చూసి పరవశించటం, దీనావస్థలో ఉన్నవారిని చూసి కరిగిపోవటమే కాదు, అన్యాయాన్ని చూసి రగిలిపోవటం కూడా తెలుసు అనేక పాటలతో ప్రజలను చైతన్యం చేస్తూ గుండెల్లో చెరగని ముద్రను వేసుకుంటున్నాడు.



**ముగింపు:-**

మన తెలంగాణ సాంస్కృతిని చాటి చెప్పిన మహానీయులు ఎందరో ఉన్నారు. మన తెలంగాణ పండుగలను, ప్రజల జీవనశైలిని, యాస భాషలను ప్రపంచంలో నలుదిక్కుల చాటి చెప్పిన మహా కవులు, సాహితీ వేత్తలు, గాయకులను మనం తిరిగి మననం చేసుకోవటం, వారియొక్క జీవన శైలిని, వారు తెలంగాణ ప్రజల యొక్క గుండెల్లో ఏవిధంగా పెనవేసుకున్నారో వారి జీవితాలను పరికించి చూస్తే మనకు అర్ధమవుతుంది. అలాంటి మహానీయుల అడుగుజాడల్లో నడుస్తూ మనం బంగారు తెలంగాణను నిర్మించేందుకు కృషిచేద్దాం.

**- చల్లా దేవి, పరిశోధకులు, ఖమ్మం జిల్లా**

Printed & Published by: Neetukumari Prasad, Chief Executive Officer, on behalf of TSIPARD, Printed at Navatelangana Printers Pvt.Ltd. M.H.Bhavan, Near RTC Kalayanamandapam, Hyderabd.-20. Published at TSIPARD, Rajendranagar, Hyderabad- 500 030. Editor : Neetukumari Prasad